

చెన్నపట్టణము, ఏప్రెలు ౧౯౨౪

సంపుటము ౧. రక్తాక్షి సంవత్సరము చైత్రమాసము సంఖ్య ౪.

ఉగాది

రక్తాక్షిసంవత్సరము

శ్రీయుత చిల్లరిగె యోగానంద కవిగారు (యోగానందరామాయణకృతికర్త)

ఆంధ్రవత్సరమా యేల యాగ్రహంబు?
సాంద్రగుణరత్నమా యేల సందియంబు?
సాంద్రగుణరత్నమా యేల సంశయంబు?
ఇంద్రలోకేంద్ర భారతీయెంత్రులేని,
యాంధ్రలోకేంద్ర భారతీయెంక్రులేని,
నీకు నమ్రులై యుందురు వాకులేల,
కమ్రచరితను విందురు గాథ లేల,
వినుతిప్రణతులు గావింత్రు వింత లేల,
సకలపూజలు గావింత్రు శంక యేల,
అమ్మ! కనవమ్మ! రక్తాక్షి వయిటివేల,
మమ్ముఁ గనవమ్మ! యమ్మ! కోపమ్మదేల,
చిమ్మచీఁకటి మాకు బల్ క్రమ్మెనమ్మ!
యెమ్మెయెమ్మెయిఁగాంతుమో యెఱుఁగమమ్మ!

నెమ్మి నేనెఱిఁ గాంతునో చుమ్మి యమ్మ!
పాదపూజ లొనర్తుము భరతమాత
కమ్మనీకట్టు కట్టులు వమ్మొనర్చ
దేవదేవుని నర్థింతు మో వినూత్న
వత్సరాంచిత మాత! మావలన నేవి
లోటు లగపడ్డ నీయెడ్డలోఁ దలంప
కమ్మ! రక్తాక్షివై యుండి యభయమిడుమ
నూత్ననింబకుసుమయుతానూనచూత
నవశలాటుఖండోపేత భవికగుడను
మిళితతింత్రిణీరసరసామృతము నీకు
దివ్యనైవేద్య మొనరించి తిందుమమ్మ!
గోకి గోకిలే యని పురికొల్పి తెల్పి
తిలక తిలకాయటం చెదఁ దెలిపి కొలిపి
కలిపి ప్రేముడి నిలిపితి కడుపునందుఁ
గాలచక్రాకృతిస్ఫూర్తిఁ గ్రాలుదమ్మ!
గాథయశ మిద్ది మూఁడవ గాంధిశకము
కనులపండువు నలుపంగఁ గాంచవమ్మ!
యలుక యేలమ్మ! దక్షిణాంధ్రాబ్దదేవి!
కొమరులను గట్టెడు ల్పరుగ్గోపధనులు
గోడుపఱచుచునుండి రన్గోల వింటి
కంటనీఁడి నల్పితే కన్నతల్లి!
కన్నులెఱుపెక్క నేమమ్మ! చెన్ను తొఱఁగి
చెన్నుమీఱెడి ప్రేముడి సెప్పనేల
చెప్పకయ చెప్పుచున్న నీచొప్పెఱింగి
దొరలు కరఁగరు నెఱుఁగరు పరఁగ రమ్మ!
దొరలుకన్నీరు మున్నీరు పఱపకమ్మ!
కవిత గలిగిన కవివరుల్ కవితకొఱకు
ధనము చెలఁగిన ధనిమణుల్ ధనముకొఱకు
బుద్ధి పరఁగిన మునిఘనుల్ బుద్ధికొఱకు
నెందొరుల మీఱునట్టు వే ఉండునట్టు
పట్టుపట్టినయట్టును బరఁగి కలన
డీకొనుచునుండి రజ్ఞానవాకు లాడి
యనుచు నెఱింగింప రక్తాక్షి వయితివమ్మ!
వాఁడిచూడ్కులఁ జూడకు వేఁడికొందు
క్రోధనవు గాఁగనుండియుఁ గ్రోధనతను
గనకుమా మాత! యక్షయాఖ్యను బ్రజాలి
సౌఖ్య మక్షయముగఁ జేయ సంస్తుతింతు.

వి హం ం గ వి మా న ము

వేంకట పార్వతీశ్వర కవులు

క. లలితకుహూకారవమా! అల వనరమయింటివిందవగు కవివరమా!
అలరు వసంతునిరాకం, దలఁపించెడి నీకు స్వాగతము! కోకిలమా!

ప్ర స్తా వ ము

వసంతాభ్యుదయ మైనది. శిశిరవికలమగు ప్రకృతి చిత్రచిత్రముగ సింగారించుకొని చిగురుగే లెత్తి జీవలోకము నాహ్వానించుచుండెను. వనరమామాధవుల వైవాహిక శుభసమయమున సకలజగంబును నానంద ప్రపూర్ణమై యుండెను. అప్పుడు విహంగ విమానమునుండి వివిధస్వరములతో విశ్వ గీతములు వినవచ్చుచుండెను. ఆమధురస్వరము లప్రయత్నముగ శ్రవణగోచరములై యంత రంగమునఁ బ్రతిధ్వనించి యనేకసంకల్పముల నంకురింపఁ జేయుచుండెను. ఆభిన్నస్వరముల యేకీభావమే వసంతగానము. ఆభిన్నప్రకృతుల సముత్సాహ సమీకరణమే వసంతకల్యాణ మహోత్సవము. — శుభస్తబంధుబు ప్రవరీ వారసమాకీర్ణంబగు నాకల్యాణమండప మే విహంగవిమానము.

జగముచుట్టమగు వసంతుని పెండ్లికి బంధువులుగాఁ జేరనివా రెవ్వరును లేరు. అతని కందఱును జుట్టములే. కాని, వారంద ఱును దమలోఁ దాము పరస్పరబంధులు మాత్రము కారు. అందు సజాతీయులును, విజాతీయులును, శత్రులును, మిత్రులును, సములును, విషములును గూడ సమావేశులై యుండిరి.

పురోహితుఁ డగుపూర్ణకాముఁడు పుష్పాక్షతలను జల్లుచుఁ బవిత్రప్రణయమంత్రములను బఠనము సేయుచుండెను. వధూవరుల ప్రథమావలోకన సమయమునఁ బరస్పరహృదయములే కాక ప్రకృతి యంతయును బులకించిపోయెను. ఆయానందములో నాటలు,

పాటలు, వింతలు, వినోదములు, ముద్దులు, ముచ్చటలు జరిగిపోవుచుండెను.

కొందఱు రసజ్ఞులు పెండ్లిపాటల నాలకించుచుండిరి. కొందఱు విచక్షణులు పెండ్లి వేడుకలఁ దిలకించుచుండిరి. కొందఱు సమర్థులు పెండ్లిపనులలోఁ బాల్గొనుచుండిరి. కొందఱు ముగ్ధులు ప్రకృతిచిత్రములకు ఱిచ్చపడుచుండిరి. కొందఱు విదగ్ధులీశ్వరవిలాసములకు మెచ్చుకొనుచుండిరి. కొందఱు వాచాలురు తర్కవితర్కములలోఁ దత్త్వమును మఱచిపోవుచుండిరి. కొందఱు క్రియాశూన్యులు లోకాభిరామాయణమున నిమగ్నులగుచుండిరి. ఇట్టి యనేకభిన్నప్రకృతుల భిన్నభావము లన్నియు నీపెండ్లివేడుకలలో సలక్షితములై యుండెను.

భావప్రపంచమున విహరించు పరమహంసల నవలోకించుచున్న యొకకవికులభూషణుఁ డప్పుడు పర్ణకుటీరాంగణమునఁ గూర్చుండి ప్రణయగానమునకు శ్రుతులను సవరించుకొను చుండఁగా నెలమావిచిగురు గొంపమునం దూఁగుచుఁ దూఁగుచు వసంతకోకిల పంచమస్వరంబున "కుహూ! కుహూ! కుహూ!" అని పాడఁ దొడంగెను. ఆపల్లవిలోఁ బ్రమదావన మంతయుఁ బల్లవితమయ్యెను. ప్రసవమంజరు లన్నియును బరిమళించెను. ప్రకృతి యంతయును బరవశమైపోయెను. భావగానలోలుఁ డగుకవి యచ్చట—

"ప్రసవరస మాను నెలదేఁటి పాటకంటె
ఫలరసముఁ గ్రోలురాచిల్క పల్కుకంటెఁ
గసరుఁజివురాకుఁ గసిగాటుగా గ్రసించు
మత్తకోకిలరవ మింత మధుర మేమొ?"

అని భావింపఁ దొడంగెను.

ప్రదేశము—మధువనము.

ప్రవేశము—రసాలశాఖపైఁ జిలుక, గోరవంక.

చిలు— (మెడ త్రిక్కించి) ఆహా! ఏమి యీయమృతగానము!

గోర— ఔను. అది యీఫలరసముకంటెను మధురముగా నున్నదే! కాకులలోఁ బెరిగినదానికిఁ గలకంఠ మెట్లువచ్చినదో?

చిలు— ఎక్కడఁ బెరిగిన నేమి, ఎవ్వరు పెంచిన నేమి? అది దాని జన్మస్వత్వమే కాదటే!

గోర— అక్కా! నీకుమాత్రము కలాలాపత్వము జన్మస్వత్వము కాదా?

చిలు— ఇదియెట్లు? పలుకులు నేర్చినంతమాత్రమునఁ బాటలు పాడఁగలమా? మన మిరువురమును గలాలాపలమే కాని కలకంఠుల మెట్లగుదుము?

గోర— మనముకూడ దానివంటి పక్షులమే గదా! ఆపాట మన మేల నేర్చుకొనఁ గూడదు?

చిలు— అది సహజముగఁ బుట్టవలయునే గాని నేర్చుకొనిన వచ్చునది కాదమ్మా!

గోర— మనము మాత్రము రసజ్ఞలము గామా? కోకిల నాశ్రయించినచో మన కీరహస్యము బోధపడు నేమో?

చిలు— కోకిల కెవ్వరివలన బోధపడినది? మనకు సహజముగా రసానుభవమే గాని, రాగగరిమ యెక్కడిది?

గోర— ఫలరసము మాని మనము కూడఁ బల్లవసేవనముం గావించిన నేమగునో?

చిలు— సోదరీ! పువ్వులలో మసలినంత మాత్రమునఁ దేనెటీఁగ లేఁటి కాఁగలిగి నదా? ఊరక యూసపడి చిగురుమేయుట కారంభించినచో నొగరుబిగువుచే మన కున్న పలుకుబడికూడఁ జెడిపోవును. కష్టపడి ప్రయత్నించినంతమాత్రమున మనము కలకంఠములము కాఁగలమా?

(కోకిలమరలమృదుస్వరముతో కుహూ! కుహూ! కుహూ!)

(గోరవంక తత్తరముతో ఱెక్కలనప్పళించుచు మెడఁ గుంచి పైకిఁ జూచుచు నటునిటుఁ దిరుగుచుండును.)

చిలు— (కిలకిల నవ్వుచూ) సోదరీ! ఈ యావేగ మంతయు నేమే!

గోర— అక్కా! వినఁబడలేదా? ఆ కోకిల మనలను బిలుచుచున్నది!

చిలు— చెలీ! ఎంతవెఱ్ఱిదానవే! అది మనవంకఁ జూడనైనఁ జూచినదా? పలుకరించినట్లు, పరాకుఁ దెలిపినట్లు, ప్రత్యుత్తర మిచ్చినట్లు, ప్రబోధించినట్లు, బహుభావములు దాని పాటలోనే యున్నవి.

గోర— అక్కా! నీమాటలు నిజమేనే! చూడుము! తమ్ముఁ బలుకరించినట్లుగా దెసలు మాఱుపలుకు చున్నవి. తమకుఁ బరాకుఁ దెలిపినట్లుగాఁ దరుణవల్లికలు పల్లవాంచలముల సవరించుకొను చున్నవి. తమకుఁ బ్రత్యుత్తర మిచ్చినట్లుగాఁ బక్షిసంతతు లన్నియును బ్రతివాదముఁ జేయుచున్నవి. తన్నుఁ బ్రబోధించినట్లుగాఁ బ్రకృతి యంతయును దన్మయమగుచున్నది. ఆహా! ఒక్కపాటలోనే యిన్ని భావములా?

చిలు— అదియే బహుజన్మతపఃపరిపక్వమగు ప్రతిభ! అట్టి యమృతవృష్టిచేతనే జీవచైతన్యమంతయు నానంద విలసితమగుచుండును. అట్టి యమృతప్రభచేతనే జీవలోకమంతయు నాలోకరమణీయ మగుచుండును.

గోర— ఆకోకిల నిట్లు పాడుమన్నవా రెవ్వరే!

చిలు— అది యొక్కరికొఱకుఁ బాడుట లేదు. ఉత్సాహము పొంగి పొరలినప్పు డది యూరక పాడుకొనుచుండును. దాని కెట్టి కోరికయును లేదు.

గోర— లేకేమి? మన మందఱము నిట్లు మెచ్చుకొను చుంటిమి గదా! వన మంతయు నిట్లానందకందళిత మగుచున్నది గదా! దెసలన్నియు నిట్లు ప్రతిధ్వనించుచున్నవి గదా! జగమంతయు నిట్లభిముఖ మగుచున్నది గదా! లోకమును మోహింపఁ జేయుటకుఁ గాకున్నచోఁ గోకిలకీపాట యేల?

చిలు— సోదరీ! నీవు పొరఁబడుచున్నావు. కొమ్మ లెవ్వరిమెప్పుకొఱకుఁ బల్లవించుచున్నవి? తెమ్మెర లెవ్వరిమెప్పుకొఱకు వీతెంచుచున్నవి? పువ్వు లెవ్వరి మెప్పుకొఱకుఁ బరిమళించుచున్నవి? ఫలము లెవ్వరిమెప్పుకొఱకు ఫలించుచున్నవి? ఆనందోచ్ఛ్వాసముచే నగుచుండు దీనింగూర్చి యనుభవజ్ఞు లభినుతించుచుందురు. రసజ్ఞులు రంజిల్లుచుందురు. కోకిల పాటకూడ నట్టిదే.

గోర—అక్కా! నీవు కవిత్వమును ...ర్చి ప్రశంసించినట్లు ప్రశంసించుచున్నావే!

చిలు—కాదా మఱి! హృదయమును సమయమునఁ జేయుఁబలుకుఁబొందికయే కవి త్వము.

(కోకిల—కుహూ! కుహూ! కుహూ!)

చిలుక—గోర— (ఆనందపారవశ్యము ...ందును.)

కవిపరమానందముతో

... ఆనందమయవసంతారామమోహన
దివ్యతేజంబుపై దృష్టి నిలిపి
ఆనందరాగరసామోదపల్లవ
మృదులపీఠంబుపై మేను నిలిపి
ఆనందరసతరంగాయితవసుధా
మధురభావంబులో మనసు నిలిపి
ఆనందగుప్తమంత్రాధారపావన
ప్రణవనాదంబులోఁ బాట నిలిపి
అఖిల మానందపారవశ్యమున మునుఁగ
వాస్తవానందతన్మయత్వంబుఁ గాంచి
చల్లగా రాగవల్లరుల్ పల్లవింపఁ
గోయిలా! హాయిగాఁ బాడు కోఁగదమ్మ!

కోకిల—కుహూ! కుహూ! కుహూ!—

గోర—(ప్రకృతిస్థమైన స్మృతినభినయించి) అక్కా! ఈమధురగానమునకు లోక మంతయు నిట్లు మైమఱచిపోవుచుండఁగాఁ దన బిడ్డగా నెంచి పెంచికొన్న కాకి యీకోకిల నెట్లు తన్నివైవఁగలిగినదో?

చిలు—దాని కారసజ్ఞత యెక్కడిది! పురుగులను బొడిచికొనితినువులుగునకుఁ బు ష్పాలపరిమళ మెట్లు తెలియును?

("తురుతురుతురుతురుతుక్" అను ధ్వని యగుచున్నది.)

గోర—(ఉలికిపడి) ఇది యేమి? ఈయ నంత సుఖస్వరమునఁ గ్రిందినుండి యేదో యప స్వరము వినఁబడుచున్నది!

చిలు—అది యేదో కఠినవక్త్రమునుండి వెలువడిన కఠోరస్వరమువలె నున్నది.

("ఠక్ ఠక్ ఠక్" అను ధ్వనియగుచున్నది.)

గోర—(భయముతో) అక్కా! ఎవ్వరో చెట్టుఁ గొట్టుచున్నట్లున్నది!

చిలు—(ఆలోచించి) తెలిసినది. భయము లేదు. ఈవికృతచేష్టలు వడ్లంగిపిట్టవని తోఁచు చున్నది.

గోర—(క్రిందివంకఁ జూచి) ఔనే! తన యినుపముక్కుతో నది యీతరుస్కంధమును టక్కుటక్కు మని పొడుచుచున్నది. చూడుము!

చిలు—(పరికించి) ఫలవృక్షములను బగులఁ గొట్టుటయే దానిపని.

గోర—ఈశుభసమయమున నిది యెంత రసభంగము చేయుచున్నది!

చిలు—అచ్చటికిఁ బోయి దాని నెట్లయిన మరలింతము రమ్ము.

(చిలుకయు, గోరవంకయు నెగిరి క్రింది కొమ్మపై వ్రాలుచున్నవి.)

వడ్లంగిపిట్ట— (చప్పుడు విని తల పై కెత్తి) ఓహో! చిలుకా గోరింకలవలె నున్నారు.

గోర— వలె నుండుట యేమి? మేము చిలుకాగోరింకలమే!

వల్ల— మీయంతటి రసజ్ఞత నాకు లేదనియా నీవు నేనన్నమాటకుఁ బ్రత్యాఖ్యానముఁ జేయుచున్నావు?

చిలు— నీకు రసజ్ఞత లేదనియా? నీ చేష్టలు—

వల్లం— (అర్థోక్తియందే) నాచేష్టలు మీ రేమని గ్రహించితిరి?

గోర— రసభంగములుగా నున్నవని—

వల్లం— ఓహో! తెలిసినదానివలె రసము రస మనుచున్నావు! రసస్థాన మేదియో నీ వెఱుఁగుదువా?

గోర— ఎఱుఁగ కేమి? పాటలో రస మున్నది. పలుకులో రస మున్నది.

వల్లం— ఆలాగా? వానికి మూలము?

గోర— చిగురులో రస మున్నది. పుష్పాలో రస మున్నది. పండులో రస మున్నది.

వల్లం— అంతేనా! మఱి యెచ్చటను లేదా? సరే. వానికి మూలము?

గోర— రసజ్ఞనిహృదయములో రస మున్నది.

వల్లం— ఆఁగు మాఁగుము! గోరింకా! నీవొక్కసారిగాఁ గప్పగంతులు వైచుచున్నావు. వానికి మూలకారణ మగు కేంద్రస్థానము ఇప్పుడు నేను నిలిచియున్నచోటు! ఇందేమైన రస మున్నదేమో యనియే నేను పరీక్షించు చుంటిని.

గోర— ఏమైన నగపడినదా?

వల్లం— ఇంతవఱకు నాకేమియు నగపడలేదు.

గోర— (నవ్వుచు) ఇది మూలచ్ఛేద ప్రయత్నముగాని, రసగ్రహణప్రయత్నము గాదు.

వల్లం— చెట్టున లేనిరసము చిగురున కెక్కడనుండి వచ్చును? వెఱ్ఱిదానా! తత్త్వజ్ఞానములేని పాండిత్యముతోఁ దప్పులు దిద్ద వచ్చితివా?

గోర— ఆలాగా? అట్లయినచో నీతలకు మించినశక్తి ముక్కున కెట్లు వచ్చినది?

చిలు— (సాధుభావముతో వల్లంకిపిట్టం గాంచి) అన్నా! ఈ శుష్కతర్కములవలన నేమి ప్రయోజన మున్నది? కోయిల హాయిగాఁ బాడుచున్నది. ఒక్కింతసేపు నిశ్శబ్దముగా నుండి యానందింపరాదా?

వల్లం— ఆహా! ఏమి యీ చిలుకపలుకులు! ప్రూనుకోయిలమాట చిగురుకోయిల పాటపాటిది కాకపోయె నేమి?

చిలు— వాదము వల దంటిని గాదా?

వల్ల— వాద మక్కఱలేదు గాని వస్తుతత్త్వమును గ్రహింపవలదా?

గోర— (విసుఁగుతో) నీవిందు గ్రహించిన దేమి? రంధ్రాన్వేషణమే గాని నీకు రసగ్రహణశక్తి యేదీ? ఎంత పట్టిప్రాఁకులాడినను, ఎంత పొట్టుపొట్టు చేసినను, నీ బ్రదు కింతే.

చిలు— అన్నా! రసజ్ఞులపని యిది గాదు. అమృతతరంగమాలికాఖేలనమున కానందింపక యడుగున నేమున్నదో త్రవ్వఁ గోరుట యవివేకము కాదా?

గోర— ఔను, అమృతఫలముల నారగింపవలయును గాని, గిల్లి గింజలను లెక్కిం

...టవలన నేమి ప్రయోజనము?

వడ్లం— (కోపముతో) అమృతము, ...సము, హాయి, యని మీరేమేమో కొసవెఱ్ఱి ...మాటలు చెప్పుచున్నారు. గుడ్డినమ్మకమే ...ని గుణాగుణపరిశీలన మక్కఱలేదా?

చిలు— దేనిగుణాగుణములను దానిని ...ట్టియే గ్రహింపవలయును పనసతొలలరుచి ... పెచ్చులను నమలిన నెట్లు తెలియును?

వడ్లం—సరే. ప్రకృతమును విమర్శిం...ము. కోయిలపాట హాయిగా నున్న దంటిరి ...దా! ఎట్టి దాహాయి?

చిలు—సకలజీవహృదయములను రస...ములుగాఁ జేయుమధురభావము లందు ...యా రీభవించి యున్నవి.

వడ్లం—సరిసరి! ఈమాటలవలన నా...కేమి బోధపడినట్లు? పెండ్లిపాటయా? వసంతపుఁ...పాటయా?

చిలు—నీకెట్లు తోఁచుచున్నది?

వడ్లం—ఏమియుఁ దోఁచుట లేదు ...క్కటే పాలిపాటవలెనున్నది.

గోర—మధురకోకిలగానము మ్రాను...కోయిల కెట్లు రుచించును?

వడ్లం—(కోపముతో) మర్యాద నతిక్ర...మించి మాటాడుచున్నావు!

గోర—ఉన్నమాట యన్న నులుకేల?

వడ్లం—(కోపముతో) అలాగా? ఇందె...క్కువతక్కువలు నీవేమి గ్రహించితివి?

గోర—గ్రహింపకేమి? చిదుకఁబొడిచి చెట్టుఁ దొలుచుదానవు నీవు—పాట పాడి చిగుళ్లను బెట్టించున దది—

వడ్లం— (అసహ్యభావముతో) నోరు మూయుము! గట్టిగ మాటాడుచున్నావు.

గోర—నీ యినుపముక్కుకంటె, నీటిక్కు టిక్కులకంటె నా మాటలు కఠినముగా నున్నవా?

(వడ్లంగిపిట్ట కోపమును బట్టఁజాలక గోరవంకను బొడువఁజూచుచుండఁగా గాలిపాటున రసాలఫలము జారి పడినచప్పుడగును.)

"తురుతురుతురుతురు తుర్రో."
అని వడ్లంగిపిట్ట యెగిరిపోవును.

చిలు—గోర—(యథాస్థానమున కెగిరి పోవును.)

కోకిల—కుహూ! కుహూ! కుహూ!

కవి

"చివురు దినుము! పాడుము! మఱి
చివురులు బెట్టింపు మలరఁ జేయుము వనమున్
నవనవగీతాచాతురి
మివుల మరల మరలఁ బాడు మిా! కోకిలమా!"

ఆరణ్యపర్వము - ఎఱ్ఱాప్రెగడ

నడకుదుటి వీరరాజు పంతులు గారు

"యుక్తియుక్తం వచో గ్రాహ్యం" "వినఁదగు నెవ్వరు సెప్పిన"

శ్రీమదాంధ్ర మహాభారతము లోని యారణ్య పర్వోత్తర భాగము నెఱ్ఱాప్రెగడ మహాకవి రచియించె నను వాడుక చిరకాలమునుండి యాంధ్రదేశమునం దెల్లెడల నలమికొని యున్నది. దీనికి, ఆంధ్ర ప్రబంధములలోని కవిస్తుతిపద్యములు, ఆంధ్రలక్షణగ్రంథములు, ఆరణ్యపర్వాంతమునఁ గానవచ్చు (రెండు) పద్దియములు, పెద్దల వచనములు మున్నగునవి యాధారములై యున్నవి

కొంతకాలము క్రిందట, మ. శతఘంటము వేంకటరంగ శాస్త్రి మున్నగు పండితు లొకరిద్దఱు భారత ప్రథమపర్వములు మూఁడును నన్నియభట్టారకుఁడు తెలిఁగించె ననియు, నందుఁ గొంతభాగ ముత్సన్నము కాఁగా దాని నెఱ్ఱాప్రెగడ రచియించె ననియు, వ్రాసియున్నారు.

పై పండితుల వ్రాఁతలను గాంచియే కాఁబోలు, శ్రీ వీరేశలింగము పంతులవారు, తాము క్రొత్త వెలయించిన కవుల చరిత్రము ప్రథమ భాగమున, "ఇప్పటివారు కొందఱు నన్నయ యారణ్యపర్వము సంపూర్ణము కాగానే చేసెననియు,...... ఏ కారణముననో యది నశింపఁగా నెఱ్ఱాప్రెగడ నన్నయ పేరనే పూరించెననియు, మున్నెన్నఁడు కనని వినని క్రొత్తవాదము నొకదానిని నారంభించిరి. ఈ వాద మపూర్వమైనదే..." ఇత్యాది వాక్యములు వ్రాసి కొన్ని యుక్తులతో పై వ్రాఁతలను పూర్వపక్షము సేయుచు, నన్నయ యారణ్యపర్వమునఁ గొంతభాగము వ్రాసి మృతినొందఁగా, మూఁడు వందలయేండ్లయిన తరువాతఁ దక్కిన భాగము నెఱ్ఱన నన్నియ పేరుపెట్టియే పూరించెనని సిద్ధాంతీకరించినారు.

పై పండితుల వ్రాఁతలను, కవుల చరిత్రములోని యుక్తులను, ఆంధ్ర మహాభారతమును, ఎఱ్ఱాప్రెగడ యితర గ్రంథములను, మఱియుఁ గొందఱ యితర కవుల గ్రంథములను బరిశోధింపఁగా నెఱ్ఱాప్రెగడ కావించినది శిథిలభాగపూరణమే కాని సంపూర్ణ రచనము గానే కాదనియు, గ్రంథ మంతయు నన్నియ మహాశయునిదే యనియుఁ దెలియవచ్చెను. ఆంధ్ర వాఙ్మయ పరిశోధకులు సత్యవిషయ నిశ్చాయకు లగుదురను తలంపున నారణ్యపర్వమునకును, నెఱ్ఱాప్రెగడ మహాకవికిని గల సంబంధమును గూర్చి నాకుఁ గలిగిన యభిప్రాయమును, అయ్యభిప్రాయ మొదవుటకుఁ గల కారణములను క్రమముగ నిందుఁ బ్రదర్శించుచున్నాను.

నన్నియ భారతాంధ్రీకరణము

నన్నియ మహాకవి భారతాంధ్రీకరణమునకుఁ దొడంగు నప్పటికి వయసు మిగిలిన వాఁడయ్యెను. 'అవిరళజపహోమతత్పరుఁ' డగు సమ్మహితాత్ముని ప్రాయమున విశేష భాగము, 'సంహితాభ్యాసము' నందును, 'నానాపురాణవిజ్ఞాన' సముపార్జనము నందును, 'విపులశబ్దశాసన' క్రియానిర్వహణమునందును వ్యయపడియుండెను. పిమ్మట నాతఁడు, 'ఉభయభాషాకావ్యరచనాభిశోభితుఁ'డై, వయసు మీఱిన తరువాతనే భారతాంధ్రీకరణమహాకార్యమునకుఁ బూనుకొని, యందు దొలిపర్వములు మూఁడును సమగ్రముగఁ దెలిఁగించెను. మూఁడవపర్వము ముగించునాఁటికే యక్కవిసింహము మిక్కిలియు వృద్ధుఁడై, యుత్తరగ్రంథ రచనమునకుఁ గాలము లేమి స్వకీయపరిశ్రమార్జితంబగు సలక్షణకవిత్వమహాధనమును, ఆచంద్రార్కస్థాయి యగు నిస్తులానంతయశోధనంబును నిహంబున విడిచి పరంబున జేరెను.

నన్నియ భారతగ్రంథవ్యాపనము

భట్టారకమహాశయుని భారతములోని యాదిసభాపర్వములు రెండును విశ్వజనీనములై జగద్వ్యాప్తము లయ్యెను. సలక్షణకవిత్వనిర్మాణలాలసులు, పురాణశ్రవణాభిలాషులు, మొదలగువా రనేకులు, అతని గ్రంథమునుండి ప్రతులను వ్రాసికొనుచు, వ్రాయించుకొనుచుఁ గొనిపోవుచుండిరి. రాజనరేంద్రుఁడును గొందఱు వ్రాయసకాండ్ర నేర్పఱచి, తన యభిమా

బ్రతులను వ్రాయించుచు ననేకరాజాస్థానములకుఁ బంపుచువచ్చెను. ఈరీతి నన్నపార్యుని కావ్యకన్యక మాతృకగా ననేకపుత్రికలును, పుత్రికాపుత్రికలును జనింప నాంధ్రభారతములోని మొదటి రెండవ పర్వములు దేశమున నెల్లయెడల వ్యాపింపఁగలిగెను.

ఆరణ్యపర్వము

ఆరణ్యపర్వముమాత్రము దక్కినవాని వలెఁ గడల్కొనఁజాలదయ్యెను. ఏమన, అది విఘ్నకారి యను ప్రవాదము లోకమునఁ గలిగియుండెను. (ఈవాదుక యారణ్యపర్వాంధ్రీకరణదివసములయందు నప్పుడప్పుడు నన్నియకుఁ గల్గినవార్ధకచిహ్నములగు రోగాదులచేతను, పిమ్మటఁ గలిగిన మరణముచేతను మఱింత దృఢపడియుండును.)

ఆరణ్యపర్వమును సాధారణముగా నేఁటికిని గొందఱు పురాణముగానైనఁ జదువనొల్లరు. మఱికొందఱు, ఆరణ్యముగాక తక్కిన గ్రంథమంతయుఁ జదివి పిమ్మట నారణ్యపర్వమును బఠించి, కడపట శాంతిని, తొలిపర్వమునో మరలఁ జదివి పురాణపఠనమును ముగించెదరు. మహాభారతపఠనమున నింక ననేకభేదము లున్నవి. కాని, వనపర్వమును మాత్రము మొదటివానితో వరుసను జేర్చి పఠింపకుండుట సర్వసామాన్యమైన విషయమేయై యున్నది.

మనపూర్వు లారణ్యపర్వపఠనలేఖనములకు భయపడుచువచ్చిరనుట నేఁడును వినఁబడియెడి. అప్పటివారికి దైవతాదులయందు

విశ్వాసము లుండెడివి. ఇక్కాలమునను గొందఱు పెద్దలు, ఉపనిషత్తులు భోజనానంతరము పఠింపరాదని శాసింతురు. దేవీనవరాత్రములయందు సరస్వతీపూజకుఁ దాటియాకు గ్రంథములనే కాని యచ్చుపొత్తములను పూజాపీఠమునఁ జేర్పనీయని ముదుసలులు గొందఱిప్పుడును గలరు. అందును గొందఱు, గీర్వాణభాషా గ్రంథములనే కాని తెలుఁగుబాసలోనున్న తాటియాకు గ్రంథములనైనఁ బూజింపనీయరు. శ్రీకృష్ణాష్టమీదివసంబునఁ బోతనార్యుని భాగవతమును జదువువారి నధిక్షేపించిన వృద్ధవిద్వత్కవి యొకఁ డిప్పుడును గలఁడు. ఏతాదృశభక్త్యాదులు పూర్వమునుండి నేఁటిదాఁకఁ బరంపరగా వచ్చుచున్నవి.

చూడుఁడు! ఇక్కాలమున 'ఆర్. వేంకటేశ్వర్ అండ్ కంపెనీ' అనువారు (ఆనంద ముద్రాక్షరశాలాధిపతులు) ఆంధ్రవచనభారతమును బ్రకటించుచుఁ దొలుత నాదిసభాపర్వములఁ బ్రకటించియు, "విఘ్నకారి" యను భయముచేతనే యారణ్యపర్వమును మాని, ముందుగ శాంతిపర్వమును బ్రకటించినారు. (ఇవ్విషయము తద్వచనగ్రంథకర్తలచే నాకుఁ దెలియవచ్చెను.)

ఇయ్యారణ్యపర్వవిఘ్నభయము మన భారతవర్షమున నెన్నాఁడు జనియించెనో తెలిసికొను నాధారములు కానరావుగాని మనయాంధ్రదేశమునందుఁ బోలె వంగ, ఘూర్జర మహారాష్ట్రాది దేశములయందును నారణ్యపర్వమును ప్రథమద్వితీయపర్వములతో వరుసను జేర్చి చదువరనియు, శాంతికి ముందో గ్రంథాంతమునందో దానిని చదివి, శాంతిపర్వమును బఠించెద రనియుఁ దద్దేశవాసులు చెప్పెదరు.

నన్నయమరణముతరువాతనే యీ భయము హిందూదేశమునం దెల్లయెడల గతానుగతికముగ వ్యాపించియుండవచ్చు నని భావింతమన్నను, ఆంధ్రారణ్యపర్వము దేశమున నంతగా వ్యాపింపకుండుటకు ముఖ్యకారణ మొకటి గానవచ్చుచున్నది:—

మన భాషయందుఁ బూర్వము విషాదాంతకథలు లేవు. ఎన్నికష్టములు వచ్చినను దుదకు సుఖముతోఁ గథ ముగియవలయు నని మనవారియాశయము. అరణ్యమునఁ బడిన సజ్జనులగు ధర్మరాజాదులు వెలుపలికి వచ్చి సౌఖ్యము నందినట్లు దెలిపెడికథ యిప్పటికిఁ దెలుఁగున వ్రాయఁబడియుండలేదు. కావునఁ దెలుఁగు వనపర్వము నక్కాలమునఁ జదువువారు లేకపోయిరనియు, దానం జేసియే తత్ప్రతులు వలసినన్ని దేశమున నప్పుడు వ్యాప్తిం గాంచియుండలేదనియు నూహింపనగుచున్నది.

మొదట దేశమునం దంతట ననంఖ్యాకముగ వ్యాపించిన తొలిపర్వముల వెంటి ప్రతులు నిర్దుష్టకవితాలక్షణమును దెల్పుటకు సమర్థములై యే యున్నవి. కావునఁ గవితా వ్యసనపరులకు నారణ్యముతో నంతగాఁ బని లేకపోయియే యుండును. పురాణపఠనమున కది యుపయోగింపదని పైని నిరూపింపఁబడియేయున్నది.

నన్నియ మరణానంతరము రాజరాజు భారతాంధ్రీకరణపరిసమాప్తికై ప్రయత్నించి నట్లు కథయొకటి గలదు. అది నిజమైన, రాజ నరేంద్రునకుఁగూడ నారణ్యపర్వము ప్రీతి పాత్రము గాలేదని గ్రహింపవచ్చును. ఎట్లన ఆమహారాజు విద్వత్కవులచెంతకు నాదిపర్వములోని "నిండుమనంబు..." అను పద్యము నో, సభాపర్వములోని "మదమాతంగ..." అనుపద్యమునో పంపెనుగాని ఆరణ్యపర్వము లోని (నన్నియకడపటిపద్యమనఁబడు) "శారద రాత్రులు..." అనుపద్యమును పంపఁడయ్యెను! పై రెండుపద్యములును దీనికంటె రసవత్తరములు గావు. మఱియు నీపద్యముతో సాటి వచ్చు పద్యమును వ్రాయుసమర్థుఁడే లభించుచో, నాంధ్ర మహాభారతము అతుకు దెలియని మేలిహారమువలె నొప్పారియుండు నని యారాజేంద్రుఁడు భావించి దానినే పంపి యుండఁడా? కావున రాజరాజునైతము వన పర్వమును బరీక్షింప వెనుదీసె నని యీకథ చెప్పుచున్నది కట్టుకథకుఁ గూడ నారణ్యపర్వ భయ మెట్లున్నదో!

ఎఱ్ఱాప్రగడమహాకవి యారణ్యపర్వమున జేయిడినతరువాతఁ (బ్రదికి కీర్తి గడింపఁ గలుగుటచే) గొంతభయము దీఱి దేశమున నిప్పు డారణ్యపర్వపుఁ బ్రతులు గన్నులఁ బడు చున్నవి గాని యేడెనిమిదివందలయేండ్లక్రింద నీపర్వమునుగూర్చి జనుల కెట్టియడ లుండె నో యెవ్వరు చెప్పఁగలరు? కావున నక్కా-లమున భట్టారకునియారణ్యపర్వము విశేష వ్యాప్తిఁ గాంచియుండలే దని పై విషయము లెల్లఁ బర్యాలోచించువారికి విశదముగాక మానదు.

ఇఁక నీవిషయమును గూర్చిన చర్చ, నటుండనిచ్చి, తిక్కనసోమయాజి నాఁటికి నన్నియభారత మెట్లుండెనో కనుఁగొందము.

తిక్కననాఁటియాంధ్రమహాభారతము

తిక్కనకవీంద్రుఁడు, తాను భారతాంధ్రీకరణమునకు దొరకొనునప్పటికి, మొదటి పర్వములు మూఁడును నన్నియచే సమగ్రముగఁ దెలిఁగింపఁబడియె నను విషయమును బాగుగ నెఱిఁగియే యుండెను. కాననే యాతఁడు లేఖ్యమైన భారతామ్నాయము,

"ఉ. ఆదరణీయ..............నం, దాదిఁ దొ
డంగి మూఁడుకృతు లంధ్రకవిత్వవిశార
దుండు వి,ద్యాదయితుం డొనర్చె మహి
తాత్ముఁడు నన్నిరు..."

"మ. హృదయాహ్లాదిచతుర్థమూర్తి తకథో
పేతంబు నానారసాభ్యుదయోల్లాసి
విరాటపర్వ మటఁ యుద్యోగాదులుం
గూడఁగాఁ, బదునేనింటిఁ దెలుంగుబాస
జనసంప్రార్థ్యంబులై పెంపునం, దుదిముట్టన్
రచియించు డొప్పు బుధసంతోషం బు
నిండారఁగన్."

అని వ్రాసియున్నాఁడు.

ఇప్పు డెఱ్ఱాప్రగడచే రచియింపఁబడిన దని చెప్పఁబడు భాగ మారణ్యపర్వమున సగ ముకంటె నెక్కుడుగఁ గానవచ్చుచున్నది. ఇంతభాగము మిగిలియున్నపుడు, తిక్కన వంటివాఁడు పైరీతి నంత విస్పష్టముగ వ్రాసి యుండఁడు. ఒకచిత్రకారుఁడు సర్వాంగసుంద

రమైన చిత్రప్రతిమ నొకదానిని వ్రాయఁదల పెట్టి, దానిచుట్టురేఖల నేర్పఱుచుకొని శీర్షమును నిండుగ లిఖించి, కంఠమునఁ గొంత భాగమును వ్రాసి మృతినొంద, నాప్రతిమనే పూర్తిసేయఁదలంచు వేఱొకచిత్రకారుఁడు, తా నెంత రమ్యముగఁ జిత్రించు నేర్పరియైనను, దాను లిఖించు తక్కినవిగ్రహమును బూర్వపుఁ గంఠభాగముతోఁ గలుపఁడేని, యా చిత్తరువు చూపఱకు సంతోషము నింపారఁ జేయు నని భావింపఁజాలఁడు అట్లే యారణ్యపర్వమున నంతభాగము కొఱవడి యుండెనని "బుధసంతోషంబు నింపారు"నని తిక్కనయుఁ దలంపఁజాలఁడు. కావున నన్నియు మూఁడు పర్వములను సంపూర్ణముగఁ దెలిఁగించియుండుటను గవిబ్రహ్మ స్పష్టముగ నెఱిఁగియుండె ననియే చెప్పవచ్చును.

సోమయాజిశిష్యుఁ డగుమారనయుఁ బై విషయము నిట్లు ధ్రువపఱిచినాఁడు

"ఉ. సారకథాసుధారసము……, భారతసంహితఁ జేసె మును ద్విపర్వము లెవ్వఁడొనర్చె నట్టి…నన్నియభట్టు గొల్చెదన్." (మార్కండేయపురాణము)

ఎఱ్ఱాప్రెగడకుఁ బూర్వమున నున్న యీ యిరువురును ఘంటారావముతో నన్నియ మూఁడుపర్వములను వ్రాసె నని స్పష్టముగఁ జెప్పియుండ, వారిది సామాన్యపు వ్రాఁత యనుట సమంజసము గాదు.

భారతవ్యాప్తి

కవిబ్రహ్మభారతము లోకమనోహర మయ్యెను. నూతనప్రియులగు లేఖకాదు లాతని కవిత్వపటుత్వసంపదకు వశులై తద్గ్రంథమునుండి లెక్కలేని ప్రతులను వెలువరించిరి. సోమయాజి యనంతరము నాచన సోమనాథ మహాకవి భారతశేషమగు హరివంశమును దెలిఁగించి యాంధ్రమహాభారతమును సమగ్రముఁ గావించెను. భారతపురాణపఠనమున దేశము నెల్లెడల నభివృద్ధిఁ గాంచెను.

అరణ్యపర్వావశ్యకత

పురాణపఠనశ్రవణాభిలాషులకు నారణ్యపర్వ మావశ్యక మయ్యెను. అప్పుడు తెలుఁగు భారతము రమణీయహారము దెగినట్లుండెను. శాంతిపర్వ మాంధ్రమునఁ గలదు గాన వనపర్వము దోషావహము గా దని విద్వాంసులు చెప్పుచుండిరి. ఆరణ్యపర్వపుబ్రతులకై యన్వేషణప్రయత్నములు జరుపఁబడెను. అచ్చటచ్చట ససమగ్రములు సమగ్రములు నగు ప్రతులు కొన్ని యుండెను. అవియును జిరకాలమునుండి స్పృశించువారు లేక శిథిలములై యుండెను. వానినుండి ప్రతులను వ్రాసికొనుట సంకట మయ్యెను. సమర్థుఁ డగు కవిసత్తముఁ డెవ్వఁడైన శిథిలభాగములఁ బూరింపఁ గడంగనిచో నున్న భాగములు నయితము నశించిపోవు ననుకొనవదంతి లోకమున వ్యాపించెను.

ఎఱ్ఱననాఁటివనపర్వము

ఆ సమయమునఁ * జెదలువాడ వంశపయఃపారావారరాకాచైవాతృకుం డెఱ్ఱనార్యుం

* వీరవనారాయణ చరిత్రమున చెదలువాడ మల్లయ్య, ఎఱ్ఱాప్రెగడ వంశమునకుఁ గర్త యని వ్రాయు

జగద్ధితార్థమై యవతరించి సకలకలా
శేలుఁడై వెలుఁగొందుచుండెను. ఆతఁడు సామాన్యుఁడు గాఁడు "శంకరస్వామిసంయ...ంధ్రగురుచరణధ్యానానంద సౌందర్య ధుర్యుఁ..." "గిరిశపదభక్తిరసతత్పరభావుఁడు' 'బహు...రాణపర్మశాస్త్రకథావిస్తరవేది.' మఱియు ...దయసౌశీల్యాదిసద్గుణగణసంపన్నుఁడు.

ఇట్టిమహాత్ముఁడు పైయరణ్యపర్వశిథి...లావస్థను గూర్చిన జనశ్రుతిఁ జెవ్రలార నాక...ించెను. నన్నయ యారణ్యపర్వపుస్తకము ...కదానిని సంపాదించి చూచెను. అది చెద...పురుగులు దిన్నవన్నెలగొడుగుంబోలెఁ గ్రిమి...లదష్టమై యచ్చటచ్చట నష్టములైన యక్షర...ములు, పదములు, పద్యపాదములు, పద్య...ములు మొదలగువానితో నెన్నో తాటి...తాకులు గలవై యుండెను. (రెండు మూడు...దల యేండ్లక్రిందటి తాటియాకు పుస్తక...ములను గనఁగలిగినవారి కీవిషయము విశ...దమే.) దానిం గాంచి నిర్మలహృదయుఁ డా...ప్రభుదాసుఁ డిట్లు చింతించియుండును.

"హా! శబ్దశాసనమహాశయా! దిక్కు...లేలిన యీయారణ్యపర్వము నిన్ను మ్రింగి...ల్లి నియుక్షరములతో నున్న తన్నుఁ దానే ...మ్రింగు కొనుచున్నదా యేమి? నీ వెంత ...మము వహించి దీనిని రచించితివో కదా! అవసానసమయమున భగవన్నామస్మరణమునకంటె మున్న నీమనోదృష్టి యెన్ని సాకులు నీయీయాంధ్రభారతపుత్రికారత్నముపైఁ బ్రసరించియుండెనో కదా! అకటా! సుజనుఁడవైన నీయీ గ్రంథభాగమున కెంత గతిపట్టినది! ఏమాయెను తెమ్ము! నీకీర్తిని నిలుపువాఁడను—నీవాఁడను—నేనున్నాను. నీ గ్రంథములోని శిథిలభాగములను నేను పూరించి నీపరిశ్రమము వ్యర్థవోవకుండ దీనిని వెలయించెదఁగాక!..."

ప్రబంధపరమేశ్వరుఁడు ఋజుమార్గవర్తనుఁడు; ధర్మమతి, పరమార్థచింత గలవాఁడు. నన్నయభట్టారకునియందు దానినిఁ బొడమిన యపరిమితభక్తిగౌరవాదులు తద్గ్రంథశిథిలభాగపూరణోద్యమమున కాతని సాహసింపఁ జేసినవి. అప్పుడు జనించిన భావోద్రేకముచే నరణ్యపర్వమును గూర్చి యంతకుమున్ను లోకమునఁ గల ప్రవాదము నాతఁడు సరకుసేయఁ డయ్యెను. "ప్రప్రథమమున నే రామాయణములోని యుత్తరకాండమునే రచించిన తిక్కనమహాశయుఁడు దీర్ఘాయుష్మంతుఁడై భారతములోని పదునేనుపర్వములు గల గొప్ప గ్రంథమును వ్రాసి శాశ్వతంబగు యశంబును గడింపఁగల్గెనే! ఖిలమగుచున్న భట్టారకుని గ్రంథమును బరమార్థబుద్ధితో నాతని పేరనే యుద్ధరించు నేనేల

...కే నిట్లు వ్రాయవలయ్యెను గాని రొట్టవనాఁ డీ యింటిపేరే యున్నదని చెప్పుటకు ధైర్యము చాలదు. ఎట్టనఁట్ల ...ను పడుకుఁ జాలదరములు గడచినవి. ఒక్కొకయింటిపేరు తండ్రినుండి కొమరునికడకు వచ్చునప్పటికే మారి...పుచుండుట గలదు. తిక్కనకొమరుఁడు కొమ్మన యనంతరము కొట్టరువువారు పాటూరివారైనారు. కరా. తిమ్మక...ర్యదుల గురువైన కొండులూరి లింగనారాధ్యుని శిష్యులందఱు 'అయ్యగారు' అనుటచే; నాయనవరువారివా రయ్య...రివారైనారు. ఇట్లే నరహరి ప్రెగడవారు మత్తరాజువారుగను, పైఁడిపాటివారు రేమఁగువారుగను మయినారు;

తిక్కనవలె నితరగ్రంథములను వ్రాయఁగల చిరంజీవిని గాఁగూడదు? ఏమైనఁ గానిమ్ము. నే నీమహాకార్యమునకుఁ గడంగెదను." అని యాతఁడు భావించుకొనెను.

శిథిలభాగపూరణము

పిమ్మట నాతఁడు దేశమునఁ గలయరణ్యపర్వపుఁ బ్రతులకై ప్రయత్నించెను. కొలఁదిప్రతులు లభించెను. అందుఁ గొన్ని యసమగ్రములు; కొన్ని సమగ్రములు. అవి యన్నియుఁ దన యొద్దనున్న ప్రతికి దోఁబుట్టువులయియే యుండెను. ఆ ప్రతుల నన్నిటిని మిక్కిలి శ్రమచేసి సరిచూచుకొనుచు, నష్టభాగములను పూరించుచుఁ తుదకు వనపర్వమును బూర్తిగావించెను.

"నన్నయకవీంద్రుఁడు విశేషశ్రమమున కోర్చి వార్ధకదశయందు సనయమహత్త్వము తగ్గిపోయినను, ఓపికచేసి దీనిని రచియించినాఁడు. ఇందుఁ గొన్నిచోటు లచ్చటచ్చటఁ గాలవశమున శిథిలమైపోయినవి. అట్టి మహాత్మునిశ్రమ మూరకపోనేల? ఆతనిశ్రమమును భూమిపై నేల నిలువరాదు? నే నెంతశ్రమపడిన నేమి? మొదటిశ్రమ మాతనిదేకదా? ఆతనికీర్తియందు నాకు భాగమేటికి?" అని యా మహాదార్యశాలి తలంచి, నష్టభాగములను సాధ్యమైనంతవఱకు నన్నయపదాదులనే నిలుపుచుఁ బూరించుచు, ఎక్కుడు పరిశ్రమము తనదేయైనను నందున్న నన్నయ రాజనరేంద్రుల నామములఁ దెలుప నిచ్చగింపఁడయ్యెను.

ఇప్పు డెఱ్ఱాప్రెగడభాగ మనఁబడు గ్రంథమున నున్న నన్నయప్రయోగములు, ఎఱ్ఱనప్రయోగములు నన్నయభాష, ఎఱ్ఱనభాష రాజనరేంద్రుని సంబోధనములలో నన్నయవి, ఎఱ్ఱనవి- నన్నయ మధ్యాక్కరలకు నెఱ్ఱనదానికిని గలభేదము- మొదలగు విషయములను మఱియొక యవసరమున గైకొనఁదలఁచి ప్రస్తుత మొకటి రెండు విషయముల నిచ్చట నిచ్చుచున్నాను.

(అ) చ. రయవిచలత్తురంగ మతరంగముల
న్మదనాగనక్రసం
చయములఁ జంచలద్భటుల సై
నికమత్స్యములన్ భయంకరం,బయి..."

ఈ పద్యభాగము సభాపర్వమునను (ద్వి. 33.) ఎఱ్ఱనభాగమని చెప్పఁబడు ఆర. ష. 58 పద్యమునను గానవచ్చుచున్నది. ఈ రెంటికర్తయు నొక్కఁడు గాఁకున్నచోఁ బ్రబంధపరమేశ్వరునిపైఁ బదారచౌర్యమారోపింపవలసి యుండును. అంతకంటె వనపర్వమంతయు నన్నయ దనుట న్యాయ్యము గాదా?*

ఆరణ్యపర్వోత్తరభాగమును బరికించు వారికి నం దనేకభాగములు నన్నయ కవిత్వములోనివే యని తప్పక స్ఫురించును. ఎన్నివిధములఁ బరిశీలించినను, ఎఱ్ఱాప్రెగడ

* (క) నన్నయ సీసగీతనియమములు వేఱు, తిక్కనాదులవి వేఱు. నన్నయనియమము లెఱ్ఱన గ్రంథములలో లేవు. ఆరణ్యపర్వమునం దంతటను నీ నియమము గానవచ్చుచున్నది. ఇందుమాత్రమే నన్నయనియమము నెఱ్ఱన నిల్పినాఁ డందురేమో? సీసగీతనియముల నిలిపినవాఁడు మధ్యాక్కరలక్షణము నేల పాటింప లేదు? ఆర. చ. 3౧.

చేసినది శిథిలభాగపూరణమే కాని ప్రత్యేక రచనము గాదనియే తోఁచుచున్నది. ఇవ్విషయమునఁ గల పూర్వపక్షసిద్ధాంతముల సమ* న్వయము నిచ్చట సంగ్రహించి చూపుచున్నాను.

(౧) భట్టారకుని యారణ్యపర్వభాగము "శారదరాత్రులు" అను పద్యమువఱకే వ్రాయఁబడినదయి యుండి, మిగిలినది వట్టితాటి యాకులుగలదే యై, పిమ్మట నెఱ్ఱనచే రచియింపఁబడినదే యై యున్నచోఁ, దాను రచించిన యా గొప్పభాగము నాతఁడు నన్నియపేరనే వెలయించుటకుఁ దగిన ప్రబల కారణ మేదియుఁ గానరాదు. తనపేర నారణ్యపర్వశేషమును బ్రకటించుచో నన్నియ గతియే (మతిభ్రమణమో, మరణమో) తనకును సంభవించు ననుభయముచేత నాతఁ డట్లు చేసినాఁడని కొందఱొక యుక్తి సెప్పెదరు. నన్నియకు మరణముఁ గలిగించినది యారణ్యపర్వాంధ్రీకరణమా? అందున్న నన్నియనామమా? ఇదేటి యుక్తి? నన్నియపేరు సెప్పి యెఱ్ఱన నిప్పు ముట్టినను కాలదు గాఁబోలు! మున్నూఱేండ్లకు ముందున్న వానిపేరు సెప్పినంతమాత్రమున నారణ్యపర్వదోషము తప్పిపోఁగలదా?

పై భయమును మనవారు తిక్కనయందును నారోపించియున్నారు. తొలుదొల్తనే, యారణ్యపర్వము వంటిదే యగు నుత్తరరామాయణమును దెలిఁగించి, మనుమసిద్ధిభూపాలునకుఁ (అల్లునకుఁ?) గృతి (కన్యా) దానము నొనర్చి మించిన కవిచక్రవర్తికిఁ దిక్కన కట్టిభయ ముండెనను మాట నమ్మఁదగినదా?

"పసుచువాఁడైన తిక్కన కొకవేళ నట్టిభయ ముండిన నుండవచ్చు"నని యొకానొకరు వ్రాసిరి. ఎఱ్ఱనమాత్రము వనపర్వరచననాఁటికి ముసలివాఁడా? తిక్కనకన్నను బడుచువాఁడు!

లెక్కలేని యోధులచావులు గల యుద్ధపర్వములు, కేవలము శోకభూయిష్ఠమగు స్త్రీపర్వము, నూర్గురుకొడుకులును బంధుమిత్త్రులును జచ్చినదుఃఖము నిండికొనిన మనంబులతో ధృతరాష్ట్రాదులు వనంబునకుఁ బోయినకథ గలయాశ్రమవాసపర్వము, శ్రీకృష్ణనిర్యాణమును జెప్పు మౌసలపర్వము, ధర్మరాజాదులు రాజ్యకాంక్ష సంపూర్ణముగ భూమిపై దిగవిడిచిపోవు మహాప్రస్థానికపర్వము (అరణ్యపర్వకథనాఁటికిఁ గను నెప్పటికేని రాజ్యము రాఁగలదను నాసయైనఁ

* నన్నియ భట్టారకుని సీసగీతాదులలోఁ గానవచ్చు నియమముల నన్నిటిని పూర్వము నేను బరిశోధించి- అప్పటి యచ్చుపొత్తము లిప్పటివానివలె స్వచ్ఛమైన ముద్రణముగలవియు, పాదమున కొకపంక్తి గలవియుఁ గాక పోయినను చిక్కులయ్యు శ్రమపడి- యొకవిమర్శనము వ్రాసి వేఱొక సందర్భమున నామిత్రులగు పాఁడి వేంకటస్వామిగారికిఁ జూపఁగా వారు నన్నుఁ బొగడుచు, దానిం బరికించి యిచ్చెద మని పుచ్చుకొని, నా వాక్యరచనను గొంతమార్చి, తమపేరితో నేను బంపెదనన్న పత్త్రికకు- అముద్రిత గ్రంథచింతామణికిఁ బంపి యందు బ్రకటించుకొన్నారు; అక్కాలమున సం॥గ్ర. చింతామణిలో నాయనకుఁ బరిచితియే లేదు;

గలదు! ఈపర్వమున నదియు లేదు!) తుదకు స్వర్గారోహణపర్వమును రచియించిన కవి బ్రహ్మమహాశయుఁడు, తనకాలమున నారణ్యపర్వము కొంత అవశిష్టియుండెనేని దానిని బూరింప వెనుదీసియుండునా?

(౨) ఆరణ్యపర్వమున నన్నయకవిత్వమని తలంపఁబడుభాగము ౧౩౦౦ పద్యములు గలదై యున్నది. ఎఱ్ఱనకవిత్వమని చెప్పఁబడునది ౧౬౦౦ పద్యములు గలది. ఇంతగొప్పగ్రంథమును దానే సంపూర్ణముగా నన్నయ కవిత్వము లేకయే రచియించియుండెనేని, యాగ్రంథమునకు నన్నయను గృతికర్తగను, రాజనరేంద్రుని గృతిభర్తగను జేయునా యెఱ్ఱాప్రెగ్గడ? ఏనాఁటి నన్నయ? ఏనాఁటియెఱ్ఱన? ఏనాఁటిరాజరాజు? ఎవ్వరు చూచిన సతోషమిది?

పై సందేహమునకుఁ గొందఱు, "ఒకరి సంతోషముతో నెఱ్ఱనకుఁ బనిలేదు. నన్నయపై నాతనికిఁ గలిగిన భక్తిగౌరవములే కారణములు." అని చెప్పుదురేమో!

నన్నయయెడఁగల భక్తిచేతనే యారణ్యపర్వభాగము నాతనిపేర రచియించి యుండునేని, భారతశేషమగు హరివంశమును దిక్కనపేరనయినను వెలయించి యుండును. కావునఁ బైసమాధానము యుక్తియుక్తము గాదు. మఱియు, నన్నయయెడనే యట్టిగౌరవము చూపఁదలఁచినాఁడు గావున నారీతి నొనర్చినాఁ డందు రేమో! అట్టియాశయమే యాతనికిఁ గలిగినచోఁ దద్భాగమును నన్నయకుఁ గృతిగ నిచ్చియుండునే! ఎన్నఁడో మృతినొందినయాతఁడు రచియించిన ట్లసత్యవిషయప్రకటన మొనర్చుటకంటె నాతనికిఁ గృతి యిచ్చియుండుట విశేషభక్తిగౌరవములఁ దెలుపునుగదా?

పోతనభాగవతమును భాస్కరునిరామాయణమును గనుఁగొనుఁడు! అందెవ్వరు వ్రాసిన భాగములను వారు తమనామములతోనే వెలయించినారు గాని యొం దొక్కఁడేని తన భాగమునందున్న ముఖ్యకర్తపేర వ్రాయలేకపోయినాఁడు! కృతిపతులనుసయితము దమ యిచ్చకు వచ్చినవారినే నిలిపికొన్నారు!

మఱికొందఱు "నన్నయ సగముపర్వము వ్రాసియుండెను గావునఁ దక్కినసగమునందు నింకొక కృతిపతిపేరును, నింకొకకవి పేరును నేల యని యెంచి యట్లుచేసినాఁ" డని యందు రేమో!

(అ) తిక్కన సోమయాజి నిర్వచనోత్తర రామాయణమున యల్పభాగము మిగిలియుండఁగా (లేక యుత్సన్నముకాఁగా) దానిం బూరించిన జయంతిరామభట్టు వేఱొకయాశ్వాసముగ రచించి భద్రాద్రిరామున కంకితమిచ్చితనపేరనే వెలయించుకొన్నాఁడు.

(క) హుళిక్కిభాస్కరుని యుద్ధకాండమును బూరించిన యయ్యలార్యుఁడు దానిని వేఱుగ విభజింపకయే "అమరహుళిక్కిభాస్కరమహాకవి సెప్పఁగ నున్నయుద్ధకాండము తరువాయి సెప్పె..."అని తనపేర వెలయించుకొనుటయే కాక యాశ్వాసాంతమునఁ గృతిపతిని సైతము మార్చివేసినాఁడు.

(గ) సాహిణిమారన సంబోధనముతో భాస్కరామాత్యుఁడు ప్రారంభించిన సుందర

కాంశమును మల్లికార్జునభట్టు పూరించుచుఁ, దా నాతనిపుత్త్రుఁడైయుండియు నాశ్వాసాం తమునఁ దత్కృతిపతి పేరైన నత్తక తన యిష్టదైవమును సంబోధించి, గద్యమునఁ దననామమునే వెలయించుకొన్నాఁడు. కన్న కొమరుఁడై యుండియుఁ దండ్రియందుగాని, యమ్మేలు ప్రభుప్రనందుగాని కొంచెమేనియు భక్తి గౌరవములమాట యటుండనిండు!) మామోటమియైన లేకుండ సుందరకాండ పూరణ మొనర్చిన మల్లికార్జునభట్టు కాండ మంతయుఁ దానే రచించినట్లు వ్రాసికొన్నాఁడే. మూఁడు వందలయేండ్లకు మున్ను పరమ వదము నడిపిన నన్నియరాజరాజులపేర నేకా ణము (నన్నియరచన) లేనిదే యయ్యె ణ్యాపర్వభాగమును ఎఱ్ఱాప్రెగ్గడ వెలయిం నాఁ డనుట యుక్తియుక్తముగా నుండు కేమో యోజంపుడు కీర్తికాముఁడు గానివా వ్వఁడు? "మహాకవులాద్యులు గావ్యకళయ్య లించిన కీర్తిసంగసుఖలీలకు నేను గాం సేసితిఁ" అని నృసింహపురాణమున నెఱ్ఱన వ్రాసికొనియున్నాఁడే.

(3) నృసింహపురాణములోని యీ క్రిందిపద్యములను బరీక్షించువారికి, అరణ్య ర్వమంతయు నన్నియకృతమే యనియు, ఱ్ఱన యొనర్చినది యచ్చటచ్చటి శిథిలభాగ ములపూరణమే యనియు స్పష్టముగాఁగలదు.

వ. అని యీ క్రమంబునఁ బ్రధాన దేవతాసంకీర్తనంబును... సమర్థించి, కృతా తం బొంది కతిపయమాసపరిగ్రహజనితం రైన నైసర్గికచాపలంబుకతంబున.

ఉ. వించిన వేడ్క- పీనులకు మిక్కుటమై మధువృష్టి గ్రమ్మరాయంచలు గూయఁ గ్రొంచమును నావలఁ గూయఁ గడంగు భంగిఁ బ్రా, భాంచితశబ్దసారులు మహా కవులాద్యులు గావ్యకళయ్యఁ గీలించిన కీర్తిసంగసుఖలీలకు నేను గాంక్షసే సితిఁ."

నృసింహపురాణమునకు నిమ్మడు గు గ్రంథమును వనపర్వోత్తరభాగమును దాను ప్రత్యేకముగ వ్రాసియుండనేని "కతిపయా తురచాపలంబున' ననియు, పూర్వులవలె నేనును గవిత్వమును జేయఁ గాంక్షసేసితి' ననియు నెఱ్ఱన వ్రాసియుండఁడు. శిథిలభాగ పూరణముతోఁ దన గంటమునకుఁ బదను గలిగించికొన్నాఁడు. తరువాత స్వతంత్ర గ్రంథ రచనమునకుఁ బూనుకొన్నాఁడు. కావుననే యద్భుతులానుభావభవ్యుఁడు, స్వప్నమున సాక్షాత్కరించిన తన పితామహుఁడు తనతో,

ఉ. ఉన్నత సంస్కృతాంధ్ర చతురోక్తి పదంబులఁ గావ్యకర్తవై, యెన్నికమై ప్రబంధపరమేశుఁ డనంగ నరణ్యపర్వశే, షోన్నయ మాంధ్రభాష సుజనోత్సవ మొప్పఁగ నిర్వహించితి (వి)

అని పలికినట్లు వ్రాసికొన్నాఁడు. ఇందు గల ఉన్నయశబ్దమున కర్థము విచారించుచో "ఉన్నదానిని పైకి లేవనెత్తుట (ఉద్ధరించుట)" యని యేకాని "క్రొత్తగా సృష్టించుట" అను నర్థము లేదని విశద మగును. (ఉన్నయమ్. కూపాదితో జలాదే రుత్తోలనమ్.)

శ్రీ వీరేశలింగము పంతులవారు, "అరణ్యపర్వశేషము" అనునప్పుడు 'శేష' మనగా మిగిలిన దని యర్థముగదా! నన్నయ రచింపఁగా మిగిలిన దనకపోయినయెడల నిచ్చట శేషశబ్దమున కర్థ మేమగును?" అని వ్రాసి యున్నారు. అరణ్యపర్వశేషము-అరణ్యపర్వముయొక్క మిగులు-ఇతరములయిన ప్రబల హేతువు లనేకము లుండఁగా, నీ 'శేష' శబ్దమునకు "చేసినదానిమిగులు" అనునర్థమును దెచ్చుకొనుటకంటె "లభించినదానిమిగులు" అనునర్థముకు గ్రహించుట సమంజసము గాదా? ఇచ్చట, "లభించునది" యనగా ఖిలముగాకుండ లభించినదని భావము. అరణ్యపర్వశేషోన్నయము - అరణ్యపర్వఖిలభాగముల నుద్ధరించుట.

పై పద్యమును జూచి శ్రీ పంతులుగారు తమ కవిచరిత్రమున, "ప్రబంధధోరణిని భారతారణ్యపర్వశేషమును చమత్కారబంధురముగ రచించుటచేతఁ బ్రబంధపరమేశ్వరబిరుదము వచ్చిన" దని వ్రాసిరి. ఈపద్యమున నిట్టియర్థము గానరాదు. ఎన్నికమై, ప్రబంధపరమేశుఁడనంగ, సంస్కృతాంధ్రచతురోక్తిపదంబులఁ గావ్యకర్తనై (కవిత్వాధికారినై) యరణ్యపర్వశేషోన్నయము నిర్వహించితి నని పై పద్యము నన్వయము. ప్రబంధపరమేశ్వరుఁ డనఁదగినంత మేలికవిత్వ మలవడిన పిమ్మటనే వనపర్వశిథిలభాగములను బూరింపఁ దొరఁకొన్న వాఁడుగాని, కవిత్వారంభము నందే తత్పర్వమును బూరించి యట్టిబిరుదము పడలేదు. నన్నియతిక్కనలకంటె నెక్కుడు ప్రబంధధోరణియు, నెక్కుడు చమత్కారబంధురతయు నెఱ్ఱనకు లేవు. పై పద్యములోని "చతురోక్తి" అనుదానిని గనుఁడు. మఱియు, "పరిఢవింతుఁ బ్రబంధపరమేశ్వరుని దేవసూక్తివైచిత్రి నెక్కొక్కమాటు" అను శ్రీనాథుని స్తుతిని, "ఈత్రయిఁ దాఁ బ్రబంధపరమేశ్వరుఁడై రచియించె శబ్దవైచిత్రి..." అను జక్కననుతిని గనుఁడు.

(ర) నన్నియతిక్కన లిరువురును భారతము సంపూర్ణముగాఁ దెలిఁగించినారను భావమే కాని యెఱ్ఱాప్రెగడకు వేఱుతలంపు లే దని యూహించుట కాతని నృసింహపురాణములోని యాక్రింది పద్యమునయితము మార్గముఁ జూపుచున్నది.

ఉ. భాసురభారతార్థముల భంగుల నిక్క-
మెఱుంగనేరమిం, గానటబీసటల్ సదివి
గాథలు ద్రవ్వ తెలుఁగువారికిన్, వ్యాస
ముని ప్రణీతపరమార్థము దెల్లము సేసి
పట్టియు, బ్జాసనకల్పులం గొలుతు నాద్యు
ల నన్నియతిక్కనార్యులన్."

ఆంధ్రభారతములోని యరణ్యపర్వమున సగముకంటె నెక్కుడుభాగమునకు సంపూర్ణకర్తృత్వము గలవాఁడు పై రీతిని వ్రాసి యుండఁడు.

(గి) అరణ్యపర్వాంతమునఁ గానవచ్చు, నెఱ్ఱనార్యుఁడు దదుత్తరభాగమును రచియించినాఁ డనువాడుక లోకమునఁ బ్రబలుటకు ముఖ్యహేతువులై యున్న

"సీ. భవ్యచరిత్రుఁడు...ఇలఁ శాకనాటిలో
సీలకంఠేశ్వరస్థానమై యొసకమెసఁగు,

గుడ్లూరు నెలవుగా...నొప్పు...నెల్లి
ర్యుండు..." అను సీసపద్యమును,

". ధీరవిచారుఁడు దక్షుని, తాఁకితియుఁ
గొంత దోషఁ దద్రచనయకా, నారణ్య
పర్వశేషము, పూరించెఁ గవీంద్రకీర్ణపుట
పేయముగ౯."

అను కందపద్యమును నెఱ్ఱన మహాకవి సినవి గావు. ఎట్లన, ఆనంద ముద్రాక్షర లను ముద్రింపఁబడిన యాంధ్రభారత ను బరిష్కరించినపుడు తాము పెక్కు టి యాకుప్రతులను జూచితిమనియు, నం ప్చటను పైపద్యములు గానరాలేదనియు, (శ్రీ) తం. తేవప్పెరుమాళ్లయ్యగారు ప్రాయునా్నరు. దీని కుపబలముగా 1907 వ వత్సరము మొదలుకొని నేటి దాఁక ద్రింపబడిన (ఆనంద) భారతము కూర్పు ల్టి యందును, అరణ్యపర్వాంతమున పుట కుగున, "భవ్యచరిత్రుఁడు- అని అచ్చు ప్రతులయందుమాత్ర మగఁడియెడి" అని చింపఁ బడియున్నది. (శ్రీ) తేవప్పెరుమా ళ్లయ్యగారు పరీక్షించిన దాక్షిణాత్యకోశ ము కొన్నిటియందుఁ బైపద్యములు లేకు ను, ఈ దేశములోని కొన్నిప్రతులలో కానవచ్చుచున్నవి. ఆపద్యము లెఱ్ఱనవే యుండు నేని కొన్నిటియందవి యుండు ను, గొన్నిట లేకుండుటయు సంభవింపదు. మునుంగాక, యాపద్యముల నెఱ్ఱనయే యుండు నేని, ఒక్కొక యాశ్వాసము టను డు గద్యమునందును దననామ చేర్చియుండును. ఒకచోటఁ గల మరిణ క్షితి వేఱొకచోట నుండదనుటకు హేతువు గానరాదు.

కొన్ని వ్రాఁత ప్రతులలోనుండి, కొన్ని ట లేక గతానుగతికముగ ముద్రింపఁబడిన ప్రతులలోఁ గానవచ్చుచున్నపై "భవ్యచరిత్రుఁడు..." అనుపద్యము శంభుదాసునకుఁ దరువాతఁ జిరకాలమునకు వ్రాయఁబడినదే యని యూహించుట కొకగొప్పయాధార మా పద్యముననే చూపట్టుచున్నది. ఎట్లన:— ఆ పద్యమున,

'పాకనాటిలో నీలకంఠేశ్వర స్థానమైన గుడ్లూరియందు నెఱ్ఱన యుండినట్లు చెప్పఁబడి యున్నది. ఈపద్యముదక్క నెఱ్ఱనది గుడ్లూరనుటకు నితరాధారము గానరాదు. నృసింహపురాణమున నెఱ్ఱన "వేఁగినాటఁ గొఱ్ఱపత్రి వృత్తిమంతుఁ"డని తనతాతను వర్ణించినాఁడు. పిమ్మట, ప్రోలయవేముని తమ్ముఁడు మల్లారెడ్డి దన్నుఁ దీసికొనిరాఁగా నద్దంకి రాజధానియందుఁ దదాస్థానకవిగా శంభుదాసుఁ డుండినట్లు హరివంశము దెలుపుచున్నది. పిమ్మట నాతఁడు చెదలువాడ నివాసియైనట్లు విప్రనారాయణ చరిత్రము బోధించుచున్నది. వేమారెడ్డి జీవించియుండఁగానే యెఱ్ఱన పరమపదము నందినట్లు కవిచరిత్రము తెలుపుచున్నది. కావున నవసానదశయందు అద్దంకినుండి యాతఁడు చెదలువాడఁ జేరెనని భావింపవచ్చును. కవిగాని, తద్వంశస్థుఁడు గాని చెప్పని యీగుడ్లూరు, ఈపద్యమున నెట్లు చేరెననియూరకుఁగా, వేమారెడ్డివంశపువాఁడైన రాచవరెడ్డి, గుడ్లూరు రాజ.

ధానిగాఁ బాకనాటిసీమ నేలినట్లును, అచ్చట నీలకంఠేశ్వరుఁ డుండినట్లును విష్ణుపురాణము లోనియీ క్రిందిపద్యమువలనఁ దెలియవచ్చెను!

"గాఁకీన మేతుఁడై గరిమతో నేపీట నేపారు నీలకంఠేశ్వరుండు,......అట్టి రాజధానియై యొప్పు గుడ్లూరి నెసర నేలుచుండి యొక్కనాఁడు."

రాఘవరెడ్డికి, వేమారెడ్డి పూర్వుఁడై నట్లు విష్ణుపురాణమున వర్ణింపఁబడియుండుట చేతను, ఎఱ్ఱనమహాకవి, వేమారెడ్డియాస్థాన కవి యని తెలియుటచేతను, రాఘవరెడ్డి యేలియుండినగుడ్లూరినే పూర్వము వేమారెడ్డి గూడ నేలియుండు నని యూహించిన (చరిత్రము దెలియని) యే లేఖకమహాశయుఁడో విష్ణుపురాణమును జదివికొని; (ఎఱ్ఱనకుఁ బిమ్మటఁ జిరకాలమునకు) పైపద్యములను వ్రాసి యారణ్యపర్వాంతమునఁ దూర్చినాఁడు! ఆ ప్రతికిఁ బుత్త్రికలయిన ప్రతులే యీపద్యములు గలవి! తత్పూర్వపుఁ బ్రతులపుత్త్రికలే యీపద్యములు లేనివి. కావున నారణ్యపర్వాంతమునఁ గానవచ్చు పై రెండుపద్యములును నెఱ్ఱాప్రెగ్గడ వ్రాసినవిగావనుట స్పష్టము. (కంద పద్యమున నున్న "తక్కవితారీతియుఁ గొంత దోఁప" అనునది దైవికముగానే వ్రాయఁబడినది!)

(౩.) అరణ్యపర్వచతుర్థాశ్వాసము 142 వ పద్యముతరువాత.

"నన్నయభట్టుకవిత్వము సంపూర్ణము."
"ఇక్కడనుండి యెఱ్ఱాప్రెగడకవిత్వము", (ఇది యచ్చుప్రతులందుమాత్రమే యున్నది.)

అనువ్రాఁత లేఖకులదే యనుట స్పష్టము ఎఱ్ఱనయే యట్లు వ్రాయుచో నాశ్వాసాంత గద్యములయందు నన్నియ పేరు పెట్టుటయందు లాభమేమి ? అతఁడే యట్లు వ్రాయునేని, "నన్నియ యింతదనుక వ్రాసి మృతినొందెను గావున నింతనుండి యాతని పేరనే నేను రచించుచున్నాను." అని వ్రాసియేయుండును.

ఎఱ్ఱనయనంతరము కొంతగాలమునకు "భారతారణ్యపర్వశిథిలభాగముల నాతఁడు పూరించె" ననుప్రతీతి క్రమముగా "అరణ్యపర్వశేషమును జెప్పె" ననువిఖ్యాతిగామాఱి, దేశమున వ్యాపించినతరువాత, నే లేఖకుఁడో, ఎఱ్ఱన కవిత్వారంభమును గనిపెట్టనెంచి నృసింహపురాణము ప్రథమాశ్వాసములోని 113 వ పద్యమునఁ గానవచ్చు "స్ఫురదరుణాంశురాగరుచి" అను దానిని, భారతములోనిదానిని వాని సామ్యమును బట్టి, "ఇక్కడ నుండియే యెఱ్ఱాప్రెగడకవిత్వమై యుండు" నని భావించి యట్లు వ్రాసియుండును! కావుననే "ఇంతనుండి యఱ్ఱాప్రెగడవారు చెప్పిన ఆరణ్యపర్వశేషము" అని కొన్నిటియందును, "ఇంతనుండి చదలువాడ యెఱ్ఱాప్రగడవారు చెప్పిన అరణ్యపర్వముశేషము" అని కొన్నిటియందును వ్రాయఁబడియున్నది. "నన్నియభట్టకవిత్వము సంపూర్ణము" అనునది తాటియాకు పుస్తకములందు లేనే లేదు మఱియు, "శారదరాత్రులు..." అనుపద్యముకడపట, "పాండురుచిపూరితసర్వదిగంతరంబులై" అనుపాఠము "పూరములం బరిపూరితంబులై" అని మాఱి "పూరము లంబరపూరితంబులై" అని తుదకుఁ

...పూరములన్ + పరపూరితంబులై" అను పాఠాంతరమై పదవిభాగమేర్పడఁగా, "అక్కడనుండి యితరులు పూరింపవలసివచ్చిన" దను ...ర్థముతో నొకకథపుట్టియుండ, అక్కఁను విన్న ...లేకరిద్దైన "ఇంతనుండి యెఱ్ఱాప్రెగడకవిత్వ" ...మని వ్రాసినదేని దైయుండును.

(2) ఆరణ్యపర్వోత్తరభాగము ప్రబంధపరమేశ్వరుఁడు రచింపలేదనుటకుఁ బ్రబలకారణము నొకదానిని జూపుచున్నాను.

ఎఱ్ఱన శిష్యయాస్థానకవిగదా! అతని తరువాత నచిరకాలముననే యయ్యాస్థానియందే మహాకవిగా నున్న శ్రీనాథుఁడు, తెలుఁగుభారతముకర్తలు నన్నయతిక్కనలే యైనట్లు భీమఖండమున నిట్లు వ్రాసియున్నాఁడు.

"క. నెట్టుకొని కొలుతు నన్నియ, భట్టోపాధ్యాయ సార్వభౌమునిఁ గవితా, పట్టాభిషిక్తు భారత, ఘట్టోల్లంఘనపటిష్ఠగాఢ ప్రతిభున్. ఉ. పంచమవేదమై పరగు భారతసంహిత యాంధ్రభాషఁ గావించె బదేనుపర్వములు విశ్వజగద్ధితబుద్ధి నెవ్వఁడు, కాంచనగర్భతుల్యున కఖండితభక్తి నమస్కరింతు నిర్వాంచితకీర్తివైభవవిరాజికిఁ దిక్కనసోమయాజికిన్."

ఆరణ్యపర్వశేషము నెఱ్ఱన వ్రాసినట్లు శ్రీనాథుఁడు పొగడకపోవుటం దలంచి కాఁబోలు శ్రీ వీరేశలింగముపంతులవారు తమ కవులచరిత్రము 417 వ పుటయం దిట్లు వ్రాసినారు:— "కవిత్రయములో నెఱ్ఱాప్రెగడ యిప్పటి శాధునికుఁ డగుటచేతఁ బొగడక పోయినను దాను రచియించిన యితరగ్రంథములయం దీకవి యాతనిఁ జేర్కొన్నాఁడు."

శృంగారనైషధ మీ భీమఖండముకంటె ముప్పదియైదేండ్లకు మున్నే రచియింపఁబడినదని శ్రీపంతులవారే వ్రాసియున్నారుగదా! శ్రీనాథుఁడు నైషధమున నెఱ్ఱన నిట్లు పొగడియున్నాఁడు:— "ధీరమతి నన్నపార్యునిఁ దిక్కయజ్వ, శంభుదాసునిఁ గరమర్థి సన్నుతించి" నైషధమునఁ బొగడఁబడిన యెఱ్ఱన భీమఖండమునాఁటికి(35 ఏండ్లకుఁ దరువాత)నాథునికుఁ జెల్లగును?— ఆరణ్యపర్వములోని యంతగొప్పభాగము నెఱ్ఱనయే రచించెనేని, యారెడ్లసంస్థానమునందే యుండిన శ్రీనాథున కావిషయము దెలియకపోవుట యసంభవము. మఱియు నన్నియభట్టు వనపర్వము నంతను వ్రాసినాఁ డనుటయే శ్రీనాథుని యాశయమైనట్లు పై కందములోని "భారతఘట్టోల్లంఘనపటిష్ఠగాఢ ప్రతిభున్" అను విశేషమునుబట్టి గ్రహింపవచ్చును. (ఘట్టము= అరణ్యప్రదేశము. భయంకరమైన భారతారణ్యపర్వమును దాఁటిన ప్రజ్ఞగలవాఁ డని భావము.) శిథిలభాగపూరణము శ్రీనాథునివంటి వానికొక ఘనకార్యముగాదు.

(3) మడికి సింగన పూర్వకవిస్తుతి నిట్లు గావించినాఁడు:— "వ్యాస..., సకలభాషారసజ్ఞులనముల నన్న,పార్యతిక్కకవీంద్రుల నభినుతింతు" (వాసిష్ఠరా.) శ్రీ వీరేశలింగము పంతులవారు, ఇక్కవి యెఱ్ఱాప్రెగడను బొగడకుండుటనుగూర్చి యిట్లు వ్రాసినారు. "ఈకవి యెఱ్ఱాప్రెగడకు మిక్కిలి తరువాతివాఁ డయ్యును ప్రబంధపరమేశ్వరు నేల స్తుతింపలేదో తెలియదు." ఆంధ్రకవులలో శంభుదాసుని

స్తుతింపనికవులు పలువురుండఁగా, వారిచరిత్రమున వ్రాయని యీ వాక్యము నిచ్చట నేల శ్రీసంతులవారు వ్రాసిరో యని యూరయు, సింగనకవి తనపద్మపురాణమున నాంధ్రభారతమును నన్నయతిక్కనలుమాత్రమే రచియించినట్లు పొగడినపద్యము గానవచ్చినది!:—

"ఉ. భారత వేదవాక్యరసభావము లజ్ఞులెఱుం
గలేక ని, స్సారమనస్కులై తిరుగు చం
దము సూచి తెనుంగుబాస వెం, పార
రచించి యందఱఁ గృతార్థులఁ జేసిన
పుణ్యమూర్తులన్, సారమతి న్భజింతు నని
శంబును నన్నయతిక్కనార్యులన్.

(సింగనామాత్యుఁ డెఱ్ఱన కేఁబదియేండ్ల తరువాతివాఁడు.) ఈతఁడును శిథిలభాగపూరణము నొక ఘనకార్యముగా నెంచియుండఁడు.

(౯) నన్నయయనంతర మథర్వణాచార్యులుగూడ విరాటపర్వము మొదలుకొనియే భారతాంధ్రీకరణ మొనర్చెనని కవుల చరిత్రము దెలుపుచున్నది. ఈ వ్రాఁతనయితము నన్నియ మూఁడుపర్వములం దెలిగించె నని తెల్లము సేయుచున్నది. ఎట్లన, అరణ్యపర్వము కొఱవడియుండునేని, మతిభ్రమణమును గాని మరణమునుగాని సరకుసేయని (జైనుఁ డైన) యాతఁడు దానిని దప్పక పూరించియే యుండును.

(౧౧) చెదలువాడ మల్లయ్య తనవిప్రనారాయణచరిత్రమున "ప్రతిభమై నారణ్యపర్వశేషము జెప్పె" నని యెఱ్ఱనను బొగడియున్నాఁడు. ఎఱ్ఱనకు మల్లయ్య ౭,౮ తరముల తరువాతివాఁడు. (పీఠికాకారులకాలనిర్ణయము సరియైనను తరములసంఖ్య పొరఁబాటు.) ఆతఁడు, తనకాలమునాఁటికిఁ బ్రబలిన వాడుకనుబట్టి యట్లు వ్రాసియుండు నని పైని వ్రాయఁబడిన కారణములవలన నూహింప వచ్చును.

(౧౨) "ఆకాలమునం దలికొన్ని ప్రతులు వనపర్వశేషము లేకయే కనంబడుచున్నవి." అనుకవిచరిత్రములోని వాక్యము భ్రాంతిజనకము. ఏమన, ఏడెనిమిదివందలయేండ్లనాఁటి తాటియాకులపొత్తము లిక్కాలమునఁ గనఁబడుట కడుదుర్లభము. తాళపత్త్రగ్రంథభాండాగారములఁ జూచువారికి, ఒక్కవనపర్వమే కాక యెల్లపర్వములును సగసగము వ్రాయఁబడినవియుఁ గానవచ్చును. ఒకవేళ ఆవనపర్వశేషము లేనిప్రతులు కొన్నియున్నయెడల, అవి నన్నయమరణప్రవాదమును విని భయపడి వ్రాయమానిన యేలేఖకుని ప్రతినుండియో వ్రాసికొనఁబడిన (రెండుమూఁడువందలయేండ్లనాఁటి) ప్రతులై యుండును. కావుననన్నయ సగముపర్వమువ్రాసె ననుటకు నిది యొక కారణము గాదు.

(౧౩) ఒకకవీంద్రుని మొదటిగ్రంథములోని కవిత్వముకంటెఁ దరువాతివానిలోని కవిత్వ ముత్తరోత్తరాభివృద్ధిఁ గని యొప్పమీఱుట స్వభావము. అరణ్యపర్వోత్తరభాగకవిత్వ మంతయు నెఱ్ఱనదే యై యున్నచో, దానితరువాత వ్రాయఁబడిన నృసింహపురాణాదుల కవిత్వము దానికంటె క్రమముగా జానుమీఱి యుండవలయునుగదా! అట్లుగాక యది మిక్కిలి తగ్గియున్నది. అరణ్యపర్వ

మును విడిచితిమేని తిక్కనవి యథోత్తరశ్రేయ
ములై యున్నవి. ఎఱ్ఱనమహాకవి కవిత్వము
తగ్గిపోయిన దనుటకంటె, నారణ్యపర్వమున
రాతఁ జొరబడినది శిథిలభాగపూరణ మను
ంచమే మేలు.

(౧౪) ఆరణ్యపర్వోత్తరభాగము తిక్కన
యెఱ్ఱనల నడిమికాలమున నుత్పన్నమైపోఁగా
యెఱ్ఱన పూరించె నని కొందఱు వ్రాసినదియుఁ
ప్రమాదమే.

ఏవంవిధము లగు ననేక కారణములచే
న్నయభట్టారకుఁడే మొదటి మూఁడుపర్వ
ములను సమగ్రముగ రచియించినట్లును, అం
ారణ్యపర్వముమాత్రము ప్రచారములేమిఁ
ాలక్రమమున విశ్లథముకాఁగా, ఎఱ్ఱాప్రెగడ
ూరించినట్లును నిర్ధారణమగుచున్నది.

అనేకహేతువులు గానవగుచుండఁగా,
న్నఁటో మృతినొందిన నన్నయపేర, మూఁడు
ందలయేండ్లయినతరువాత నెఱ్ఱాప్రెగడ రచి
ంచి (యసత్య ప్రకటన మొనర్చి)నాఁ డనుట
ఁజై సిద్ధాంత మెంతయు నొప్పును గదా?

అడిదము సూరకవి మొదలగులక్షణ
ంథకర్తలును, జక్కన, మల్లయ్య మొద
ు ప్రబంధకవులును, ఎఱ్ఱాప్రెగడ, ఆరణ్య
్వశేషము విరచించినట్లు వ్రాయుట, అప్ప
ఁ గలవాడుకనుబట్టి యేమైయుండును. శిథిల
గపూరణ మనుకొనఁబడునది కాలక్రమ
న గ్రంథరచనముగా మాఱిపోయియుండు
ఆంధ్రకవులచరిత్రములోని— నన్నియ,
ర్వణాచార్యభీమకవ్యాదుల గ్రంథములఁ
్పించె ననుకథలు, నన్నియపద్యమును
రాజరాజు పంపఁగా, తిక్కన దానికి తమ్ములపురంగుపూసె ననుకథ, పినవీరభద్రునకు సరస్వతి జైమినిభారతమును వ్రాసిపెట్టుచు బావగారు వచ్చినారని లేచిపోయినకథ, ఆంధ్రశబ్దచింతామణిగ్రంథమును బాలసరస్వతులకు సారంగధరుఁ డిచ్చె ననుకథ, కుమ్మరగురునాథునికథ— వ్రాయఁబూనిన నిట్టి వెన్నియేని గలవు— మొదలగు మూలములేని కథలే గోరంతలు కొండంతలై నప్పుడు, వనపర్వమునుగూర్చిన శిథిలభాగపూరణకథ కాలక్రమమున రచనకథగా మాఱుటయం దాశ్చర్యమేమి గలదు?

సింగరార్యకవిచే రచియింపఁబడి, చెన్నభూపాలునికిఁ గృతియీయఁబడిన "ఆంధ్రబిల్హణీయమహాకావ్యము" నపహరించి తనపేర వెలయించుకొనిన "పండి పెద్దకృష్ణస్వామి" వలె ద్రోహచింతనము గలవాఁడు గాఁడు గావున, మహానుభావుఁ డగు శంభుదాసమహాకవి నన్నియయారణ్యపర్వమున కొన్నిచోటు లచ్చటచ్చట జీర్ణములు గాఁగా, వానిని పూరించి మొదటికవియశస్సును గాపాడుటకై యాతనినామమును, ఆతఁడు హృదయపూర్వకముగఁ గృతియిచ్చిన రాజనరేంద్రునినామమును దెలుపక, అట్లే నిలిపియుంచుటయేకాక యాచంద్రార్కముఁ దనపేరు గూడఁ బుడమిపై నిలిపికొనినవాఁడై, పరలోకమునను, నన్నియతిక్కనలను జేరి నిరతిశయానందము ననుభవించుచున్నవాఁ డయ్యెను.

"చిత్తశుద్ధి గల్గి చేసిన" సత్కార్య మల్పమైన నేమి గుఁశ మనల్పమే!



శ్రీశో మార్త్వ్యముఖా స్తుహీంభరపరీహారాయ దివోద్భవాళి, స్వాత్మాత్మబోధమహాప్రభావవశగాః సధ్యాన్య పా త్వనన్వాహాస్;

శ్రీగాంధీమహాత్మప్రశంసా పంచరత్నమాలికా

బం. ఆదిశేషాచలశర్మ గారు

శ్రీమాన్ శేషగిరీంద్రశేఖరమణి ర్బృందారుచింతామణిః
దుఃఖధ్వాంతనిరాసవాసరమణి ర్లోకైకరత్నామణిః;
శ్రీమత్త్రయ్యబలాశిరోమణి రురోవిన్యస్తకాంతామణిః;
పాయాచ్ఛ్రీఛ్ఛపతి రాసతామరమణి శ్రీగాంధిసద్గ్రామణిమ్.

శ్రీమాన్ భాసురసర్వమంగళతయా శ్రీరాజమాళిత్వతః
సర్వారాతిపురప్రమాపణతయా సర్వజ్ఞభావేనచ;
సర్వప్రాణిశివంకృతే ర్మదనధిక్కారేణ చైశ్వర్యతః
శ్రీగౌరీదయితో యథా విజయతాం గాంధీమహాత్మా స్వయమ్.

శ్రీమాన్ సాధు యశోదయోషకలిత శ్చాక్రూరహృత్సంతతం
సత్యాసక్తమనాః కుచేలజనతాసంరక్షణై కాదరః;
ధర్మాయత్తమనా స్సమస్తసుమనస్సంత్రాణదీక్షాధరః,
శశ్వద్గాంధిమహాన్ రమాపరిబృఢప్రఖ్యో విజేజీయతామ్.

శ్రీమాన్ తిగ్మరుచిం రుచా పరిహసన్ మత్యా జయన్ గీష్పతిం
తం లక్ష్మ్యా ధనదం హసన్ సురవరాధీశం ద్విషన్ వైభవాత్;
విందన్ రాజ మతిప్రసన్నమనసా సావిత్ర మంచన్ సదా.
ధర్మైః భువ్యఖిలోత్తరో విజయతాం గాంధీమహాత్మా స్వయమ్.

శ్రీగంగాంచ నగాధిరాజతనయాం సానంద మంగే వహన్
సర్వస్వామ్య మఖండ మంచతి శుభాన్నిత్యప్రదో యః ప్రభుః;
గాంధీశం మహిమోన్నతంచ కురుతా న్నిశ్చింత మేకాగ్రధీః,
శోభారంజితవిష్టపం జయయుతం యత్నేషు చాతిప్రియాత్.

సస్యలక్ష్మి

జంధ్యాల వేంకటశివకవులు

సమయముదయము; పుష్యమాసంపుదినము
తారకానాథుఁ డపరదిక్తటమునందుఁ
గ్రమముగాఁ గాంతిహీనుఁడై గ్రాలుచుండె;
కొక్కరోకోయటంచును గుక్కుటములు
కూయుచుండెను అటనట గొంతులెత్తి;
కాఁపుటిల్లాండ్రు భుజములఁ గడెవ లుంచి
నీటుగా నూరబావులనీటికొఱకుఁ
బోవుచును గోడెగాండ్రను ముద్దులొలుకు
పలుకులను బలుకరించుచుఁ గులుకునగవు
లలరఁ బోవుచునుండిరి యానగొలిపి;
"హరిగోరంగాహరీ" యంచునరపు లిడుచుఁ
జిఱుతలం గేలఁబూని తంబురను నొక్క
చేత నుంచియు నున్నని శిరముపైని
తామ్రపాత్రము నుంచి సాతానిభక్తుఁ
డడుగువేయుచుఁ బాడుచు నడచుచుండె;
కుప్పనూర్పుడులం జేసి గోగణంబు
గంతు లిడుచుండె; నలగృహాంగణములకును
కూరగాయలు తట్టలఁ గోసి యెత్తి
విక్రయముచేయఁ బట్టణవీథులకును
బోవుచుండిరి కాఁపులు, పుర్వఁబోండ్లు;
అమ్మరో! ముగ్గులను వేయుమనుచు నాఁడ
పిల్లకాయలు పూలు గొబ్బిళ్లకొఱకు
సంగ్రహించుటకయి సహచరులఁ గూడి
పరువులెత్తుచు లలితలావణ్యమైన
పాదులం జేరి వెదకుచు వచ్చుచుండి
రరుగొ; వ్యవసాయకులు సాలులందముగను
దేహమంతట దిటముగాఁ దీర్చి కప్పి
యేఁగుచుండిరి సస్యసమృద్ధిఁ జూడ;
స్వాప్నసంచారశాంత్యవస్థలను వదలి
యెల్లరును నిత్యకృత్యములెల్లఁ దీర్చు
కొనుటకై చనుచునుండిరి కొలనులకును;
వెండిపన్నులసన్నాయి నొండుఁబట్టి
హృద్యముగఁ బాడు మంగళవాద్యకులను
జూచుచును బ్రకృతిచిత్రంపు చోద్యములకుఁ
దన్మయత్వముఁ జెంది చిత్తమ్ము హర్ష
వారిధితరంగముల ముంచఁబడుచునుండె;
వీక్షణప్రసార మొనరింప వీలులేని
మాదిరిన క్రమ్మినట్టి హిమమ్మునుండి
బాలభానుఁడు దన ప్రభావంబుఁ దక్కి
వెలయుచుండెను బంగరుబరిణెపగిది
ఇట్టులే కొంతదూర మేనేఁగ నచటఁ
బ్రకృతిపరిణామమందుఁ జిత్రము లవెన్నొ
కన్నులకుఁ బండువొనరింపఁ గర్ణపర్వ
ముగను ఆ ప్రక్క చేనిలో ముదితయొకతె
నిగనిగలు గారు నల్లని నెరులు దువ్వి
కొండి చనఁ జట్టి బంతిపూదండఁ బెట్టి
తొట్రుపడుచున్న పాదాలతోడ గోఁగు
కూరఁ గోయుచు స్వాదుగానారసమున
మనసు కరఁగించి నీతిబోధనము సేయు
పలపాటను మధురిమామృతరసమ్ము

ట్టిపడఁ బాడుచుండె; వేఱొక్కమూల
ంగలును మిరపలును గూడఁ బండియుండ
ు రుఁ జేయఁగ రైతు కాపాడుఁ గనుఁడు!
్రాఁతతోఁ గాయతోఁడను మురియుచుండి
ఘుమఘుమాయించుకొతిమెర గుప్పెఁడంత
ోఁచుఁగా నప్పుడే మది కోరుచుండు;
ం దెచేఁ గాయచే శోభఁ జెందు సెనగ
చేలమిసమిసఁ జూడు మా చెంత, కంది
కాయలును ముదిరినందున గలగలమను;
అన్నిరకముల ప్రత్తి కాయలును పండి
ిచ్చియున్నవి, యజ్ఞోపవీతములకు
ొంచె మడుగుమ; నూర్చినకొమ్మ పెసలు
ోతముఁ బట్టి రిచ్చట; గొంతునెత్తి
జొన్నచేనున మంచెపై నున్నకాఁపు
పిల్లఁడా! వడిసెలం బెడ్డపెట్టి బాట
సారులం జూచి పిట్టలఁ బారఁదోలు
మిోయి" యంచును ఆ వెంపు నొక్కమాట
వినఁబడుచు నున్న; దాత్రోవ వెళ్లువారు
చేనిలో మెల్లఁగా దూరి చిన్నదోస
కాయలం ద్రుంపి మూటలోఁ గట్టినారు
చూచితివ; తంపటిని బెట్టి జొన్నకంకు
లల్లదే కోటుచున్నారు అచట; నొక్క
తట్టలోఁ బచ్చగడ్డిని గట్టుపైనఁ
గూరుచుండియు నానతోఁ గోయుచున్న
పడుచు మెదురుగ లేఁదూడఁబత్తె నొకటి
మేయుచున్నది. ఆతోఁట మిగుల మంచి
క్షేమనఁగ: నిమ్మలును దబ్బ లెక్కువైన
యూటఁ గలిగియు పెద్దవై యుండు; కమల
ఫలములును రుచ్యములు; ఆమ్రఫలము లిందు
పలురకంబులుగల వవే వరుస, చైత్ర
మాసమందున దినవచ్చు; మంచినారి
కేళములు నున్న; హితోఁటమాలి చాల
బుద్ధిమంతుఁడు నుత్సాహమున మెలంగు
వాఁడు సుమ! చూడఁగోరిన భార మనక
పూలజాతులు, పొదరిండ్లు, ముఖ్యమైన
వానినన్నిఁటి నెఱిఁగించువాఁడు సఖుఁడ!
తనివిదీరంగ కమ్మనితావిఁ దేల్చి
దేశమాతను బూజించునాశఁ గలిగి
జరుపుమా కాల మిఁకనైన భరతపుత్ర!
సవ్యసౌభాగ్యమతిమోహనమ్మువైన,
అనఁటి మొక్కలు లేతవై యవిగో? ప్రక్క
బాగుగాఁ బెరిగి పుష్పచే నూఁగుచున్న
జనపచేలను గనినచో సంతసమ్ము
కలుగకుండదు పూర్వపుకథలు మఱల
జ్ఞప్తికిని రాకయుండవుగాదె? అవిగో
పెద్దకుసుమలు, సన్నాలు, పిన్నకుసుమ,
రామసాగరధాన్యముల్ రాసిఁ జేసి
గణపతిని ఉంచినారలు గాంచు; మెపుడు
సంపదల నిచ్చి ప్రాణరక్షణముఁ జేయు
సస్యలక్ష్మికి నానమస్కారశతము.

(పూఁదేనెమండి)

శ్రీకృష్ణ తులాభారము

పారనంది జగన్నాథస్వామి గారు ఎం. ఏ. ఎల్. టి.

నాటకమునకు ప్రదర్శనధర్మము ముఖ్యగుణమైనా ప్రదర్శనమునకే ఉపచరించేవి, సారస్వతములో నిలిచేవి, అని రెండు రకములుగ నాటకములను విభజింప వీలున్నది. ప్రదర్శనఫలము మాత్రమే కోరు నాటకకర్త శిల్పి అగుననిన్నీ కవికానేరడనిన్నీ అభిప్రాయము. ప్రదర్శనమునకు రంగచాకచక్యము ఎంత అవశ్యకమో వాఙ్మయమునకు కవిత్వము అంతకంటె ఎక్కువగా ఆవశ్యకము. కథారచన, శైలి, సహృదయరంజనము, పాత్రపోషణము, నిర్దుష్టత్వము మొదలైనవి కవిత్వమునకు ప్రధానధర్మములు. ప్రదర్శనమునకే వ్రాసే నాటకములలో ఈగుణములు లేవు అనేటంత అల్పస్థితిలో ఉండుటచేతనే వందలకొలది ధనము ఆర్జించగలిగే సురభికంపెనీవారినాటకములు వాఙ్మయగ్రంథములు కాలేకున్నవి. రంగస్థలమున ప్రదర్శించేటప్పుడు ప్రేక్షకులను, వారి హర్షధ్వనులను విస్తారముగా జమచేయగలిగిన నాటకములన్నీ అంతమాత్రాన వాఙ్మయస్థానమునకు అర్హములు కావు. నాటకకవిశిఖామణియైన షేక్స్పియరు తన నాటకములన్నీ ప్రదర్శనమునకై వ్రాసెననే సంగతి మరిచి ఈచర్చ చేయలేదు. ప్రదర్శనమున బాగా ఉండుట గ్రంథమునకొక లోపమనిగాని, ప్రదర్శనమున బాగా ఉండేది సారస్వతములో నిలవదనిగాని, బాగుండనిది నిలుచునని గాని, ఇట్టి ఏవ్యాప్తినైనా అంగీకరించలేదు. ప్రదర్శనమున నాటకము బాగా ఉండుటకు లక్షణములు వేఱు, గ్రంథముగా నచ్చుటకు లక్షణములు వేఱు, అనే భేదమును నొక్కి చెప్పటయే ఈచర్చకు ప్రయోజనము.

పోతుకూచి సుబ్బయ్యగారు ఎం.ఏ.ఎల్.టి. పరీక్షలలో ఉత్తీర్ణులు. "ఆంగ్లేయతత్వకళాధినాథులు; బోధనాశక్తి సంపూర్ణులు; పండితవంశోద్భవులు." అట్టి ఉభయసంప్రదాయవిదులైన గ్రంథకర్త వారి శ్రీకృష్ణతులాభారనాటకములో ఏధర్మమును, ప్రదర్శనసారస్వతధర్మములలో దేనిని, ఎక్కువగా పాటించినారో అనే ప్రశ్న కలుగుచున్నది. నాటకముయొక్క ఉత్కర్షనువర్ణించిన ఆగ్రంథకర్త ఆగ్రంథములపై అభిప్రాయములు ఒసంగినధీమంతులందరూ ప్రదర్శనమున నాటకము చక్కగా రాణిల్లిననే అంశమును నొక్కి నొక్కి చెప్పుటకు ధ్వనియేమైనా ఉన్నదా అనే సంశయము పుట్టుచున్నది. నాటకముగా రచించుటకు పురాణసంబంధమైన ఈ కథను ఎంచుటలో గ్రంథకర్త అభిప్రాయము ఏమైయుండునో ఈ కథను సూచించుపటమును చూచునపుడు, శ్రీకృష్ణ శ్రీరామనామో

...చ్చారణ చేయునపుడు గ్రంథకర్త హృద ...యమున ఉప్పొంగిన భావములు చదువు ...వారికంటె వినేవారికి ఎక్కువ ఆహ్లాదకరముగ ...ండును. "దైవమహిమ" గల దివ్యపురు ...షుడు కథానాయకుడు. అమానుషమైన ...మహిమచర్యలు నాటకమునకు వస్తువు. స్వర్గ ...మునుండి వచ్చే నారదుడు, అన్నిచోట్లను ...నబడే కృష్ణుడు, తులసీదళమాహాత్మ్యము, ...ఇవన్నీ పురాణ సంప్రదాయములో పెరిగిన ...ప్రేక్షకులకు చక్కగా రుచించును. పామర ...పండిత భేదము లేకుండా అందరికి ఆబాల ...గోపాలము ఈకథ తెలిసినదే. ఇంద్రశచీదేవు ...లను భంగపరిపించైనా పారిజాతము తెప్పించు ...నగలిగిన సత్యభామకు పూర్వము కంటె ...ఎక్కువగా గర్వము ఉద్రేకించుటచేత, ఆమె ...పత్నిని గోరు శ్రీకృష్ణునికి ఒకవైపు, లోక ...నుగ్రహమే ప్రధానకార్యముగా పెట్టు ...కొనిన నారదునికి ఒకవైపు, సత్యభామాగర్వ ...భంజనము ఆవశ్యకమైనది. ఇందుకు ఆమె ...సవతి రుక్మిణి సాధనమాయెను. దానాను ...రూపము నారదునినుంచి భర్తను తిరిగి సంపా ...దించుటకు మార్గము కనబడనందున కలవర ...పడి కొట్టుకొనుచున్న సత్యభామ శ్రీకృ ...ష్ణుని ఆదేశానుసారముగ రుక్మిణిపాదములపై ... శిరము వేడవలసివచ్చినది. తాను ...చిన స్వర్ణవజ్రమాణిక్యములకు సరితూగని ...కృష్ణుడు రుక్మిణివేసిన ఒక తులసీదళమునకు ...తూగగా సత్యభామకు సిగ్గువచ్చినది. ఈకథ ...జనులను ప్రేక్షకులమనస్సులను ఆకర్షించుటకు. శ్రీకృష్ణనటుని చూచి పరవశులై, అతనిపాదరజస్సు శిరస్సునధరించుటకుఉద్యుక్తులగుపుణ్యారుషులు నాటకశాలలలో ఉన్నప్పుడు, హర్షధ్వనులకు ఏమి కొదవ? తులసి అదృష్టమేమో కానిఅన్నిమతములవారికిశైవవైష్ణవస్మార్తులకందరికి పుణ్యప్రదమగుటచేత, దానిమహాత్మ్యమును చూచే రుక్మిణీపతిపాత్రులీ నాటకక్రమాడుచున్నప్పుడు పారవశ్యము పొందరా? ఇట్టికథను ఎంచుకొనిన కవి గొప్ప అదృష్టవంతుడు. అందుచేతనే అన్నివిషయములలోవలె నాటకవిషయములో కూడా మనము పురాణయుగమును దాటలేదని ఒప్పుకోవలసియున్నది. పాశ్చాత్యదేశమున నాటకారంభదశలో ఉద్భవించిన మహిమల నాటకముల*వంటి నాటకములు మన వాఙ్మయమున ఇప్పుడు రాజిల్లుచున్నవి. వాటినుండి నీతులను సంగ్రహించి, కథాపురుషులను దేవులుగ ఆరాధించి, కథాచర్యలను ఈశ్వర మహిమలుగ భావించి ఆనందమగ్నులగుచు నాటకమును మెచ్చుకొనే ప్రేక్షకులు పురాణయుగమును దాటినవారు కారుగదా. ఇట్టి కథ ఈరోజులలో సులభముగా రంగస్థలమున సంతోషపెట్టును. ఇక, రంగస్థలముందు ఏర్పాటులు, తెరలు, వేషములు, నటుల రూపురేఖావిలాసములు, రంగమున జూపుసామగ్రి దీపములు,—ఈమొదలైనవి ప్రేక్షకులను రంజింపజేయుటకు తగినసాధనములు. అందుచేత ప్రదర్శనమున నాటకము బాగా ఉన్నదన్నంత

* Of Mystety and Miracle plays

మాత్రాన సారస్వతమునకూడా బాగాడున్నదని అంగీకరించినట్లే కానేరదు.

కాని సారస్వతమునకు ఉపచరించేటట్లు రచింపబడెనని గ్రంథకర్త ప్రయత్నించినట్లు వారి యుపోద్ఘాతమువల్ల తెలుస్తూఉన్నది. పాత్రపోషణ నాటకమునకు ముఖ్యము. నాయకుని పాత్రపోషణ విషయమై కవి చాలా శ్రద్ధ వహించినట్లు వ్రాసియున్నాడు. అంతేకాక తన గ్రంథమును పఠనీయపుస్తకముగా విశ్వవిద్యాలయమువారు నియమించేటట్లు ప్రయత్నిస్తూ ఉన్నారు. నాటకరచనలో కూడా అట్టిపూనికి చూపి ఉంటారని మనము ఊహించగలము.

ఈ నాటకకథకు మూలము లోకమే కాబోలు. దీనిని ఎక్కడనుండి సంగ్రహించెనో కవి చెప్పలేదు; పటావలోకము అతనిని పురికొల్పినట్లున్నది. అందుచేత కవి స్వతంత్రకల్పన లేవో, మూలమునుండి గ్రహించినవేవో నిర్ణయించి చెప్పుటకు ఆధారము లేదు. కాని ఈ కథాభాగములు అనగా దేవేంద్రుని కథలోనికి తెచ్చుట, కృష్ణుని కోపమునకు కారణము కల్పించుట, కథనుండి గ్రహించిననీతి, ఇవి లోకములో ఉన్నకథలో ఉన్నట్లు తోచదు. సత్యభామాగర్వోద్రేకమువల్ల రుక్మిణి, గోపికలు, లోకము, తుదకు కృష్ణుడు కూడా వ్యథనొందినట్లు చెప్పితేనే కాని సత్యభామాపరాభవమునకు కృష్ణుడు సర్వాంగీకారము ఇచ్చినట్లు వర్ణించుట సమంజసముగా ఉండదు. అలాగు మొదటిఅంకము అవశ్యకమే. తనతో కలిసి వెన్నెలరాత్రిని గడుపుటకు కృష్ణుడు ఇంకా రాలేదేమని రానంతసేపూ వగస్తూ తీరా వచ్చినతరువాత బెట్టుకొరకు అతనిని నిరాకరించిన సత్యభామపై కృష్ణునికి కోపము వచ్చుట సహజమే. సత్యభామాగర్వాతిశయము యొక్క పరిమితి చూచుటకు ఈ భర్తృనిరాకరణము ఒక చక్కనిమానము. నారదుని పన్నుగడకు కృష్ణుడు ఏల సహకారి అయినాడో ఈ అంకములోని కథవలన తెలియుచున్నది. మొదట అంకములోని కథ వలెనే రెండవ అంకములోని కథకూడా కవి యొక్క కల్పన అని నాయూహ. పారిజాతాపహరణమువలన సత్యభామపై శచీంద్రులకు గల అసూయను చూపి, ఇట్లు అన్నిలోకములలోను ఆమె గర్వోద్రేకము ఎట్లు ప్రబలియున్నదో సూచించి, ఆమె గర్వభంగమునకు ఏర్పరచిన పన్నుగడపైగాని, నారదునిపైగాని మనకు ద్వేషము కలుగకుండా మన భావములను సరిపెట్టుటకా? లేక శచీంద్రులకు వారిద్వారా మనకందరికిన్ని కృష్ణుని మహత్వమును రుజువుచేసి, వారిపై ఉన్న స్త్రీలోలత్వనిందను పోగొట్టుటకా, ఈ రెండవఅంకములోని కథాభాగము? శచీంద్రుల సంభాషణవలన సత్యభామాగర్వము, కృష్ణుని స్త్రీలోలత్వము ద్యోతితములగుచున్నవి. ఈ కథే కాకుండా కృష్ణలీలలవర్ణనకూడా ఈ అంకములో ఉన్నది. కాని గర్వభంజన కథకున్ను ఈలీలకున్ను సంబంధము కనబడదు. రెండవ అంకములో ప్రారంభమైన ఈచిక్కు నాటకమునంతా ఆవరించినది. మూడు, నాల్గు

ఐదు అంకములలోని కథ, అనగా భర్తృదానోపదేశము, ఆ వ్రతము, తులాభారము, భర్తృసంపాదనము, ఈకథ క్రమముగా నడుచును. ఇదంతా గర్వభంజనకథాభాగమే కదా!

గర్వభంగనిరూపణము, స్త్రీలోలత్వ ఖండనము, ఈ రెండింటిలో ఏది ఈనాటకమునకు ప్రయోజనము? ఒకటా, అయితే ఏది? రెండు, అయితే ఏకత ఎట్లు కుదురును? గర్వభంజనమునే కవి లక్ష్యమందుంచుకొనెనని చెప్పలేము. "పామరులు భగవద్గీతా సంప్రదాయము తెలియనివారు శ్రీకృష్ణుడు కేవల * మింద్రియలోలుడని తప్పభిప్రాయము పడుచున్నారు. బాగుగ నాలోచించినచో అట్టి యభిప్రాయమునకు దగిన * ఆధారము లేదు. * వేదాంతవేద్యుడై శ్రీమత్ భగవద్గీతోపదేశకుడైన శ్రీకృష్ణుడు స్త్రీలోలుడగునా? ......నాశక్తికొలది శ్రీకృష్ణుని దైవమహిమకుచితమగు పాత్రపోషణ చేయుటకు ప్రయత్నించితిని." అని కవి తనపీఠికలో వ్రాసియున్నాడు. ఈవిషయమునే నాటకములో కూడా అక్రూరకృష్ణుల నారదేంద్రుల, కృష్ణనారదుల సంభాషణలలో ఉటంకించడమైనది. నాటకపర్యవసానమున వచ్చినఇంద్రునికి ఈ ప్రశ్న వేసే నారదుడు చెప్పినాడు. ఈ హేతువులనుపట్టి కవిహృదయములో ఈవిషయము ముఖ్యముగా భాసిల్లెనని చెప్పకతీరదు. ఈ ప్రయోజనము లోకవిదితమైన తులాభారకథకు ఉన్నట్లు కనబడదు. అందుచేత ఈమార్పు కవి చేసెనని చెప్పకతీరదు; అలాగని దీనినే నాటకప్రయోజనముగా ఉంచలేదు. రెండున్నప్పుడు వాటికి సంగతి యెట్లు? ఒకటి ముఖ్యము, ఒకటి గౌణము అందమా? అన్నా సంగతము కాదు గదా! ప్రేక్షకుల రంజనకొరకనిగాని నారదుని సంతోషపెట్టుటకనిగాని లీలల ప్రయోజనము చెప్పితే, నాటకరచనకు లోపము అంగీకరించినవార మగుదుము. ఒకమారు నిరాకరించినంతమాత్రాన సత్యభామకు కృష్ణునిపై మోహము లేదని ఎట్లు వాదించలేమో, అట్లే ఒకమారు పరాభవించుటచేత భామపై కృష్ణునికి లోలత్వము లేదని ఎట్లు వాదించగలము? అంతే కాక, భామపై గల అనురాగాతిశయముచేతనే లోలత్వభ్రమ లోకములోని పామరులకు కలుగలేదు. భార్యలే కాక వేలకొలది గోపికలు, అప్సరసలు ఉన్నారు కదా! లోలత్వ ఖండనకు తులాభారకథ చాలదనే లీలలు ఆవశ్యకమైనవా? లీలలే ముఖ్యమైనప్పుడు నాటకముకొరకు ఈకథనే ఎంచుకొనుటకు సారస్యము చాలదు.

ఈ చిక్కును దాటుటకు ఇట్లు ఉపపత్తి చెప్పవచ్చునేమో విమర్శకులు ఆలోచింతురు గాక! భామను స్త్రీజాతికి ఉదాహరణముగా

* "కేవల" "తగిన" అనేమాటలను ప్రయోగించుటలో అభిప్రాయమేమైనా ఉన్నదా? కేవలము ఇంద్రియలోలుడు కాకున్నా, కొంతవరకైనా అగునని అంగీకరింతురా? తగిన ఆధారము లేకుంటే ఎటువంటిదైనా ఉన్నదా? ......వేదాంతులైనవారు స్త్రీలోలురగుట అసంభవమా? "వేదాంతవాక్యంబులు వేరు; ప్రవర్తనా చాకచక్యంబులు వేరు" అని కవే చెప్పించియున్నాడు. లోకములో ఇందుకు ఉదాహరణములు లేవా? ఈలోకనిదర్శనము కృష్ణునికి వర్తించదేనా? సత్యభామాకథవలన ఈ యభిప్రాయము నిరసింపబడునా?

చేసి, ఆమె పరాభవమును ఆజాతికంతటికి చెందజేసెదమా? లేదా, లోలుడైనవాడు పరాభవింపబడుననే వ్యాప్తిని సిద్ధపరుచుకొని సత్యభామనే పరాభవించినవాడు లోలుడు కానేరడని చెప్పవలెనుండునా? లేదా, లీలలచే దైవమహిమ సాధించి, అట్టి మహత్వము కలవాడుగనుకనే తులలో చిత్రమును చేయగలిగినాడని చెప్పి, తులాభారకథకున్ను లీలకున్ను సంబంధము కల్పించగలమా? దేనినో ఒకదానిని అంగీకరించక తప్పదు. ఏదైనా శంకతీరుగుడు సమాధానమే కదా!

ఇంకొక ప్రశ్న, ఈకథకు ముఖ్యులెవరు? కృష్ణుడా? భామా? స్త్రీలోలత్వఖండనమే ప్రధానమైనచో కృష్ణుడు ముఖ్యుడగును; గర్వభంగమే ప్రధానమైనచో భామముఖ్యమగును; ఇద్దరూ ముఖ్యులు కారుగదా. ఇక ఎట్లు?

ఇంతవరకు నాటకప్రయోజనమును విచారించితిమి. ఇక పాత్రపోషణగురించి కొంచెము ఆలోచించెదము. దానిగురించి చాలా శ్రద్ధతీసుకొనినట్లు కవి తనపీఠికలో తెలియజేసెను. లోకసిద్ధమైనకథలోనిపాత్రలు, వారి శీలవివరణము లోకములో చాలావరకు సిద్ధమేకదా! సత్యభామ, ఆమె శృంగారవిలాసములు, ఆమె టక్కు, బెట్టు, గర్వము; రుక్మిణి, ఆమెభక్తి, ఆమెనింద; నారదుడు, వాని కలహప్రియత్వము, మాయలు, భక్తి; ఎందులోను వీరివిషయమై విశేషము కానరాదు. కాని రుక్మిణియొక్కఆత్మ పక్వమైనదా అనేసంశయము కలుగుచున్నది. కృష్ణుని దేవునిగ తెలుసుకొని, అతనియందు అద్వితీయ భక్తిని గల ఆమె త్రాసులో తులసివేయుటకు వచ్చి, భామను కసితీరా తూలనాడుటలో ఆమె గొప్ప హృదయమునకు ఔదార్యగాంభీర్యములకు ఒక కళంకము వచ్చినట్లు అయినది. చూడండి ౯౮, ౯౯ పుటలు. సుందరీ కుముదలకు గల తారతమ్యమును శీలభేదమును కొనవరకు చక్కగా నిలిపి యుంచుట ఒక మంచిసంగతి.

కృష్ణుని దైవమహిమను, భక్తపరాయణత్వమును, దుష్టదండనశీలమును వ్యక్తపరుచుటకు కవి ఉద్దేశించినాడు. కాని లోకులు ఈ గుణములను, అనగా ఈశ్వరాంశములైన ఈ గుణములను మనుష్యస్వభావముతో మేళనముచేసి కృష్ణుని భావిస్తూ ఉంటారు. అట్టి మేళనమును కవికూడా మానలేదు. ఒకమారు సాధారణమనుష్యునివలె ఒకమారు ఈశ్వరునివలె ప్రవర్తించుటలో కలిగే విరోధమును పరిహరించుట ఎట్లు? మొదటి అంకములో కృష్ణుడు మనుష్యుడు; అక్రూరునికి తత్వము బోధపరిచినంత మాత్రాన ఈ శృంగారపురుషుడు మనుష్యుడు కాక ఈశ్వరుడెట్లు అగును? సాధారణ స్త్రీలోలుడు శృంగారబాధలకు ఓర్వజాలక తనవలపు స్త్రీకొరకై చూపు దైన్యమంతా కృష్ణుడు కూడా వెలిపుచ్చును. భామ నిరాకరణచేత వచ్చిన కోపముయొక్క ఫలమే గర్వభంగప్రయత్నము. అక్రూరసత్యభామా స్వప్నముల అర్థమేమిటి? కృష్ణుడు మనుష్యుడైనపుడే ఆకలలకు అర్థమున్నది. సత్యభామకు భక్తిపుట్టించుటే ప్రయోజనమైన ఈశ్వర

ష్ణుడు పారిజాతమును తెచ్చియిచ్చి ఆమె ర్వమును ఎందుకు ఉద్రేకించవలెనో?

ఈ ద్వివిధలీలవర్ణనలో ఉండే చిక్కు-ాట అటు జనిచ్చినచో; కృష్ణుని లీలలవలన ాచించే భక్తినిగురించి కొంచెము విచారిం ము. "భక్తికిగదా స్వాధీనుడు ఇతడు" అని ండీపద్యములోనే ఉండుటచేత భక్తిత త్వము ఈ నాటకమునకు ఒక ప్రయోజన ని కవి ఆశించినట్లు సూచన అగుచున్నది భక్తి ఎట్టిది? స్త్రీని శృంగారపురుషుడు ర్షించి తన్మయత్వము పొందించువిధాన, వంతుడు తన భక్తులను ఆకర్షించి తన ందు లయమొందించుననే వైష్ణవమత ాంతమును కవి ఆమోదించినట్లు కన ను. ఎట్లనగా, "నేను శృంగారవేషంబున ామను ఉద్ధరించి వచ్చెద" (పుట ౧౨) కృష్ణుడు అక్రూరునితో చెప్పినాడు. సత్య మమొదల చూపిన వాత్సల్యము శృంగార బద్ధమైన కేళీవిలాసములు కావనిన్నీ, క్తిశాస్త్ర సమ్మతమైన ఆకర్షణలీలలనిన్నీ కృష్ణుడు చేసినదంతా నటన అని అంగీ ంచవలెను. చూడండి, "శృంగారవేషంబున" ఉన్నది. అట్టినటన శిష్యులకు పాఠము బోధపరుచుటకున్నూ, భక్తులను ఆక చుటకున్నూ అవలంబించిన సాధన ి, అట్టికార్యము లేనప్పుడున్నూ గా తాను ఒంటరిగా ఉన్నప్పుడున్నూ, లో తాను ఆలోచించుకొంటున్నప్పు న్నా ఆ వేషమునే, అట్టినటననే ధరించు [illegible]

రమణియందె హృదయతృప్తిని గాంచి నియమితకాముడై నిలుచుట" అనే సంసారపాఠమును అక్రూరునికి బోధపరుచుట ఒకటి, శిష్యుడు లేనప్పుడు కూడా ఆ ప్రవాహములో పడి కొట్టుకొనుట ఒకటి. "మోహనాకారమునుజూచి మోదపడుచుఁబ్రాణంబులెల్లను మోసపోదురహహ; సొంపైనరూపముచేతను నంతకంటె నింపైనమాటచేతను, నెట్టి యతివ మనసైన నను నపహరింతువు" అని భామ వర్ణించిన శృంగారవేషమునకు శిష్యరాంక్రు ఉన్నప్పుడే ప్రయోజనముకాని, తాను ఒంటరిగా ఉండి భామ తనను ఆకర్షించుటకు ఎట్టిపర్పాటు చేయలేదని కృష్ణుడు సామాన్యరసికునివలె విలపించుట యుక్తియుక్తముగా లేదు కదా! మొదటిఅంకము తుదను ఉన్న కృష్ణవిలాపమువలన నాటకము వినేవారికి చూచేవారికి కృష్ణునిస్వభావము ఎట్టిదని తట్టునో విమర్శకులు ఆలోచించవలసి ఉంటుంది. తనకు శృంగారాహ్లాదము కలుగలేదని విలపించవలెనా, లేక, తాను శృంగారము చూపి ఆకర్షించేసమయ మొకటి పోయినదని కించపడవలెనా? ఎట్టిది తగిన పాత్రపోషణము? చూడండి. విలాపభాగములలో కొన్ని ముఖ్యమైనవి. "తనలో" తాను అనుకొన్నవి. "భక్తుల బాలింప" "దీనుల మొరవిని" "నైవేద్యతతిగొన", "దాసులప్రార్థనల్ తలచుట", "యోగిహృదయబద్ధుండ"—ఈ మొదలైన

"యెన్ని యపరాధములో చేసియుంటిదీర
ఏమిసేయునొ నను భామ యెఱుగనేర."

[illegible] నున్నాడు. భామ

కడకు రాక పూర్వమే. భామ కనబడిన తరువాత లేక అక్కడ దాగియుండవచ్చునని ఊహించిన తరువాత కనబరిచే శృంగార శోకము సమంజసము. నిరాకరణతరువాత వచ్చినకోపము, కృష్ణుడు చేసిన గర్వభంజనదీక్ష సామాన్యుల భావములకంటె ఎట్లు అసాధారణములో, ఎట్లు భిన్నములో కవి చూపలేదు. చూడండి. పుట ౨౦ (లోనలో) "నేను బ్రతిమాలినకొలదిని నీమెగర్వ మెంతె హెచ్చుచున్నది? ...యతిశయమున్న దేమొ యణగార్చెద గర్వితమానసంబులన్" ఈమాటలు భక్తపరాయణుడైన భగవంతునకు ఉచితమైన వైష్ణవసంప్రదాయభక్తిశృంగార చేష్టలా? లే, తాను వలచి ఉన్నస్త్రీ నిరాకరించునప్పుడు ఉద్వేగముపొందు సామాన్య రసికుని ఆశాభంగకోపమా? ఈచిక్కుకు కారణము కృష్ణుని ద్వివిధస్వభావ మేళనము.

ఈ రచనాలోపము లున్నా, కవిఆశయముమాత్రము భక్తినిర్వచనమే అని తెలుసుకొనుటకు సూచన లనేకములు నాటకములో ఉన్నవి. నారదుడు చూచినలీలలవర్ణనలో అట్టిమాటలు దొర్లినవి. రుక్మిణి అత్యంతానురక్త. రాధ అత్యంతభక్త. భామ అత్యంతగర్వాతిశయుక్త. ఈ సందర్భములో నారదు డన్నమాట ఒకటి ఉన్నది; "ఈ అహంకారము వదిలిననే కాని యామెకు నీ మహిమ గోచరము కాదు." ఇందువలన మరొకసంగతి ఉల్లిఖితమైనది. శరీరసుఖము, ఇహలోకలాభములు— వీటిపై గల అభిమానము పోతేనేగాని ఆత్మానందము, పరలోకప్రాప్తి ఎవరికైనా దొరకవు అనే సామాన్యధర్మమును కవి సూచించినాడా? ఇందుకు రుక్మిణీసత్యభామలుఉదాహరణములు. కృష్ణుని మోహనాకారశరీరమే సర్వమని భావించిన భామ అతని దైవమహిమను గ్రహించలేకున్నది. సర్వోత్కృష్టమైన సంపద భక్తే అని చూడలేకపోవుటచేతనే భామ వీగిపోయినది. భక్తిలేని వ్రతము భేషజము. ఆత్మకు శాంతి కలుగనిదీ, మనస్సు పక్వముకానిదీ లౌకిక సామ్రాజ్యమునకు విలువ ఉండదు; అది చక్కగా ప్రాప్తించదుకూడా. అవి ఉన్నప్పుడు గడ్డిపరకకైనా విలువ కలుగును. "భగవద్భక్తులకు వేషములతో పని యేమి" (పుట ౨); భక్తిమిళితమైన తులసీదళముతో భక్తిరహితమైన బంగారమునకు సాటి ఎక్కడ? భక్తులకు ఈశ్వరుడే స్వాధీనుడగుచున్నప్పుడు, ఇక లోకములో ఉన్నది ఏది స్వాధీనము కాదు? అంతేకాక, ఎట్టిహృదయముగలవారికి అట్టి లోకమే అనుభూతమగును. కృష్ణభక్తితో నిండిన ఆత్మలుగల రాధారుక్మిణీ గోపికలకు ఎక్కడ చూచినా కృష్ణుడే. ఏదైనా కృష్ణుడే? భామకో? బాహ్యసుఖము కొరకే లోలయై యున్నప్పుడు ఆదృష్టి యెట్లు సాధ్యపడును? ఈ ఆధ్యాత్మికతత్వము ఈ కథకు బీజమందామా? అంటే బాగానే ఉంటుంది. ఇదే నాటకప్రయోజనమని ఎందుకు భావించకూడదు? అలాగన్నా నాటకరచనలోను, పాత్రశీలవివరణములోను ఉండి యున్న చిక్కులు పోవు. ముఖ్యగౌణవిభజన చేయుటలోను, అంతటికి ఏకసమన్వయము

కత చక్కగ పట్టేటట్లు చూచుటలోను లోప
ములను తీర్చవలసి ఉంటుందని నాఅభిప్రాయము.
నా విమర్శనకు నాటకరచనవిషయ
శోధనలే ముఖ్యములు. భాషాశోధనతో
కు ప్రసక్తిలేకున్నా, పుస్తకములో కొన్ని
రపాటులు ఉన్నవని చెప్పవలసి ఉన్నది.
తర లోపములతో పాటు అవికూడా రెండో
ద్రులో పోతవని నాఆశ. ముఖ్యముగా సం
స్కృత ప్రయోగములే మమ్ము బాధించేవి.
న్నిచోట్ల "ప్రపంచకము" (పుట ౪, ౩౮,
=, ౫౯, ౬౯) అనేరూపమే కనబడుతు
ది. 'క' ఎందుకు? అలాగే 'జన్మజన్మేపి'
పుట ౪౫). ఇట్టివి ఇంకాఉన్నవి. చూడండి
౩ పుట; "కార్యనియత పూర్వవృత్తి; అన
థాసిద్ధ; దైవికకారణ" ఈ మొదలైన తర్కా
భాట మెందుకు అక్కడ?

పద్యరచనగాని, గద్యరచనగాని క్లిష్టమై
కావు. పద్యములలో గుంభన చాల
మో. పద్యములో చెప్పినసంగతిని, దాని
ందే గద్యలో తిరిగీ ఎందుకు చెప్పడము?
దేని సంప్రదాయమోకాని ఇప్పటినాట
ములలో చాలాతరుచుగా కనబడుతుంది.
పాచీనాంధ్ర నాటక సంప్రదాయమేమో అని
ఊహ. ముఖ్యముగా వినేది చూచేది
టకమైనప్పుడున్నూ, పామరులకు సులభ
గా బోధపడవలెను అన్నప్పుడున్నూ ఈ
పునరుక్తి పుట్టి ఉండవచ్చును. వీథినాటక
ములు, బొమ్మలాటలు, భాగవతములు,
పురాణముచెప్పాట ఈ మొదలైనవి ఇందుకు
నిదర్శనములు.

గద్యపద్యములకు ఛంధస్సే భేదమా
లేక వర్ణనాంశములోను, భావవివరణము
లోను, రచనసొగసులోను విశేషమేమైనా
ఉన్నదా? ఈ చర్చయొక్క ప్రాధాన్యము
ఆంగ్ల సారస్వత సుపరిచయముగల కవికి
సులభముగా వచ్చునుగదా! ఐనచో, ౨౭,
౩౦, ౩౫, ౪౨, ౫౦, ౫౮ పుటలలోని
పద్యములను చూడండి. ఇట్టివి ఇంకా చాలా
ఉన్నవి. పద్యము లెందుకు? ఉంటేనే కాని
నాటకముకాదా? సంగీతమునకు స్థానముండ
దనా? చక్కని పద్యములు రానపుడు, అక్కర
లేనపుడు గద్య ఎంత బాగుంటుంది! తెల్లవారు
నప్పటికిః బద్యములు తమంతటః దామె కుదిరి
మనోగోచరము లగుచుండెను. ఆహా! ఏమి
చిత్రము; ఏమి అదృష్టము?.. ఈనాటకములో
౯౬ పద్యము లున్నవి. అందులో ౧౪ వృత్త
ములు, ౩౦ సీసములు, ౪౯ గీతములు, ౩
కందములు. పద్యరచణానైపుణితను తెలుసు
కొనుటకు ౧౧, ౩౦, ౫౧, ౭౯, ౯౧, ౯౩ పుట
లలోని పద్యములను చూడవచ్చును. ఈభాగ
ముతో నా కంతగా ప్రసక్తిలేనందున ఇక
ముగించెదను.

రాధవలవంత

మంగిపూడి వేంకటశర్మగారు

గొల్లవారింట నేను రేపల్లెలోను
రాధనై పుట్టకుండ నరణ్యమందు
వెదురుపొదలోనఁ బుట్టిన బ్రదికిపోదు
విరహవేదనలోఁ బడి వేఁగకుండ.
వెదురునై యుంటినా ప్రాణవిభుఁడు నన్ను
వేణువుగఁ జేసికొని మెల్లవేళలందుఁ
గేలఁ గొని మాధురీగానలోలుఁడగుచు
విడిచిపెట్టక కడు గారవించును గద!
నా విభుఁడు నన్నుఁ బిల్లనగ్రోవిగాను
జేసికొని యూదుచుండిన నాసదీర
వాని కమ్మని కెమ్మోవి యాని చొక్కి-
యన్యతరానందమున నోలలాడుదుగద!
రుక్మిణీసత్యముఖపురంధ్రులును సతముఁ
బడయఁగారాని వల్లవీపల్లవేంద్రు
మధురమధురతరాధరసుధను ద్రావి
ధన్యనై మాన్యనై యొప్పుదాననుగద!
అట్టి భాగ్యంబె నిజముగా నబ్బెనేని
మురళిధరు వాతెరను నాతఁ డెఱుఁగకుండ
నల్లనల్లన ముద్దులఁ గొల్లలాడి
యమితసుఖపారవశ్యంబు నందుదుగద!
అట్టి భాగ్యంబె నిజముగా నబ్బెనేని
యష్టమహిషీమణు లసూయ నందకుండఁ
జట్టపక్కాలు చురచురఁ జూడకుండ
నాకొలమువారు నను జూచి నవ్వకుండ
నళుకులేకుండ బాహాటనై చెలంగ
నా జగన్మోహనాకారు నా మనోవి
హారు నవమారు రామాంతరంగచోరు
స్వేచ్ఛమైఁగూడి మాడి సుఖింతునుగద!
అహహా! వంశమ! యేపుణ్యమాచరించి
యేమినోములు నోచి నీ వీ ముకుందు
కరుణ కిటు పాత్రమైతివో యెఱుఁగఁ జెప్పి
మాన్పవే! నావగపు బతిమాలుకొందు.
నిన్నె యిలవేల్పుగాఁ గొల్తు నీదుకడుపు
నందుఁ బుట్టుదు, నీ పేరె నందనులకుఁ
బెట్టుకొందును, దయయుంచి వేణుధరుఁడు
కైవసంబగు కిటుకేదొ గరపఁగదవె!
వేణువా! నీవు శ్రీవల్లవీవినోదు
వలచియో వశ్యమంత్ర జపంబు చేయు
నట్లు నా ప్రాణసమునిచే నాలకింతు
నిక్కమో కాదొ చెప్పవే నిజము నాకు?
తమ్ము ధన్యులఁగాఁ జేయ దయఁదలంచి
కృష్ణభగవానుఁ డవతార మెత్తెననుచు
దేవకీవసుదేవులు దివ్యభక్తి
భరితు లక్రూరముఖ్యులు బాంధవులును
అష్టమహిషులు గోపీసహస్రములును
యాదవులు నందుఁడును యశోదాదులెల్ల
నెంతు. రదికల్ల; వీరిలో నెవరికైనఁ
గలదె నీపాటి మేటి భాగ్యంబు వంశ!
రాకుమారుఁడుగద యశోదాకిశోరుఁ
డతఁడె కోరిన బూరల కడ్డమేమి?
మేలిమిపసిండితోఁ జేసి మిసిమి మించు
రతనములు దాపినట్టి బూరాల నిడరె?
శంఖశేఖరమగు పాంచజన్యముండ
ఘనతరధ్వాన మొలయు శృంగంబులుండ
వీణముఖవాద్యములు పెక్కు వెలయుచుండ
నాదరసలోలుఁడగుచు నానందజలధి
వాలలాడంగ నీవె కావలయునటవె?
నీతపఃఫలమున శౌరి నిన్నె కోరె,
నినుఁ గృతార్థంబుగాఁ జేయ నిండుదయను
యాదవప్రశంస్యు హరి నిశ్చయంబు మురళి!

స్వామి వివేకానందుని చరిత్రము

మేడేపల్లి వేంకట రమణాచార్యులు గారు

సర్వజ్ఞుఁడు సర్వశక్తియు నగు నీశ్వరుఁడు సత్య సంకల్పముచేఁ దాను సృజించిన లోకమందు నెనాఁటికి దుష్టులు ప్రబలి ధర్మముచెడి అధర్మము ప్రబలమగుచుండెడి కాలమందెల్లఁ దా నజుఁడయ్యు రామకృష్ణాదిరూపములతో నిచట నవతరించి అధర్మ ప్రవర్తకు లగువారిని సంహరించి జ్ఞానప్రదానాద్యనేకవిధ ములచే సాధువులను రక్షించుచు లోకవ్యవస్థల నెప్పటి యట్ల స్థాపించుచుండునని పురాణేతిహాసాదులలో మన ము చదివియున్నారము. మఱికొన్ని సమయములందుఁ దా నీలోకమునందు స్వయముగా నవతరించుటకు బదులుగా స్వాంశభూతులు దివ్యజ్ఞానసంపన్నులు నగు మహనీయుల నీ జగమునం దవతరింపఁజేసి వారిమూలమున నీలోకమును దిద్దుబాటుఁ జేయించుచుండును. అట్లు భగవదంశచే నీభూమియం దనేకస్థలములలో భిన్నభిన్న కాలములందు జనించి తమ జ్ఞానప్రదానముచే చేతనుల నుద్ధరించిన మహానుభావు లనేకులు గలరు. అట్టివారిలోఁ జరిత్రలవలన మనము కొంచె మెఱిఁగినవారు బుద్ధుఁడు; క్రీస్తు; మహమ్మదు; జొరోష్టర్; శంకరాచార్యులు; రామానుజాచార్యులు; వల్లభాచార్యులు; గౌరాంగుఁడు; కొలదికాలముక్రిందట జీవించిన రామకృష్ణపరమ హంస మొదలగువారు. వీరందఱు స్వసుఖనిరపేక్షులై లోకహింసను గూడ లక్ష్యమునేయక ఖ్యాతిలాభ పూజలయందు లేశమయిన నభిలాష లేనివారయి కేవల లోకోపకారముకొఱకే తమ ఆయుష్యము నంతయును వినియోగించిన మహాపురుషులు. ప్రకృతోపన్యాసనాయ కుఁడగు వివేకానందస్వామిగూడఁ బైని చెప్పఁబడిన లోకమహాత్ములలో నొకఁ డని మనము దృఢముగాఁ జెప్పగలము.

జన్మాదివృత్తాంతము

ఈ వివేకానందుఁడు బంగాళాదేశములో సిమోలియా యను గ్రామమందు నివసించెడు దత్తయను వ్యవహార నామముతో గూడిన ప్రాచీనకాయస్థకుటుంబములో 1862 సంవత్సరమున జనేవరు తొమ్మిదవ తేదీని బుట్టెను. జననకాలమందుఁ దలిదండ్రులు ఇతనికి నరేంద్రుఁడని నామకరణముఁ జేసిరి. తరువాత నీతఁడు తన ప్రతిభావిశేషము తత్త్వబోధకతాశక్తి, ఆత్మానాత్మ వివేకజ్ఞానము సకలజనహృదయాకర్షకము వక్తృత్వ శక్తి మొదలగు ప్రజ్ఞలచే సకలదేశవిఖ్యాతమగు కీర్తిని సంపాదించి వివేకానందుఁ డను పౌరుషనామముఁ బడ సెను. ఇతనిపూర్వు లందఱు ఆస్తిక్యము, దైవభక్తి, శాస్త్రప్రామాణ్యము, మతవిశ్వాసము గలవారై యుండి రని తెలియవచ్చుచున్నది. ఇతనిపితామహుఁడు వార్ధక దశయందు సన్న్యాసాశ్రమము స్వీకరించెనట. ఇతని జనకుఁడు కలకత్తా న్యాయాధికరణమునందు న్యాయ వాదిగాఁ బనిచేసి జీవించెను. ఇతనితల్లియు మూఢత కిరవైన లోకపుస్త్రీలవలెగాక అసాధారణ స్మృతిశక్తి, మేధాసంపద గలదియై ప్రసిద్ధికెక్కినది. తరువాతి కాల మందు వివేకానందునియందు మొలకలెత్తి మితిమీఱిన వికాసమునొంది జగమునంతయు నింపునట్లు ఫలించిన గాఢమగు నీశ్వరభక్తి, సూక్ష్మతత్త్వవిమర్శనశక్తి, లోకోత్తరబుద్ధివిభవము మొదలగు ప్రజ్ఞావిశేషములు బీజావస్థలోఁ దొలినీతని కుటుంబస్థులలోనే యున్నట్లు మనము నిశ్చయింపవలయును. ఈతఁడు పెద్దవాఁ డైనపిదప నీతనికి జగత్ప్రసిద్ధి గలిగించిన సర్వభూత మైత్రి, పరోపకారవ్యసనము, ఆత్మశుద్ధి, ఆత్మసంయ మము, ధార్మికత్వము, దైవభక్తి మొదలగు సాత్త్వికగుణము లీతని బాల్యావస్థయందే కానవచ్చెను. స్వభావసిద్ధముగా నితఁడు బాల్యమునుండియుఁ దత్త్వశాస్త్రవిమర్శనమం దభిలాష గలవాఁడైయుండెను. పాఠశాలయందు విద్యా భ్యాస మొనర్చుచున్న కాలములో సంగీతమును హిందు-

తత్త్వశాస్త్రమునందు బహుశ్రద్ధాళువై చదువుచుండెడివాఁడు. పాశ్చాత్యతత్త్వజ్ఞులలోఁ బ్రధానుఁడగు హెర్బర్టు స్పెన్సర్ దొరవారి గ్రంథములయందుఁగూడ నధికారము గనఁబఱిచెను. స్పెన్సరు సిద్ధాంతములపై ఖండన పత్రిక వ్రాసి పంపఁగా నది అతఁడు చూచి నరేంద్రనాథుని తత్త్వవిమర్శనబుద్ధిచాతురికిఁ గడు సంతసిల్లి వారు నీపత్రిక అమితానందమును గలిగించెనని ప్రత్యుత్తరమిచ్చినట్లు చరిత్రయందుఁ గానవచ్చుచున్నది. తత్త్వశాస్త్రగ్రంథముల నధికముగాఁ జదివి చదివి తరచఁగా తరచఁగాఁ గొన్నాళ్లు ఈశ్వరసద్భావమందు సంశయము గలవాఁడ నయితినని తానే యొకయుపన్యాసములోఁ జెప్పెను. ఇట్లు కొంతకాలము తనలోఁదాను విమర్శించుకొని తుదకు నాస్తికబుద్ధిని విడనాడెను. పిదప మఱి కొన్నినాళ్లు బ్రహ్మసమాజమతము శుద్ధాత్మజ్ఞానము గలిగించునేమో యని పరీక్షించి స్వతంత్రమగు తనబుద్ధి కది సమంజసముగా నున్నట్లు కానరాకుండుటచే దాని నుండి తనమనస్సును మరలించెను. పిమ్మట మఱికొంత కాలము తత్త్వ మెట్టిదియో యథార్థముగాఁ గనిపెట్టుట కవిరతమయిన మనోవ్యథ నొందుచు ధనము గోలుపోయిన దరిద్రునివలె దైన్యము గలవాఁడై లోకములో నుండు సకలమతస్థుల సిద్ధాంతములను వారు వ్రాసిన గ్రంథములను బరిశీలించుచు దేనివలనను తృప్తి నొందక మానసికావస్థ గలవాఁడై పిచ్చెత్తినవానివలె నుండెను. అప్పుడు పట్టపరీక్షలో నుత్తీర్ణుఁడై న్యాయవాద్యాజీవిక (Profession of a Lawyer)చే జీవనము చేయుటకు సన్నద్ధుఁ డయ్యెను. కాని చిరకాలమునుండి తన మనోగుహలో స్థిరనివాస మొనరించుచున్న యీశ్వరాస్తిత్వవిషయకమైన సంశయాంధకారమును నశింపఁ జేయజాలిన గురుశ్రేష్ఠు నెచ్చటను గానక మనోవ్యథ నొందుచునే యుండెను. ఆసమయమున భగవంతుని కటాక్షము తనపై నించుకంత ప్రసరించుటచేఁ జిరకాలమునుండి తనకున్న మనోరథములు అన్నియు సఫలముగు కాలము ప్రత్యాసన్నమైనట్లు గాన్పించెను. ఎట్లన నాస్తికబహుళమగు నాకాలమందు ఆత్మజ్ఞానసంసిద్ధి నొంది ఋషివృత్తిగలవాఁడై జగదుద్ధరణశీలుఁ డని కీర్తి వహించిన రామకృష్ణపరమహంస కీరనిపిసరేశ్వడి శిష్యుఁడైయుండెను. అతఁ డొకదినమున వివేకానందుని నా రామకృష్ణుని సాన్నిధ్యమునకుఁ గొనిపోయెను. ఇదియే యీవివేకానందుని జీవనము నంతయును బూర్ణముగా మార్చి వేయుటకు ముఖ్యహేతువు. ఉపదేశించుట కుత్సాహుఁడై యున్న గురువగు పరమహంసకు నేర్చుకొనుట కాతురతతో నున్న శిష్యుఁడగు వివేకానందునికి నావాఁడు కలిగిన సమావేశమును గన్నులారఁ జూచినవారి హృదయము నీరై ద్రవించెను. జితేంద్రియుఁడై ముక్తసంగుఁడై కాలమంతయు నీశ్వరోపాసనతోఁ గడపుచున్న నా ఋషిసత్తముఁడును, మన వివేకానందుని శ్రీకృష్ణునిపైఁ బాటలుపాడ నాజ్ఞాపించెనట. అందుపై నతఁడు మతిరక్తకంఠముతో వినువారికి మిగుల శ్రావ్యముగా శ్రీకృష్ణునిపై గీతములు పాడుచుండఁగా శిష్యబృందముచేఁ బూర్ణమగు నాశ్రమమందు గూర్చుండి వివేకానందుని మధురగానమునకు లోలుఁడై యచటనుచచ్చి ఆనందముతోఁ దాండవించుచు నెదుటనున్నట్లున్న యా దేవకీనోములపంట యగు చిన్నికృష్ణుని మనోనేత్రముచేఁ బ్రత్యక్షీకరించి భక్తిపారవశ్యముచేఁ బులకాంకితసర్వగాత్రుఁడై కంటికొనలనుండి దిగజాఱెడు నానందబాష్పకణములచేఁ దడిసిన వస్త్రములు గలవాఁడై ఆనందసముద్రములో నోలలాడెను నా పరమహంస నయ్యెడ నొద్ద నుండి కాంచిన పరమనాస్తికుల హృదయము లయినను భగవద్భక్తిపరవశములు గాకుండునే! ఆనాటికి వివేకానందుఁడు గురువుచే ననుజ్ఞాతుఁడై మరుసటిదినమందు మరల గురువుగారి దర్శన మొనరించుట కింటికేఁ జనెను.

అప్పటినుండి వివేకానందుడు పరమహంసగారి శిష్యులలో నగ్రగణ్యుఁడై గురుపరిచర్య లొనర్చుచు వేదాంతశాస్త్రరహస్యములను సమగ్రముగాఁ దెలిసికొనసాగెను. మునుపటి మనఃకాలుష్యము సవాసనగా నంతరించెను. మహాత్ములనేకు లాసన్న్యాసికి శిష్యులైరి గాని వారిలో నొక్కఁడును వివేకానందునివంటివాఁడు కాలేదు. అత్యుత్సాహముతో గురుశిష్యులిరువురు నుపనిషన్మతచర్చలతో సుఖముగా గోష్ఠి గావించుచు నానందముతోఁ గాలము గడపుచుండఁగా నది గని సహింపనివానివలెనే యీశ్వరుఁడు 1886 వ సం. ఆగష్టు పదునాఱవతేదిని పరమహంసను దనపరంధామమున

ఁ జేర్చుకొనిరెను. పిదప వారలనిశిష్యులందఱు విరక్త సంసారసంబంధమును శుద్ధముగాఁ బరిత్యజించి తమ వువలె సన్న్యాసివృత్తి నవలంబించి దేశాభివృద్ధికి తాభివృద్ధికిఁ బాటుపడసాగిరి. వివేకానందుఁడుకూడ రిలో నొకఁడు. ఇతఁడు వేదాంతమును బ్రజలకు ధించుచు మతమునే దేశమునం దెల్లెడల వ్యాపింపఁ యుట తనజన్మమునకు ముఖ్యప్రయోజనముగాఁ బరిగ ంచెను. కొంతకాలము తనసహోధ్యాయులతో నిట్లు సి పనిచేసికొని నీశ్వరోపాసనమునకు మోక్షశాస్త్ర సంగమునకు విజనప్రదేశవాసము మిక్కిలి సదుపాయ ని యెంచి హిమాచలమునకుఁ బోయెను. టిబెటుదేశ నకుఁ జని యచట గొన్నాళ్లుండి బౌద్ధమతమునఁ గృషి సెను. అదిమొదలుకొని హిందూదేశమం దంతటఁ బ్ర ణములఁ జేయ నారంభించెను. మొదట ఖాత్రీనగ రమున కరిగి యా పురము నేలు మహారాజును దనమతము నఁగలిపికొని యచటనుండి పశ్చిమసముద్రతీరమందున్న రువనంతపురము మొదలగుప్రదేశములు చూడఁబోయెను. చట నాసి చెన్నపట్టణమునకుఁ జేరెను. ఆయాయిప్రదే ములయందున్న దినములలో భరతఖండనివాసు లగు ాలురకు వేదాంతశాస్త్రసిద్ధాంతములను దివ్యజ్ఞానసంప న్న లగు ప్రాచీనబ్రహ్మఋషుల మాహాత్మ్యమును వారి ాలమందు భరతవర్షముయొక్క యున్నతస్థితిని హృదయా ర్షముగ వక్తృత్వశక్తితో బోధించెడివాఁడు.

అమెరికాదేశప్రయాణము

ఇతఁడు చెన్నపట్టణములో నున్న సమయమున చ్చటి విద్వాంసులగు కొందఱు పెద్దమనుష్యు లొకసభ చేసి అమెరికాదేశమందుండు చికాగోనగరములో నాకా మందుజరుగనుండిన(Parliament of Religions) ార్లమెంటు ఆఫ్ రిలిజియన్స్ అను మత ంబంధమైన పెద్దసభ కితఁడు పంపఁబడ నర్హుఁడని శ్చయించి చందారూపముగా గూర్పఁబడిన కొంత నము నితని కొసంగి అమెరికాకుఁ బంపిరి. స్వామి అమెరికాలో నోడదిగినప్పటికిఁ జేతిలో రొక్కమంతయుఁ చెల్లిపోవుటచే నిస్సహాయుఁడై దుఃఖకరమైన స్థితిలోఁ బడెను. అట్టియిక్కట్టులో నన్వేళ మనస్వామి వాదు కొని సహాయము చేసిన యొకముసలిదొరసానివిమయమై హిందువులయినవారందఱుఁ గృతజ్ఞులయియుండఁ దీరదు. ఆముసలి దీతని వింతయగువస్తువుగాఁ దనవారికందఱికిఁ బ్రదర్శింపఁజొచ్చెను. తనమిత్రులగు కొంతమందికి విందు జేయఁదలంచి స్వామినికూడ వారితోఁ బంక్తిభోజనమునకుఁ బిలిచెను. భోజనసమయమం దితఁడు పంక్తిలోఁ గూర్చున్నవారందఱు మెచ్చుకొని యాశ్చర్యపడునట్లు సహజమయిన వాగ్మిత్వమును వెల్లడిఁ జేయుచు ననేకవిధ శాస్త్రీయాంశములగుఱించి సంభాషింపఁ దొడఁగెను. విద్వజ్జనులే తెలిసికొనగల భావగర్భితములగుగంభీరవాక్యలతో హిందూవేదాంతము నుపన్యసించినపు డచటి వారందఱు ప్రతిపాదితాంశములను గ్రహింపఁజాలక చిత్తరువులో వ్రాయఁబడిన ప్రతిమలవలె నిశ్చేష్టులై రెప్పవేయక యితనివైపు చూచుచు నిగిడించి యుండిరి. అపు డొక పండితుని నతనితో వాదమునకుఁ దిగిలించిరి. గుణగ్రహణపారీణుఁడగు నాపండితుఁడు క్షణములో నితనియంతస్సారమును గ్రహించి జరుగఁబోవు పెద్దసభ కగ్రాసనాధిపతి యగు (Barrow) బారోదొరగారియొద్దఁ బ్రవేశపెట్టెను. అప్పు డాదొర సభలో హిందూమత ముపన్యసింపుమని యితని నుపన్యాసకసంఘములోఁ జేర్చెను. అట్టి గొప్ప సభలో మనస్వామి యుపన్యాసకుఁడుగాఁ గానవచ్చుట సకలజనులకు మహావిస్మయమును బుట్టించెను. పాశ్చాత్యులచూపుకుఁ జోద్యముగాఁ గానవచ్చు కాషాయ వస్త్రముల ధరించి యున్న తాపసను సధిష్ఠించి హిందూ వేదాంతమతమే జగత్తునం దుండెడు నితరమతములకంటె సారతమమయినదని యుక్తులచే సమర్థించి మేఘస్తనిత గంభీరమగు కంఠధ్వనితో నుపన్యసింపఁగా నతివిశాలమగు నాసభారంగమంతయు మంత్రించినట్లు మత్తుమందు చల్లినట్లు, తరంగధ్వని లేని సముద్రమువలె నిశ్చలముగాఁ గన్పట్టెను. ఇతని యుపన్యాసము ముగిసినతరువాత "నిట్టివాఁడు తూర్పున నున్నాఁడా" యని కొందఱు, "నిట్టి విద్వాంసులున్న హిందూదేశమునకు మనమతము బోధింప మిషనరీలను బంపుట మన కెంతయవివేకపుఁబని" అని మఱికొందఱుఁ దమలోఁ దామనుకొనిరి. అమెరికాలోఁ బ్రకటింపఁబడు వార్తాపత్రికలన్నిటిలో నితనిప్రశస్తియే శ్లాఘింపఁబడెను. అమెరికాఖండముయొక్క అన్నిభాగములనుండి మతోపన్యాసములకు రమ్మని యితనికాహ్వానపత్రికలు వ్రాయఁబడెను. అమెరికాలో నున్నంతకాలము వేదశాస్త్రమాహాత్మ్యము నుద్ఘోషించుచు, శరీరేంద్రి

యాదులకంటె విలక్షణము, నిత్యము, శాశ్వతము నగు, ఆత్మ యొకటి యున్నదనియు, నది జ్ఞానానందస్వరూప మయినదనియు, కావున దానికే బ్రహ్మత్వము వాటిల్లు ననియుఁ, బ్రమాణయుక్తులచేఁ బ్రతిపాదించి ప్రతివాదుల యుక్తుల నన్నిటిని ఖండించి హిందూమతమే సర్వోత్తమ మయినదని వారందఱచే నొప్పించెను.

అనంతర మమెరికానుండి యితఁ డింగ్లాండునకుఁ బోయెను. అచ్చటఁగూడ నట్లే సకలవిద్వజ్జనశ్లాఘాపాత్రుఁడై సర్వప్రతివాదిమదగజేంద్రకంఠీరవుఁడై విజయలక్ష్మీకరగ్రహణముఁ జేసెను. ఆకాలమునం దాదేశములోనున్న తత్త్వశాస్త్రజ్ఞులు కొందఱు జాత్యంతరులైనను ఈతనిమతబోధకశక్తికి లొంగిపోయి శిష్యులయిరి. అట్లు శిష్యులైనవారిలోఁ బ్రసిద్ధులగువారు (సాండోబర్గు Sandoberg–స్వామి కృపానందుని పేరు పెట్టుకొన్నవాఁడు. ఉభయానందుఁడను నామాంతరము నొందినవాఁడు) అనువాఁడు, సిస్టరు నివేదితా అనిపించుకొన్న మిస్ మార్గరెట్ నోబిల్ (Miss Margaret Noble) మొదలగువారు. వీరంద ఱతని శిష్యులగుటయేకాక యితనివలెనే వీతరాగులై నిర్వ్యాజశ్రద్ధతో నీమతమును వ్యాపింపఁజేసినవారు.

18 6 వ సంవత్సరము డిశెంబరు 16 తేదీని వివేకానందుఁడు స్వదేశమునకు మరలివచ్చెను. కొలంబోలో నోడ దిగెను. కొలంబో మొదలుకొని ఆల్మోరావఱకు వేలకొలది మనుష్యులు వెంబడిరాఁగాఁ బెద్దయుత్సవముతోఁ దీసికొనివెళ్లిరి. స్వదేశస్థు లంత ఆతనియం దతి గౌరవమును జూపిరి.

అతిసుందరము నత్యున్నతము నగు నాతనివిగ్రహము, మనుజులహృదయములయందు శాంతరసము నావేశింపఁజేయు చూపులు, శ్రావ్యమగు కంఠధ్వని, మనుష్యులకు వ్యామోహమును బుట్టించెను. కేవల ముపన్యాసముల నిచ్చుటయే అతనిపని కాదు. తాను బోధించుమతమునకు స్థైర్యము నాపాదింపఁ దలంచెను. పరమార్థము మోక్షప్రదము నగు నుపనిషన్మతమునే సకలహిందూజనము లవలంబించునట్లు చేయుట అతనికి ముఖ్యోద్దేశ్యమయి యుండెను. అజ్ఞానమువలన మతములోనికి సంఘములోనికి సంక్రమించిన దురాచారములను మాన్పించి తా నుపదేశించు మతముయొక్క ప్రాశస్త్యమును జనులందఱు తెలిసికొనునట్లు చేసెను. సంసారమును విడిచిపెట్టి విరక్తులయినవారి కందఱికి వేదాంతపాఠములు చెప్పుట కుపయోగముగా హిమాలయముమీఁదను కలకత్తానగరమందును నాశ్రమములను మఠములను గట్టించెను. ఈరెండు స్థలము లతనికి ముఖ్యనివాసస్థానములుగా నుండెను.

ఇట్లు విశ్రాంతి లేక లోకహితముకొఱకు రాత్రి పగలు పాటుపడుటవలన వివేకానందునిశరీరము వ్యాధిగ్రస్త మయ్యెను. వైద్యులసలహాపైని శరీరారోగ్యమును వృద్ధిచేసికొనుటకు మరల నైరోపాఖండమునకుఁ జనెను. స్వల్పకాల మింగ్లాండులో నివసించి శరీరస్థితి కొంచెము బాగుపడఁగా నమెరికాకుఁ బోయెను. అచట Sanfrancisco అనుస్థలమం దొక ఆశ్రమమును నొకవేదాంతపాఠశాలను స్థాపించెను. అవి యిప్పటికి వర్ధిష్ణుస్థితిలో నున్నవి. తరువాత France దేశములో Paris పట్టణమందు జరిగెడు పెద్దమతసభ కాహూతుఁడై దానిలో ఫ్రెంచిభాషను స్వమతోపన్యాసము గావించెను. అప్పటికిఁ దనయారోగ్యము మునుపటికంటెఁ జెడఁగా నిండియాకు మరలివచ్చెను. అతఁడు తాను జేయఁబూనుకొన్న పని ముందరఁ దనశరీరారోగ్యమునుగూడ నంతఘరకుసేయ లేదు. వారణాసీనగరమున విద్యార్థుల కొకపాఠశాలయును వైరాగులకొక మఠమును గట్టించెను.

నిరంతరము దానుగూడ విద్యార్థులకు వేదాంతగ్రంథములఁ బాఠములు చెప్పుచుండెడివాఁడు. ఇట్టి సమయములోఁ దమమతమును సంస్కరింప రమ్మని జపానుదేశస్థులు స్వామికాహ్వానము నంపిరి. కాని శరీరాస్వాస్థ్యత హెచ్చగుటచే నచటికిఁ బోవఁజాలకపోయెను. అట్టిస్థితిలోనున్నను స్వదేశప్రజలకు జ్ఞానప్రదానము నవిశ్రాంతితోఁ జేయుచునే యుండెను.

ఇట్టి మహాపురుషుని జీవిత మంతమగుసమయ మాసన్నమయ్యెను. 1902వ సంవత్సరము జూలైనెలలో నొకనాఁటి సూర్యోదయకాలమున శుద్ధజలస్నానపూతుఁడై ప్రశాంతమగు చిత్తముతో నీశ్వరప్రణిధాన మొనర్చుచుఁ గొంతవడియూరకుండి యావలఁ గొందఱుశిష్యులకు సంస్కృతభాషతోఁ బాఠమునుబోధించెను. ఆమధ్యాహ్నము గూడ నట్లే బ్రహ్మోపాసనతోఁ గడపి సాయంకాల మొక్కఁడు కొంతదవ్వు విహరించుటకేఁగి మరలివచ్చి

యాశ్రమములో సూర్యుండై రాత్రి తొమ్మిదిగంటలవేళ యోగప్రవిష్టచిత్తుఁడై పరబ్రహ్మసాయుజ్యము నొందెను.

అంతగొప్పవాఁడయ్యును పాపము వివేకానందుఁడు "సుకృతీ గతాయుః" అన్నట్లెంత అల్పాయుష్యము గలవాఁడయ్యెను! నలువదిసంవత్సరములే జీవించినప్పటికి నతని జీవన మెంతప్రకాశమాన మైనదియో! అతనిజనమనోవశీకరణశక్తి యెంతయద్భుతమయినదియో! అతనిప్రభావ మెంతలోకోత్తరమో! అంతస్వల్పకాలములో నతనికీర్తిలత దిగంతముల కెట్లు ప్రాఁకినదో చూడుఁడు.

రాజతేజస్సు గలశరీరము, దీనులయెడ దయను వర్షించుచూపులు, కంచుఘంటవంటి కంఠస్వరము, ఎట్టి దుర్బోధాంశములనయినను పరమసూక్ష్మంబులను నిస్సంశయముగాఁ దెలియునట్లు బోధింపఁగలవాగ్జాలము నీశ్వరసృష్టిలో నతని కొక్కనికే యుండెను. అతనికి స్వదేశాభిమానము మెండు. మాతృదేశమగు భరతఖండముయొక్క ప్రాచీనోత్కర్షముగూర్చి మాటలాడునపు డాతఁ డానందపరవశత్వమొంది నేత్రములయం దానందబాష్పములతో నగపడెడువాఁడు. వేదప్రతిపాదితములైన రహస్యార్థములను దనకుశాగ్రీయబుద్ధిచే గ్రహించి శ్రోతలకుఁ జక్కగా బోధించెడివాఁడు. ఇప్పటినూతనశాస్త్రీయసిద్ధాంతములకు విరోధముగాని ఖండనముగాని లేకుండ వానిని జక్కఁగ సమన్వయింపఁజేసి వేదాంతము నుపన్యసించువాఁ డగుటచే నతని కట్టియుత్కర్ష లభించెను. నూతనశాస్త్రములకుఁ బ్రాచీనవేదాంతశాస్త్రమునకుఁ గల పరస్పరైకమత్యమును గనఁబఱచెడివాఁడు.

ఈతని మతసిద్ధాంతము

మతమనఁగాఁ దన్ను దానుఁ దెలిసికొనుట యని నిర్వచించెను. వినువారి మనస్సునందు దృఢముగా లగ్నమగునట్లీయర్థము నే పలుమాఱు బోధించెను. మతమనఁగా మూఢవిశ్వాసమనియు నదియుక్తికిఁ గట్టుపడదనియు మనుష్యులకుఁగల దురభిప్రాయమును నిశ్శేషముగా దొలఁగించుటయేగాక సదుక్తి మతమునకు నావశ్యకమయిన పరిచారికవంటిదని పలుమాఱు నొక్కిచెప్పెను. ఈతని మతము శుద్ధాద్వైతము. ఆత్మను దెలిసికొనుటయే దీనికి ముఖ్యప్రయోజనము. ఇతనివాద మిది: యాథార్థ్యవిషయికములు కాని యుక్తులవలన నీ కేమి లాభము? నీయుక్తులను మూలమయిన యాథార్థ్యము ప్రాకృతములయిన నీ యింద్రియములవలనఁ గనిపించినదిగాని వేఱొకటికాదు. శరీరముకంటెను, ఇంద్రియములకంటెను వేఱుగా నాత్మను కేవలయుక్తులచే సాధింపవలసివచ్చినపు డింద్రియజన్యజ్ఞానమూలమయిన ప్రాకృతయాథార్థ్య మాయుక్తుల కెట్లు తోడుపడును? పరాఙ్ముఖము లయిన యింద్రియములను యోగబలముచేఁ బ్రత్యాహృతములుగా నొనర్చుచో నాత్మ సాక్షాత్కరించునుగాని యితరోపాయములవలన నాత్మదర్శనము సిద్ధింపదు. బాహ్యజ్ఞానద్వారములగు నింద్రియము లెంతమాత్రము నాత్మతత్త్వాన్వేషణమందు సహాకార మొనరింపవు. వైశేషికరసాయనాదిశాస్త్రవేత్తలు ప్రయోగములవలనను శోధనలవలనను వస్తుయాథార్థ్యమును గనిపెట్టునట్లు ధ్యానముచేతను అంతరదృష్టిచేతను ఆత్మ కనుఁగొనఁబడును. కఠోపనిషత్ప్రతిపాద్యమగు నీయర్థము నీతఁడు స్వమతముగాఁ బరిగ్రహించి జనులకుఁ దెల్పెను. సచ్చిదానందస్వరూపుఁడగు భగవంతుఁడు సర్వభూతములను నంతర్యామియై యున్నాఁ డని యితనిముఖ్యసిద్ధాంతము. అట్లైనచో లోకనీతికి భంజకముగాదా యని యెవ్వరైన వాదించినచో వారికతఁ డిట్లు ప్రత్యుక్తి చెప్పువాఁడట: "అట్టి వాదము కొరడాదెబ్బలచే నడల్పఁబడు పశువులు చెప్పవలసినది. నీ వట్టిపశువైనయెడల మనుష్యుఁడవై జీవించుటకంటె నాత్మహత్యచే జచ్చుట మేలు నేను బోధించు నీసిద్ధాంతమే లోకనీతి కనుగుణమయినది. పరులకు మేలుచేయుటయే గొప్పనీతియని సర్వమతము లేకగ్రీవముగా బోధించుచున్నవి. అఖండమగు మహాకాశమువలె నందఱిలోనున్న యాత్మయు నఖండముగావున నీవు పరులకు హానిచేసినయెడల నీకు నీవే హానిచేసికొన్నవాఁడవగుదువని అద్వైతము దృఢముగా బోధించుచున్నది. మానవజాతివారందఱు పాపులనియెడు క్రైస్తవమతసిద్ధాంతము నీతఁడు మొదలంట ఖండించెను." ప్రతిమనుజునియందు బ్రహ్మజ్యోతిస్సు ప్రకాశించుచున్నది. ఈశ్వరుఁడు శరీరముగలవాఁడని యవివేకులు తలంచెదరు. అతఁడు నిరూపుఁడు. పామరుల కీశ్వరునియందు గురికుదురుటకు విగ్రహారాధనము విధింపఁబడినదిగాని పూర్ణజ్ఞానులగువారు జగమంతయు నీశ్వరమయముగాఁ జూతురు. ప్రతిమనుజునికిఁ బరమతసహన ముండవలెను. పరమతనింద పరమతస్థుల హింసించుట మతనిష్ఠకు విరోధములు. ఆత్మసాక్షాత్కారమే

మతమనఁదు ముఖ్యప్రయోజనము. అది సిద్ధించుట కేమతమయిననేమి? మనుష్యుఁడు మహమ్మదీయుఁడైగాని క్రైస్తవుఁడైగాని బౌద్ధుఁడైగాని యుండవచ్చును. అట్టివాఁడుగూడ ముక్తినొందును. ఒకపట్టణమునకుఁ బోవుమార్గము లనేకములున్నట్లు ముక్తిని సాధించుటకు ననేకమతములు ననేకోపాయము లున్నవని తెలిసికొని స్వమతమే మంచిదనియుఁ బరమతము మంచిది కాదనియు నెవ్వఁడు నాక్షేపింపఁగూడదు. సరియైన ఆత్మజ్ఞానము జ్ఞానానురూపమగు నాచరణము ప్రవృత్తిలేనివానికిఁ గేవలమతదురభిమానము ముక్తినియ్యఁజాలదు. ఇదిగాక మన మవలంబించు మతము సార్వలౌకికమైనదిగా నుండవలెను. ప్రతిమనుజుఁడును తనమనస్సునకిష్టమై తానొప్పుకొనునది మతముకానేరదు. ఎట్లన ఒకఁడు తన కిష్టమగు నేదో యొకసిద్ధాంతము నూహించి దానిని బలపఱుచుటకుఁ బలువురకుపదేశించి వారినందఱను దనకు లోఁబఱచుకొని యొకమతముగా నేర్పఱచును. మతస్థాపనకర్మ కిది తప్పుదారి. సర్వమతములయందున్న మూలతత్త్వము నెఱుంగవలయును. ఆ తత్త్వమే నానావిధములఁ దెలుపఁబడును. ప్రతిమతమునకుఁ దత్త్వశాస్త్రము, పురాణము, కర్మతంత్రము కలవు. లౌకికములోఁ బ్రతిమనుష్యుఁడును తనమతముతో సంబంధించిన జ్ఞానశాస్త్రమే పరమార్థమనియుఁ, పురాణగాథలన్నియు సత్యమయిన చరిత్రములనియుఁ, కర్మతంత్రము ముక్తిమార్గమనియుఁ దలంచుచుఁ బరమతస్థుల జ్ఞానశాస్త్రములు మతాభిమానముచే వ్రాయఁబడినవనియు వారి పురాణములు మూఢవిశ్వాసజాలములనియు వారికర్మతంత్ర మతినింద్యమనియు నాక్షేపించుచుండును. ఇట్లెన్నఁడు దలంపఁగూడదు. ఒకనిమత మెంతయథార్థమో అట్లే మఱియొకనిమతముగూడ నంతయథార్థము. సర్వమతములలోనుండు తత్త్వ మొక్కటియే యని తెలిసికొనుట సార్వలౌకికమతము (Universal religion.) అభివృద్ధిచేయునదిగాని పాడుచేయునదిగాదు. అది ఒకనికిఁగల మతవిశ్వాసమును జెడఁగొట్టుటకుఁ బ్రయత్నింపకుండ వాఁడున్నస్థితినుండి మఱింతయభివృద్ధికిఁ దెచ్చును. మనుష్యబుద్ధులు నానావిధములు. ఒక్కొక్కని కొక్కొక్కదానియందు రుచికలుగును. కొందఱికిఁ దత్త్వచింతయందు, కొందఱికి భక్తియందు, మఱికొందఱికి కర్మయందుఁ బ్రీతిపుట్టును. నేనిపుడు చెప్పిన సార్వలౌకికమతమునకై చెప్పఁబడిన యధికారులకందఱికిఁ దగియున్నది. ఇది కేవలము పనివృత్తిసాధ్యమయినది. ఆత్మసాక్షాత్కారమునకు జీవాత్మపరమాత్మైక్యమునకు ముఖ్యమయినసాధనము యోగము. తత్త్వచింతకునికి జ్ఞానయోగమనియు, భక్తునికి భక్తియోగమనియు, కర్మికిఁ గర్మయోగమనియు నీయోగము పలుతెఱఁగులు. ఈయన్నిటియందు నంతర్యామియై యుండు పారలౌకికమేమనఁగా ఫలాపేక్షవిడిచి పనిచేయుట. ఇదియే ముఖ్యమైనమతమని వివేకానందుఁడు స్వదేశస్థులకుఁ జిరకాలము బోధించెను.

ఆతఁడు సంఘసంస్కరణవిషయమయి చెప్పినమాటలుగూడ నిచట మనము స్మరింపఁదగియున్నవి.

1893 వ సంవత్సరమున ఆతఁడు జపానుదేశమునుండి వ్రాసినజాబులో నిట్లు నుడివెను. "దేశీయసోదరులారా! విదేశములకు నౌకలలోఁ బోవుటవిషయమయి మీకుండెడు దురభిప్రాయములను పట్టుదలను విడువుఁడు. మీగూళ్లలోనుండి బయటికిరండు. నగరాం ప్రవసించుకొనుఁడు. మీకన్నులు దెఱచి దూరముగాఁ జూడుఁడు. ఇతరదేశస్థు లెట్టియభివృద్ధిలోనున్నారో విచారింపుఁడు. మీకు మీదేశమం దభిమానమున్నయెడల నింతకంటె గొప్పసంగతులను జేయ్యఁగోరి విజ్ఞానులై దేశము నుద్ధరింపుఁడు. వెనుకకుఁ జూడకుఁడు. మనజాతిసాభివృద్ధి యుగములవఱకుఁబట్టునదిగాని స్వల్పకాలములో నైనదికాదు. సంఘసంస్కరణము లుత్తమవర్ణములవారివిషయమయ్యేగాక నిమ్నజాతులవిషయమైగూడఁ జేయఁబడవలయును. మన నీచవర్ణములవారికిఁగూడ విద్యగఱపి బ్రాహ్మణులస్థితికిఁ దీసికొనిరావలయును. బ్రాహ్మణులే హెచ్చువారు; తక్కినవర్ణములవారు తక్కువవారని విభాగములు పెట్టుకొనుట జాత్యభ్యుదయమును జాతియోత్సాహమును పాడుచేయును. అందఱుకంటె మేమే గొప్పవారము మేమే స్వతంత్రులము అని బ్రాహ్మణులు విఱ్ఱవీఁగుకాలము గతించినది. ఇపుడందఱు సమానులే. అబ్రాహ్మణులారా! బ్రాహ్మణులవలె మీరుకూడ సంస్కృతభాష నభ్యసింపుఁడు. హిందూదేశములో సంస్కృతభాష - గౌరవము సమానములైనవి. మీరు సంస్కృతవిద్య నభ్యసించినచో బ్రాహ్మణతుల్యులగుదురు. బ్రాహ్మణులారా! మీరును మీదురభిప్రాయములను మీమీపట్టుదలలను విడిచి మీవివేకమునకుఁదగినట్లు

కొందిజాతివారివిషయమయి ప్రవర్తింపుఁడు. హిందూ దేశమందుండెడు లక్షలజాతులవారి నుద్ధరించుబాధ్యత మీయందున్నది." అని యిట్లు బ్రాహ్మణులకు బ్రాహ్మణేతరులకు బోధించెడివాఁడు.

ఇట్లు వివేకానందస్వామి వ్రాసినఉపన్యాసములు పత్రికలు మొదలగువని అభిప్రాయములు నతిసుందరముగను నత్రిప్రాయములచే నిండియున్నవి. అతఁడత్యుజ్జ్వలమైన ప్రతిభావిశేషమున సాధారణముగ బోధకతాసామర్థ్యముగలవాఁడు. అతఁడు తానుచేయఁబూనుకొన్న పనిని నిర్వహించుటకై లేవరాయుమ్యమునంతయును వ్యయపఱచెను. విద్యార్థిమిత్రులారా! మన మతనిచరిత్రము చదువుటవలనఁ బనియం దతనికున్న పట్టుదల, శ్రద్ధ, అతని సదాచారము, అతని నిష్కాపట్యము, అతని ధైర్యము, అన్నిటికంటె హెచ్చుగు స్వసుఖనిరపేక్షత్వము మొదలగు సద్గుణములు మనహృదయఫలకమునందుఁ జెక్కఁబడఁదగిన పాఠము లయియున్నవి. మహాపురుషులచరిత్రములు లోకమున కుదాహరణభూతములు. అట్టివారికి మనము సమకాలికులము కాకపోయినను వారిచరిత్రములపైన శ్రద్ధగాఁ జదివినయెడల వారిసత్ప్రవృత్తి, వారిసద్గుణములు కొంతవఱకైన మనకుఁగూడ నలవడునని తలంచెదను.

మాతృసందేశము

కొప్పర్తి నారాయణమూర్తిగారు, బి. ఏ., ఎల్. టి., (సాహితీసమితి)

గుండె బరువు నెక్కకొంత బాపుకొన
పంపుచుంటినీ వార్తను నేను
చెవిని బెట్టుమా చెప్పెడుదానిని
కన్నతల్లినని కాస్త తలంచి
పట్టెడు కూటికి పరదేశములకు
పరుగిడ నేలర? వరతనయా!
ఇంటికెయొద్ద నే నిటు లుండగను
వదలిపోవుటకు ప్రాణ మెటొప్పె
చిన్ననాటి నీ విభవంబును గని
విశ్వంబెల్లను వికసించె గద!
విన్నవోవనను వీక్షించెని యీ
విశ్వం బిప్పుడు విలపించుకద!
కొదువ లేనినా కూర్మిదినములను
తలచిన గుండెలు తరుగుకుపోవు!
కొడుకులుగల్గియు కోడలుగల్గిన
అమ్మ బదుకు నిక నడుగగ నేల!
మోదావహమై మ్రోగిపారెడివి
ఆనందాశ్రులు అడుగంటినవి
ఉడుకు బాష్పములె ఉబికిపారుచును
ఉన్నప్రాణముల నూడగ జేయు!

కాలుసేతులను కదపగ లేనుర
పెదవుల సరిగా మెదపగ లేను
నిన్ను చూడకను నిలువగ లేనుర
కన్నకడుపునే కానటనోయి!
పూర్తిగ కన్నులు పోవక మునుపే
కంటబడుము నా కన్నులపాపా!
బొత్తిగ పుటములు పూడకముందే
అమృతపువాక్కుల నానగనిమ్ము!
స్పర్శజ్ఞానము చావకుండనే
వ్రాలిపడుము నాయొడిలోపలను!
ఐహిక సౌఖ్యము లాసింపను; నీ
పెట్టుపోత లిక వట్టివి సుమ్మా!
ఇపుడని యికనని యెపుడును కాటికి
కాళ్లను చాచుకు కూర్చుని యుంటి;
ప్రాణము నీపై పరుగిడుచున్నది
పట్ట శక్యమును బాయుదునేమొ?
అసల దెబ్బిది ఆగ్రహ మొందకు
ధర్మము నిల్చును ధారుణిలోన.
వెట్టిభ్రాంతియని విసుగు నొందకుము
గాలి ప్రాణ మొగడియకు నేమొ!

శ్రీ సింహాచలక్షేత్రమ్

దేవులపల్లి అప్పలనరసింహం గారు, ఎమ్. ఏ., ఎల్. టి.

శ్రీ సింహాశైలశిఖరే నివసన్ త్వయం భోః
వారాహదేహవిలసత్ప్రభు రాత్మయోనిః,
ఆత్మీయమాం బహువిధాసు నిమజ్జితాంగీం
త్రాయేత గాం దితిసుతాదివ భారతీం యః.

శోభాయుక్తమై తనరారు శ్రీసింహాచలశిఖరమున, పూర్వము దితిసుతుఁడగు హిరణ్యాక్షుని బారినుండి భూమిని రక్షించినరీతిని నేఁడు బహువిధములగు నాపదలలో మునిఁగియున్న ఈ భారతభూమిని ఉద్ధరింపఁదగిన స్వయంభువగు ప్రభుఁడు వరాహవిగ్రహమున విలసిల్లుచు నివసించియున్నాఁడు, గనుఁడు.

హేమనేత్ర మథ హేమగాత్రిణమ్
భ్రాతరౌ జగదబాంధవౌ పురా,
సంవిదార్య నఖదంతహేతిభి
ర్యజ్ఞసూకరనృసింహ! శోభసే.

అన్నదమ్ములును జగత్కంటక శత్రువులును నగు హిరణ్యాక్షహిరణ్యకశిపులలో, మొదట హిరణ్యాక్షుని వరాహమూర్తివై దంతాయుధములచేతను, పిమ్మట హిరణ్యకశిపుని నరసింహమూర్తివై నఖాయుధములచేతను జీల్చి; అన్నదమ్ములిద్దఱను జంపుటకు "ఎత్తిన అవతారములు రెండును నొక్కటిగానే భావింపఁదగినవియును. అని సూచించుటకొఱకై యీ క్షేత్రమున శ్రీ యజ్ఞవరాహ లక్ష్మీనృసింహస్వామి" యను నామమున శోభిల్లుచున్నావు.

రూప ముగ్రమపి ధారయ న్ముహుః
దుష్టదానవ విదారణోత్సుకః;
శాంతమూర్తి రితి శస్యసే బుధైః
ర్హ్లాదితైః కరుణయా తవ ప్రభో!

ఓ ప్రభువా! దుష్టులగు దానవులను జీల్చుటకై మాటిమాటికి నుగ్రరూపమును ధరించుచున్నను నీకరుణచేత సంతోషింపఁజేయఁబడిన జ్ఞానవంతులచేత శాంతమూర్తివనియే ప్రశంసింపఁబడుచున్నావు.

అత్ర యే శరణ మాగతా న తే
భీతి మాప్నుయు రితీవ యంత్రితః;
ఉగ్ర! వారయసి దీప్తి మాత్మన
శ్చందనేన శిశిరేణ వల్గునా.

ఓ ఉగ్రమూర్తీ! ఇక్కడకు శరణార్థులై వచ్చువారు భయమునొందుదురను శంకచేతను నీదీప్తిని చల్లని చందనముచేఁ గప్పించుకొనుచున్నావు.

తేన సింహగిరిమధ్యసంస్థితమ్
రమ్యవృక్షవనరాజిశోభితమ్,
శీతలాచ్ఛమధునీర ముద్గిర
త్స్రవణం భజన మాదృతం త్వయా.

అందువలననే సింహశైలమధ్యమున నున్నటువంటియు, మనోహరములగు వృక్షములు వనపంక్తులచే శోభించుచున్నట్టియు, చల్లని నిర్మలమైన తియ్యని నీరునిచ్చుధారలు గల్గినట్టియు ఆలయము నీచేత అంగీకరింపఁబడినది.

చూతశైలవనసైః పవిత్రకైః
నారికేళకదళీఫలద్రుమైః,
పుష్పితైశ్చ కరవీరచంపకై
రాతనోతి నయనోత్సవం నగః.

మామిడి మారేడు పనస మదనాసప కొబ్బరి అరఁటి మొదలగు ఫలవృక్షములతోను పుష్పించిన చంపకవృక్షములు గన్నేరు (అనఁగా నూఱువరహాలు, వేయివరహాలు అనఁబడు) వృక్షములతోను నిండియున్న యీకొండ కన్నులకు పండుగు చేయుచున్నది.

కర్కశాశ్మశిఖరః క్వచి ద్గిరిః
కేసరీవ భయదోఽపి రాజతే,
గోమహిష్యజకులాదిభి ర్వృత
శ్శాద్వలాంబరమనోజ్ఞసానుమాన్.

ఈ కొండ కొన్నిచోట్ల కఱకుఱాలతోఁ గూడిన శిఖరములు గలిగి కేసరజాలముగల సింహమువలె భయంకరముగ గనుపడినను మఱికొన్నిచోట్ల గోవులు, మహిషములు, మేఁకలు మొదలగువాని మందలతో నొప్పారుచు పచ్చికబయళులతోఁ గప్పఁబడి మనోజ్ఞములగు చరియలు గలిగి శోభిల్లుచున్నది.

నోదనో విబుధసంఘవిద్విషామ్
అర్థినాం హృదయతాపనోదనః,
యుక్తరూప మితి వాత్మనః స్థితే
రథ్యతిష్ఠ దచలం నృకేసరీ.

తాను దేవతాసంఘములకు శత్రువుల నడఁచువాఁడును, భక్తుల హృదయతాపమును అడఁచువాఁడును అగుటను, ఒకేకాలమున భయంకరమును, శాంతికరమును నగు తనరూపమునకు ఒకప్రక్క భయంకరమును, ఒకప్రక్క మనోహరమును నగు నీ సింహశైలము తగిన నిలయ మని నరహరి యిందు నిలిచెనుగాఁబోలును.

హేమచంపకగులాబిమల్లికా
పుష్పదామపరిశోభివక్షసమ్,
కంఠలంబికరవీరమాలినం
శాంతరూప నృహరిం సదా భజే.

స్వర్ణచంపక, గులాబి, మల్లె మొదలగుపుష్ప మాలికలతో అంతటను శోభించుచున్న వక్షస్థలము గలిగినటువంటియు, కంఠమునుండి వ్రేలాడు తెల్లగన్నేరు (చేయిగరహాలపుష్పముల) మాలికలు గలిగినటువంటియు శాంతరూపమును ధరించిన నరహరిని నిత్యమును భజించుచున్నాను.

వ్యక్తవిగ్రహ మపీహ సంస్థితమ్
వ్యక్తరూప రహితం నిబోధత,
మామితి స్ఫుటయితుం ప్రణేముషాం
చందనేన హి తనుం నిగూహసే.

“ఇచ్చట స్పష్టముగా రూపమును ధరించి కనుపడుచున్నను నేను నిజముగా నిర్ణయింపఁగల రూపము లేని అవ్యక్తుఁడను అని తెలిసికొనుఁడు” ఈరీతిని నీవు వందనము చేయుటకు వచ్చు భక్తులకు బోధింప నెంచి కాఁబోలు చందనముతో నిజరూపమును మఱుఁగుపఱచు చున్నావు.

రక్ష కేశవ జనార్దనాచ్యుత
శ్రీశ సింహబల దానవాంతక!
సాధుదీనజనరక్షణోద్యత
రక్ష న స్సుఖబలాయు రీప్సితః

ఓ కేశవా, జనార్దనా, అచ్యుతా, లక్ష్మీశ్వరుఁడా, సింహవిక్రముఁడా, దానవాంతకుఁడా, సాధువులను దీనజనులను పరిపాలింప నుద్యుక్తుఁడవై సుఖమును బలమును ఆయువును గోరుచున్న మమ్ము రక్షింపుము.

సంసృతే రతి విషణ్ణమానసమ్
శాంతిదానకృపయా సముద్ధర,
శ్రీనివాస భవదంఘ్రిచింతనాం
సుస్థిరాం మయి కురు ప్రసాదతః.

సంసారమువలన చిక్కులి విషాదమును బొందిన మనస్సుతోనున్న నన్ను శాంతి నిచ్చు కృపతో నుద్ధరింపుము. ఓ శ్రీనివాసా! అనుగ్రహముతో నీ పాదచింతనను నాయందు స్థిరముగా నెలకొల్పుము.

ఏతం వసంతతిలకంచ రథోద్ధతాఖ్యా
న్యేకాదశేహ కులకే రచితాని భక్త్యా,
శ్రీసింహశైలనిలయాయ సమర్పితాని
మాల్యాని సంతు హృదయోపవనోద్భవాని॥

నాహృదయమను పూలతోఁటయం దుద్భవించినవియును ఈకులకమను పద్యమాలికయందు భక్తితోఁ గూర్పఁబడినవియును నగు ఒకవసంతతిలకముతోఁ గూడిన పదునొకండు రథోద్ధతావృత్తములు శ్రీ సింహాచలవాసునికి స్వీకారార్హములు అగుఁగాత!

పండిత ప్రతిజ్ఞ

దువ్వూరు రామిరెడ్డిగారు

మొన్నటి పుష్యపంచమికి ముప్పదియేండ్ల వయస్సు చెల్లె నిం
కెన్నిదినంబు లీగురుని యింట వసింతు? సమస్తశాస్త్రముల్
తిన్నగ నేర్చుకొంటి "మనతిమ్మయశాస్త్రికుమారు డెంతలో
నున్నతి కెక్కె" నంచు నను నూరిజనుల్ వినుతింతు రెప్పుడున్.

గీ. సగము ప్రాయంబు విద్యావిచారమందె, గడచె; సంసారసౌఖ్యంబుఁ బడయ నైతి
గొప్పవారింటఁ బెండ్లాడఁ గోర్కె గలదు, గాని దారిద్ర్యదోషంబు కంటకంబు.

గీ. ఎవరి నడిగినఁగాని "మీ కెంతయాస్తి? పెండ్లికూఁతురి కేమగ పెట్టఁగలరు?
ఇంటిమర్యాద లెఱిఁగి మా హెచ్చు నెంచి, పెండ్లి వేడుక నడుపంగఁ బ్రీతి గలదె?"

చ. అని మఱి యేమొ యేమొ మఱియాదలుగీదలు చెప్ప నోర్పుతో
వినివిని చీదరించుకొని పెండ్లి పెడకులు మానుకొంటి; నై
నను జెలికాఁడు నామనమునం దొక కోరిక విత్తు నాఁటి నీ
య్యని నుడికారపుందడిని సంతరమెత్తఁగఁ జేసి యిట్లనెన్.

చ. జను లనుకొంగ వింటి; నెలజవ్వని, తాఁ జనఁ గడిపోవు మె
త్తని చిగురాకు మేను, కనుదమ్ముల లోకము మోహపుచ్చు మో
హనమగు నింద్రజాల మెదొ చూడుచునుండు; వివిక్త కాననం
బున సెలయేళ్ల కూలముల బూఁబొదరిండ్ల వసించు నొంటిగన్.

గీ. పేరు "కవిత" యంట, పెద్దలుం బిన్నలు, గారవింపఁ బెంపు గాంచునంట;
ఇష్టమున్నఁ, గోర్కె లీడేర్పఁ దనకుఁ దా, వరుని సరసహృదయు వలచునంట!

మ. కులముం జూడదు, సొబ్బు గోరదు, మనఃకూలంకష ప్రేమతో
వలచుం దాను గుణాప్తి నైన; నెటు నిర్బంధించి కామింప భూ
వలయాధీశున కైనఁ గానిపని; నీ పాండిత్యముం జూపి యా
పొలఁతిన్ లోఁగొను మన్నమాటలు మదిం బూరించెఁ బేరాసలన్.

గీ. అఖిలశాస్త్రపురాణేతిహాసములను, సంస్కృతాంధ్ర కావ్యకలాపసంపుటముల
మూటముల్లెలుగాఁ గట్టి మోసికొంచుఁ, దరలితిని గవితాస్వయంవరమునకును.

గీ. జనకుఁ డొసఁగిన దేవతార్చనపుఁ బెట్టె, నంచు చినిఁగిన మడిపట్టుపంచఁ జుట్టి
చంకఁదగిలించి, వెలిబూది సంచిగూడఁ, బదిలముగ దాఁచికొని దారిఁ బట్టినాఁడు.

సీ. తలయూఁచినపుడెల్లఁ దళతళద్యుతి నింపు, మకరకుండలములు మాకు లేవు;
పాండిత్యమున కనివార్యలాంఛనమైన కాశ్మీరశాలువఁ గప్పలేదు;
లలితంపుఁగవ్వలగుండెలు ఝల్లుఝల్లన, గండపెండారంబుఁ గాలఁ దొడుగ
మునుకొని తనకన్నముందు బారెఁడు వోవ, బిరుదు పేరెవరైనఁ బెట్టరయ్యొ!
ఐనఁ గానిమ్ము, నా కున్నయంతవట్టు, కేమి లోపంబు లే దెవ రేమి యన్నఁ
గడుగంటపుఁబ్రాయసకాఁడఁ గానె? మిగత భారంబు దైవముమీఁద నిడితి.

చ. అని తలపోయుచుం దుదకు నాకవితాలలితాంగిఁ బెండ్లి యా
డినతి మెఱవ నిడ నెక్కు సుమాళము సందడింప లోఁ
దొనికెడి భావిభోగఘటితోత్సవభావన చెప్పలార్చుచున్
వనమున కేఁగుచుండె మనపండితశాస్త్రి జయాభిలాషతోన్.

చ. చనిచని కొన్నినాళులు వసంతశుభోదయవేళఁ గొండదా
పున దిగఁబాఱువాఁక కిరుప్రంతలఁ బూఁబొద లందగించు చ
క్కనివనిఁ జొచ్చి దప్పి నడగాసియుఁ దీఱ జలంబుఁ గ్రోలి చ
ల్లనిపొదరింటిసీమఁ బదిలంబుగఁ గూర్కె సుఖంబు చేకుఱన్.

గీ. అంతలోన నెండయారాట మొక్కింత, దొలఁగఁ బూఁతగాలి తోడ వీచె;
కొండసెలలసడులు కోయిలపాటలు, మిళితమయ్యె నెడలు పులకరింప.

మ. చిపురాకుల్ చెగ మేసి పోతరమునం జెంగించుచున్ దాఁటుచున్
దవుదవ్వేగుచుఁ, గొమ్ము పుట్టుతఱిఁ బంతాలాడి కండూతి వో
వ వడిన్ ముస్తల డీలుచున్ హరిణశాబంబుల్ వినోదించుఁ గే
ళివిహారంబుల నిర్భయంబుగను, వల్లిచ్ఛాయ లాసించుచున్.

గీ. అట్టినవమోహనారణ్యమందు నొక్క, మావికొమ్మకు నల్లిన పూవుఁదీవ
తూఁగుటుయ్యాలఁ గూర్చుండి, తునిగి రాలు, విరుల జడిగొట్ట నొకనవ్యతరుణి యూఁగు.

ఉ. ఆవలపించుతొయ్యలి కొయారము నేర్పఁ గలాపె ప్రేమసం
భావనతోడఁ గుత్తుకను బయ్యెదమీఁదుగ మూపుఁ జేర్చి పూఁ
దాప్రలఁ జల్లు క్రొవ్వెదశలాసిని మోమర మోపి, మొత్తగం
జే పరిజక్కపై నిమురఁ గెల్లఁబొడింపన మోడ్పు హాయిగన్.

ఉ. కోయిలపాటకత్తె తనకూఁతలతప్పుఁ బలుంగు దిద్దికోఁ
గాయక యభ్యసించుఁ బలిపజ్జన పాఠము; గోరువంక క
త్యాయతనికి నైన దొసఁగంతయుఁ బోదు; సమర్థుఁడా గురుం
డైయును జక్కఁ జేయఁగలఁ డా ప్రతిభావిహీనశిష్యులన్.

మ అపుడే నిద్దురలేచి పండితుఁడు, నుయ్యాలాఁగునాలేమ యం
దపుఁ జందంబును రూపురేక వెలఁగొంసం గాంచి యూహించుఁబో
ఈపదాబ్జంబుల మ్రొక్కినం దొలఁగవే నిర్మూలమై పాపముల్
అపురూపం బిటువంటిమూర్తి యని వెయ్యాఱుల్ విలోకించుచున్.

గీ. పలుకరింప నెంచి, పలికిన నేమేని, బెడఁద వచ్చు నన్న బెంగతోడ
నీళ్లు నములుకొంచు నెత్తిగోఁకుచు నిల్వఁ, జూచి చూడనట్లు చూచి చెలువ.

ఉ. ఉయ్యెల డిగ్గి పయ్యెదను నోరమునుం గిడి జవ్వనంపులా
గియ్యది యన్నపోల్కిఁ గను లెత్తియు నర్ధనిమీలితంబుగా
నయ్యలినీలవేణి నడయందము దోఁపఁగఁ జెట్టుచాటునుం
జయ్యనఁ బోయి తేనియలు జాల్కొనఁ బల్కెఁ దెనుంగుమాటలన్.

గీ. సిగ్గు పైకొని చెక్కిళ్లు జేవురింప, నగమునగముఁ బల్కె నాసొగసులాఁడి
"యతిథులరు, మీకు స్వాగతం బన్ననుడులు, పడెను జెవిలోన విని వినఁబడనియటులు.

గీ. ముగుదమాట సూదిమొన మోపునంతటి, సందుఁ జేయ నళుకు జాఱవిడిచి
పండితుండు పల్కె వనిత! నీవెవతెవు? ఒంటికత్తె విచట నుండనేల?

చ. అన విని కాంత నేఁ గవితనయ్య! వనాంతరసీమలందు రే
యును బవ లెప్పుడుం బ్రకృతియుత్సవముం దిలకించుచుం బికాం
గనలు మయూరముల్ సఖులుగాఁ బరిచర్యలు సల్ప నెంటిగన్
దినములఁ బుత్తు జవ్వనముఁ దీరును దియ్యము శాశ్వతంబుగన్.

మ. కలికీ! యెంతటిదింత! నీవె కవితాకళ్యాణివా? బాపురే!
తెలియం జాలకయుంటి, నీకొఱకు నే దేశాలు పట్నాలు కో
టలు వేటల్ గిరు లేళ్లు దాటుకొని మూటాముల్లెభారంబునన్
దల చెప్పట్టగ బట్టగట్ట పనుగత్తన్ వచ్చితిం గానకున్.

గీ. నిన్నుఁగూడి ధర్మనియతులఁ బాల్గొనఁ, దలఁచి వచ్చినాఁడ, వలచినాఁడ;
నన్నుఁ గ్రోసిపుచ్చ న్యాయంబె? వైదిక, విధిహితంబుగాఁగఁ బెండ్లియాడు.

గీ. అన్నవేళకు నతిథులభాగ్యతులును, నింటి కరుదెంచి కూర్చుండ, వంట గింటఁ
జేయ నిల్లాలు లే దని చెప్పలేక, తెగఁబడితిఁ గాంత! యాకొఱఁ దీర్ప నింక.

సీ. హేమంతమున నైన నేటేట మునింగి, మడిదోవతులు పాతమైల లుతికి,
యిలు నాల్గుచూరాదిగాఁ గల ప్రాచినములెల్ల, విసుగువేసట లేక వెళ్లఁబుచ్చి
దేవతార్చన వేదదీక్షంబు వెలిఁగించి, బానసంబున వంటకములఁ దీర్చి,
యిరుగుపొరుగువింద్ల కేఁగక తమయిల్లు, కనిపెట్టుకొని, దూది పెనఁచి దివ్వె
వత్తులను జేయుటో, లేక వలయువిస్తరంబ్లు గుట్టుటో తడిబట్ట లార్చుటయును
గాక యిల్లాలి కింకొక్క కార్యమున్నె? యట్టి గృహిణీపదంబు నీ కను చాన!
సీ. వేదవేదాంగముల్ వివిధపురాణేతిహాసముల్ నాబుద్ధి నరగిపోవె
పంచకావ్యాల నేపట్టున నేశ్లోక, మడిగిన వల్లింతు నప్పటికపుడె
ఆశేంప్ల పాణినీయము పీల్చి పిప్పిఁ జేసితి నది నాయందె జీర్ణమయ్యె
వసుచరిత్రంబున వ్యాఖ్యానయుతముగ, శ్లేషభంగుల విమర్శించినాఁడ
కడకుఁ జిన్నయసూరివ్యాకరణ మెల్లఁ, బుటలు మలినంబుగాఁగ నెప్పుడును జదివి
సిద్ధిపడసితి; నమరంబుఁ జిత్తశుద్ధి, తో నుపాసించి పొందితి దొడ్డఫలము.
సీ. శాకుంతలములోన శతసహస్రములుగ, వ్యాకృతిదోషముల్ బయలుపఱతు
భవభూతిసాహిత్యభాండార మెల్లను, గాసుకుఁ గాకుండఁ గడిగి వైతు
బాణుని శ్రీహర్షు భారవి ఝాడింప, దొలిదెబ్బకే నను నిలువఁ గలరె?
తిక్కయజ్వకుఁ దలతిక్క మాన్పెద నన్నఁ, బెరపిగా నొకనాఁడు లేటలేదు
ఇంకఁ దక్కినవార లవేమి లెక్క, ముక్కుఁ బట్టినఁ బ్రాణంబు మొదలె పోవు
కాంత! నాకన్న సర్వగుల్ గలరె చెపుమ? నేను నన్నుఁగూర్చి పొగడుట నియతి గాదు.
గీ. నత్కవి, ప్రబంధ వేంకటేశ్వరవిజయవి, లాసకర్త నామది లెక్కలాగు వ్రాసెఁ
గాని, కొందఱు పాండిత్యగర్వతావి, హీనలను దాఁచ, రస మని యెంచినారు.
చ. అని తనమాటముల్లెలు రయంబున విప్పి నెలంత! పాత్రముల్
గనుమ, యధీతమయ్యె నివి; గ్రంథము లెన్నియొ మోయలేక యిం
టను బదిలంబు చేసితిని; నాశ్రమ లెల్లను జింతచేసి నన్
గనుమ కృపాకటాక్షములఁ గామిని! నీమన సేమి చెప్పుమా!
గీ. తనకుఁ బరమశత్రుఁ డెన లేనిఛాందసుం, డింత కెటులొ దొరకె; నింతతోడ
విడువరా దటంచు వెలఁది సంతోషించి, హాస్య మనుభవింప నభిలషించి.
గీ. ధర్మశాస్త్రమెల్లఁ దనువ్రస జీర్ణించె, నిగమవిధులయందు నిధులు మాకు;
అట్టి నాట దలఁప కెట్టుల నీనాఁడు, కులటతోడి పొందు గోరినారు?
గీ. అనిన విని ఛాందసుం డప్పు డదరి లేచి, వెలఁది యేమంటి? నీ వెట్లు కులట వైతి?
బహుపతిత్వము స్త్రీలకు భాగ్యమగునె? ధర్మవైరుధ్య మక్కటా! దాపురించె.

గీ. ఇందుకా నేను బలుపాటు లెల్ల నోర్చి, యింత దూరమ్ము వచ్చుట యెమ్మెలాఁడి!
బ్రహ్మచారిని, బ్రాహ్మణపండితుఁడను, కులటసాంగత్య మేరీతిఁ గోరుకొందు.

చ. అని కపటంబులేనివత లాననసీమను దేలియాడఁగా
ముని! కులటత్వ మెట్లు లనుమేయము నీయెడ నన్నుఁ గాంచియున్
మనమున నుబ్బుహాస్యరసమాధురి కన్నులఁ జిప్పిలంగ లోఁ
గొని మొగమందు మాయవగఁ గూర్చి వచించెఁ జరిత్ర మంతయున్.

సీ. వాల్మీకి మునలితాపసి యయ్యు ననుఁ గూడ, రమణీయకళలఁ గరంచి యేలెఁ;
కాళిదాసుఁడు బిగ్గఁగౌఁగిట లాలింప, శృంగారభోగనిర్వృతిని గంటి;
భవభూతి పాండిత్యపటిమతో శాస్త్రసమ్మతముగ ననుఁగూడి మాడినాఁడు;
భట్టబాణమయూరభారవి ప్రముఖులు, దివ్యభాషాపేశ దీర్చినారు;
నన్నపార్యుఁడుఁ దిక్కన మున్నగాఁగఁ, దెలుఁగుఁగవు లెల్ల నాముద్దు సలిపినారు;
ప్రాతవారల యనుభోగ్యపటిమ నశలఁ, గ్రొత్తగోవాళ్ల నాసించి కాచుచుందు.

చ. అన విని పండితుం డనును నందలి ముంచిన ప్రాఁతలంజ న
య్యును బడుచుందనంబుఁ గనులారలఁ జూచెడి ముద్దరాలిసొం
పును, దనుసౌష్ఠవంబు, వలపుంబస, లెట్టులు గాచి యుంచితో
వనిత! శరీరరమ్యతకు బ్రహ్మ విసీతిని గూర్పఁ జేలొకో?

గీ. అనుచు గ్రంథంబు లెల్లను నట్ట జవిరి, మూటముల్లెగ నవరించి పోలఁతి! నేను
బోయి వచ్చెద, మనపొందు పొసఁగ దనినఁ, జెలియ చిఱునవ్వ నవ్వుచుఁ జెంతఁ జేరి.

ఉ. పేముకతోడ నాయురము బిట్టుగ నీకవ్రఁగింటఁ జేర్పకే
యోమనుధర్మశాస్త్రరత! యూరక పోయెదె యంచుఁ దెచ్చికో
లీమన మూని కౌఁగిలిఁ జేరకుఁ దత్తఱ మంది చూచు చే
మేమొ వచించుచుం గనుల నెత్తక చేతుల నూడఁబీఁకినన్.

సీ. ముద్దుమాటలు వల్కి మోము చిట్లించుచు, శబ్దసంస్కారంబు చాల దనును;
అడవిపూఁదొడవులఁ దొడిగియుండుటఁ గాంచి, యలంకృతిలోప మెసఁగె ననును;
మురిపంబు దళుకొత్త మోవి యానఁగఁ బోవ, నెంగిలిరస మంచు నీసడించు;
బలిమిమై గిలిగింప నులికి బారెఁడుదాఁటి, జలిబిలినడ లెల్లఁ జెల్లవనును;
పెట్టరానట్టిసిలుగులఁ బెట్టి చెలువ, యాటపట్టించి చెర్లాట మాడుచుండఁ
గానవంబున నెడనో కానరాక, మురళిరావంబు వినవచ్చె మోహనముగ.

సీ. పూలగుత్తులఁ గాంచి పునికి ముద్దాడును, పికమనోహరగీతి విన్న మెచ్చు;
సెలయేళ్ల పాటలఁ జెవియొగ్గి యాలించు, రాలుఁబువ్వుల నేరి మాల గ్రుచ్చు;

పొదరిండ్లలోఁ దూఱి పొదలయల్లికఁ జూచు, నడవిజంకలతోడ నాటలాడు;
సాంధ్యారుణాంకితజలదఖండముఁ గాంచు, వనరామణీయకమును దలంచు;
మధురరసము తేఁదు మనమునఁ దోలఁకాడ, లోకమెల్లఁ దేనెపాక మనును;
నిట్టిమృదులహృదయుఁ డెచ్చోటనుండియో, పిచ్చివానిపోల్కి వచ్చుచుండె.

ఉ. అతనిఁ జూచి కాంత, తనయంతు నెఱింగినచెల్మికాఁడు సాం
ధ్యాతపకాంతులం బ్రకృతియందముఁ గాంచఁగ నేఁగుదెంచెఁ; దా
నాతరుణుం డొకళ్లోకరి యంసమునం జెయి వైచి ముగ్ధసం
గీతములన్ రసంబు లొలికింపఁ దలంపులు దీపరింపఁగన్.

సీ. వచ్చి రాక మున్నె వరునిఁ గౌఁగిటఁ జేర్చి, మూఁతపడ్డకనుల ముత్తెసరుల
గతిఁ బ్రమదబాష్పకణములు చిప్పిల్ల, నుడులఁ బల్కనారు లుప్పతిల్ల.

గీ. రెండుకీలలు నేకమౌరీతి నిరువు, రొకరొకరికౌఁగిళులలోన నుండి రపుడు;
వసుధఁ బ్రతిదియుఁ బ్రణయపిపాసతోడ, నొకటినొకటి నాశ్లేషించుకొన్న దోఁచె.

గీ. అనిమిషత్వమునొంది యాయద్భుతంబు, నరయుచుండెను శాస్త్రి నోరంత తెఱచి
యంతఁ గౌఁగిలి వీడి యాయబ్జనేత్ర, పిన్ననవ్వులు మోమునఁ జిన్నలొలుక.

ఉ. చాలిఁక శాస్త్రిగారు! శ్రమ చాల వహించి మదర్థ మయ్యయో!
కాలుకుఁ గాలు గొట్టుకొనఁ గాననసీమకు వచ్చి యింత కే
మేలును బొందకే తిరిగి మీపురిఁ జేరుటఁ జూడ నాకునున్
జాలి జనించె; దైవము ప్రసన్నము గా, దిఁకఁ బొందు నావుడున్.

గీ. ఈర్ష్యయొకవంకఁ బరిభవ మింకనొక్క, కడను జిత్తమ్ముఁ జఱచుటఁ గాల్చుచుండఁ
గటము లదరఁగఁ గనుబొమల్ నటనసేయఁ, బండితుఁడు పళ్లు బిగఁబట్టి ప్రతినచేసె.

శా. నేనే తిమ్మయశాస్త్రిపుత్రుఁడయినన్ నిత్యమ్ముఁ గాత్యాయనీ
ధ్యానారూఢహృదబ్జతన్ విధులసద్ధర్మంబులం బ్రత్యుష
స్స్నానంబుం బొనరింతు నేనిఁ గవితా! సత్యంబుగా నీజగల్
నీనాటెంబు నెయ్యూరియుంచనడలున్ నిర్మూలముం జేసెదన్.

మ. అని కోపంబున మూటముల్లె గొని సంధ్యావందనాపేక్షచే
వనమార్గంబునుబట్టి యేటిదరికిన్ బాండిత్యవాహుండు పో
యిన, నాయిద్దఱు నెచ్చెలుల్ వనవిహారేచ్ఛన్ నదీసైకతం
బునకుం బోయిరి జంటఁ బాయక మనంబుల్ దేహముల్ వర్తిలన్.

గీ. సందెచీఁకటిలో నేదో, చాయనుండి, వీనులం బడె నళకీరగాన మొండు;
ప్రకృతి నిదురించె నాకోలపాటలోని, తియ్యఁదేనియ లక్కఱ దీఱ నాని.

ప్రాచీనాంధ్రు లెవ్వరు? ఆర్యులు కారా?

చిలుకూరి వీరభద్రరావు గారు

(గత సంచిక శేషము)

ఇప్పటికి రెండు వేలయైదువందల సంవత్సరములనాఁడు శాక్యులు, లిచ్ఛవులు, మొదలగు క్షత్రియసంఘములవారు బహుపరాక్రమశాలులుగ నుండి ప్రాచీనవైదికహిందూదేశమున గొప్పమార్పును బుట్టించినట్టి ప్రతిభాశాలులు. వీరికిఁ బూర్వము కురుపాంచాల శాఖలవారు వైదికమతమును విస్తరింపఁజేసియుండిరి. అధిరాజ్యములను స్థాపింపలేదు. కాని యీశాక్యులును, లిచ్ఛవులు, మొదలగువారు మౌర్యసామ్రాజ్యము, ఆంధ్రసామ్రాజ్యము, గుప్తసామ్రాజ్యమువంటి మహాసామ్రాజ్యములను, జైనబౌద్ధమతములవంటి మహామతములను స్థాపించి భరతఖండమునకు నెక్కువ ఖ్యాతిని గడింపఁజేసిరి. ఈక్షత్రియశాఖలవారెల్లరు వజ్జియను లను క్షత్రియసంఘమునకు సంబంధించినవారు. ప్రథమమున వీరిలో లిచ్ఛవులనుగుఱించి తెలిసికొనుటకుఁ బ్రయత్నింతము. వీరినిగూర్చి బౌద్ధజైనవాఙ్మయములలో నున్నదానినంతయుఁ గ్రోడీకరించి "బౌద్ధయుగమునాఁటిక్షత్రియకులము" లను గ్రంథములో వ్రాయఁబడియున్నది. ఈ గ్రంథము బాబూ విమలచరణలా గారిచే రచింపఁబడి రెండేండ్లక్రితము ప్రకటింపఁబడినది. ఈ గ్రంథకర్తగారి యభిప్రాయములకును నా యభిప్రాయములకును గొంతభేద మున్నను ఈ క్షత్రియసంఘములనుగుఱించి యిదివఱకు విస్పష్టముగాక సందిగ్ధములుగా నున్న పెక్కువిషయములు వీరి గ్రంథమువలన నేఁడు తేటతెల్లము లయినవి. లిచ్ఛవులలోఁ బెక్కుతెగ లున్నట్టు తెలియుచున్నది. వేదములలోఁ గాని, మహాభారతమునఁ గాని లిచ్ఛవుల నామములు గానరావు గాని మనుధర్మశాస్త్రములోను కౌటిల్యుని యర్థశాస్త్రమునను గనఁబడుచున్నవి. వీరిజన్మచరిత్రమునుగూర్చి యొక విచిత్రమైనగాథ బుద్ధఘోషుఁడు 'బుద్ధకపాఠ' మను గ్రంథముపైని వ్రాసిన పరమాత్థ (పరమార్థ) జోతిక (జ్యోతిక) అను వ్యాఖ్యగ్రంథములో నిట్లు చెప్పఁబడినది.

కాశీరాజపట్టమహిషి గర్భమును ధరించెను. దానినెఱింగి యామె రాజునకుఁ దెలియఁజేసెను. అతఁడు గర్భసంరక్షణార్థము చేయవలసినకర్మల నన్నిటిని గావించెను. నెలలు గడచినపిమ్మట నామె ప్రసవగృహమును బ్రవేశించెను. ఒకనాఁటి సూర్యోదయకాలమున నొక శుభముహూర్తమున నామె ప్రసవించెను. అపుడామెగర్భమునుండి లక్కవంటియు, బంధుజీవక పుష్పములవంటియు నెఱుపువన్నెగల యొక మాంసపుముద్ద వెలు

పల పడెనట! తక్కినరాణులు దీనిని జూచి తాము రాజున కీవర్తమాన మంపిన యెడల సువర్ణచ్ఛాయగల సుకుమారుని గాంచునని యెదురు చూచుచున్న రాజునకుఁ దమపై నెల్లఁ గోపము వచ్చునని భయపడి యాతనికిఁ దెలియఁజేయక వెంటనే వా రామాంసపుముద్ద నొకపేటికలో నుంచి దానిపై రాజముద్రికను ముద్రించి యియ్యది పట్టమహిషియొక్క బిడ్డ యని యొకచీటిని వ్రాసి దానికిఁ గట్టిపెట్టి యాపేటికను గంగాప్రవాహమున విడిచిరఁట. ఇయ్యది మహాభారతములోని కుంతీదేవి కర్ణుని గని యొరులకుఁ దెలియకుండ గంగాప్రవాహమున విడిచినకథను బోలియున్నది. అప్పు డాగంగయొడ్డున గోబృందముల చెంత నున్న యొకరోగి గంగాప్రవాహమునఁ గొట్టుకొని వచ్చుచున్న యాపేటికను గాంచి దానిని పట్టుకొని దానికిఁగట్టిన చీటిని జదువుకొని కాశీరాజముద్రికను గాంచి దానిని దెఱచి చూడఁగా నం దొకమాంసపుముద్ద గానంబడియెనఁట! అయ్యది గర్భములోని పిండముగా భావించి యాతఁడు దానిని భద్రముగాఁ దన యాశ్రమమునకుఁ గొనివచ్చి పదిలముగా నొకమూల నుంచి సంరక్షించుచుండెనఁట! పక్షదినములు గడచునప్పటికి యామాంసపు పిండము రెండుభాగములుగ విడిపోయెనఁట! అంత నాఋషి వానిని జాగరూకతతోఁ బోషించుచుండెను. మఱిపక్షదినములు గడచునప్పటికి శిరస్సు, కాళ్లు, చేతులు మొదలగునవి యాకారము లేర్పడినవఁట! మఱియొక పక్షమునకు నం దొకటి సువర్ణచ్ఛాయను బోలిన మగబిడ్డగను, రెండవది యాడుబిడ్డగను నేర్పడియెనఁట! పితృవాత్సల్యముతో నాతఁ డాబిడ్డలను బాలుబోసి పెంచుచుండెనఁట! వారలగర్భములలోని కేపదార్థమును బోసినను మణులలోని పదార్థమువలె వికసించుచుండుటచేత 'నిచ్ఛవు' లని అనఁగాఁ జర్మములేనివారని చెప్పుకొనుచుండిరఁట! మఱికొందఱు 'లీనాచవు' లని అనఁగా సంధింపఁబడిన చర్మములు గలవారని చెప్పుకొనుచుండిరఁట! (ఇది జరాసంధుని జన్మవృత్తాంతమును బోలియున్నది.) ఆఋషి ప్రతిదినము గ్రామములోనికి నుదయమునఁ బోయి చాలప్రొద్దెక్కినతరువాతఁగాని తిరిగివచ్చుట సంభవింపనందున గోపకులు దానిసంతయుఁ గనుపెట్టి ఓఋషిపుంగవా! ఈబిడ్డలను మీవంటివారు పెంచుట కష్టము. మాకు దయచేసినయెడల మేము పెంచెదము. అని ప్రార్థింపఁగా నాతఁడు సమ్మతించెనఁట! అమఱునాఁడు గోపకులందఱు పతాకములను ధరించి దారి చక్కఁజేసికొని మార్గముపొడవునను బువ్వులు చల్లుకొనుచు సంతోషము పెంపు మీఱ మేళతాళములతో రాఁగా నాఋషి వారితో వీరిరువురు మంచిగుణవంతులు గావున వీరిని జాగ్రత్తతోఁ బెంచి పెద్దవారయిన పిమ్మట వీరిలో నాఁడుబిడ్డను మగబిడ్డకిచ్చి పెండ్లి చేయుటయే కాక రాజు నడిగి కొంతభూమి గైకొని యొకపురము నిర్మించి యందు వీరిని పట్టాభిషిక్తులను గావింపవలసిన దని చెప్పి యాబిడ్డలను వారల కప్పగింపఁగా, వారలు సంతోషముతోఁ గొనిపోయి యాతఁడు చెప్పినట్లు మిక్కిలి జాగరూకులై పెంచుచుండిరి.

వీరలు పెద్దవారయినతరువాత బలాఢ్యులై గోపకులబిడ్డలతో నాటలాడుకొను చుండునపుడు తగవులు కలిగినచో వీర లాగోపకుల బిడ్డలను దయమాలి పిడికిటిపోటులం బొడుచుచు మోకాటిపోటులు పొడుచుచుం గొట్టుచుండువారగుటచేత నేడ్చుచు నిండ్లకుం బోయి తమ తల్లిదండ్రులకు వీరివలనం జాలమందికిం గష్టములు వచ్చుచున్నవనియు వీరి నుంచరాదు వర్జింపవలసిన దనియు (వర్జితబ్బా) మొఱ్ఱవెట్టి కొనిరంట! అప్పటినుండి యాదేశము మూఁడు వందలయోజనముల పరిమాణము గలిగి 'వజ్జి' యనుపేరం బరఁగుచుండెను. పిమ్మట నీగోపకులు రాజదయను సంపాదించి యాతనియనుమతిని బొంది యాదేశమును సంపాదించి పురమును నిర్మించి దాని కాతని పట్టాభిషిక్తుని గావించిరి. ఆ బాలునకు యుక్తవయస్సు వచ్చిన వెనుక యుక్తవయస్సు వచ్చిన యాకన్యకకు వివాహము గావించిరి. ఆసమయమున రాజు 'నేటినుండి యేపెండ్లికొమరుని నిక్కడకుం దీసికొని రాఁగూడదు; ఇక్కడనుండి యేపెండ్లికొమార్తెను బైటకుం బంపరాదు' అని శాసించెనంట! అప్పు డాదంపతులకుం బ్రథమమున నిరువురు కవలు జనించిరంట! ఇట్లు పదునాఱుమాఱులు కవలు జనించిరంట! ఇట్లొక జంటవెంబడి నొకజంట జనించి పెరుఁగుచుండుటచేత పురము విశాలము చేయఁబడవలసి వచ్చెను. పురము చుట్టును పాతికయోజనముల కొకొక్క ప్రాకారము చొప్పున మూఁడు ప్రాకారములు నిర్మింపఁబడి చాలకున్నందున రానురాను పెంపు చేయబడుచువచ్చిన దాటచే, 'వైశాలి కాకట' మనుపేరున (వేసలి) వ్యవహరింపఁబడుచుండెను. ఇయ్యది రామాయణములోని లక్ష్మణశత్రుఘ్నుల (కవల)యొక్కయు, మహాభారతములోని నకులసహదేవులయొక్కయు జన్మవృత్తాంతములను దలఁపునకుం దెచ్చుచున్నది. రామలక్ష్మణులు విశ్వామిత్రునితోఁ గూడ వైదేహిని బెండ్లియాడుటకై మిథిలానగరమునకుం బోవుచు నీపురము నేలుచున్న సుమిత్రుఁ డనురాజుచే సన్మానింపఁబడినట్లు రామాయణమున వక్కాణింపఁబడియె నని (భారతి రెండవసంచికలో) యిదివఱకే తెలిపియున్నాను. కాని యీగాథలో మాంసపిండము రెండుతునుకలై యొకఋషి (అంగదేవుఁడు) చే నతుకఁబడుటయు నయ్యవి బిడ్డలగుటయు నస్వాభావికమగుటచే నెవ్వియో రెండు జాతులసమ్మేళనమువలన నీసంఘ మేర్పడియుండుననను నూహతోఁ బరిశోధకు లగు పండితులు లిచ్ఛవు లెవరై యుందురని పరిశోధింప నారంభించిరి. వారిలో నిరువురను ముఖ్యులనుగాఁ జెప్పవచ్చును. అందు మొదటివారు విన్సెంటుస్మిత్తుగారు, రెండవవారు కీర్తిశేషులయిన మహామహోపాధ్యాయ సతీశచంద్ర విద్యాభూషణు లనువారు. లిచ్ఛవులు న్యాయవిచారణపద్ధతులయందును, మరణముఁజెందిన వారి విషయమై జరపుకర్మలయందును ట్రిబిష్టపు (Tibet) దేశపుపద్ధతు లనుసరించుటచే టిబెటునుండి వచ్చినవారని స్మిత్తుగారు నుడివిరి. అది సరికాదు. ప్రాచీనపారశీకము (పార్థియా, మేదియాలు) నుండి వచ్చినవారయి

యుండవలె నని మహామహోపాధ్యాయులు వ్రాసియుండిరి. దీనిని మనము విచారింపవలసి యున్నది. లిచ్ఛవులలో పురుషుఁడుగాని స్త్రీ గాని మరణముఁ జెందినపుడు వన్యమృగముల కాహారముగా విడుచుట చీనావారి వైపునుండి శాక్యబుద్ధునిగాథలు చెప్పుకొనుసందర్భమున నసంబడుచుండెనని తెలియుచున్నది. (Beal's Romantic Legend of Sakya Buddha P. 59; Ksatria Clans in Buddhist India P. 29) ఋషులు తన ప్రశ్నకుజవాబు చెప్పుడు సిబోధిసత్వుఁడు(గౌతముఁడు) వైశాలిపురము కుఁ బోయినపు డిట్టిదర్శన మందుఁ జేయఁబడి యెనఁట. సమాధికడ శవములు రాంబందులు తినకొనుటకై విడిచిపెట్టబడునఁట. అక్కడ శవములనుగూడ దహనముగావించి యెముకలు ప్రోగుచేసి నిలువచేయుదురట. శవములను చెట్లకు వ్రేలాడఁ దీయుదురఁట! బంధువులచేతఁ గాని మఱియెవ్వరిచేతఁగాని చంపఁబడినవారిని వారు తిరిగి సజీవులై వచ్చి బాధింతురేమో యనుభయముచేతఁ గొందఱు పాతిపెట్టుదు రఁట. బహుశః వారు తిరిగి యెప్పటికైన బ్రది కచ్చుట కవకాశము కలుగునట్లుగాఁ గొం దఱు శవముల నక్కడ విడిచి వత్తురఁట. దీనిని బట్టి డాక్టరు విన్సెంటుస్మిత్తుగారు చరిత్రకాల మునకుఁ బూర్వమునుండియు నిట్టిపద్ధతులాచర ణములో నున్నవని తెలుపుటకు హిందూదేశ ములో నిట్టిసమాధులు పెక్కులు కనఁగొనఁ బడెననియు నచటగూడ నీమార్గముతో యాచ రణములో నున్నట్లు కనుగొనఁబడె ననియు వాదించుచున్నారు. (Indian Antiquary 1903. P. 234). వీరివాదమును విని బాబూ విమలచరణగా రిట్టిపద్ధతులు ప్రాచీనార్యులలో నుండెననియు, "యేనిఖాతా యేపరోప్తా యేదగ్ధా యేచోద్ధితాః సర్వాంస్తానగ్న ఆవహ పితౄన్ హవిషే అత్తవే" అను అథర్వవేదమంత్రములో (అ. వే. 23. 2. 34) నీమూఁడుపద్ధతులు గలవని వక్కాణించిరి. (K. B. I. Page 30) కాఁబట్టి యీపద్ధతులు టిబెటునుండి గ్రహించినవి కావని వారియభిప్రాయము. న్యాయవిచారణపద్ధతులును బౌద్ధమతము విదేహదేశము నుండి టిబెట్టుదేశమునకుఁ బోయినపుడు గ్రహించినవేగాని యటనుండి యిక్కడకు రాలేదని నుడువుచున్నారు. కాఁబట్టి లిచ్ఛవులు త్రివిష్ట దేశమునకుఁగాని తత్ప్రాంత దేశమునకుఁగాని సంబంధించినవారు కారనియు, లిచ్ఛవు లార్యులే యనియు, మఱియు, బీలుగారు లిచ్ఛవులు యూచీలు (యకజాతులు లేక శ్వేతహూణులు)గఁ బరిగణించుచున్నారనియు వారు క్రీస్తు శకారంభమున హిందూదేశమునకు వచ్చిన వారు గావున నెన్నఁడో క్రీ. శ. పూర్వము నైదాఱుశతాబ్దులుగా నత్యంతనాగరికులుగ నున్నజాతులవారిని వారితోఁ బోల్చుటసందర్భముగ నున్నదని చెప్పకయే దానిమోమున గన్పట్టుచున్నదనియు నొక్కి వక్కాణించెను కాని యీసందర్భమున బాబూ విమలచరణ లాగారు బాగుగా నాలోచించి వ్రాసిన వాక్యము కాదేమో యని నాకు గట్టిసందేహము కలుగుచున్నది. ఏమనఁగా పవిత్రమైన జైనవాఙ్మయములోని 'సూత్రకృతాంగ' మను గ్రంథమున లిచ్ఛవులు ఉత్తమకులసులుగ

చెప్పెడియా క్రిందివాక్యము గనంబడుచున్నది.

"A Brahmana or a Ksatria by birth, a Scion of the Ugra Race or Licchavi, who enters the order eating alms given him by others, is not stuck up on account of his renowned Gotra." Jacobi Jaina Sutras, Part II S. B. E. Vol. xlv. P. 321)

ఉగ్ర లేక లిచ్ఛవీజాతీయుఁడై జన్మచేత బ్రాహ్మణుఁడైనవాఁడుగాని క్షత్రియుఁడైనవాఁడుగాని అర్హుఁడైనపుడు, ఇతరులవలన దానములను పరిగ్రహించుటకుఁ దన ప్రసిద్ధమైన గోత్రమును బట్టి కట్టుబడియుండ నక్కఱ లేదు.

పైనైన గ్రంథములోని వాక్యమువలన లిచ్ఛవులు ఉగ్రజాతికి సంబంధించినవారుగఁ గన్పట్టెదరు.(K. B. I. P. B.) ఉగ్రులన నెవ్వరు? ఉగ్రుఁడనఁగా క్షత్రియునకు శూద్రస్త్రీయందుఁ బుట్టినవాఁడని ధర్మశాస్త్రములు వక్కాణించుచున్నవి. విశ్వంభరశాస్త్రమునందు:—

శూద్రాం క్షత్రా దుగ్రజాతిర్యుద్ధశస్త్రాది జీవికాః శస్త్రాస్త్రవ్యాసకుశలః సంగ్రామకుశలో భవేత్ । తయా వృత్త్యాహ్యజీవన్నైవ శూద్రధర్మాంశ్చ పాలయేత్ । శూద్ర్యాం జాతస్తు వైశ్యా ద్వైకరణో లిపిలేఖకృత్ ॥

అని క్షత్రియునకు శూద్రస్త్రీయందుఁ బుట్టినవాఁడు ఉగ్రుఁడనియు, వానికి యుద్ధము శస్త్రవిద్యయు జీవికయనియు, దీనిచే జీవనము జరుగకున్న శూద్రధర్మము లాచరింపవలెనని యును జెప్పఁబడి యున్నది. "వైశ్యా శూద్ర్యోస్తు రాజన్యా న్మాహిష్యోగ్రౌ సుతౌ స్మృతౌ" అని క్షత్రియునకు వైశ్యశూద్రస్త్రీలయందుఁ బుట్టినవారు క్రమముగ మాహిష్యుఁడు నుగ్రుఁడు ననఁబడుదు రని యాజ్ఞవల్క్యుఁడు పలికియున్నాఁడు. టిబెటు దేశమునకు నుత్తరమునను మంగోలియా దేశము నడుమటి హద్దులలో ఉయిగర్ లేక ఊషన్ (Uigur or Ushon) జాతివారున్నట్లు తెలియుచున్నది. ఈ ఉయిగర్ శబ్దము ఉగ్రశబ్దముగను, ఊషన్ శబ్దము ఉశనశబ్దముగను సంస్కరింపఁబడినట్లు కన్పట్టుచున్నది. ఉశనసుఁడు, ఔశనసస్మృతి మొదలగునవి సంస్కృతభాషలోఁ గలవు. మఱియును, ఉశీనరు లనువారు ఉత్తరకురుభూములనుండియు, ఉత్తరమద్రభూములనుండియుఁ గురుపాంచాలురతోడను వసులతోడను గంగాతీరమునకు వచ్చినట్లుగా భారతి మూఁడవసంచికలోఁ దెలిపియున్నాను. కంసునితండ్రి ఉగ్రసేనుఁ డనువాఁడు మథురాపురము నేలుచుండెనని భాగవతాది గ్రంథములనుబట్టి మనము దెలిసికొనుచున్నారము. ఈ జాతివారు బ్రాహ్మణులు, క్షత్రియు లెట్లయిరో వీరు వాసిష్ఠగోత్రు లెట్లయిరో యింక ముందుఁ దెలిసికొనవలసి యున్నది. మొదటి సారి బుద్ధదేవుఁడు లిచ్ఛవులను గలిసికొన్న విషయమును దెలుపుచు, వైశాలికాపురమున మహామారిరోగము ప్రజలను బీడించుచుండ లిచ్ఛవులు పోయి బుద్ధదేవుని గౌరవముతో రప్పింపఁగా నాతఁడు సంభాషించునపు డెపుడును వారలను వాసిష్ఠులారా! యని సంబోధించుచుండువాఁడఁట. ఇఁక మనము మహామహోపాధ్యాయ డాక్టరు సతీశచంద్ర విద్యాభూషణు లనువారు తెలిపినయభిప్రాయ

నుగూర్చి కూడ కొంత చర్చింపవలసి
న్నది. వీరు క్రీస్తుశకమునకుఁ బూర్వము
౫౫-వ సంవత్సరములో (పారశీకపురాజగు
రయసు అనువాఁడు భరతఖండముపై దండె
టకై సైన్యములఁ బంపెననియు, ఆసైన్య
లు హీరతునకు దూరముగా నున్న నిశిబిసు
isibis) అను ప్రదేశమునుండి వచ్చఁబడిన
యు, వారు సింధునదీతీరమునకువచ్చియక్క-
నుండి పంజాబులో ప్రాచీనాచారపరాయణు
యిన బ్రాహ్మణులు మిక్కుటముగా నున్నం
నను మగధప్రాంతమున వ్రాత్యులు (బహి
ష్కరింపఁబడినవారు) విశేషముగా నున్నం
న మగధమునకు వచ్చిరనియు, ఈనిశిబీలనే
చ్ఛవీ లని మనువు వ్రాసినాఁ డనియు శబ్ద
మ్యము కలదు. కాఁబట్టి లిచ్ఛవులు ప్రాచీన
రశీకులని వ్యవహరించుచున్నారు. మను
ృతికి వ్యాఖ్యానము చేయుచు కుల్లూకభట్టు
చ్ఛివిశబ్దము నిచ్ఛివిశబ్దముగఁ జదివి యట్లె
్యాఖ్యానముచేసియుండుటచేత డాక్టరు సతీశ
ంద్రవిద్యాభూషణులు తప్పు త్రోవఁ ద్రొక్కి-
లాగా రాక్షేపించిరి. మఱియును గౌతమ
ద్ధుఁడు విన్సెంటు స్మిత్తుగారియభిప్రాయము
కారము క్రీ. శ. పూర్వము ౪౮౦ లో
ర్వాణముఁ జెందినది వాస్తవమైనను సిం
శగాథల ననుసరించి క్రీ. పూ. ౫౪౩ లో
ర్వాణముఁ జెందినది వాస్తవమయినను క్రీ.
పూ. ౫౧౫ లో డెరయసు దండయాత్ర
కాలముగా ప్రాచీనపారసీలువచ్చినారని తెలు
ట బొత్తుగా విశ్వసనీయముగా లేదని
బాబూ విమలచరణలాగారి యభిప్రాయ మై

యున్నది. కాని యిక్కడకూడ మనలాగారు
పొరపడుచున్నారేమో యని భయము వేయు
చున్నది. వీరికి డెరయసుదండయాత్రమాత్ర
మే జ్ఞప్తియందుండి భయముగొల్పుచున్నది
గాని యంతకుఁ బూర్వపుస్థితిని గమనింప
కున్నారు. బాబూ విమలచరణ లా గారు
లిచ్ఛవులు ప్రాచీనపారశీకమునుండి వచ్చినా
రని యొప్పుకొన్నందున వాసిష్ఠగోత్రులనియు,
బ్రాహ్మణులనియు, క్షత్రియులనియు, వక్కా-
ణింపఁబడిన లిచ్ఛవుల యార్యత్వమున కెక్కడ
భంగము కలుగునో యని భయపడుచున్నట్లు
గన్పట్టుచున్నది. వైదికయుగమునందే ప్రాచీన
పారశీకమునకును భరతఖండమునకును నెక్కు-
వసంబంధ మున్నట్లు గన్పట్టుచున్నది. రామా
యణమునుబట్టి లిచ్ఛవులలో నుగ్రజాతివారు
గలరని తోఁచుచున్నది. మహాభారతమును
బట్టిగాని తదితరపూర్వగ్రంథములనుబట్టిగాని
ప్రాచీనపారశీకమునకు సంబంధించిన తెగలు
కూడ లిచ్ఛవులలోఁ గలిసిపోయినట్లు గన్పట్టు
చున్నది. మఱియును కొన్ని వేలసంవత్సర
ములక్రిందటనే పార్థియా, మీడియా, అస్సీ
రియా, కాల్డియా, ఫొనీషియా దేశములకు
నెక్కువసంబంధము గన్పట్టుచుండుటచేత డెర
యసునకుఁ బూర్వము మనకును ప్రాచీనపార
శీకమునకును సంబంధము లేదనుకొనుట భ్రమ
వలెఁ గన్పట్టుచున్నది. ఋగ్వేదకాలమునందే
యెక్కువ సంబంధ మున్నట్లు గన్పట్టుచున్న
యది. ఇట్టి నాయభిప్రాయము నొప్పుకొ
కున్నయెడల ఋగ్వేదమంత్రములు రచిం
బడి ౨౫౦౦ సంవత్సరములకన్న నె

కాలేదని చెప్పవలసివచ్చును. అది అంతవిశ్వసనీయముగఁ గనుపట్టదు. కావున మహామహోపాధ్యాయులవారి యభిప్రాయములోఁ గూడ సత్యము కలదు గాని లేకపోలేదని కన్పట్టుచున్నది. లిచ్ఛవులను వారిలోఁ బెక్కు-శాఖలు గలవు. వీరియభిప్రాయము లన్నియు సత్యములే యని యింకముందుఁ దెలుపఁబోవుచున్నాను.

లిచ్ఛవులశీలమును దెలిసికొనుటకై వానిగూర్చిన మఱికొన్ని వర్ణనములను బౌద్ధగ్రంథములనుండిచూపింపవలసియున్నది. బౌద్ధగ్రంథములలోని వర్ణనములన్నియు బాబూవిమలచరణలాగారి 'బౌద్ధయుగమునాఁటి క్షత్రియకులము' లను గ్రంథమునుండి సంగ్రహించినవే కావున నీగౌరవమంతయు వారికిఁ జెందవలసియున్నది. బుద్ధుఁడు జీవించియున్న కాలమున వజ్జిజనులు పెక్కు-కులములవారుగా నుండిరి. ఇయ్యవి లిచ్ఛవులు, వైదేహులు, తిరుభుక్తులు మొదలుగాఁ గల నామములతో నొప్పెడి 'అష్టకులము'లని కన్నింగుహాముగారు తెలిపిరి. ఒక్కొక్క-కులమునకు నొక్కొక్క-సభ్యుఁడుచొప్పున నెన్నుకొనఁబడిన యెనమండ్రు సభ్యులతోఁ, గూడిన న్యాయవిచారణసభ, (Jury) వీరికిఁ గలదట. (Cunningham's Ancient Geography of India P. 447). ఈతెగలవారందఱు యుద్ధవ్యాపారతంత్రములప్రావీణ్యమును గఱపు నట్టియస్త్రశస్త్రాగారప్రతిష్ఠాపనలతో నొప్పుచు వీరాధివీరులై యొంగోరులయెడఁ బ్రేమాతిశయములం జూపుకొనుచు భరతఖండముయొక్క-యీశాన్యదిగ్భాగమునఁ బ్రసిద్ధులుగనుఁ బరాక్రమవంతులుగను నున్నవారని బౌద్ధసూత్రాది గ్రంథములలో వర్ణింపఁబడి యుండెను. Buddhist Sutras, S. B. E. Vol. XI. P. 3, Vide also Turnour, Pali Buddhist Annals No. 5. J. A. S. B., Dec. 1838, P. 992.

ఒంగోరులయెడ వీరుచూపు ప్రేమాతిశయములు నిరుపమానములు. ఒకనికి జబ్బుచేసిన యెడలఁ దక్కి-న లిచ్ఛవు లెల్లరును వానిని జూడఁ బోయెదరు. ఒక లిచ్ఛవుని యింటఁ బండుగ వచ్చినఁ దక్కి-న లిచ్ఛవు లెల్లరును దోడ్పడుదురు. విజాతీయుఁడైన గొప్పవాఁడెవ్వఁడయిన తమనగరమునకు వచ్చిన యెడల వా రెల్లరును వాని కెదురుగఁ బోయి గౌరవముతోఁ గొని వచ్చి యర్హసత్కా-రములచే గౌరవింతురు. (సుమంగలవిలాసము. Burmese Edition pp. 103-105) వారు సురూపులును, చిత్రవిచిత్రములయినరంగులతో నొప్పెడి దుస్తులను ధరించుటయం దభిలాషగలవారును నఁట. (Watterson Yuan Chang Vol II. P. 79. బుద్ధుఁడు వారలను మొట్టమొదటఁ గాంచినపుడు వింతలగు వారిరూపరేఖావిలాసములను వీక్షించి వానిని దేవతాంశసంభూతు (Tava timsa) లనుగ దలంచెనఁట. మహాపరినిర్వాణసూత్రమునందు లిచ్ఛవు లి ట్లభివర్ణింపఁబడిరి. బుద్ధుఁడు వైశాలినగరమునకు వెలుపలిభాగమున నున్న అంబపాలీయొక్క-మామిడితోఁటలో వసించియున్నాఁడని విన్నవ్వాడు లిచ్ఛవులందఱును వానిని సందర్శింప పెక్కు-రథములను సమకూర్చికొని పోయి

రనియు కొందఱు శ్యామలవర్ణము గలవారు గను, కొందఱు గౌరవర్ణము గలవారుగను, మఱికొందఱు ఎఱుపు లేక తెలుపువర్ణము గలవారుగ నుండిరనియు, వారివారివర్ణములకుఁ దగిన యావర్ణములఁ బోలు రంగులు గల దుస్తులతో నేగిరనియు వర్ణింపఁబడి యుండెను. వా రలంకరించుకొన్న యాభ రణములు కూడ వారి దేహచ్ఛాయలంబోలిన రంగులు గలవిగనే యుండెనఁట. (Bud- dhist Sutras, S. B. E. Vol XI. P. 31) అట్టి వర్ణనము తే 'అంగుత్తరనికాయ'మను గ్రం థమునందును జేయఁబడినవి. వీరలు కేవలము ర్వదినములందు మాత్రమే కాక ప్రతిదినము సామాన్యసందర్భములను గూడ నట్టి రంగుల దుస్తులనే ధరించుచుండి రని పై గ్రంథమును ట్టి తెలియుచున్నది. ఒకప్పుడు గౌతమ బుద్ధుని మహావనమునందలి కూటాగారశాల యందు వినయవిధేయులై ౫౦౦ లిచ్ఛవులు వానిని బరివేష్టించి సేవించుచున్నపుడు కొం దఱు లిచ్ఛవులు నీలవర్ణముగల దేహములు, లవర్ణముగల దుస్తులు, నీలవర్ణము గల యాభరణములు; కొందఱు పీతవర్ణము పచ్చని) గలదేహములు, పీతవర్ణముగల దుస్తులు, పీతవర్ణముగల యాభరణములు; మఱికొందఱు నిదేరీతిగ నెఱుపు, తెలుపు ర్ణము గలవారుగా నుండిరని తెలుపుచున్నది. nguttara Nikaya P. T. S. Part III. P. 239). మఱియు నిదేవర్ణనము మహావస్తు ను సంస్కృతబౌద్ధకావ్యమునందుఁ గూడఁ జేయఁబడినది. ఇట్లు నీల, పీత, గౌర, శ్వేత, రక్త, హరిత, ఆదిగాఁగల నానావర్ణములు గలవారు నానావిధము లయిన రంగులదుస్తు లతో నుప్పొంగుచున్నవా రని తెలుపుట చూడఁగా లిచ్ఛవులలో నట్టివర్ణములు గల తెగలవా రుండిరని చెప్పకయె వేద్యమగుచు న్నది. వారి వారి రథములకుం గట్టినగుఱ్ఱముల రంగులు నట్టివిగానే యుండెనఁట! మఱియు మహావస్తుకావ్యమునందలి వర్ణనములఁ జూచినపుడు మహారాజులు వారియైశ్వర్య భోగములను వెంటఁ గొనిపోవురీతిగ నుండెను. వారు వేసలినగరమునుండి పోవునపుడు మౌ క్తికములు, మణులు, సువర్ణము మొదలగు వానితోఁ బొదుగఁబడిన గుఱ్ఱములు, రథ ములు, ఏనుఁగులు మొదలగు వాహనాదిక ములు ౮౪౦౦౦ తోడ వారు పయనమై మహావనమునకుఁ బోయిరఁట. 'మహావస్తు' అను కావ్యములో

"లిచ్ఛవి కా అహంసు అన్యదాపి భగవాన్ భగవానాహ అన్యదాపి వాసిష్ఠా. భూత పూర్వం వాసిష్ఠా అతీత మధ్వానే పాంచాలే జనపదే కాంపిల్లనగరే రాజా బ్రహ్మదత్తో నామ రాజ్యం కారేసి"

అని యుండుటచేత వేసలి యొకప్పుడు కాంపిల్యనగరమను పేరిటఁ బరఁగుచుండె నని తెలియుచున్నది. పాణిని వక్కాణించిన ప్రా క్పాంచాలు రనువారు వీరేమో పరిశోధింప వలసియున్నది. అయినను బుద్ధుఁడు బ్రదికి యుండి నాటిలోఁ జేరి వారికి ధర్మమును బోధించిన కాలమున వారిస్థితి యింతయైశ్వ ర్యవంతమయినదిగఁ గన్పట్టుచున్నది. బుద్ధుఁడు

చెప్పినదానిని సంయుక్తనికాయ మను గ్రంథము పదిలపఱచియున్నది. ఓభిక్షువులారా! వీరిని చూడుఁడు! ఈ లిచ్ఛవులు సుస్థిరచిత్తులును, అప్రమత్తులును ధనుర్వేదపారంగతులునై యుండియుఁ గట్టెకదుంగలను దలగడలుగాఁ జేసికొని నిద్రించుచున్నారో! వైదేహీపుత్రుఁడైన మగధరాజు అజాతశత్రుఁడు. వీరిపై వైరము గల్పించుకొనుటకు లోపమేమియు వీరియందుఁ గన్పట్టదు. భిక్షువులారా! ఎప్పుడైన నిఁకముందు వీరు సుకుమారులై హంసతూలికాతల్పములఁ బన్నుండి ప్రమత్తులై మైమఱచి నిద్రపోయినయెడల వైదేహీపుత్రుఁడైన మగధరాజు వీరిలోపములను గనుపెట్టి వీరిపై దాడివెడలుటకుఁ గారణము గనుపెట్టఁగలిగి యుండును." (సంయుక్తనికాయ. P. T. S. Part II 267, 268.) చదువరులారా! ఈ పైబౌద్ధగ్రంథములందలి వర్ణనములు శ్రీకృష్ణుఁడు మహారణ్యమునందున్న పాండవులను జూడ వచ్చి దుర్యోధనునిదుర్నయమును దలపోసి మహర్షులకుఁ బాండవుల దుస్థితిని వ్యక్తపఱచినవిధమును దెలుపుచున్నది. బౌద్ధగ్రంథములందు వర్ణింపఁబడిన యజాతశత్రుఁడను మగధరాజే మహాభారతమునందు వర్ణింపఁబడిన దుర్యోధనుఁడు; గౌతమబుద్ధుఁడే శ్రీకృష్ణుఁడు; లిచ్ఛవులు పాండుజాతులవారు. దేవతాంశసంభూతులు; వేసలిపురము కాంపిల్యనగరము; బ్రహ్మదత్తుఁడే ద్రుపదమహారాజు; బౌద్ధగ్రంథములు పెక్కులు మనకు మఱుఁగున నుండుటచేత మహాభారతములోని రహస్యములుగూడ మఱుఁగున నున్నవి. ప్రాచ్యులుగాని పాశ్చాత్యులలో మఱియెవ్వరుగాని తెలుపని విషయములను భగవదనుగ్రహమువలన నేను దెలిసికొని మీకుఁ దెలుపుట సంభవింపుచున్నది గావున చదువరులీనావాక్యముల కాగ్రహముఁజూపక దయ గలిగి శాంతచిత్తముతోడ నేనీసందర్భమున వ్రాయఁబోవుచున్న వ్యాసములను జదివి సత్యమును గ్రహింపవలయు నని ప్రార్థించుచున్నాను.

దురాశ

(చిన్నకథ)

గుండిమెడ వేంకట సుబ్బారావు గారు

సత్యమునకు, ధర్మ ప్రతిష్ఠకును, దగిన
ఫలితము లొసంగుచును, నాల్గు పాదములను
తిరుగ ధర్మంబు, తొలి వంగ దేశమందు
కలఁడు శృంజయుఁడను ధరాఖండలుండు.

కం. ఆ నరపతి సంతాన వి
హీనుండై బంధుజనులహితమున భక్తా
ధీనుండగు నీశ్వరు వర
దానముఁగొనఁదలఁచి ఘోరతప మొనరించెన్.

చం. బహుళతపోనిరూఢి వన
వాటములన్ వసియించుచున్న యా
మహిపతి భక్తికిన్ కరఁగి
మాన్యగుణాలయుఁడైన యా మహా
మహుఁడు శశాంకశేఖరుఁడు
మానవనాథుని ముందునిల్చి తత్
సహజకృపారసంబు పయిఁ
జల్లుచు రాజును బిల్చి యిట్లనున్.

తే. "ఓధరాతలేంద్ర! యుష్మదీయతపఃప్ర
భావమునకు నే దిగివచ్చినాఁడ
నేఁ ద్రిశూలపాణి నీ యిచ్చవచ్చిన
వర మొసంగువాఁడఁ బల్కు మనఘ!"

మ. అనుచున్ తజ్జననాయకుండు మది బ్ర
హ్మానంద ముప్పొంగ, న
య్యనఘున్ గాంచి నమస్కరించి యిటుల
త్స్తోత్రంబుతోఁ బల్కె, "నో
కనకాద్రీశ! సువర్ణదేహుఁడయి నా
కన్నంటఁ జల్లార్చు బా
లుని నాకున్ సుతుఁ జేసి నన్ సుఖవిలో
లున్ జేయవే యీశ్వరా!"

ఆ. కలదె యిట్టిదింత ఘనగుణాఢ్యుండౌచుఁ
దనకుఁ గీర్తిఁ దెచ్చు తనయుఁ గోర
కకట! స్వర్ణదేహుఁడగు పుత్త్రు నర్థించె!
ప్రభు వదెంత మందభాగ్యుఁడొక్కొ!

కం. అద్ధరణిపు విపరీతపు
బుద్ధికిఁ గారణము లేకపోవునొకో? స్వత
స్సిద్ధంబైన ధనాశన్
బద్ధుండయియుంట నట్టివాంఛ జనించెన్.

గీ. కోరిన వరం బొసంగి పురారి యంత
తని పూజల నంది యదృశ్యుఁడయ్యె
ధరణిపతియు మహానందభరితుఁడగుచు
నరుగుదెంచె నిజాస్థానపురమునకును.

ఉ. అంతటఁ గొన్ని మాసముల
కా నరనాథుని రాణివాసశు
ద్ధాంతము సవ్యకాంతులకుఁ
దావలమై విలసిల్ల, నమ్మహీ-

కాంతుఁడు కాంచె నిర్మలిన
కాంచనగాత్రుని నొక్కపుత్త్రకున్
కంతునిఁ గేరువాని! శిలి
కంపుని వాక్యము రిత్త వోవునే!

ఆ. ఆకుమారుఁగాంచి యతులహర్షమహాబ్ధి
నెడలు మరచి యుండెఁ బుడమి ఱేఁడు.
సుతునికంటె వాని యతిలోకసౌవర్ణ
తనువె తనకు మోదధామమయ్యె!

కం. ఈవిధముగ నాశ్రృంజయ [చుం
భూవిభుఁడు కుమారధనవిభూషితుఁ డగు
జీవనయాత్రను బహుసౌ [ఖ్యా.
ఖ్యావహముగఁ గడపుచుండె నవ్యాకులుఁ

ను పరమానందముతోఁడ నిట్టు లలభూ
పాలుండు నాల్గైదు వ
త్సరముల్ పుచ్చె ననంతరం బొక నిశీ
థంబందు నాభూతలే
శ్వరు సౌధంబునుఁ జొచ్చి రజ్జ్వలఘనా
శన్ ఘోరపాపక్రియా
నిరతుల్ పల్వురు చోరు లీశ్వరుని ని
ర్ణిశంబు సామాన్యమే!

ఆ. గృహముఁ జొచ్చి నాల్గుకెలఁకుల శోధించి
సాధ్యమైనదెల్ల సంగ్రహించి
అచట నచట వెదకి యాచోరవరు లంత
నెడలు పులకరింప నొక్కచోట

కం. కాంచిరి నిద్రారతుఁడై
మంచముపయిఁ బండియున్న మహనీయతనూ
దంచిత తేజస్సాంద్రునిఁ [పుత్త్రున్
గాంచనమయగాత్రు, మనుజ కాంతుని

గీ. వానిఁగని స్వర్ణవిగ్రహభ్రాంతులగుచుఁ
జోరులంతట నారాజసుతునిఁబట్టి
లీలఁ గొని పోయి రటఁ బాపి! లేశమేని
యెఱుఁగఁ డీచర్య పాప మాధరణి విభుఁడు!

ఉ. బాలునిఁ గొంచుఁబోయి యొక
పర్వతగహ్వరమందుఁ బెట్టి, యా
కూళలు నాల్గు తున్కలుగఁ
గోసిరి వాని సువర్ణదేహమున్;
కాలవశంబునన్ మనుజ
కాంతుఁడు మక్కువఁ బెంచుకొన్నయా
శాలత లిట్టినిష్ఠురవి
పంపు ఫలంబును గాసె నక్కటా!

ఆ. అనఘతప మొనర్చి యార్జించినసుపుత్త్ర
భాగ్యరాశి భస్మపటల మయ్యె!
ఆశఁగొల్పి నట్టి యాత్మీయ వంశంబు
నక్కటకట! మరల దిక్కుమాలె!

ఆ. ఆమహేశ్వరుని జరాయురారోగ్యసం
తునిఁ గుమారు నొసఁగు మనక నాఁడు
అకట! స్వర్ణదేహుఁడగు పుత్త్రు నేటి క
ర్హించె శృంజయుండు తెలివి మాలి!!

కం. ఈ పర్యవసానం బే
శాపంబో కాని, సర్వ సామాన్యముగన్
జొప్పట్టు నెల్ల యెడలను!
పాపిష్ఠి దురాశ మధురఫలముల నిడునే ?

జ్యోతిశ్శాస్త్రము

సిదపర్తి సుబ్రహ్మణ్య సిద్ధాంతిగారు

సుధాంబునిధి చంద్రమా క్తిక సమాన భాసాన్వితైః,
ప్రమాణపదవర్జితైః కపటనామభి స్తంతుభిః;
యదాశ్రితసుధీవరాః ప్రకటయంతి బ్రాహ్మ్యం నిజం,
తే మానత ఇహార్థయే కలిపతిం స్వకార్యాప్తయే.

ఆకాశమందు మనకు కనిపించు తేజోగోళములకు జ్యోతులని పేరు. అట్టి జ్యోతులయొక్క స్థితిగతులను తెలుపునది జ్యోతిశ్శాస్త్రము.

ఈ జ్యోతిశ్శాస్త్రము రెండువిధములుగా విభాగింపబడినది: ౧. గణితభాగము(సిద్ధాంతము) ౨, ఫలితభాగము. ఫలితభాగము నాలుగు భాగములుగా నేర్పడియున్నది: ౧ సంహిత, ౨ జాతకము, ౩ ముహూర్తము, ౪ ప్రశ్న. సంహితాభాగమునుండి విడిన కేరళ- కకుడాదిభేదములచేత పెక్కు-భేదము లేర్పడినను ఫలితభాగమంతయు నైదుభాగములుగా మతికొందఱిచే పరిగణింపబడె. జీవులయొక్క చరిత్ర నిర్ణయమందు ప్రధానాధారమై జ్యోతిశ్శాస్త్రములలో నెల్ల నుత్తమమై రాణిల్లుచున్నది.

జనసామాన్యముగ జ్యోతిశ్శాస్త్ర విషయములను తెలుసుకొననివా రుండరని నానమ్మకము. ప్రకృతిశాస్త్రములలోనెల్ల పండితులు మొదలు పామరులవఱకును, బాలలు మొదలు వృద్ధులవఱకును జ్యోతిశ్శాస్త్రమందభిరుచిలేని వారుండరు. గనుకనే,

“వనం సమాశ్రితా యేచ వృత్తమూల మహాశ్రితాః,
అపితే పరిపృచ్ఛంతి జ్యోతిషాం గతిగోచరమ్.

అను ప్రాచీనసూక్తి రాణిల్లుచున్నది. అందరికిని విదితమైన విషయములను నేను చెప్పుటయం దావశ్యకముం పోదు. ఇప్పుడు నేను వ్రాయబూనిన కొన్ని విషయములను మీరు పాశ్చాత్య గ్రంథములయందు చదివియే యుందురు. అయినప్పటికిన్ని,

“పాశ్చాత్యవిదుషాం నాహం వృణే తద్గ్రంథగౌరవాత్,
యుపపన్నతాప్తోక్తే ర్నేష్వస్తు గృహీతర్థం విశోధ్యతే.”

అను పూర్వ ప్రతిజ్ఞను మరువకుందును.

రాసులు నిన్నగాక మొన్న నేర్పడినవని కొందరును, పూర్వమందు మనకు (భారతీయులకు) జ్యోతిశ్శాస్త్రము సమగ్రముగ లేదని కొందరును, విమర్శించియుండిరి. ఫలితభాగముపై పట్టుసల బూనినమనపాశ్చాత్యపండితులపలుకులు పరిపరివిధములుగ నుండుటయం దాశ్చర్యము లేదు. ఇది వ్యక్తసిద్ధయుగము. ఇందు హేతువాదము హెచ్చుగనుండును; ప్రాచీన పండితుల పద్ధతియో ప్రమాణవాదము.

ప్రాచీనవిద్యలను నేర్చినవారు సంశయాస్పద విషయములయం దాప్తవాక్యమును స్వీకరింతురు. పాశ్చాత్య విద్య నేర్చినవారు ప్రత్యక్షముగా జూచినదానియందు విశ్వాసము కలవారై యుందురు. వీరిరువురకును కల భేదమిదియె. జ్యోతిశ్శాస్త్ర విషయములో నేను రెండు తెగలవారితోను మాటలాడితిని. సిద్ధాంతభాగమునం దిరువురకును విశేషభేదాభిప్రాయము కానరాదు. నిన్నగాక మొన్న సృష్టిప్రారంభ మనువారుగూడ నిప్పుడు వెనుకకు బోవుచున్నారు. నవీనులు దేశకాల నిర్ణయములయం దాకాశమునందు పరిగణించిన గుర్తులకు ప్రాముఖ్యము నాలోచించిన ప్రాచీనులమార్గమునకు వత్తురు. ఫలితభాగమునందు మాత్ర మిరువురకును సర్వతోపరమాణ్వంతరము కలదు. ఫలితభాగము ప్రకృతిసిద్ధమే కాదని కొందరును, ప్రాచీనకాలమంద లేదని కొందరును, పాశ్చాత్యవిద్య నేర్చినవారిలో ర తెగలు కలవు. నాడీగ్రంథములు నమ్మతగినవి నవనాగరికులలో కొందరిమతముకూడ కలదు.

జ్యోతిశ్శాస్త్రవిషయములను బోధించుటకై ప్రయత్నించుచుంటిమి. జ్యోతిశ్శాస్త్రమందు మనము బోధింపదగిన విషయములలో నాకాశమందు తిరుగు గ్రహనక్షత్రాదులయొక్క స్థితిగతులను గురించి ముఖ్యముగా తెలుపవలయును. అందువిషయమై మనప్రాచీనమహర్షులు మిక్కిలి కష్టపడి యుండిరి. ఒక్కొక్కమహర్షి తన జీవితమునంతయును ప్రత్యేకముగ నొక్కొక్కగోళము యొక్క స్థితిగతులను కనిపెట్టుటకై ధారపోసి యాగోళమునకు తనపేరుగాని తనపూర్వులపేరు గాని పెట్టినటుల సుప్రసిద్ధము. ఆకాశమునందు గల నక్షత్రములలో అగస్త్య, అపాంవత్స, అరుంధతి, రేణుక, బృహత్ప్రాంచిత్, ఆప, మృగవ్యాధ, వైనతేయ, శుని, శౌరి, మొదలగు పేర్లుగల నక్షత్రము లుండుట కిదియే కారణము. మహర్షు లాకాశపరిశీలనము చేసి గోళముల యొక్క చారప్రకృతివికృతిప్రమాణవర్ణకిరణసంస్థాపనము మొదలగువానిని కనిపెట్టిరి. ఆకాశమందు సంచరించు తేజోగోళములయొక్క స్థితిగతులను బట్టి నిర్ణయించినచారాదులకు సుజననృపరంజనమే ప్రయోజనమని కొందరిమతము. నరసులకు ప్రభువులను సంతోషపెట్టుటకై మహర్షులు శాస్త్రకల్పన నొనరించిరనుట యందు సారస్యము లేదు. ఆకాశమందు గ్రహములు మొదలగువాని నడవడికను బట్టి భూగోళమందొక క్రొత్తవింత కలుగుననుటయం దిసుమంతయైనను సందియము లేదు. దానిం దెల్పునది ఫలశాస్త్రము (ఫలితజ్యోతిషము). ఈఫలశాస్త్రము జ్ఞాపకమే గాని కారకము కాదని కొందరిమతము. జ్యోతిశ్శాస్త్రమందలి ఫలితభాగము జీవులయొక్కయు దేశముయొక్కయు నడవడికను చెప్పునదియే గాని మార్పుచేయునది కాదను వాదమువారుగూడ కొంద రుండియున్నారు. ఆకాశమందు గ్రహములు మొదలగువాని నడవడికచేత ప్రపంచము యొక్కయు జీవులయొక్కయు నడవడికయందు క్రొత్త సంగతులు పుట్టుటచేత జ్యోతిశ్శాస్త్రము మార్పుచేయునని కొందఱిమతము. జ్యోతిశ్శాస్త్రము కారకమే గాని జ్ఞాపకము కాదని వీరినిశ్చయము. పైవాదిరువురును అప్రాచ్యపద్ధతులయం దాసక్తి లేనివారు.

"మ్లేచ్ఛాహియవనాస్తేషు సమ్యక్ శాస్త్రమిదంస్థితమ్,
ఋషివత్తేఽపిపూజ్యంతే కింపున ర్దైవవిద్ద్విజః"

అను వరాహునివాక్యమును బురస్కరించుకొని భారతీయులకు బురాతనమునుండియు ఫలితజ్యోతిషము లేదనియు వరాహుడు మొదలగువా రన్యభాషనుండి సంస్కృతభాషలోనికి మార్చిరనియు ఒల్లగ్రుడ్డి బలముగా వాదించువారుగూడ కలరు. వరాహుడు తనగ్రంథమునందు మ్లేచ్ఛులను పెక్కుచోటుల వర్ణించినమాట సత్యము. ఆతడు యవనభాషయందు ఫలితజ్యోతిషమును చదివియుండుట గాని లేక నచట ఆశాస్త్రమును విపులముగ జూచియుండుట గాని జరిగియుండవచ్చును. ఏభాషయందు వరాహుడు ఫలితజ్యోతిషమును విపులముగ జూచియుండెనో నాభాషయొక్క గొప్పతనమును వర్ణించినంతమాత్రమున నంతకు బూర్వమందు తదితరభాషలయం దాశాస్త్రము లేదని సిద్ధించదు. కాశికా రాజకీయసంస్కృతపాఠశాలయందు ప్రధానగణితశాస్త్రాధ్యాపక మహామహోపాధ్యాయ పండితసుధాకరుడను దీర్ఘవృత్తలక్షణమును సంస్కృతభాషయందు వ్రాయబూని తాను యూరపుభాషయం దావిషయమును పూర్తిగా చదివియుండుటచేత నీక్రిందిపద్యమును వ్రాసెను.

"నిరణాయ మయా విచార్య సమ్యగ్బహుధా యూరపుదేశవిజ్ఞవేద్యమ్ ; సిద్ధాంతే యిదంతు యుక్తియుక్తం లఘువృత్తం సురభాషయార్యతుష్ట్యై."

పై పద్యమును చదివినంతమాత్రమున పురాతన భారతీయులకు దీర్ఘవృత్తము తెలియదనిచెప్పుటకు సావకాశముండునా? ఉండదు. దీర్ఘవృత్తమును "త్రివాభిచక్రము"ని పూర్వమందు వాడిరి. పండితసుధాకరుని కాలమందు దీర్ఘవృత్తలక్షణము సంస్కృతభాషయందు నశించియుండుటచేత భాషాంతరమం దాసిద్ధాంతమును బాగుగ నభ్యసించి యుండవచ్చును. వా రభ్యసించిన భాషకు గౌరవ మిచ్చుట విశ్వాససూచకమే గాని వేరు విషయము కాదు.

భరతవర్షమునందు బుట్టినగ్రంథముల నెన్నిటిని దేశాంతరములనుండి తిరిగి సంపాదించి ముద్రింపించుచుంటిమి. పై సుధాకరపండితుడే లల్లాచార్యకృత "శిష్యధీవృద్ధిద" మను గ్రంథమును యూరపుదేశమునుండి సంపాదించి యచ్చొత్తింపించెనని యాగ్రంథముపీఠికయందు,

ప్రాచీనచీనవర చర్చితపుష్పపుర్యా
మాపూర్య పర్యయజ మార్యభటేన వేదమ్;
లబ్ధం తదేవ వరలల్లను ధాషు(సాగ)
ధాం ప్రవాహనికరేణ మహత్త్వమాప. ౧.
సా భాస్కరాదివరవైదిక రాజరేణ
దూవాతిదీనహృదయాంగబలక్షయేన;
ఊత్తీర్య సాగర మహో! మహతో విరాగా
ద్యూరోపదేశ మథ లబ్ధవచస్సుధాఽగాత్. ౨.
తత్రాపి శీతబహులేన జడత్వ మాప్య
కిం వాన్య దేశజనసంగపరా ప్యుత్థా సా;
మాయాభిధానవగరీత ఉపేత్య తూర్ణం
మా పశ్చిపూర్ణనయనా నయనాగరీతా. ౩.
సంశోధ్య వర్ణ మపహృత్య దురక్షరాణి
రూపం విధూయ్య విమలాఖిలవాసనాభిః,
నేయం సుధా నిజకరేణ సుధాకరేణ
విస్తారితా బుధవరా జగతి ప్రసిద్ధా. ౪.

అని పైశ్లోకములచే తెలియుచున్నది. భారతీయ భారతమతల్లిక దేశాంతరములయందును భాషాంతరముల యందును బద్ధురాలై యున్నది. ఆయాతరుణములయందు గల సన్నివేశములచేత వరాహుడు సుధాకరుడు మొదలగువారు వేలువేలు భాషలయందు ప్రాశస్త్యము సంపాదించినను సంస్కృతభాషయందు ప్రాచీనకాలమందు ఫలితజ్యోతిషము మొదలగు విషయములు లేవనుకొనుట ప్రమాదము. ఏకాలమం దు యవనులు మొదలగువారినుండి జ్యోతిశ్శాస్త్రము భారతీయులను మన మభ్యసించితి మనుకుంటిమో ఆకాలమునకు పూర్వమందు వేదము, శ్రీమద్రామాయణము, మహాభారతము మొదలగు గ్రంథములు భారతీయులకు గలవని యొప్పుకొనుచున్నాము కదా! యవనులకంటె పూర్వమందు భారతీయులకు కల శ్రీమద్రామాయణాది గ్రంథములయందు మనము యవనులు మొదలగువారి యొద్దనుండి నేర్చుకొనియుంటి మనుకొనిన విషయములుండిన సంశయము తీరగలదు. చిత్తగింపుడు. ప్రస్తుతమందు ఫలితజ్యోతిషమునుగూర్చి వ్రాయబూనితిని. ఫలితజ్యోతిషము భారతీయులకు పూర్వకాలమందులేదు. గ్రీకులనుండి నేర్చుకొనిరనికదా యూహ. శ్రీమద్రామాయణకాలమందు ఫలితజ్యోతిషము సంపూర్ణ ప్రకీర్తిత్వము నొందియున్నదని నేను జూపగలను, జాతక, ముహూర్త, శకున, సాముద్రిక, వాస్తు, కేరళ (లక్షణ, స్వప్న, సంకీర్ణ) భాగములను కదా ఫలితజ్యోతిషమునందు వాడుచుంటిమి. ఈమొదలగునవన్నియు శ్రీమద్రామాయణము మొదలగువానియందు గలవు.

జాతకభాగము

"తత శ్చ ద్వాదశే మాసి చైత్రే నావమికే తిథౌ
నక్షత్రే దితిదైవత్యే స్వోచ్చసంస్థేషు పంచసు
గ్రహేషు కర్కటే లగ్నే వాక్పతా విందునా సహ
ప్రోద్యమానే జగన్నాథం సర్వలోక నమస్కృతమ్
కౌసల్యాజనయ ద్రామం సర్వలక్షణసంయుతమ్;

* * * *

పుష్యే జాతస్తు భరతో మీనలగ్నే ప్రసన్నధీః
సార్పే జాతౌ తు సౌమిత్రీ కుళీరేఽభ్యుదితే రవౌ

* * * *

కళ్యాణే బత నక్షత్రే మయిజాతోఽసి పుత్రక.
యేన త్వయా దశరథో గుణై రారాధితః పితా.

శ్రీమద్రామాయణము బాలకాండ ౧౮ వ సర్గ.

పైశ్లోకములనుండి శ్రీమద్రామాయణ కాలమందు జాతకభాగము ఎక్కువ ప్రచారములో నుండెనని తెలియుచున్నది. "కళ్యాణే బతనక్షత్రే" అను శ్లోకమును బట్టి చూచిన శ్రీసామాన్యము సంభాషణమందు గూడ జాతకభాగము ప్రచారములో నున్నట్లు తెలియుచున్నది. "తండ్రీ! కుమారకా! నా గర్భమునందు మంచి నక్షత్రమున బుట్టితివి" అనికౌసల్యాదేవి శ్రీరామచంద్రమూర్తిని స్తుతించుచున్నది. జాతకభాగము వృద్ధిలో నున్నదని చెప్పుట కింతకంటె ప్రమాణము లక్కరలేదు.

ముహూర్తభాగము

"లక్ష్మణాగచ్ఛ భద్రం తే ఊర్మిళా ముద్యతాం మయా
ప్రతీచ్ఛ పాణిం గృహ్ణీష్వ మాభూత్కాలస్య పర్యయః."

శ్రీ. రా. బాలకాండ ౭౩ వ సర్గ.

"తస్మాత్త్వం పుష్యయోగేన యౌవరాజ్య మవాప్నుహి;
ఉదితే విమలే సూర్యే పుష్యే చాభ్యాగతేఽహని.

అయోధ్యాకాండ ౩ వ సర్గ.

లగ్నే కర్కటకే ప్రాప్తే జన్మ రామస్య సంస్థితే;
అభిషేకాయ రామస్య ద్విజేంద్రై రుపకల్పితమ్.

౧౫ వ అ. కాం. సర్గ.

చూచితిరా! "లక్ష్మణాగచ్ఛ భద్రం తే" అను శ్లోకము లక్ష్మణస్వామిని గూర్చి జనక చక్రవర్తి పలు

మున్నది. "నా బిడ్డయగు ఊర్మిళ కరగ్రహణ మొనరింపుము. జాగు వలదు" అని యాతనితో పలుకుచుండెను. "మాభూత్కాలస్య పర్యయః", 'ముహూర్త కాలము మించును గనుక విలంబము వలదు' అని జనక చక్రవర్తి యాశయము. ఇటులే ముహూర్తభాగమును గురించి శ్రీమద్రామాయణమునం దెన్నెన్ని విషయములో కలవు. గ్రంథము పెరుగునన్న భయముతో నిచట వ్రాయలేదు.

శకునభాగము

అపిచాద్యాఽశుభాన్ రామ! స్వప్నాన్ పశ్యామి దారు
సనిర్ఘాతా దివోల్కా చ పతతీహ మహాస్వనా.| ణాన్;
అవష్టబ్ధం చ మే రామ! నక్షత్రం దారుణైర్గ్రహైః;
ఆవేదయంతి దైవజ్ఞా స్సూర్యాంగారకరాహుభిః.
ప్రాయేణ హి నిమిత్తానా మీదృశానాం సముద్భవే;
రాజా వా మృత్యు మాప్నోతి ఘోరాం వాపదమృచ్ఛతి.
అద్యచంద్రోఽభ్యుపగతః పుష్యాత్పూర్వం పునర్వసుమ్;
శ్వః పుష్యయోగం నియతం వక్ష్యంతే దైవచింతకాః
తతః పుష్యేఽభిషించస్వ మన స్త్వరయతీవ మామ్.

రా. అయోధ్యాకాండ ౪ వ సర్గ

దివ్యం తరిక్షే, భూమౌ చ ఘోర ముత్పాతజం భయమ్
సంచచక్షే చ మేధావీ శరీరే చాత్మనో జరా.

అయోధ్యాకాండ ౧ వ సర్గ.

"శ్రీ రామచంద్రమూర్తితో దశరథమహారాజు చెప్పుచున్నాడు. ఓ రాముడా! ఇప్పుడు నాకు స్వప్నమందు పెక్కు చిక్కులు కానంబడుచున్నవి. మరియు పగలు నక్షత్రములు పడుట మొదలగు దుశ్శకునములు కానంబడు చున్నవి. లోకమందిట్టి నిమిత్తములు కనిపించిన వెంటనే రాజు మృతినొందుట గాని పెద్ద యాపత్తును పొందుటగాని సంభవించును గనుక ఎల్లి పుష్యనక్షత్రమున నిన్నభిషిక్తునిగా జేసెదను."

పైవిషయములనుబట్టి శ్రీమద్రామాయణ కాలమందు నిమిత్తములంబట్టి రాబోవుఫలములను నిర్ణయించుట పరిపాటిగా నున్నటుల దోచును.

తథా గతాం తాం వ్యథితా మనిందితాం
వ్యపేతహర్షాం పరిదీనమానసామ్;
శుభాం నిమిత్తాని శుభాని భేజిరే
నరం శ్రియా జుష్ట మివోపజీవినః.
తస్యాః శుభం వామ మరాళపక్ష్మ
రాజీవృతం శుక్లవిశాలకృష్ణమ్;
ప్రాస్పందతైకం నయనం సుకేశ్యా
మీనాహతం పద్మ మివాభితామ్రమ్.
భుజశ్చ చార్వంచితపీనవృత్తః
పరార్థ్యకాలాగరుచందనార్హః;
అనుత్తమే నాధ్యుషితః ప్రియేణ
చిరేణ వామః సమవేపతాశు.
గజేంద్రహస్తప్రతిమశ్చ పీనః
తయోర్ద్వయోః సంహతయోస్సుజాతః;
ప్రస్పందమానః పునరూరురస్యా
రామం పురస్తాత్ స్థిత మాచచక్షే.
శుభం పునర్హేమసమానవర్ణ
మీషద్రజోధ్వస్త మివామలాక్ష్యాః;
వాసః స్థితాయాః శిఖరాగ్రదంత్యాః
కించిత్పరిస్రంసత చారుగాత్ర్యాః.
ఏతైర్నిమిత్తై రపరైశ్చ సుభ్రూః
సంబోధితా ప్రాగపి సాధుసిద్ధైః;
వాతాతపక్లాంతమివ ప్రణష్టం
వర్షేణ బీజం ప్రతిసంజహర్ష.
తస్యాః పునర్బింబఫలాధరోష్ఠం
స్వక్షిభ్రుకేశాంతమరాళపక్ష్మ;
వక్త్రం బభాసే సితశుక్లదంష్ట్రం
రాహోర్ముఖాచ్చంద్ర ఇవ ప్రముక్తః."

సుందరకాండ ౨౯ వ సర్గ.

సీతాదేవికి ఎడమకన్నదరెను. ఎడమభుజ మదరెను. ఎడమతొడ యదరెను. పైటకొంగు జారెను. ఈ మొదలగు శకునములు శ్రీ రామచంద్రమూర్తిని శీఘ్రకాలములో వచ్చువానిగా జెప్పుచున్నవి. అనికదా పైశ్లోకముల తాత్పర్యము. మనుష్య సామాన్యముగా పైశకునములు యోగసూచకములని యెఱిగియున్నదే.

"అథచాపి మహాప్రాజ్ఞ! బ్రాహ్మణానాం మయా శ్రుతమ్
పురా పితృగృహే సత్యం వస్తవ్యం కిల మే వనే.
లక్షణేభ్యో ద్విజాతిభ్య శ్శ్రుత్వాహం వచనం గృహే
వనవాసకృతోత్సాహా నిత్య మేవ మహాబల!

ఆదేశో వనవాసస్య ప్రాప్తవ్య స్స మయా కిల;
సా త్వయా సహ తత్రాహం యాస్యామి ప్రియ నాన్యథా!"
(సాముద్రికము) అయోధ్యాకాండ ౨౯ సర్గ.

శ్రీరామచంద్రమూర్తి అరణ్యమున కేగుచుండగ సీతాదేవియును పైన వచ్చెను. రామచంద్రమూర్తి ఆ విప్రయాణమును వారింపుచుండగ నామె పలుకుచున్నది. 'పూర్వమందు నేను పితృగృహమం దుండగ సాముద్రికశాస్త్రజ్ఞు లరుదెంచి నాలక్షణంబులంబట్టి ను నాలుగు వత్సరంబు లరణ్యవాసము నుడిరి. నేను ను దానిఫల మనుభవింపవలెను గనుక తప్పక వచ్చెద' నని శ్లోకములయం దున్నది.

"విపులాంసో మహాబాహుః కంబుగ్రీవ శ్శుభాననః;
గూఢజత్రు స్సుతామ్రాక్షో రామో దేవిజనై శ్శ్రుతః.
దుందుభిస్వననిర్ఘోష స్స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్;
సమ స్సమవిభక్తాంగో వర్ణం శ్యామం సమాశ్రితః.
త్రిస్థిర స్త్రిప్రలంబశ్చ త్రిసమ స్త్రిషు చోన్నతః;
త్రితామ్ర స్త్రిషు చ స్నిగ్ధో గంభీర స్త్రిషు నిత్యశః.
త్రివలీవాం స్త్ర్యవనత శ్చతుర్వ్యంగ స్త్రిశీర్షవాన్;
చతుష్కల శ్చతుర్లేఖ శ్చతుష్కిష్కు శ్చతుస్సమః.
చతుర్దశసమద్వంద్వ శ్చతుర్దంష్ట్ర శ్చతుర్గతిః;
మహోష్ఠహనునాస శ్చ పంచస్నిగ్ధోష్టవంశవాన్.
దశపద్మో దశబృహ త్త్రిభి ర్వ్యాప్తో ద్విశుక్లవాన్
షడున్నతో నవతను స్త్రిభి ర్వ్యాప్నోతి రాఘవః."
సుందరకాండ. ౩౫ సర్గ.

ఆంజనేయస్వామి సీతాదేవితో విశ్వాసముకొ కు శ్రీరామచంద్రమూర్తివారి రూపరేఖా విలాసాదిక లను చెప్పుచున్నాడు పై శ్లోకములయందలి లక్షణము న్నియు సాముద్రిక పరిభాషలోనే యున్నవి.

లక్ష్మణా! నయ దారూణి దృఢాని చ వరాణి చ;
కురు ష్వావసథం సౌమ్యం వాసే మే భిరతం మనః.
తస్య తద్వచనం శ్రుత్వా సౌమిత్రి ర్వివిధాన్ ద్రుమాన్;
ఆజహార తత శ్చక్రే పర్ణశాలా మరిందమః.
తాం నిష్ఠితాం బద్ధకటాం దృష్ట్వా రామ స్సుదర్శనామ్;
శుశ్రూషమాణ మేకాగ్ర మిదం వచన మబ్రవీత్. [మ్;
ఐణేయం మాంస మాహృత్య శాలాం యక్ష్యామహే వయ
క ర్తవ్యం వాస్తుశమనం సౌమిత్రే! చిరజీవిభిః.
మృగం హత్వానయ క్షిప్రం లక్ష్మణేహ శుభేక్షణ!
క ర్తవ్య శ్శాస్త్రదృష్టో హి విధి ర్ధర్మ మనుస్మర.
భ్రాతు ర్వచన మాజ్ఞాయ లక్ష్మణః పరవీరహా;
చకార స యథో క్తం చ తం రామః పున రబ్రవీత్
ఐణేయం శ్రపయ స్వైతత్ శాలాం యక్ష్యామహే
వయం. [యమ్;
త్వర సౌమ్య! ముహూర్తోయం ధ్రువశ్చ దివసోఽప్య
వాస్తుసంశమనీయాని మంగళాని ప్రవర్తయన్.
వేదిస్థలవిభాగాని చైత్యాన్యాయతనాని చ;
ఆశ్రమస్యానురూపాణి స్థాపయామాస రాఘవః."
వాస్తు. అయోధ్యాకాండ. ౫౬ సర్గ.

"తాం వృక్షపర్ణచ్ఛదనాం మనోజ్ఞాం
యథాప్రదేశం సుకృతాం నివాతామ్;
వాసాయ సర్వే వివిశు స్సమేతా
స్సభాం యథా దేవగణా స్సుధర్మామ్."

పై శ్లోకములను బట్టి శ్రీరామచంద్రమూర్తివారు వాస్తుశాస్త్రప్రకారము పర్ణశాలను నిర్మింపజేసెననియు శాస్త్రము నతిక్రమింపక గృహప్రవేశ మొనరించెననియు తెలియుచున్నది.

ఈప్రకారముగనే శ్రీమద్రామాయణమున ఫలిత జ్యోతిషప్రచారము పెక్కుస్థలములయందు గలదు. ఇందునుండి శ్రీమద్రామాయణకాలమందే మనభారతీయులు ఫలితజ్యోతిషముయొక్క ప్రచారమందు నిపుణులని తెలియుచున్నది.

ఇప్పటిసన్నివేశములనుబట్టి జ్యోతిశ్శాస్త్రస్వరూపమును చెప్పబూనినవారు ముందుగ ఫలితభాగమునుంచి సిద్ధాంతగణితభాగముల కేగవలయును. కనుక నింతకుంచె ప్రాచీనులఫలితజ్యోతిషజ్ఞానమునుగురించిముచ్చటించితిని. ముందు ఫలితజ్యోతిషమునుగురించి ప్రత్యేకముగ నొక్కొక్కభాగమునుగురించి విపులముగ వ్రాసెదను.

సర్వావనందము నంగీకరించి భాషాసాంప్రదాయములను కవివాగాడంబరములను విడనాడినందులకు భాషాభిమానులు మన్నింతురుగాక!

ప్రేమతత్త్వము

మల్లాది సూర్యనారాయణశాస్త్రి గారు

ప్రేమతత్త్వనిరూపణము

(ప్రథమభాగము)

అదనెఱిఁగి కుమారులకును,

సదమలమతి బోధచేసి చదివించినచోఁ

జదువను మఱగినవారల,

మది యూఁగుచి వదలి వెనుక మరలదు కనుఁడీ!

సీ. రఘువంశరసము నారంభించు రసన నై, షధమాధురిం గ్రోలసాగకున్న?
దశకుమారచరిత్ర దరిసించుకన్నులు, కాదంబరీశోభఁ గాంచకున్న?
శాకుంతలోత్తరచరిత భూషితబుద్ధి, ముద్రాదులనువాల్చి మురియకున్న?
కువలయానందంబుగోను మది గంగాధర ప్రకాశంబులఁ గ్రాలకున్న?
గీ. దివ్యరామాయణ సరస్వతీమహేతి, హాసపారాయణ పరాయణాననంబు
మఱచునే బుధసంస్తూయమానచరిత, భాగవతభార తేందిరా ప్రార్థనంబు?

చ. కనుగొన దిక్ప్రదర్శనముగా వచియించితిఁగాని సంస్కృతం
బున ననురక్తిఁ గాంచుమనముం దమనంకకు లాగునట్టి క
ల్పనపదసౌష్ఠవంబు రసభావసమృద్ధియు సాచితీగుణం
బెనసిన గ్రంథరాజముల నెన్నిటి నియ్యెడ నెన్నవచ్చెడిన్?

సీ. అలపెద్దనార్యు తియ్యనిపల్కు లాలించి, భట్టుచిక్కని పలుకుపల్కు లెఱిఁగి
కృష్ణరాయలప్రౌఢ గీర్భావ మూహించి, ధూర్జటీవాక్య మాధుర్యమాని
నందితిమ్మనమాటలందంబు తిలకించి, నరసింహానుజులు కర్ణములఁ గ్రోలి
రామభద్రునివచోరామణీయక మెచ్చి, రామకృష్ణునివచః ప్రౌఢి వ్రాలి
అబ్బనకవిమనోహరభాష హర్షించి, తమ్మయ్యవచన సౌందర్య మరసి
శంకరకవివాక్యసంపత్తి గుర్తించి, కారనముఖ్యులు గౌరవించి
వేంకటపతిపల్కు విన్నాణములు గాంచి, వేంకటకవివచో విభవ మెంచి
నారాయణోక్తి ప్రచారచాతురిఁ గాంచి, యితరసత్కవివాక్కు లెఱిఁగి తిరిగి
సూరనార్యునిక్రొత్త సొంపులింపులు నేర్చి, వీరభద్రునివాణి వినుతి చేసి
శ్రీనాథకవినాథు సింగారములు కేర్చి, పోతనార్యునిభక్తిఁ బూజచేసి

రంగనాథునినవారంభరంగముఁజొచ్చి, భాస్కరాదులరామభక్తిఁ బొగడి
సోమునిమహిమంబుచూచి చేతులుమోడ్చి, కేతనాదులమహాఖ్యాతి కలరి

గీ. ఎందఱెందఱసూక్తు లింకెన్ని యేని, యరసివచ్చు కుమారవిద్యానురక్తి
తుట్టతుదకుఁ గవిత్రయధుర్యభవ్య, దివ్యవాణీ సుధాంబుధిఁ దేలకున్నె!

గీ. విద్యనేర్చుట సదసద్వివేకమూల, మైన యాముష్మికంబున కనుట సత్య
మైన, నయ్యది ధనమూలమైన కేవ, లైహికంబున కుపయుక్త మగుచునుండె.

మ. పరసారస్వతనీరధిం దఱచి తద్భావామృతం బాని బా
లురు నిర్నిద్రమతిం బఠించి కృతార్థుల్ గాకోకో! కాని యొ
క్కరుఁ డెవ్వండయినన్ సహస్రశతసంఖ్యన్ దానిఁ బ్రేమించినన్
బరమార్థంబున కెల్ల వారలయభిప్రాయంబు వీక్షింపుఁడీ!

మ. పురవాసశ్రమ మర్థనాశనమనోబుద్ధిశ్రమల్ సైఁచి దు
ర్భరనిర్బంధనిబంధనాంగలకలాభ్యాసంబు గావించుచుం
డురుగాదే యిపుడెల్లవారు కులవృత్తుల్ గూడఁ ద్రెడించి దు
ష్కరసేవాకలితాధికారధనభోగఖ్యాతికామంబులన్!

గీ. కాని యానందమునుగూర్చి మానసంబు, ధనము భోగంబు సమకూర్చి తనువుఁ దనిపి
యలరఁ జేయునుగాన విద్యానురక్తి, యిరుతెఱంగుల నాత్మార్థమే నిజంబు.

క. ఈగతిఁ గౌమారము వడి, నేగడిలటి యౌవనంబు నేతెంచుఁ దనూ
భోగానురక్తి కప్పుడు, లోఁగుదు రెల్లరును గామలోలుపబుద్ధిన్.

గీ. ఇదియె నైసర్గికప్రేమ యెనయునట్టి, నాలుగవమార్పు, దీనిచందం బభూత
పూర్వ, మిదిగాదె లౌకికపూరుషార్థ, కామధామంబు దంపతిప్రేమ మనఁగ.

క. చదువనివారని చక్కఁగఁ, జదివినవారనుచు శంకసలుపక మోఁడాఁ
డుదియని యెంచక యౌవన, పద మెల్లరమదుల నొక్కమాడ్కిఁ గలఁచుఁగా!

సీ. నవనవోన్మేషమానసనారసంబుఁ జం, దఱ సేయు మత్తదంతావళంబు,
విద్యావివేకపుష్పితబుద్ధివల్లరి, నూఁచముట్టుగ నూఁచునోరుగాలి,
లోకవృత్తాంత మాలోకింప వికసించు, కండ్లోయి బంధించు గాఢతమము,
సత్కథాకర్ణనాసక్తకర్ణములోన, శృంగారమంత్రంబు చెప్పుగురువు,
వినయనయధర్మయవిధులార్చు వేడపురుగు, కుటిలసాహస విధిఁ గూర్చు కుంటసేఁడు,
మంచిచెడ్డలు మఱపించు మత్తుమందు, నగుచుఁ బొడసూపు నభినవ యౌవనంబు.

చ. పారవిహీన ముద్ధత మపాయపరీతము నైన ఘోరసం
సారముఁ జొచ్చు జీవి సహజంబుగ జవ్వనమందు దానికిం
గారణ మాశరీరసుఖకాంక్షయె దానికి సాధనం బగుం
గోరినకాంత కాంతునకుఁ గోరినకాంతుఁడు కాంత కబ్బుటల్.

చ. పరిణయనిశ్చయం బనెడిభాగ్యము నాటినయట్టి విత్తులై
కరమును బట్టువేళ మొలకల్ వొడమం జిఱునవ్వుచూపులన్
బెరిఁగి తలంపు సిగ్గు గనిపించురసోక్తులఁ బూచి యవ్వధూ
వరహృదయానురాగరసవల్లులు కూడికఁ గాచు నేకమై.

సీ. ప్రాణనాయికమేను బంగారుబొమ్మగాఁ, సింగార మొనరించి పొంగువారు
కాంతాంగవల్లరి కాంచనవల్లిగాఁ, గాంచి యానందంబు గాంచువారు
మంజుభాషిణిపల్కు మాధ్వీరసంబుగాఁ, గ్రోలి మైమఱపునఁ దూలువారు
హరిణాంకవదనయపాంగవీక్షారేఖ, తమభాగ్యరేఖగాఁ దలఁచువారు
గీ. పక్వబింబాధరోష్ఠచుంబనఫలంబు, తనువు లెత్తినఫలముగాఁ దలఁచువారు
గాఁగ జాయానురాగసంక్రాంతహృదయు, లగుచు నానంద మొందనిమగలు గలరె?

సీ. భావజాతత్రపాబహుమానవలమాన, దరమానవీక్షణోదరములందు
జీవారుణాధరాంచితలాసవిలాస, దరహాసచంద్రికోదరములందు
వరకుందవాసనాభాసమానాసమా, దరవేషధారణోదరములందుఁ
బరిహాసపరిరంభపరిచితాదరచితా, దరనర్మభాషణోదరములందు
గీ. రూఢగాఢాతిగాఢసంవ్యూఢమగుచుఁ, గానవచ్చెడిస్వీయముగ్ధానురాగ
వల్లరులఁ బెంచుననుకూలవల్లభులకు, స్వాదుశృంగారరసఫలాస్వాద మరుదె?

చ. తరుణము వేచి కూర్చుసుఖదాయకభోజనపానశయ్యలన్
సరసవచోవిలాసములఁ జందనచర్చలఁ గమ్మతావిక
ప్పురపు విడెంబులన్ వలపు పొంగఁగఁ దన్పుచు మానినీమణుల్
వరులకుఁ గూర్చుచుందు రనవద్యగుణాభరణాభిరామలై.

చ. చెలువము దీర్చు మేల్నగలు చీరలు రైకలు లేకయున్న న
గ్గలి మెయి దాల్చి యందమున మించె నొకో యనఁ గొంద ఱంగనల్
చెలువ్రలఁ గూర్మిఁ గాంచి సుఖలీలలఁ దేలుదు రెందు నాథులన్
వలచినభామినీమణులు భాగ్యము భోగ్యము లెన్నఁజాలు రే?

చ. కులమును శీలముం బలుకుఁ గోర్కియు నొక్కటి గాఁగఁ జిత్తముల్
గలిసినదంపతుల్ సమముగాఁ జవిగొందురు ప్రేమబద్ధులై
కలిమియు లేమియున్ సుఖముఁ గష్టము నెల్లయవస్థలందు మే
నుల నెడఁబాయునంతకు వినోదవిషాదము లారగించుచున్.

ఉ. ఎంతటికష్టమైనను సహింతురు కూరిమి గల్గు కాంతలున్
గాంతులు గూడి కష్టములు గాఁపుర ముందునె యంచుఁ జిత్తవి
శ్రాంతి యొనర్చుకొంచును బరస్పరభావిసుఖాభిలాషఁ దుః
ఖాంతమునన్ సుఖంబు గనునాసలు నైజము గావె జీవికిన్?

గీ. అతికి యతుకనియ ట్లుండునాలుమగల, యంతరంగంబు లొకటిగా నదుకఁజాలు
నందనానందరసము చెందంబు లారఁ, గ్రోలి సుఖయింత్రు దంపతుల్ కూర్మి వెలయ.

సీ. కొడుకుఁ గూఁతుల నెత్తికొని నెత్తిఁ గొని యాస్యమున నద్దుకొని ముద్దుగొనెడువారు
లాలారసస్యందిబాలాంగపరిరంభ, లీలాసుఖంబులం దేలువారు
పుత్రులతొక్కునవ్వులు చిల్కు తేనియ, లొల్కుపల్కులు విని కుల్కువారు
మందమందానందకందబాలక్రీడ, లందంబుఁ గని వేడ్క నందువారు
గీ. ఐహికాముష్మికసుఖంబు లంద దిక్కు, నందనులె యంచు నానంద మొందువారు
గాఁగఁ గడగండ్లు వడి వారిఁ గాచునట్టి, జంతులపుత్రపూర్ణవాత్సల్య మరుదె?

క. ఈమెయి వడి నుచితంబుగఁ, బ్రేముడి సత్త్వాంశ మొప్ప వెలయుచు నడుమన్
గామక్రోధగతం బయి, తామస మయి లోక మెల్ల దండడివెట్టున్.

ఉ. దారసుతాదిబంధము యథార్థముగా నెటె నమ్మి వారి కె
వ్వారికి నెట్టిలోపము సహాయము రాఁ దగ దంచు నెన్నియో
దారుల వారికిన్ సుఖము దార్పఁగ నెంచుచు వారె తాముగా
వారియుపాయమే తమయుపాయముగాఁ గనుచుండరే జనుల్?

చ. ఒకనికి నొక్కఁడే కొమరుఁ డుండెను బో తన కౌసుమారుఁడే
సకల మటంచు వాఁడు కడుసంతస మందును గాన వాని ప్రే
మకుఁ గుదు రాసుతుం డతఁడు మై విడనాడిన వానిఁబొంది తం
డ్రికిఁ గనుపట్టు నెల్లపుడుఁ బ్రేమపుటుయ్యెల నూఁగులాడుచున్.

చ. కొమరులు నల్వు రుండి రనుకొందము వారలలో నొకండు కా
లముగతి నొంది తండ్రి యుదిలంగొన నాప్తులు వచ్చి యున్నగా

కొమరులఁ జూచికొమ్మ మదిఁ గుందకు మన్నను ప్రేమసూత్రబం
ధము మృతపుత్రుతోఁ దెగునెడన్ మఱియింత బిగింప కుండునే?

చ. తనయుఁడు తప్పుదారిఁ బడి ద్రవ్యము దుర్వ్యయ మాచరించుచున్
దన కపకీర్తి తెచ్చె నని తండ్రి వగన్ విసుఁగెత్తి వీఁడు చ
చ్చిన మఱి చావ నిమ్మనుచుఁ జేరఁగ నీయఁడు కొంప కప్పుడా
చెనఁటికిఁ గీడు మూఁడె నని చెప్పినచోఁ బిత పర్వులెత్తఁడే?

ఉ. పిల్లలు తీవ్రరోగపరిపీడన మొందినవేళ వారిపా
ల్మెల్లను వేంకటేశ్వరున కిచ్చెద మంచును జబ్బు మళ్లినన్
జల్లఘటంబు మేఁకలను జాతర కిచ్చెద మంచు దేవికిన్
దల్లులు మ్రొక్కుకొందురుగదా! కనుఁ డీతనయానురాగముల్.

గాఢప్రేమ

క. ఒకమొఱ నాటిన ప్రేమం, బకలంకము గాఢమును నహార్యము సహజం
బకుటిల మై యొప్పుచు వె, న్కకు వెంజీయఁ బోదు దానికార్యము గనుఁడీ!

చ. మరణము వాసినంత నొకమానిని భర్తపదంబు లంటి యీ
చరణసరోజసేవ నిహసౌఖ్యము గాంచు ఋణంబు తీఱె నీ
స్మరణమె యింక నాకుఁ బరసౌఖ్య మొసంగెడు నంచు బాష్పసం
చరదనురాగదృష్టిఁ గడసారిగఁ గన్గొని చేరె నాకమున్.

చ. పరమతిశీలవృత్తిసమభావసమంచితదంపతిద్వయిన్
బరమపదంబుఁ జేరె నెలప్రాయమునం దలసాధ్వి యాసతీ
విరహవిషాదసాయకవిభిన్నమనస్కుఁడు నామెదీర్ఘసం
దరనయనానురాగకలఁ దత్ప్రతిమం గనుచుండు నెప్పుడున్.

చ. ఒకనిరుపేదవాఁడు మృతినొందినప్రేయసిదేహ మేటియం
తికముఁ బూడ్చి యం దరుఁగు దీఁచి నిచ్చ గడించుకూలి నిం
చుక నొకపండు పూలు గొని సూనునిఁ గూడి దినాంతవేళ వే
దికకడ కేగి యం దిడి సతిన్ స్మరియించు నదెంతకూర్మియో!

చ. తరుణవయస్కుఁ డుత్తముఁ డుదారమనస్కుఁ డపుత్రుఁ డర్థసం
భరితుఁ డొకండు సాధ్వి యగుభార్య గతించినయంత వెండియున్
బరిణయ మాడ కాత్మసుఖవాంఛల నన్నిటి వీటిఁబుచ్చి యా
మరణము [illegible]!

ధర్మతత్త్వము

పండిత నేమాని వేంకట నరసింహశాస్త్రి గారు, కావ్యతీర్థ

"ధరతిలోకాన్ ధ్రియతే పుణ్యాత్మభి రితి వా
ధర్మః" అను వ్యుత్పత్తులవలన నిశ్శ్రేయస
ద్ధి కలిగించునది ధర్మము. ఆచార్యప్రేరిత
లగు యాగాదులను జేయుటయే ధర్మ
ని జైమినికృత మీమాంసాదర్శనమందుఁ
ండు.

"...మేవ శ్రేయస్కరస్సఏవధర్మశబ్దేనోచ్యతే"

(మీమాంసా ౧-౨ సూత్రభాష్యం)

ఏది మంగళజనకమో యదియే ధర్మము.
రణానంతర మేదియు వెంటరాదు కాని ధర్మ
మొక్కటియె యనుసరించును. ధర్మము
త్రునివంటిది.

"...ఏవ సుహృద్ధర్మో నిధనేఽప్యనుయాతియః,
శరీరేణ సమంనాశం సర్వమన్యత్తుగచ్ఛతి."

హితోపదేశము.

ధర్మము వేరువేరువర్ణములవారికి వేరు
విధముగ నుండును. ఏకార్యానుష్ఠానము
బ్రాహ్మణులకు ధర్మమో యది క్షత్రియుల
ధర్మము. ఏదియది క్షత్రియులకు ధర్మమో
భూసురుల కధర్మము. వర్ణానుకూలమైన కార్యము ధర్మము. వర్ణప్రతికూల కార్యమధర్మము. వ్యాఘ్రము జీవహింసఁ జేయును. అదియే దానికి ధర్మము. మానవుఁడు జీవహింసను గావించిన వానిధర్మమునకు విరుద్ధము. సమాజము ననుసరించి కార్యకరణము సమంజసము. వర్ణాశ్రమములకు ధర్మములు భిన్నభిన్నములుగా నుండును. ఆధర్మసంచయము నాచరింపకుండిన నాశ్రమధర్మముల నుల్లంఘించినవా రగుదురు. ఆశ్రమధర్మములను బాటింపకుండుట యధర్మము. బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్న్యాస మను నాలుగాశ్రమములు హిందూమతమునఁ గలవు. అట్టి చతుర్విధాశ్రమధర్మముల నాచరించిన మోక్షము చేకూరును.

"సర్వేషామపి చైతేషాం వేదస్మృతివిధానతః, గృహస్థ ఉచ్యతే శ్రేష్ఠః సత్రీనేతాన్ బిభర్తి హి"

(మనుస్మృతి)

ఆశ్రమచతుష్టయములోను గృహస్థాశ్రమ మత్యుత్తమము. కుటుంబి, బ్రహ్మచారిని,

వానప్రస్థుని, యతిని బోషించును. ఆశ్రమ ధర్మము లీక్రింద నుదాహరింపఁబడినవి.

"చతుర్భిరపిచైవైతే నిత్యమాశ్రమిభి ర్ద్విజైః, దశలక్షణకో ధర్మస్సేవితవ్యః ప్రయత్నతః; ధృతిః క్షమా దమో உస్తేయం శౌచ మింద్రియనిగ్రహః, ధీర్విద్యా సత్య మక్రోధో దశకం ధర్మలక్షణం; దశ లక్షణి ధర్మస్య యే విప్రా స్సమధీయతే, అధీత్య చానువర్తంతే తే యాంతి పరమాం గతిమ్." (మనుస్మృతి)

ధృతి, క్షమ, దమము, అస్తేయము, శౌచము, ఇంద్రియనిగ్రహము, ధీ, విద్య, సత్యము,అక్రోధము ననునవి ధర్మలక్షణములు. ఈ దశలక్షణములు గలవాఁ డుత్కృష్టగతి నొందును. ఇవి యన్నివర్ణములవారికి అన్నియాశ్రమములవారికి నాచరణీయములు. బ్రహ్మచర్యము, సత్యము, తపస్సు, దానము, నియమము, మొదలగు ధర్మాంగములచేత ధర్మ మభివృద్ధినొందును.

"అద్రోహశ్చా ప్యలోభశ్చ దమో భూతదయా తపః, బ్రహ్మచర్యం తప స్సత్య మనుక్రోశః క్షమాధృతిః, సనాతనస్య ధర్మస్య మూల మేత ద్దురాసదమ్."

(మత్స్యపురాణము)

అద్రోహము, అలోభము, దమము, భూతదయ, బ్రహ్మచర్యము, సత్యము, అనుక్రోశము, క్షమ, ధృతి మొదలగునవి సనాతనధర్మమూలములు.

"శ్రాద్ధకర్మ తపశ్చైవ సత్య మక్రోధ ఏవచ, స్వీయదారేషు సంతోష శ్శౌచం విద్యా నసూయతా, ఆత్మజ్ఞానం తితిక్షాచ ధర్మ స్సాధారణో నృప!"

శ్రాద్ధకర్మ, వ్రతము, అనఁగా స్నానము, దానము, పూజ, హోమము, జపము, సత్యము, అక్రోధము, స్వీయదారసంతోషము, విశుద్ధత, విద్య, అసూయారాహిత్యము, ఆత్మజ్ఞానము, తితిక్ష మున్నగునవి సాధారణ ధర్మములు.

ఆర్యు లెద్దాని నాచరింతు రదియె ధర్మము. ఆగమవేదులు దేనిని గర్హింతు రది యధర్మ మని విశ్వామిత్రునిమతము.

"యమార్యాః క్రియమాణం వై సంతో హ్యాగమవేదినః, స ధర్మోయం విగర్హంతి త మధర్మం ప్రచక్షతే."

ధర్మశబ్దమున కిట్టి యర్థములు గలవు. ధర్మశబ్దము సంస్కృతభాషాపదము. గీర్వాణ భాషయం దీశబ్దమున కేయేయర్థములు గలవో యవియన్నియు నాంధ్రభాషలో వ్యవహరింపఁబడుచున్నవి. అతిప్రాచీన మైన ఋగ్వేదమం దిటులు ధర్మశబ్దనిర్వచనము గలదు.

"త్రీణిపదావిచక్రమే విష్ణుర్గోపా అదాభ్య అతోధర్మాణి" (ఋక్)

పరమేశ్వరుఁ డాకాశమధ్యమున త్రిపాదపరిమితిగల స్థానమును నిర్మించి లోకములు సకలధర్మములను ధరించునటుల నొనర్చుచున్నాఁడు. ఇచ్చట ధర్మశబ్దమునకు జగన్నియామక మైన నియమసమూహ మని యర్థము.

మనుస్మృతి ద్వితీయాధ్యాయమున ధర్మ విచారణ యిటులు చేయఁబడినది. రాగద్వేషములు లేని విద్వాంసులు సమాజములో నే నియమమును బాలించునో యదియే ధర్మము.

పురాణములయందును శాస్త్రములయందును ధర్మశబ్దమున కేకార్థము కల్పింపఁబడక భిన్నార్థములు గల్పింపఁబడినవి.

"అహింసాలక్షణో ధర్మో హింసా చాధర్మలక్షణా" (మహాభారతము)

"విహితక్రియయా సాధ్యో ధర్మః పుంసాం గుణో మతః, ప్రతిషిద్ధక్రియాసాధ్యస్సగుణో ధర్మ ఉచ్యతే" (ధర్మదీపిక)

ఏకార్యమువలన మానవసమాజమునకు మేలు గలుగునో యదియే ధర్మము. శాస్త్రసమ్మత మగు కార్యాచరణమువలన మంగళమే కాని యమంగళము కలుగదు.

"వేదప్రణిహితో ధర్మో హ్యధర్మ స్తద్విపర్యయః" (శ్రీభాగవతము)

వేద ప్రణిహితం ధర్మకర్మ తన్మంగళం పరం" (బ్రహ్మవైవర్తము)

శాస్త్రము—"శిష్యతేఽనేనేతి శాస్త్రం" స్త్ర మన శాసనవాక్యము. పుత్రుని మంగ మును గోరుచుఁ దండ్రి సంతానముయొక్క శవావస్థయందు "లాలయేత్ పంచవర్షాణి శవర్షాణి తాడయేత్" అను న్యాయమున నుని దండించును. అటులే ఋషులు లోకులు ర్మభ్రష్టులగుదురని భావించి శాసనవాక్యము నుగాని విధివాక్యములనుగాని రచించిరి. ర్మకార్య మాచరించిన బాధ జనించును. దువలన సహజవ్యక్తికి గౌరవ ముండఁ జాలదు. ఎట్టికార్యమాచరించుటకు సాహసము పుట్టదు. కాబట్టి ధర్మాచరణముకై శాసనవాక్యములు పుట్టినవి. సిపాయిని జూడఁగనే భీతిజనించుటులు ధర్మసూత్రములను వీక్షించినంత సాధ్వసము జనించును. అట్టిభయముండకుండిన ప్రతివ్యక్తియు మానసమునకుఁ దోఁచిన కార్య మాచరించి భ్రష్ట మగును. లోక మొక్కటినుండక భిన్నభిన్నమార్గములను బట్టును. ఇట్టిదురవస్థ సంభవించునుగదా యని యాలోచించి ఋషులు సత్కార్యముయొక్క స్వరూపము ఫలము సుఖము నొంద లగునవి జన్మించునట్లు ధర్మవర్ణనము గావించిరి. ఈ సందర్భమునఁ గొన్ని యుదాహరణము లావశ్యకములు.

"ప్రతిపది కూష్మాండం నాశ్నీయాత్"

ప్రతిపత్తునాఁడు కూష్మాండమును దినఁగూడదు. ఈ నిషేధవిధి ననుసరించి గుమ్మడికాయ తినుటవలన దోషమేమి యని ప్రశ్నించిన "కూష్మాండే చార్థహానిస్స్యాత్" కూష్మాండభక్షణమువలన అర్థహాని కలుగునని సమాధానమును జెప్పవలయును. ఈ విషయమే తిథితత్త్వమను గ్రంథమున వర్ణింపఁబడినది.

"కూష్మాండే చార్థహాని స్స్యాత్ బృహత్యాం న స్మరే ద్ధరిం, బహుశత్రుః పటోలే స్యాత్ ధనహానిస్తు మూలకే"

అందుచేత విధివాక్యములు క్షేమదాయకము లగుటచే వాని నుల్లంఘింపరాదు. నిషేధదివసంబునఁ గూష్మాండమును దినకుండిన నవశ్యము శరీరమునకు మనస్సునకు నుపకారకమగును.

ప్రభువాక్యములను సేవకుఁడు శిరసా వహించునటుల శాస్త్రవాక్యములను లోకము మన్నింపవలసినదే! కాఁబట్టి కూష్మాండభక్షణమును దటులే ప్రవర్తింపవలయును.

"చతుర్దశ్యష్టమీచైవ అమావాస్యాచ పూర్ణిమా, పర్వాణ్యేతాని రాజేంద్ర! రవిసంక్రాంతి రేవచ, స్త్రీతైలమాంస సంభోగీ పర్వస్వేతేషు వై పుమాన్, విణ్మూత్రభోజనం నామ ప్రయాతి నరకం మృతః, అను ప్రమాణమునుబట్టి "పర్వాణి మాంసం నాశ్నీయాత్" అను నిషేధవాక్యము ననుసరింపవలయును.

ఒకవంక విధినిషేధవాక్యములు. వేఱొకవంక విధినిర్దిష్టకార్యములు. అందొకటి రెండు వాక్యములను జేర్కొనుచుంటిని.

"మాఘే మాసి సితేపక్షే పంచమీ యా శ్రియః ప్రియా, తస్యాం పూర్వాహ్ణ ఏవేహ కార్యస్సారస్వతోత్సవః"

(లిఖితస్మృతి)

ఈ ప్రమాణమునుబట్టి "పంచమ్యాం శ్రియం పూజయేత్" అను విధిశాస్త్ర మనుసరింపవలయును.

"ఏకాదశ్యా ముపవసేత్" అనువిధి ననుసరించి యేకాదశినాఁ డుపవాస ముండవలయును. అందుకుఁ బ్రమాణము:

"ఏకాదశీ సదోపాస్యా పుత్రపౌత్రవివర్ధనీ, భుంక్తే యో మానవో మోహాత్ ఏకాదశ్యాం స పాపకృత్"

(లిఖితస్మృతి)

అమావాస్యనాఁడు పితృశ్రాద్ధమును జేయవలయును. అందుకుఁ బ్రమాణము

"నిరాశాః పితరో యాంతి శాపం దత్వా సుదారుణమ్."

అను ప్రమాణము ననుసరించి "అమాయాం పితృభ్యో దద్యాత్" అను విధిని ఆచరింపక తీరదు. "రోచనార్థా ఫలశ్రుతిః" అను వాక్యముద్వారా రుచిలేక ప్రవృత్తిగాని అరుచి లేక నివృత్తిగాని కలుగుచున్నది.

"పిబ నింబం ప్రదాస్యామి ఖలు తే ఖండలడ్డుకం, పిత్రైవ ముక్తః పిబతి న ఫలం తావదేవ తు."

పుత్త్రుని యారోగ్యమును గోరి తండ్రి లోభపెట్టి సంతాప మను చేదుమందును త్రాగునటులు చేయును. ప్రజలకుశలమును గోరి శాస్త్రము ఫలాఫలములచే నజ్ఞానులను లోభపెట్టి సత్కార్యములను జేయువారలనుగా నియమించును. బాలకుఁడు మోదకమం దుండెడిలోభమువలన తిక్తౌషధమును సేవించును. కాని జనకుఁడు బాలునకు మోదకము నీయఁడు. అటులనే శాస్త్రమును నిర్దిష్టకార్యము నాచరించువారికి యథోక్తఫలము నీయదు. పుత్త్రుఁ డరోగవంతుఁడై యుండుటయే తండ్రి యిచ్ఛ. శాస్త్రమును ప్రజావర్గమునకు మొదట సుఖమును స్వాస్థ్యమును గలుగఁ జేయును. పిదప శాంతిభావము నందఁ జేయును. పితృప్రోత్సాహము వలన పుత్త్రుఁడు చేదుమందు త్రాగి రోగము లేనివాఁ డగును. కాని మోదకమును దినఁడు. ఆవిధముగనే శాస్త్రప్రేరణమువలన శాస్త్రోక

ష్టమార్గము నవలంబించిన మానవుఁడు రాహ్యాధ్యాత్మికలాభముల నొందును. కాని ంభనీయఫలమును బొందఁడు.

అందుచేత ఋషులు స్థిరబుద్ధిగల ాశై యాత్మజ్ఞానముద్వారా జనసాధా రణము యొక్క హితమునకై పెక్కు ధర్మ వచనములను రచియించి కీర్తివడసిరి. అందు లకే శాస్త్రవాక్యముల యావశ్యకత. అట్లు ధర్మవాక్యములన్నియు గ్రంథాకారమును దా ల్చి ధర్మశాస్త్రరూపమునఁ బ్రసిద్ధిఁ జెందినవి.

వానప్రస్థుని విభ్రమము

శ్రీ శివశంకరశాస్త్రి

సాహితీసమితిసభాపతి

౧

మనోహార మైన సాయంతనమున
ఇష్టసఖితోడఁ బథమున నేగుచుండ
క్కజము గొల్పి తోచె నీయాననంబు
రసిపైఁ దేలియాడెడి జలజమట్లు!
మధుపమై పోయె నపుడె నామానసంబు
నీముఖాబ్జముపై వ్రాల నిలవేశి!
పాదయుగళంబు తోడనె పార్శ్వమునకుఁ
దిరిగి కదలఁగఁ జొచ్చె విధేయ మగుచు.

ందరద్వారదేశము నందు దేవి!
రముగా నిల్చియున్న నీదేహయష్టి
ముపై వ్రాసి యావృతిబద్ధమైన
తిమవిధమున నాకు విభ్రమము గొలిపె!
కజాతాక్షి! నాహృదిఁ బఱపినట్టి
ట్రాక్షేపణావళి నిశితవిశిఖ

విశతి తాకఁగ నామనోవిహగ మపుడె
పల్లటిలి వ్రాలె నీపాదపద్మములను!
నీ మనోహరవదననిర్నిద్రవిమల
సాంద్రచిత్రితసహకారజాలకముల
మధ్యసీమను మీనాయమానమగుచు
సంచలించెను నాదులోచనయుగంబు!

ప్రమదభరమున నీనిరాభరణసుంద
రాననసుధాంశుబింబమునందు నిలిచి
మరల దయ్యెఁ జకోరముమాడ్కి దేవి!
దివ్యరాగార్ద్రమైన నాదృష్టి యపుడు.
తప్ప దయ్యెను నిను వీడి తరలి చనక!
మరలి చూచితి వీక్షణ మాలికలను
బఱపితివి శాంతగతిని నాపైన దేవి!
ధన్యతం గంటి నంచు నేఁ దలఁచుచుండ!

జయసీతారామ్

(ఒక కథ)

పానుగంటి లక్ష్మీనరసింహారావు గారు

౧

"జయసీతారామ్! జయసీతారామ్" అను పవిత్రాక్షరములు నడుమనడుమ నుచ్చరించుచు వ్యాఘ్రాజినమునఁ బద్మాసనస్థుఁడై యొక బైరాగి పంపాసరోవరతీరమున మహాలక్ష్మీదేవాలయమునకుఁ బ్రక్కగనున్న మామిడిచెట్టుక్రింద జపము చేసికొనుచుండెను. ఆహా! ఈ సరోవరతీరముననే కదా జానకీదేవికొఱకు జగదానందకరమూర్తియగు జానకీరాముఁడు "హా జానకీ" యని మహాకరుణముగ విలపించినాఁడు! ఈసరోవరతీరముననే కదా శ్రీరామచంద్రమూర్తి దర్శనమువలనఁ గృతార్థములైన తనకనులతోఁ బ్రాపంచికపదార్థ మేదియు నికఁ జూడ నొల్లక, జానకీరామ భక్తాగ్రణియగు శబరి యగ్నిప్రవిష్టయై తనుత్యాగ మొనర్చినది! అదిగో! ఆ మహాత్మురాలు సిద్ధిపొందిన ప్రదేశము మన బైరాగి కెదుటి వైపున నలువదిగజములదూరమున నున్నది. ఆలేని వెనుకవైపున నంతకంటె దగ్గఱగా నున్నదే యాతపస్విని తప మొనర్చుకొన్నగుహ. బైరాగికి దక్షిణపార్శ్వమున నాల్గుబారలలో నున్న పంపాసరోవరములోని పక్షులు కిలకిలలాడుచున్నవి. ఎదుటి కొండపై సూర్యుఁడు కెలకల నుదయించుచున్నాఁడు. మహాలక్ష్మీకోవెలలోని గంట గణగణమ్రోఁగుచున్నది. 'జయసీతారామ్' అని బావాజీ గొంతెత్తి యఱచుచున్నాఁడు. ఎందఱో బైరాగులు మహాలక్ష్మీదేవాలయము చుట్టియున్న మండపములలోఁ గూరుచుండి చిలుముగొట్టములలోని పొగఁ బీల్చుచు దగ్గుచు సీతారామస్మరణ మొనర్చుకొనుచున్నారు.

అప్పుడచ్చటికొక్కయుత్తమకాంతయుఁ దలపైఁ బెద్దగంప పెట్టుకొనియున్న యొక్క కూలిదియు వచ్చిరి. ఆయుత్తమకాంత పంపాపవిత్రోదకమున స్నానమాడి మహాలక్ష్మీయాలయములోనికిఁ బోయి యాదేవిని సేవించి మండపములలో నున్న బైరాగులను జూచుటకుఁ బోవుచుండఁగా "అన్నపూర్ణామాయీ! ఆయియే" యని కేకలువైచి యక్కడి బైరాగులందఱు నామె కాతిథ్య మిచ్చిరి. అంతలోఁ గూలిది యచ్చటకు రాఁగ, గంపలో నున్న గోధుమపిండి, నేయి, కంది బేడలు, పంచదార మొదలగు పదార్థములన్నపూర్ణమ్మ యెవరెవరి కెంత కావలయునో యిచ్చి వారికి నమస్కరించి తిరిగి యింటికిఁ బోవుటకై మండపపుమెట్లు దిగుచుఁ గుడివైపుననున్న మామిడిచెట్టుక్రిందిబైరాగిని

జూచి, "అయ్యో! ఆహారపదార్థము లన్నియు నయిపోయినవి. ఈ బైరాగిని జూడనేలేదు. రామరామ! ఎంతయపచార మొనర్చితి"నని లోన ననుకొని దగ్గఱ పట్టితట్ట చేతఁ బుచ్చుకొని తల గోకికొనుచు నిలువఁబడిన దాసిని జూచి "నీవు మనయింటికిఁ బోయి యీమహాత్మునికిఁ గావలసిన భోజనసామగ్రిని దె"మ్మని కన్నడబాసతో నాజ్ఞాపించి తా నాబైరాగి యొద్దకుఁబోయి నమస్కరించి యచ్చట నిలువఁబడెను. "జయసీతారామ్" అని చేయి యెత్తి యాశీర్వదించి, "బైఠీయే" యని యాబైరాగి యామెకాజ్ఞాపించెను ఆమె యచ్చటఁ గూరుచుండి "మీ రిచ్చటకుఁ గ్రొత్తగా వచ్చినట్లున్నారు. స్వామీ! మీయీరాక యెక్కడినుండియో యడుగవచ్చునా?" యని యుర్దూబాసతో నాతని నడిగెను. "బదరీనారాయణమునుండి" యని యాతఁడాభాషనే ప్రత్యుత్తర మిచ్చెను. తరువాత నాతని నేమి యడుగవలయునో తోఁపక యూరకుండెను. ఆతఁడు కనులు మూసికొని ధ్యానైకతత్పరుఁడై యుండెను. రామనామస్మరణ మొనర్చుకొనుచు నన్నపూర్ణ యక్కడనే నాల్గుగడియలు కూరుచున్నపిమ్మట దాసి భోజనపదార్థములతో వచ్చి వాని నామెయెదుట నుంచెను. బైరాగి కన్నులు తెఱచువఱకు వేచియుండి, "స్వామీ! ఈ సేవకురాలిపైఁ గటాక్షముంచి యీవస్తువులను బరిగ్రహింపవలయు" నని ప్రార్థించెను.

బైరా: ఇవి నాకేల?

అన్న: మీరు భుజియించుటకై సమర్పించుకొంటిని.

బైరా: క్షున్నివారణమునకు గోదుమపిండియు నేయియునే కావలయునా?

ఈ యడవిలో నెన్నికోటులప్రాణులు జీవించుచున్నవో! వాని కన్నిటికి ఘృతపిష్టశర్కరాదులు లభించుచున్నవా? అదిగో చూడుము, ఆ చెట్టున నెన్ని జీడిమామిడిపండ్లున్నవో! నాలుగుపండ్లతో నాఁకలి శాంతింపదా? అది గాక సీతాన్వేషణకార్యమున మహాశ్రమ నొందుచు రామచంద్రమూర్తి యిటకు వచ్చి కందిపోయిన తన శ్రీపాదములను గడిగికొనుటచే నత్యంతపవిత్రములైన యీపంపాసరస్సలిలముల నమృతప్రాయముగఁ గ్రోలెదను. బస్! ఇఁకఁ గావలసిన దేమి? జయ సీతారామ్!

అన్న: స్వామీ! నాకు జ్ఞానమువచ్చినది మొదలిరువది సంవత్సరములనుండి యిక్కడ బసచేయు బైరాగులనెల్లర నిట్లే సేవించుచు నాతనువును దరింపఁజేసికొనుచున్నాను. నా ప్రార్థనము నిరాకరింపకుఁడు.

బైరా: నేను గ్రహింపనొల్లను అంతమాత్రమున నీపుణ్యమునకుఁ గొదవ లేదు.

అన్న: స్వామీ! మీకొఱకు వానిని సమర్పించితిని. తరువాత మీ చిత్తము; నా భాగ్యము. నమస్కారము; నాకు సెలవిండు.

బైరా: జయసీతారామ్.

ఆమె యక్కడకు దాదాపుగా రెండుమైళ్లదూరములో నున్న 'ఆనెగొంది'కిఁ బోయెను. ఇక్కడి గోదుమపిండిని బంచదారను గాకు లెత్తుకొనిపోయెను.

౨

మఱునాఁ డుదయమున యథాపూర్వముగ నన్నపూర్ణమ్మ సరోవరతీర్థావగాహన మొనరించి లక్ష్మీదర్శనము గావించుకొని మండపములలోని బైరాగులకుఁ బిష్టాదు లిచ్చి పోవుచుఁ జెట్టుక్రింది బైరాగియొద్దకు వచ్చి నమస్కరించి కూరుచుండి చిన్నపుటికలోఁ బెట్టి తెచ్చిన తేనె యనఁటిపండ్లు నాతనియెదుటఁ బెట్టి "స్వామీ! వీనినైన గ్రహింపుఁ" డని ప్రార్థించెను. అతఁడు "జయసీతారామ్" అని నిమ్మళముగ ననెను. స్వరమున నిన్న నున్న ఝంకార మీదినమున లేదు నిన్నఁ బద్మాసనమునఁ గూరుచుండినయాతఁ డీదినమున గొంతుకూరుచుండి మోకాళ్లపై శిరమును వ్రాల్చి చేతులను బిక్కలచుట్టు గట్టిగ నదిమి యేమో కాని వణఁకుచుండెను. "స్వామీ! అస్వస్థతగ నున్నారా" యని యన్నపూర్ణమ్మ యాతని నడుగ "జయసీ సీ" యని యనఁ బోయి పండ్లు దగ్గఱగఁబడఁగఁ బైయక్షరములను బలుకలేక మూల్గెను. అన్నపూర్ణమ్మ మండపములలోని బైరాగులను ద్వరగ రండని పిలిచెను. గోదుమపిండి మెదాయించువారు కొందఱు, కందిపప్పులోని రాలు నేర్చి పాఱవైచువారు కొందఱు, రొట్టెలు కాల్చుటకు నిప్పు చేయువారు కొందఱు, గంజాయిజడలను దులుపువారు కొందఱునై యాబైరాగు లెవ్వరు కూడ నామె పిలుపును మన్నింపలేదు. ఇంతలోఁ జెట్టుక్రిందిబైరాగి కూరుచుండినవాఁ డాపాళముగనే యటులిటు లూఁగి యట్టె వ్యాఘ్రాజినముపైఁ బడిపోయెను అంత నన్నపూర్ణమ్మ యిది మన్నెపుజ్వరపు మాహాత్మ్యమని యనుకొని చప్పున దాసిదానిచేత సందేఁడు చిదుగు లేఱించి యాతనిచుట్టు మంట వేయించి యచ్చటనే కనిపెట్టుకొనియుండెను. లోపలినుండి భీకరంపప్రాయముగ నల్లలాడించు చలి చిదుగులమంటతో శాంతించునా? ఓ! పులిచర్మముపైఁ జలిచే నాతఁ డగిరిమొగిరి పడుచున్నాఁడు.

అంత నన్నపూర్ణమ్మ మండపములలోని బైరాగులయొద్దకు వెళ్లి బైరాగి పడుచున్న బాధలన్నియుఁ జెప్పెను. "జంగ్లీ బొఖార్-కుచ్ పర్వానహీఁ. అన్నపూర్ణా మాయీ! ఘుర్ కూ జాయియే" యని వారామె నోదార్చిరి. "చలిచే నగిరిమొగిరిపడుచున్నాఁడు. ఒక్క కంబళినిమ్మ" నియామె వారినడిగెను. 'నాకంబళి 'బిఖానాలోఁ గట్టివైచితి'నని యొకఁడు 'నాకంబళి చినిఁగిపోయిన'దని యొకఁడు 'నాకంబళి జగన్నాథములో దొంగ లెత్తుకొని పోయినా'రని యొకఁడు, 'నాకుఁ గూడఁ గొంత చలిగా నున్నది కావున నాకంబళి యిచ్చుటకు వీలులే'దని యొకఁడు పలికిరి కాని కంబళిమాత్ర మిచ్చుట కొకఁడైన నంగీకరింపలేదు.

ఔను- అందునఁ దప్పేమున్నది? ఒక్కని కొక్కనికి సంబంధములేని సంగహీనులగుటచే నొకనివస్తు వొకని కేల యీయవలయును? ఒక్కఁడే పుట్టుచున్నాఁడు, ఒక్కఁడే చచ్చుచున్నాఁడు. ఈ నడుమనున్న మూఁడునాళ్ల బాంధవ్యములతో నొకనిపై నొకని కభిమాన మెందుల కుండవలయును? ఓ! ఎవ్వఁడేమైపోయినను సరే ఎవనికిఁ గావలయును? ఇట్లు జరుపుకొనఁగలిగినయెడల నింతకంటెఁ గావల

న దేది? కాని కాకి గోదుమపిండి యెత్తు
ని పోవుచుండఁగా దానిని గొట్టుట యెందు
కు? అన్నపూర్ణమ్మ యిచ్చిన నేయి పంచ
దార తాము "జయసీతారామ్?" అని సంతో
షమునఁ దీసికొనుట యెందులకు? ఆనేతి
ొఱకే ఆపంచదారకొఱకే పదేపదే రాఁ
ోవు కుక్కను "జారే సైతాన్" అని కోప
ముతోఁ గొట్టుటకుఁ గఱ్ఱ తీసికొనుట యెందు
కు? ఏమో! సంసారపరిత్యాగులమర్యాదలు
ంసారుల కెట్లు తెలియును?

అన్నపూర్ణ యాలయములోని పూజరి
యొద్దకుఁబోయి యాతనికంబళి తెచ్చి బైరా
కిఁ గప్పి యచ్చట నింక వంటచేయుచు
ామనామస్మరణ మొనర్చుకొనుచుఁ గూరు
చుండెను. క్రమముగఁ జలి యాతనికిఁ దగ్గినది.
ాని జ్వరము హెచ్చిపోయెను. ఉష్ణమున కాఁగ
లేక యాతఁడట్టిట్టులు కొట్టుకొనుచు నడుమ
డుమ "జయసీతారామ్" అని జ్వరతీవ్రతచేఁ
ొందరగ నఱచుచుండెను. ఆతనికన్నులు
ంతనిప్పులవలె నుండెను. ఆతనికొడలి వేఁడిమి
ండు బారలలో నున్న యామెకు దుస్సహమై
ోయెను. ఎండ హెచ్చినకొలఁది జ్వరము
చ్చుచున్నట్లగపడెను. అప్పటికే జాము
ర ప్రొద్దెక్కినది. ఇంక జ్వర మెంత హెచ్చు
నో యని యామె యాందోళనపడుచు నటనే
ూరుచుండెను. ఆమె యచ్చట నింక నేల కూరు
ండవలయును? తానచ్చటనున్నయెడల జ్వర
ు తగ్గు నని కూరుచుండెనా? తాను వైద్య
ెఱిఁగి యుండుటచే నేదో మందో మాకో
యఁదలఁచి కూరుచుండెనా! అట్లు కాదు.

అతఁడట్టిస్థితిలోనుండఁగఁ దానింటికిఁ బోవుటకుఁ గాళ్లాడక యట్లు కూరుచుండెను. ఈమె కీయు జ్ఞాన మెందులకో? తోడిమానవుని కింత సేవ యెందులకుఁ జేయవలయునో? ఆ మండపములలోని బైరాగులందఱు రొట్టె లాహారించి కిలకిలలాడుచుండ, వారిని జూచి యైన రవంత బుద్ధి తెచ్చుకొని యింటికిఁ బోయి భుజియించి పండుకొనఁగూడదా? ఊహూం! అక్కడనే పీఁట పెట్టుకొని కూరుచుండెను.

ఎండతీవ్రతచేఁ గలిగిన మత్తువలన బోరలించిన తట్టపైఁ బెట్టిన చుట్టకుదుటిపైఁ దల మోపి దాసి కూరుచుండియే నిద్రించుచుండెను. 'జయసీతారామ్' అని వి;విరామములు లేకుండ జ్వరితుఁ డఱచుచుండెను. నడుమనడుమ శ్రీరామకర్ణామృతములు మ్రోఁడులు చిగుర్చునట్లు పాడుచుండెను. మామిడిచెట్టుపైనున్న కోవెల 'ఉహూఁ-ఉహూఁ!' అని యాతని హెచ్చరించుచుండెను, ఏబాధచేతనో కాని బైరాగి 'జయసీతారామ్' అని ప్రకారము ఁ రుసట్ల అఱచెను. మండపముమీఁదనున్న కోఁతి గుబాలునఁ గ్రిందికి దుమికి బైరాగివంక నన్నపూర్ణవంకఁ జూచుచుండెను. ఇప్పటికిఁ గూడ రామనామమెక్కడనైన వినఁబడునేమోయని కోఁతి యపేక్షించియుండును గాఁబోలు. బైరాగికొఱకుఁ దెచ్చిన యరఁటిపం డన్నపూర్ణమ్మ కోఁతియెదుటఁ బడవైచెను. అవి తీసికొని కోఁతి పోఁబోవునప్పుడు దాసిదానిని రాచి పోవుటచేత, నది యులికిపడి లేచి యేడువ సాగెను. అన్నపూర్ణమ్మ దాని నోదార్చి,

యింటికిఁ బోయి భుజియించి బండియొకటి తోలించుకొనిరమ్మని చెప్పఁగ వడి పోయెను.

బైరాగివాని గోరణి యింత యంత యని చెప్ప నలవికాదు. భాగవతశ్లోకములు కాదు. స్తవరాజములుకాదు. దండకములు కాదు. ప్రార్థనాగీతములు కావు. ఓ! తెలివి లేకుండఁ బాడుచున్నాఁడు. ఆనన్నిపాత ప్రలాపములో నొక్క తప్పమాటయైన వచ్చెనా? ఊహుఁ. ఎంతపుణ్యాత్ముఁడో! ఆహా! ఇట్టి యపస్మృతి కంటె నదృష్టము మఱియొక్కటి యున్నదా?

మండపములలోని బైరాగులు "రోటీ ఖానా గంజా పీనా వగైరాలు" కానిచ్చుకొని కునికిపాటులు పడుచున్నారు. మధ్యాహ్నము మూఁడుగంటలు కావచ్చినది. అంతలో బండి వాఁడును దాసియు నన్నపూర్ణయొద్దకు వచ్చి నిలువఁబడిరి. మామిడిచెట్లువఱకుఁ దీసికొని వచ్చుటకు దారిలేకుంటచే నాలుగజముల దూరమున మలుపులో బండి నిలిపి బండి వాఁడు వచ్చినాఁడు. ఆతనిఁజూచి యన్నపూర్ణ లేచి బైరాగియొద్దకు వెళ్లి "స్వామీ! స్వామీ!" యని చెవియొద్ద గట్టిగ నఱచెను. అతఁడు 'ఊఁ' అనలేదు కదలలేదు. కనులువిప్పఁ బ్రయత్నింపనైన లేదు. అంతబండివాఁ డాతనిని దలవైపున, నన్నపూర్ణ పాదములవైపున, దాసి నడుము నొద్దను బట్టి యెత్తి కష్టమునఁ దీసికొనిపోయి బండిలోఁ బెట్టిరి. ఆతని చిన్నమూటయు వ్యాఘ్రాజినమును బండిలో వేయించి యామె వెనుక నడచుచు బండి తోలించుకొని యింటికిఁ బోయెను.

3

స్మృతిరాకముందు బైరాగినోట నేమందు లన్నపూర్ణమ్మ పోయించెనో కాని స్మృతి యాతనికిఁ గలిగినతరువాతమాత్ర మాతని కొక్కమందైన నిప్పింపలేకపోయెను. ఎన్ని విధములఁ దాను బతిమాలినను, నెందఱిచేఁ జెప్పించినను నాతఁడు మందు పుచ్చుకొనుట కంగీకరింపలేదు. పట్టెఁడుతులసి మంచినీటిలో వైచి రెండుజాములు నాననిచ్చి, యది వడియఁబోసి యాతీరుమాత్ర మిమ్మని యాతఁడు కోరెను. ఆప్రకారమే యామె యొనర్చుచుండెను. ఇట్లు పదునైదుదినములు గడచిన వెనుక నాతఁ డారోగ్యదశ నొందెను. ఒకదినమున నన్నపూర్ణయు నాతఁడు నిట్లు మాటలాడుకొనుచుండిరి.

బైరా: అన్నపూర్ణా! దిక్కుమాలిన వాఁడనైన నన్ను రక్షించి నీవు మహాపుణ్యమును గట్టుకొంటివి. నిన్ను శ్రీరామచంద్రమూర్తి రక్షించుఁగాక యని యాశీర్వదించుటకంటె నేను జేయఁగలది యేమున్నది? నేనింకఁ బోయెదను. జయసీతారామ్.

అన్న: స్వామీ! అప్పుడే పోయెదరా? ఇంక నాల్గుదినములుండరాదా?

బైరా: తగదు. ఇప్పుడే పోయెదను. జయసీతారామ్. (పోఁబోవును).

అన్న: మహాత్మా! ఒక్కనిముస మాగుఁడు. నాకష్టసుఖములు రవంత మనవిచేసికొందును. నాకుఁ బుణ్యగతి యెట్లు కలుగునో మీ రానతీయవలయును. మీరు మహామహులవలె నున్నారు. మీరెఱుఁగరాని వుండవు. ఏదైన

మంత్రమే యుపదేశింతురో మతి యేమార్గమైన బోధింతురో మిమ్ము నమ్మియున్నాను. ఒక్క యసత్యమైన లేకుండ నాపూర్వచరిత్ర మనవిచేసికొందును. మీదయకు నేనర్హుఁ గాలనని మీకుఁ దోఁచినయెడల నన్నుఁ దండింపఁ జేయవలయును.

బైరా: అందఱను దరింపఁజేయువాఁడా శ్రీరామచంద్రమూర్తియే. అయినను నీవేమి చెప్పఁదలఁచితివో సంక్షేపముగఁ జెప్పుము.

అన్న: సంక్షేపముగనే చెప్పెదను. నేనాంధ్రజాతిలోనిదాన‌ను. శూద్రకులసంభవను. మావాసస్థానము చిరకాలమునుండి బళ్లారి. మాయింటిపేరు బళ్లారివారు. నాతల్లి నన్నుఁ గని చనిపోయినది. మాతల్లి మరణించినప్పటినుండియు మాతండ్రి హృద్రోగపీడితుఁడై యుండి నాపెండ్లియైనఁ జేయకుండఁ జనిపోవుదునేమో యను భయముచే నాకు నాల్గవయేఁటనే పెండ్లి చేసినాఁడఁట. నాపెండ్లి యయిననాల్గుమాసములకే నాతండ్రి గతించినాఁడఁట. పిమ్మట మేనమామ సంరక్షణమున నాకు యుక్తవయస్సు వచ్చువఱకుంటిని. అటుపైని పంపామహాలక్ష్మిని సేవింపఁదలఁచి యామహాక్షేత్రమున నిండ్లు లేకుంటచే నానెగొందిలో నిరువది సంవత్సరములనుండి నివసించుచున్నాను. అయ్యయ్యో! ముఖ్యమైన సంగతి చెప్పుటయే మఱచిపోయినాను

బైరా: ఏదది?

అన్న: నాతండ్రి పోయిన కొలఁదిదినములకే నాభర్త యెచ్చటికో పాఱిపోయినాఁడఁట. ఆతఁడెక్కడనో మరణించినట్లు కొన్నినిదర్శనము లున్నవని మా మేనమామ చెప్పినాఁడు. యుక్తవయస్సు వచ్చినపిమ్మట భర్త లేకపోయెనే యని నే నెంత యేడ్చితినో యాపరమాత్మునికే యెఱుక.

బైరా: సీతారామ్. జయసీతారామ్. భర్తకొఱకు భార్య యేడ్చిన యేడ్పులు విరాగినైన నాకు వినిపించుట యెందులకు? సంక్షేపముగాఁ జెప్పుమంటిని గాదా?

అన్న: మహాత్మా! క్షమింపుము. అతనిని బరదైవముగ భావించుకొని పరపురుషుని మనస్సుననైనఁ జేరనీయక వయస్సు వచ్చినతరువాత నిరువదిసంవత్సరములనుండి యధశ్శయనబ్రహ్మచర్యవ్రతములచే శ్రీరామచంద్రపాదారవిందభక్తిచే విరాగి జనపూజచే సద్వృత్తాచరణముచే గాలక్షేపమును జేయుచున్నాను. మహానుభావా! నాకింతకంటె సులభతారకమైన మార్గమేదైన బోధించి రక్షింతురు గాక!

కాలికిఁ బాముచుట్టుకొన్నప్పుడు నరుఁడు కాలి నెంతబింకముగ దులుపుకొనునో యామాటలు విని బైరాగి దేహమును మనస్సును నంతబింకముగ దులుపుకొని "జయ సీతారామ్" అని బిగ్గఱగ నఱచి చెకుముకిసంచి విప్పి "నా పూర్వబంధ మింక నీయుంగరము మూలమున రవంత మిగిలినట్లగపడుచున్నది. దీనిని నీవుతీసికొని నన్నురక్షింపు"మని యామె చేతిలో నాయుంగరమును జాఱవిడిచి "జయ సీతారామ్" అని కేకవైచి యాతఁడు పోఁబోవుచుండెను. "బ. రామనాథస్వామి అల్లుఁడగు కం. స్వామినాథరావునకు వివాహకాల

అన్నపూర్ణాదేవి నాథా! నాథా! అని యేడ్చుచు సన్న్యాసిని కౌఁగిలింపఁబోవుట

మందు" అను నక్షరము ఉంగరముమీఁదఁ జూచుకొని కెవ్వున నార్చి, పోఁబోవువాని కెదురుగవచ్చి "నాథా! నాథా! ఎంతకాలమున కగపడితిరి." అని యేడ్చుచుఁ గౌఁగిలింపఁ బోయెను. వెనుకకుఁ దగ్గి మొగము మఱల్చి కుడిచేయి పైకెత్తి "జయసీతారామ్" అని గట్టిగ నఱచి "ఆఁగుము! ఒక్క యడుగైన ముందునకుఁ బెట్టకుము. నేనే నీభర్తను. అయిననేమి? నేను విరాగినై యుండుటకు సంకల్పించుకొంటిని. నీవు నాకేల?" యని తిరుగఁ బోఁబోవుచుండఁగ "నేనుగూడ మీతో వచ్చెదను. నావలన మీతపస్సునకు విఘ్న మెంత మాత్రమును రానీయను" అని కూడఁ గూడఁ బోవసాగెను.

"నీవు పుణ్యశీలవు. బుద్ధిమంతురాలవు. నీవు చేయుచున్న విరాగిజనపూజ మిక్కిలి మంచిది. శ్రీరామచంద్రమూర్తి పాదధ్యానమున నీవు నాకంటె ముందుగాఁ దరింతువు. నీవు నాతో వచ్చి హిమాలయప్రాంతమునఁ జేయునదేదియును లేదు. నీవు నా భార్యవు కావనఁ జెప్పుచున్నాను వినుము. భర్తనైన నాయాజ్ఞ యిది. దీనికిఁ గట్టుపడి నీవిచ్చట నుండకతప్ప"దని చెప్పుచు "జయజయ జయ సీతారామ్"అని మొగిరిమొగిరి పరుగెత్తుకొనిపోయెను. అన్నపూర్ణమ్మ కొయ్యయై క్రిందఁ బడిపోయెను.

కొంతసేపటికిఁ దెలివితెచ్చికొని యిట్లు తలపోసికొనెను:— "నాల్గవ యేటఁ బెండ్లియేమి? ముప్పదిరెండవయేట భర్తకంటఁ బడుటయేమి? భర్తయని గుర్తించినక్షణముననే యాతఁడు మాయ మగుటయేమి? రామచంద్రమూర్తీ! నాభర్త నిట్లు కానఁబఱచు టెందులకు? మెఱపుమెఱసిన వెంటనే కల్గు గాఢాం

ధకారమున నన్నుఁ ద్రోయుట యెందులకు?
ఆహాహా! రామచంద్ర ప్రభూ! యెందులకైనఁ
దగిన వాఁడవయ్యా:—

సీ. మారువిల్లు తుత్తుమురౌనట్లు విఱిచియు
నీసు స్థాపించి పూంచినావు,
ధారుణీపతివయ్యు ధారుణీసంజాత
బహుసంతసమునఁ జేపట్టినావు,
ఇంద్రాదిసురరక్షకిలను జన్మించియు
నింద్రజు తల నూడ నేసినావు,
తరుణికై రావణుఁ బరిమార్చియు సతి
వనవీథిఁ ద్యజియించి వైచినావు
ఏఘనుండైన ని శ్లాఘించు నొక్కొ-
ఎటులో చేసినఁ గీర్తి దక్కించుకొనునె
దైవమవు కాన ధాటితో దాఁటిపోయి
తయ్యా! రామయ్యా! నిన్ను నేమందు నయ్యా!

కృతార్థుడు

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

తనువిందుగూర్చు చక్కఁదనమ్ము, పొంగారు పాలఁబోలిన వయఃప్రాభవమ్ము
శీలవిద్యారూపశాలిని కులకాంత, సంతాన మిత్ర బాంధవ సమృద్ధి
విజ్ఞానసంపత్తి వెలయించు వైదుష్య, మిష్టభోగార్హ మీహితధనమ్ము
ఉద్యత్పరిజ్ఞాన యోగసామర్థ్యమ్ము, పరమార్థనిశ్చయాభయవినోద

గీ. మెసఁగి పొసఁగి పొంపిరివోవ నెల్లవేళ, నల్ల నుల్లాసజలధి నోలాడువాఁడు
వాఁడువో వాడువోవని వన్నెవాఁడు, సర్వసంపూర్ణపురుషార్థసారవహుఁడు.

బేతాళ రెడ్డి*

(పాణశా పిచ్చిరెడ్డిగారు బి. యే. ఆనర్సు)

నరసింహాపురము పూర్వము విఖ్యాతపట్టణము. ఓరుగంటి వీరరుద్రమదేవి సామంతుడుగ నుండిన వీరభద్రారెడ్డి రాజధాని. ప్రస్తుతము చుట్టునున్న దేశముతో గూడ చోళుల మేలుబడిలోనున్నది ఇప్పుడు ప్రతాపరుద్రుని సాయమున స్వాతంత్ర్య సంపాదనకై వీరభద్రారెడ్డి దేశీయులబురికొల్పుచుండుట వెల్లగి చోళచక్రవర్తి తనసేనాధిపతి నొకని తగు సైన్యముతో నాదేశమున నుంచెను. తన చర్యల గమనించుటకు నియోగింపబడిన కులోత్తుంగుని సైన్యముల, వీరభద్రుడు అత్యాదరముతో గౌరవించెను. పండుగ నాటిరాత్రి కులోత్తుంగచోడుని తనయింట విందునకు బిలిచెను. అతడు భోజనానంతరము మేడలో పచారు సేయు సమయమున కథ ప్రారంభమగును.

మధ్యరాతిరివేళ మానిసి యొకడు
చేపట్టు గోడపై జేతుల నూని
నిలుచుండి యోచన సలుపుచు నుండె
నిర్మలాకాశము నెత్తిపై గలదు
మినుకు మినుక్కని మెఱసె చుక్కలును
వెన్నెలల్ జల్లెడు విధునిబింబంబు
ఉద్యానవనమున నున్నవృక్షముల
వెన్నెలకాంతిలో వీక్షించె నతడు.
అప్పుడే పూచిన యందంపుబూల
తావులభారము తల దాల్చినేమొ
మలయపవనంపు గొదమలకు నొక్కింత
మధురత్వమున కీడు మాంద్య మలవడియె
పవలంత కష్టించి బడలిన మేను
సౌరభసరసిలో స్నాన మొనర్చి
ఒకవింతయానంద మొందె నారాత్రి
నరసింహపురమున నగళులలోన
వృద్ధరాజన్యుండు వీరభద్రుండు
ఓరుగల్లు ప్రతాపవీరునితోడ
గలసి చోళులపైన గత్తిగట్టుటకు
పన్నాగములు చాల బన్నుచున్నట్లు
సంశయించినచోళసైన్యాధికారి
చెంగటనే కులోత్తుంగుని, వరుణు
రాణువ నిచ్చి సంరక్షణ కునిచె
తనచేత నున్న పట్టణమును చుట్టి
దేశమంతయుజూచి ఈశాంత మేమి?
అన్ని వేళలయందు నత్యాదరమున
ననుజూచు వీరభద్రునిస్నేహ మేమి?
అధికారిభయమున కవకాశ మేది?
అని తలపోసెను ఆనిశీథమున.
నిటు నటు దిరుగుచు నింతటిలోనె
ఊరిలో దివిటీలవారు గాన్పించె
పండుగ యైన నా రెండు దినాలు

---

* ఫ్రెంచినుండి ఆంగ్లేయమున కనువదింపబడి యున్న ఒక కథానుకరణము.

ఊరిలోపల దీప ముంచగరాదు
ఆఱుగడియల రాత్రి కావల నెవరు
అని యుత్తరువు జేసె నాదినమతఁడు.
నిర్దిష్టస్థలముల నిల్పుండి యున్న
భటులకత్తులు గాన బడియె వెలుతురున
దివిటీలవారలధ్వని యేమి లేదు;
ఉత్సవసందర్భయుత్సాహ మేమి
గానిపింపదు; ఏమికారణ మొక్కొ!
ఇంత నిర్భీతితో నిట్లు వర్తింప
నిప్పుడే పోయి నే నెఱిగి వచ్చెదను
అని యౌవనోద్రేకమున మేడనుండి
క్రిందికి దూకి వేగిరము సైనికుల
డ జేర నూహించునెడ శబ్ద మొండు
ని విచ్చె; నెవ్వరో వనిత యంచెంచె;
టువైపు తల ద్రిప్పె; అగుపించ రెవరు;
దలు వెన్నెల జల్లుసంద్రము జూచె
బ్ధుడై ఘోరదృశ్యము నేమి గనెనొ!
ంద్రియంబులు మోసగించె నంచెంచె.
గరంబున బెరచాపల గనియె
భీతి జెంది, ఆ కానిపించునది
లలపై బడెడి వెన్నెలకాంతి; అట్లు
తగ దోచెడు సంతియే యనుచు
నసుకు సరిపెట్టుకొన జూచె నెవరో
ము జేరఁబిలిచి నట్లనుమానమయ్యె.
ు జూడ నొకవ్యక్తి యచ్చట నిలిచి
ది యెవరు? తమరేనా?" అని హెచ్చరించు
నె; వాఁడు వీరభద్రుని యింటి దాక
తోడ జనిన భటునిగా నెఱింగి
క్రను. సంగతు లేమి?" అని మెల్ల నడిగె.
ర లచ్చట కదలబారుచున్నారు.

పురుగులవలె నట దిరుగుచున్నారు.
నేఁగన్నదంతయు మీాకెఱిఁగింపఁ
బరుగెత్తి వచ్చితి" "సరి తరువాత?"
ఇంతకు ముందొక్క డీయింటి నుంచి
దీపముతో కొండవైపుకు జనియె
ఇటువంటివేళలో నెచ్చటికేగు
మనల ముగించెడు పని యేమొ జరుగు
నని సంశయించి నే నరిగితి వెన్క
ఐదారునిముసములైన గాలేదు
కనిపించె నొకపెద్దకట్టెలమోపు"
అనియె నంతటిలోన నతిభీకరముగ
గ్రామంబదంత యొక్కటిగ కిలార్చె;
ఉత్తరకోణము కుల్లోత్తుంగునెదుట
మెటాసె తటుక్కని; మరణించె భటుడు;
తలలోన గుండు తగిలి పడి చచ్చె.
ఆతని యెదుటనె, అమిత చేరువనె
కట్టె లంటుకొనియె; గణగణ మండె;
భవనంబులోపల పాటలు నిలిచె;
అంతయు నిశ్శబ్దమయ్యె; దూరమున
మూల్గులు వినవచ్చె; మ్రోగ దొడంగ
పర్జన్యగర్జనవలెనె ఫిరంగి;
చల్లని చెమట నొసలు నిండఁజేరె;
చేతగత్తియు లేదు; చేయున దేమి;
తనవారు మడసి రందఱు; రుద్రసేన
లేతేరనున్నవి; ఇక నేది దిక్కు?
బ్రతికిన గూడ తర్వాత దండనయె;
తన యాజాగ్రత్తకుఁ దగిన ఫలంబు
అనుభవింపక తీర దవమానఫలము
అని యెంచి భూమికి నాల్గడ్డపైకి
కలదూరమంతరా కండ్లతో గాలించె

దుముక నుద్యుక్తుడౌ సమయమునందు
తను దట్టి మెల్లగ ననసూయదేవి
"పరుగెత్తి పొమ్ము; మావారలు నిన్ను
చంపి వేసెదరు చే జిక్కినయెడల
అచ్చట నా కొండకావలి ప్రక్క
మాయన్నగుట్టపు లాయము గలదు;
ఆలసింపకు; పొమ్ము" అని పల్క నతడు
స్తబ్ధుడై మరల నా తన్విని జూచె;
ఆమె 'పో' యని నెట్టె; నాతడు దుమికె;
ఒకరాతినుండి యింకొక రాతిపైకి
మేకలు సైతము దూకని చోట్ల
బ్రతుకాశ లేమి నిర్భయముగ దూకె
అనసూయ యనుచుండె ననుజులతోడ
పరుగెత్తె తెలుగుడు వధియింపుడనుచో
చంప వచ్చెడి వారి శబ్దము వినియె
వారలు కాల్చుతుపాకి గుండ్లన్న
చెవిప్రక్క రివ్వన జనె గుట్ట నెక్కి
అరనిముసములోనె నదృశ్యుడయ్యె!
జాముసేపటిలోన సైన్యము జేరి
తన యధికారి చెంతకు వచ్చి నిలిచె
"పిడికిట ప్రాణాల బెట్టుకవస్తి"
భయకంపితాంగుడై పలికె నతండు.
కూర్చుండి వివరించె ఘోరవృత్తమును
"అపరాధ మనగాదు అదృష్టహీన
తమె కారణం బని తలచెద" ననియె
నతిభయంకరుడగు నాయధికారి
"ఆంధ్రులోనచ్చిన యీ నేరమునకు
నిన్ను మన్నించెద, నీచేసినట్టి
తప్పు లేదని నేను తలచిన యెడల"
"మనచక్రవర్తి దీనిని విన్న నెట్లు!
నిలబెట్టి గుండులో నిన్ను గాల్పించు
చేయవలసినదేమొ చెప్పుఁడీ తొందరగ
కర్తవ్యమును జేయగడగుడి మీరు
క్రూరకిరాతులౌ వీరలపైన
భూమికంతకు జంకు పుట్టెడురీతి
పగ నెట్లు సాధింప నగునో యోచింపు"
డని యుగ్రుడై పల్కె నా యధికారి.
గంటసేపటిలోన కదలె సైన్యంబు
శాత్రవుల్దమవారి జంపిన తెఱగు
విని యున్న సైన్యము విపరీతరోష
కలితులై నడచిరి గ్రామములన్ని
యుద్ధసన్నద్ధమైయుండుట గాంచి
క్రమ్మి వానిని కాలాగ్నిరీతి
భస్మము గావించి పయనముసాగె
రుద్రుని సేన సముద్రాన నిలిచె
సాయంబొనర్పగ జనుదేరదాయె
నమ్మిన రుద్రుండు నట్టేటముంచ
నరసింహాపురమును నాల్గు పక్కలను
అవలీలగాదాకె ద్రవిడసైన్యములు
పౌరులు గనుగొని భయమంది బెగడి
అధికారి క్రౌర్యము నంతకు మునుపె
యెఱిగినవార లాపురివారు గాన
పట్టణమంతయు భస్మంబు జేసి
పౌరుల కత్తికి బలి జేయునంచు
తలపోసి తమలోన ద్రవిడసైనికుల
చంపినవారలు స్వయముగా నమ్మ
మాతమె దండించి మన్నింపు డోయల
నని విన్నపము లంప నందుల కతడు
"వీరభద్రునియింటివారి నందఱను
అప్పగించుటకు మీరొప్పెదరేని

వారు కోరినయట్లు మిమ్ము మన్నింతు"
నియె నందుల కంద అంగీకరింప
రభద్రారెడ్డి వీరవంశజుల
ంధించి తనసాంతభటుల గాపుంచె
రాజులక్ష్యించినవారి నిన్నాలు
పరగాల్చి చంపించె గుండుతో నపుడె
రిత్రాళ్ల గట్టంగ నొసగె నుత్తరువు
గ్రామహంతకు బిల్వగా బంపె. నింత
లో నరుదెంచి కులోత్తుంగుడనియె
గద్గద స్వరముతో, "కల దొక్క మనవి
నవారి వేయువిధముగా వధింప
రభద్రారెడ్డి వేడెను మిమ్ము
లలు ఖండించుట తగునని నుడివె
ండ్రగొడ్డలితోడగడపేర్చు మనియె"
ందుల కది కాని యంగీకరించె
బందాలు విప్పంగ బ్రతిమాలుకొనిరి
జీవోమంచును బాస జేసితిరి."
నిను నమ్మి యొప్పుకొంటిని భద్ర"మనియె
చిన్నికుమారుని మన్నించునెడల
స్తినంతయు మీకు నర్పింతు"ననియె
అట్లనా! అతని సొత్తంతయు నిపుడె
క్రవ త్తిడగదా!......సరి. అతడడుగు
ంత కొక్కనగాని యంగీకరింతు
న్నప మేలనో విస్పష్టమాయె
ంశంబు నిలుపులో సాధేయపడిరి.
రభద్రారెడ్డి విశ్వాసఘాతు
త్వము, వానికి గావింపబడిన
ల తెలంగు, దేశీయులెల్లరును
ల్ల కాలంబును నెలగియుండురు.
నిపుత్రులలో నీకొ జనస్థైన

సూనరికార్యంబు బూనినయెడల
వానికి నాస్తి సర్వస్వము నొసగి
విడిపించి పుచ్చెద: వినిపింపు మమ్ము."
ఎట్టుల వెలుపుదు నీవార్త వీరి
కని చాల యోచించి యరిగె నెట్టులను
ఈగదిలోననే నిన్నటిదినము
సుకుమారగాత్రల సుదతులిర్వురను
ముప్వురు యువకుల, ముచ్చటతోడ
ఆనందమున దేలియాడంగగనియె
కటికహంతకు చేతిగండ్ర గొడ్డలికి
బలిగాగనున్నవారలదశ గాంచి
ఇట్టుల నుండెనా మృత్యువు మీకు
అనుచింత భీతిచే వణకెనతండు
కుర్చీలపై ననే కూర్చుండినట్లు
బంధితులై వీరభద్ర రెడ్డియును
భార్యయు, సుతులును బాలికాద్వయము
చలియింపకుండిరి; నిలబడియుండ్రి
చేతులు గట్టున్న సేవకు లెదుట
బంధితులై యున్న పదునైదుగురును
హృదయభావంబుల వెలిదోప నీక
నొండొరు జూచుచునుండిరి. కార్య
వైఫల్యజనిత నిస్స్పృహ మాత్ర ముండె
గొన్ని ముఖాల; కాపున్న సైనికులు
బందీలఘనతను పాటించియేమొ
నిలుచుండియుండిరి నిశ్చేష్టముగను.
వచ్చుకులోత్తుంగు పైఖరి జూచి
ఆశతో గొన్నిముఖాలు వెలింగె.
వారలకట్లు విప్పగ నాజ్ఞయిచ్చి
అనసూయ విడిపింప జనియె సొంతముగ.
దీనవదనమునందు లేనవ్వు గాంచె.

విప్పినప్పుడె తాకె వెలదిహస్తంబు
చారుమోహనసుకుమారిరూపంబు
తుమ్మెద రెక్కల తులయగుకురులు
ముగ్ధయై నిలుచుండె మురిసెను జూచి
ఆంధ్రవీరునిపట్టియసమానరూపు
ఆంధ్రదేశపు కన్నె యపరంజివన్నె
చేరెడు కన్నులు, చిక్కని బొమలు
ఆంధ్రలక్ష్మి యనంగ నామె విలసిల్లె
"సఫల మాయెనె నీవు చనిన కార్యంబు"
ఉత్తర మొసగలే కూరక యతడు
అనసూయ ననుజుల గనుచు నిల్చుండె.
వారిలో పెద్ద ముప్పదియేండ్ల వాడు
వేతాళరెడ్డి యన్నిరుదుమగండు
అందగాడని మాత్ర మనరాదుగాని
గరువంపుజూపును గాంభీర్యగరిమ
ఆంధ్రదేశపుకీర్తి కాలంబమైన
శౌర్యధైర్యములవిస్తారత దెలుపు.
రామరెడ్డి ద్వితీయరత్నము రూపు
సోదరివలె నుండు సుకుమారి యిరువ
దేడులు వయసుండు. మూడవవాడు
పదివర్షములవాడు బాలచంద్రుండు
గోపబాలురతోడ గోవుల మేపి
బృందావనంబునఁ బిల్లన గ్రోవి
బ్రకృతి బరవశత్వమ్ము నొందించి
ఆనందలహరిలో నాడించువాడు
గోపకుల్గాంచిన గోవిందురూపు
గోపికల్గాంచిన గోపాలురూపు
ముదుసలుల్గాంచిన ముద్దులరూపు
నందయశోద లానందించురూపు
కనిపించు బాలచంద్రుని జూచినంత
వృద్ధభూమీశుడు వీరభద్రుండు
వెండిపోగులవలె వెండ్రుకల్గలిగి
భారతాచార్యునివలె గానిపించె
అధికారి వచియించు నా బేరమునకు
వీర లొప్పుట సంభవించునె? అయిన
నడిగెద గాకని యనసూయతోడ
మెల్లగ ననె గుండె ఝల్లుమనంగ
గడగడ వడఁకునాకన్నియ యపుడు
ఇంతలోన నెరింగి శాంతముదాల్చి
తండ్రితో వృత్తమంతయు వచియించె
"నాయనా! మీమాట మాయన్న మీకు
కుండులాగున నాజ్ఞయిండయ్య!" యనియె
పెనిమిటి యున్నవైపున గొంత వంగ
ననసూయ పల్కులు వినవచ్చె రాణి
తల్లిగాన్పన మది తల్లడమంది
ఘోరవృత్తము విని కూలె నచ్చటనె
వృత్తాంతమంతయు వినియె వేతన్న
చెలరేగె బోనులో బులివలె నతడు
వీరభద్రుడు విన్నవించినయంత
సైనికభటుల నచ్చటినుండి పంపె.
ఇంతలో నరుదెంచె హంతకుడటకు
పరిచారకుల వానిపరమున నొసగ
మరునిముసమునందె యురిదీసె వారి
పెద్దకుమారుని వేతన్న గాంచి
ముదుసలితండ్రి గద్గదికతో బలికె
"నాయనా వేతన్న! నామాట! వినుము
రాజ్యస్వత్వముల సంరక్షణకొఱకు
ధంసన మొనరించు భాగ్యములేదు.
గొఱ్ఱెల మేకల కోళ్ల విధాన
చావంగవలసిన జాతక మయ్యె

ప్రాజ్యసామ్రాజ్యసంపాదనయందు
ఓరుగ ల్మెప్పించె వీరజీవనత
నీవీరవంశంబు చావంగవలసె
వీరభోజ్యం బగు ఘోరరణాన
అసువుల దొరగెడు నదృష్ట మేది?
కాలము నరిగానికతమున నిపుడు
కర్తవ్య మొక్కటే గనిపించు మనకు
పేరు చెందినయట్టి వీరవంశంబు
దొడ్డరాజుల గన్న రెడ్డివంశంబు
నశియింప కుండగ నగును రక్షింప
దేశము పరస్వాధీనమైపోయె
మన కేల ప్రాణంబు లని యెంచరాదు
బ్రతికితే శుభములు పడయంగవచ్చు
కాలము గమనించి కనుపెట్టియుండి
నీతండ్రి పగదీర్ప నీ వుండు తండ్రి!"
నిర్విణ్ణుడై పోయె నిలుచున్నయట్లె.
ఒనరింపజాల నంచని చెప్పె శిరము.
అనసూయ, చెంతకు జని కూరుచుండి
"అన్న! నావిన్నప మంగీకరింపు
పాపిష్ఠిహంతకు పాపుచేతులతో
బట్టి వధించుట భరియింపజాల
నాయందు దయయుంచి నగ్గడ తేర్పు
నాకష్టములబాపి నన్ను రక్షింపు
పగవాని కప్పగింపగ న్యాయమయ్య!
పెఱవానివనితగా వీక్షింపగలవె?"
అని తీవ్రదృష్టి చోళుని వైపుబఱపి
తనదుభావంబు చేతన్నకు దెలిపె
రామరెడ్డి పలికె "రాజ్యాధిపతుల
నాంధ్రదేశంబున కందించినట్టి
వంశంబు నశియింపవలయునే యిపుడు!
"కాకతీయులు తేరి కనరానిముఖము
లస్పృశ్యహంతకు డంటఁగావలెనె?"
పిఱికితనము మాను చేతన్న యింక."
అనసూయ లేచె చుట్టును మూగియున్న
అనుజులు నందిన్య దనయుడు గాంచె
ఎదుటనె నిలుచున్న ముదుసలితండ్రి
వినిపించె మేఘగంభీరభాషణము
"నా యాజ్ఞ పాలింపు నాయనా!" యనియె.
నిలుచుండె చేతన్న నిశ్చేష్టముగను
మోకాళ్ల వ్రాలె ముదుసలితండ్రి
అనసూయ, రామన్న యటులె యొనర్ప
"పాదాలపై బడె బాలచంద్రుండు
వంశాంకురంబును వాడిపోకుండ
గాపాడ జాలిన ఘనుడని యెంచి
బ్రతికియుండు మటంచు బతిమాలిరతని
తండ్రి వచించె 'ఓ తనయ! చేతన్న!
శౌర్యంబు నీలోన జచ్చెనా యేమి?
ఆంధ్రదేశపుశక్తి ఆంధ్రపౌరుషము
అడుగంటెనా యేమి? కడువృద్ధు నన్ను
ఎంత సేపిట్టుల నేడిపించెదవు?
నీజీవితంబును నీకష్టములను
పాటింపనగున యిప్పట్టున నీవు"
"వినిపింపు దేవి! నాతనయుఁడా వీడు"
"అంగీకరించెను" అని పల్కె రాణి
కండ్లలో దానేమి గాంచెనోగాని
సైన్యాధికారి యాజ్ఞాపించినట్లె
పురముఖ్యులెల్లరు నరుదేర వారి
బారులుగా నిల్పి భటుల గాపుంచె
వారిముందుగ పదిబారలలోన
శిల యుండె పైన గొడ్డలి తళ్కుమనియె



చిత్రప్రమాణము:—8 అడుగులకు=1 అంగుళము



రాయగిరి కీర్ణము I

దీనిలోని కిస్తు ఈశాన్యమునకు తిరిగియున్నది. ఎముకలు కపాలు దొరకినవి. ఇచ్చటి కుండల లోపలనున్న నైవ మన్ను గీతలున్నవి రాళ్ల ప్రాకారము (లేక వేలి) సంపూర్ణముగ లేదు.



చిత్రప్రమాణము:— 8 అడుగులకు = 1 అంగుళము

బేతిరెడ్డి జంకుచో తయారుగనె
హంతకు డుండె. నా కింత సేటికి
అడుగులశబ్దము సందటు వినిరి
అంతయు నిశ్శబ్ద మయ్యె నాయింటి
నై పేగె వారల వీక్షణాసక్తి
సవినయంబుగ చోళసైనికభటులు
దారి కిర్వంకల బారులు నిల్వ
భవనంబు వెల్వడి మందగమనమున
రాజకుటుంబము ప్రత్యక్షమయ్యె
వ్యసనలేశము లేదు వారిముఖాల
నిర్మలశాంతప్రపూర్ణత వెలిగె
ఒకడుమాత్రము ఖిన్నుడైయుండె నందు
బ్రదుకంత శపియింపబడిన బేతన్న.
ముదుసలిరాజును ముదుసలిరాణి
అనసూయ కౌసల్య అనుజ లిర్వురును
వధ్యశిలకు చేరువనె నిల్చి రంత
అన్నవద్దకు ముందు అనసూయ యరిగి
"అన్నయ్యా! ముందుగ నన్ను వధింపు
నామొర గరుణించి నన్గడ తేర్పు
వాయుజవంబున బరుగెత్తివచ్చి
రొజుచు నిల్చె కులోత్తుంగు డచట
ఘోరదృశ్యము గాంచె గొడ్డలి బూని
భీకరమూర్తియై బేతాళరెడ్డి
ఆతనిమొదుటనె అనసూయదేవి
మోకాళ్లపై నిల్చి ముఖమును వంచి
గండ్ర గొడ్డలి బెల్చుకంబుకంఠంబు
గాంచి నిర్వీర్యుడై కడ కిట్లు పలికె
"అనసూయ నన్పెండ్లియాడుచో నీకు
ప్రాణదాన మొసర్చు మాయధికారి"
ఉలికిపాటున లేచి యూరకనవ్వె
"అన్నయ్యా! కానిమ్ము అనుమాన మేల?"
గంభీరస్వరమున గద్దించిపలికె
తల దొర్లె రాజపాదముల చేరువకు
ధ్వని విని కండ్లు మూసిన రాణి వణకు
బాలచంద్రుం డను బాలకు డడిగె
"తల సరిగానున్నదా? అన్న! చూడు"
శూరుడు బేతన్నసోదరి ననియె
"కౌసల్యా! కన్నీరు గార్చుచున్నావు."
"అన్నయ్యా! నీమాట యనుకొనుచుంటి
మేము పోయిన నిన్ను ప్రేమింతు రెవరు?
పాపము నీ వెట్లు బ్రతికెద వింక!"
వృద్ధరాజన్యుండు వీరభద్రుండు
బిడ్డలరక్తము వీక్షించె నెదుట
నిశ్చేష్టులై ముందు నిల్చుండియున్న
ప్రేక్షకలోకంబు భీతితో జూచి
స్పష్టస్వరంబుతో బలికె నీరీతి
"నన్ను నమ్మియున్న నాయకులార!
చాలనినాళ్లాంధ్రజాతికి గలిగె
"సార్వభౌముల మార్చు జాలినయతడు
గ్రాసగానిని వేడ గక్కుఱితిపడియె"
శంకింపగానేల సమయముగాదు
ప్రత్యక్షుడున్నాడు పార్థుడే మున్న
"మాధవా! రథమును మరలింపు" మనియె
ఇతరుల ననసేల? నిప్పటివఱకు
బిడ్డలవలె మిమ్ము ప్రేమించినాడ
విధివశంబున మీకు బేతన్న మిగిలె
ప్రీతితో నాతని వీక్షింపుడయ్యా."
బేతాళరాయుడా! వీరాంకవీర!
జనకునిదీవన గొనుమయ్య తండ్రి!
చింతింపబనిలేదు ఛేదింపు శిరము

పాపరహితుడవయ్య భయమేల యింక"
చనుదెంచుతల్లిని గనినంతలోన
"కన్నకడుపు జీల్చుగాయికసాయి
ఘాతకు నన్నేల కంటివి తల్లి!"
అని పల్కి పెద్దపెట్టున నేడ్చెనతడు.
తనపట్టి పడెడుసంతాపము గాంచి
అతని ధైర్యము ఖాళిపూట గుర్తెఱిగి
అత్యున్నతంబగు నాచోటినుండి
తల్లి క్రిందుగ బడి తనతల పగుల
ప్రాణాల బాసె నారాణి; బేలన్న
హా! హా! యటంచు దా నవనిపై వ్రాలె.

చిలుకపాటివారి వచనాలు

ఈకాంతనుండి నీవేకాంత కేగేవో - నా కింత యెరిగించు పది నాకు జీవి
భూకాంతపై కాంత పొందిపొందక యున్న - యేకాంత సురలింగయింది నే నంమా (?)
ఎందునైన పొందు దేలాగు గనుగొందు - బొందితో కైలాస పురమొందనయితి ౧
ఉండీ యుండని ఓటికుండలోపలి నీళ్ళు - నిండబోసినరీతి నీకు నాకు
దండిగా పంకమున దగిలియుండినయట్లు - యెడ్లువిడిచిన బండినలెనాయ బ్రతుకు (?) ౨
తైల మందిన వత్తి తగలుపడి దీపాగ్ని - తైలమంటని వత్తి దహనగతిని
తైలమే ప్రాణంబు తనువత్తి పీడినను - తైలంబు వత్తిగతి తగనాయె బ్రతుకూ ౩
ఆకు పోకయు సున్న మంతగంధనజేసి - తా కర్తయెందరోయె రమ్మెందుబోయెనే
శోక పంజరములో జొచ్చివేసిన చిలుక - మాకు విహపను యింత మాత్రమేకాదా ౪
కాకి కోవెలపిల్ల గని పెంచినావెనుక - చీకాకు పడదన్ని చెలగి చెలగి
యాకులను చిలుకపాటికుల కులగన్న - కాకి కోవెలపిల్ల గతిని బసవన్నా? (మక్కికిమక్కి) ౫

ప్రథమ జ్వాల

వింజమూరి పార్థసారథి గారు

౧

గవర్నరుపేటలో సామాన్యంగా సోమసుందరమును ఎరగనివాళ్లు లేరు. అతనందరికీ వింతగా కనపడే వాడు. సౌమ్యస్వభావుడైనా చిన్ననాటినుంచీ ఎప్పుడూ ఇల్లుపట్టక తిరుగుతూ ఉండేవాడు. అతనికి సావాసా లెక్కువ. ముఖ్యంగా అతను లక్ష్మీకాంతముగదికి తరుచుగా వెళ్లుతుంటాడు.

లక్ష్మీకాంతము ఒంటరిగా వచ్చి బెజవాడలో చదువుకుంటున్నాడు. పెద్దవాళ్లు కోపపడతారనే భయము లేకపోవడముచేత పగలంతా పదిమంది స్నేహితులను చేర్చి చీట్లాడుతూ కాలము గడిపేవాడు.

వేసంగి ప్రవేశించింది. పొద్దుటిపూట స్కూలు పెట్టినారు. ఎండలు చిటపట లాడుతున్నవి. ఎఱ్ఱటి యెండలో కూడా మన సుందరము ఆ చీట్లాడేచోటికి రోజూ పన్నెండు కొట్టేటప్పటికి హాజరయ్యేవాడు. కాని పాప మతనికి చీట్లాడడము బొత్తిగా రాదు. బస్తీలో పుట్టిపెరిగి ఇంగ్లీషు చదువుకుంటూ చీట్లాట రాకపోవడము తోడివాళ్లకు కేవలము హాస్యాస్పదంగా కనపడేది. వాళ్లంతా సోమసుందరాన్ని చీట్లాడ లేనందున ఎగతాళి చేస్తూఉన్నా, అతను మాత్రము రోజూ అక్కడికి వెళ్లి వాళ్లాడుతుంటే కాస్తసేపు ఊరికే చూస్తూకూచుని తర్వాత మరి ఒక స్నేహితుని ఇంటికి వెళ్లుతూ కాలము గడుపుతూ ఉండేవాడు.

మన చీట్లపేకక్లబ్బుకు అవతలి ఇంట్లో మాధవరావు ఉంటున్నాడు. అతనికి పెద్ద పోకడలేమీ తెలియవు. ఎప్పుడూ చదువేమో తానేమో అన్నట్లు సంచరిస్తూ ఉంటాడు. చీట్లాటలో అరితేరినవాడే. ఐనప్పటికీ అతను లక్ష్మీకాంతం ఇంట్లో క్లబ్బులో మెంబరుగా చేరలేదు. ఓర్పులేనితనమువల్లనో మరి ఎందువల్లనో కాని, కొంతమంది మాధవరావు పెద్దమనిషితరహాఅంతా పట్టి టక్కరుతన మనేవాళ్లు.

ఆ వైశాఖమాసములో ఎండలూ గాడ్పులూ తీవ్రంగా ఉన్నవి. వడదెబ్బకు పాపము కొంతమంది పసిపిల్లలుకూడా పోయినారు. ఒకనాడు మధ్యాహ్నము సోమసుందరము భోజనము చేసుకుని లక్ష్మీకాంతము గదికి వచ్చినాడు. లోపల చాపలు వేసుకొని లక్ష్మీకాంతమూ స్నేహితులు ఆటన్లు ఆడుతున్నారు. ఒకడు ఆట అన్నాడు. అడ్డు అన్నాడు ఇంకొకడు. ఆట మరతు పైమరతులదాకా పెరిగి పోయింది. దిగుడుచెయ్యివాడు గంభీరంగా ముక్కదిగినాడు. ఆట అనర్గళంగా సాగిపోతున్నది. అంత పట్టున వాళ్లు ఆడుతున్నప్పటికీ సోమసుందరము లోపలికి రాగానే సభవారంతా పక్కన నవ్వి

నారు. ఎందుకు నవ్వినారో సోమసుందరానికి అర్థము కాలేదు. అతని మనస్సు పువ్వువలె కోమలమైనది. ఎప్పుడయినా స్నేహితులు ఎగతాళి చేస్తే అతను ముఖము చిన్న పుచ్చుకొనేవాడు. అతనికి కష్టముగా ఉన్న కొద్దీ తోటివాళ్లు ఎక్కువ ఎగతాళి చేస్తూ ఉండేవాళ్లు. కాని ఆరోజున మరీ అతని కది దుర్భరమైనది. అక్కడ ఉండలేక బయటికి వచ్చి వడగాడ్పు తోలుతూ ఉన్న పంచలో అరుగుమీద కూచుని శూన్యభావంతో ముందువైపుకు చూస్తూ ఉన్నాడు.

అట్లా చూస్తూ ఉండగా సుబ్రహ్మణ్య మనే కుర్రవాడు మాధవరావు ఇంటివైపు రావడ మతనికి కనపడ్డది. సుబ్రహ్మణ్యమూ సోమసుందరమూ మూడవఫారంవరకూ రాజవాడ హిందూ హైస్కూలులో కలిసి చదువుకున్నారు. కాని ఈమూడేళ్లనుంచీ చెడు సావాసాలవల్ల సుబ్రహ్మణ్యము సరిగా బడికి పోక చదువులేకుండా తిరుగుతూ ఉన్నాడు. అతన్ని చూడగానే షుమారు పందొమ్మిదేళ్ల ప్రాయమువాడని తెలుస్తుంది. కొంచెము ఎర్రనివాడే. అయినప్పటికీ అందగాడని చెప్పడానికి వీలు లేదు. కాని అతనికిమాత్రము ఆవిషయమున అనుమాన మణుమాత్రమైనా లేదు. మరీ ఈమధ్య పిలకజుట్టు కత్తిరించుకుని క్రాపింగు పెట్టుకొన్నప్పటి నుంచీ తన ముఖానికి వికాసము హెచ్చినదనీ అసలునూ తనజీవమే వచ్చినదనీ అద్దంలో మాటిమాటికీ చూసుకుని ఆనందించేవాడు.

సుబ్రహ్మణ్యము మాధవరావింటికి రావడ మారంభించి కొద్దిరోజులే అయింది. అదివరలో వాళ్లకిద్దరి విశేషంగా స్నేహ మున్నదని మాత్రం చెప్పలేము కాని ప్రస్తుతము రోజూ అతను మాధవరావుగారింట్లో కనపడతాడు. ఇవ్వాళ చక్కగా తలదువ్వుకొని వచ్చటి రాజమండ్రిసిల్కు ఉత్తరీయము కమ్మలుతీర్చి డాబుగా కనపడేట్లు కప్పుకొని, కొత్తగావస్తున్న కోరమీసాలు దువ్వుకుంటూ తాంబూలము నములుతూ మాటిమాటికీ చెయ్యిపెట్టి క్రాపింగు సద్దుకుంటూ వస్తూఉంటే సుబ్రహ్మణ్యము బహు వింతగా కనపడ్డాడు. వేషమంతా మారిపోయింది. అదేమి, నడకకూడా మారిపోయిందే! వానికోడిపుంజు నడకా అదీ చూడగానే సోమసుందరానికి నాటకములో వచ్చేవేషాలు జ్ఞాపకము వచ్చాయి.

సోమసుందరానికి పదిహేనేళ్లకంటె ఎక్కువ ఉండవు వానిముఖంలో ఒక విధంగా అమాయకత్వము కనుబడుతుంది. అయినప్పటికీ తెలివితేటలూ ఊహాలు తక్కువలేవని అంతా అనుకునేవాళ్లు. మాధవరావింట్లోకి పోతున్న సుబ్రహ్మణ్యనిచూచి అతను నవ్వినాడు. సుబ్రహ్మణ్యము ఏమీ మాట్లాడక అతనివైపు కొరకొరలాడుతూ చూస్తూ లోపలికి వెళ్లినాడు. సోమసుందరము అరుగుమీదనే కూచుని మళ్లీ శూన్యదృష్టితో ముందువంక చూస్తున్నాడు. అట్లా చూచేప్పు డతని పెదవులు చిరునవ్వుతో విక

సిస్తవి; కళ్లు కలవరిస్తున్నట్లు కనపడి చూచే వాళ్లను ముగ్ధులను చేస్తవి.

సుబ్రహ్మణ్యము మాధవరావు ఇంట్లోకి వెళ్లి రెండునిముషము లయింది. సోమసుందరు డేదో పరధ్యానంగా కూచుని ఉన్నాడు. ముందుకు సూటిగా చూస్తూఉన్న అతని దృష్టు లేలనో మాధవరావింటి వైపు మరలినవి. మెరుపు మెరసినంత సేపులో అతని కంటికి పచ్చని రుమాలు గాలిలో ఎగరవేసి ఎవరినో పిలుస్తున్నట్టు కనపడ్డది. సోమసుందరుని ధ్యానం మరలినది. ఉన్నట్టే ఉండి ఎదుటింటివైపుకు చూపులు మరలించినాడు. అప్పుడు వానికళ్లకు చక్కని మెరుపుతీగవంటి ఒకానొక బాలిక సొగసుగా సింగారించుకొంటూ ఆయింటి కిటికీవద్ద కానవచ్చినది.

ఆ మేడలో స్వామినాథయ్యరుగారు ఉన్నారు. ఆయన కోయంబుత్తూరువాడయి నప్పటికీ తెలుగు జిల్లాలోనే చాలాకాలము నుంచీ ఉద్యోగం చేస్తూ ఉన్నందువల్ల తెలుగు రకంగానే ఉంటాడు. ఆయన పిల్లలుకూడా తెలుగుదేశములోనే పుట్టి తెలుగుబళ్లలోనే చదువుకుంటూ ఉండటము చేత వాళ్లు మనపిల్లలవలెనే తెలుగు చక్కగా మాట్లాడుతారు. ఆయనకు ఆడపిల్ల ఒక్కతే. ఒకసారి వాళ్లంతా స్వదేశము చూడడానికి వెళ్లినప్పుడు తాతగారూ వాళ్లంతా అరవమే మాట్లాడడము విని అప్పటికి అందరిలోకి చిన్నదైన కమల, 'ఏమిటీ, ఈ అరవగోడూ' అన్నందుకు వాళ్ల తాతగా రామెను తనజీవిత కాలములో క్షమించలేదట. ఆమెకు ఇప్పుడు పదమూడు సంవత్సరాల ఈడు ఉంటుంది. దక్షిణాదిస్త్రీలు ఎప్పుడూ కొర్నాటి చీరెలు కట్టుకుంటూ రెండుమూడు బట్టలతోనే కాలము గడుపుతూ ఉంటారని మనవేపున అంతా అనుకుంటారు. ఒకవేళ ఆమాట నిజమైనప్పటికీ కమల కొర్నాటిచీరలు మాత్రమే కట్టుకోక బొమ్మరంగు చీరెలు, ఊదారంగు సిల్కుచీరెలు రకరకాలవి కట్టుకొని ఎంతో నాజూకుగా ఉండేది. ఆడనలుసు ఒక్కతే కావటముచేత తల్లితండ్రులు ఆమె అడిగినదల్లా కొంటూ గారాబముగా చూచుకునే వాళ్లు. ఇంకా పసితనము పూర్తిగా వదలక పోవటమువల్ల ఆమె ముచ్చటగా ఇంట్లో ఇటు అటు తిరుగుతూ ఉండేది.

మంచి గౌరవముగలవంశములో జన్మించిన పదుహేనేళ్ల కుఱ్ఱవానికి లోకానుభవము చాలా తక్కువగా ఉంటుంది. అది మంచీ చెడ్డా బాగా తెలియని ఈడు. అందులో భయభక్తులతో పెరిగిన సోమసుందరానికి ప్రపంచములో జరిగే విచిత్రకార్యాలు ఏమి తెలుస్తవి? అయినప్పటికీ విద్యావంతుల కుటుంబములో జన్మించిన హేతువున అతని బుద్ధి కుశాగ్రమయినది. అందులో మనస్సుకు కూడా వికాసము అప్పుడే కొద్దిగా ఏర్పడుతున్నది.

పక్క ఇంటిలో సుబ్రహ్మణ్యము ఉత్తరీయము ఎగరవేయడమూ ఎదుటిమేడలో అప్పుడే చక్కని మెరుపుతీగవంటి ఒకానొక బాలిక సింగారించుకుంటూ కిటికీవద్ద కానరావడమూ చూడగానే సోమసుందరుని మన

న్సులో ఏదో సందేహము ఏర్పడినది. బాగుగా చూచినాడు. చక్కగా ఆలోచించినాడు. కొంతసేపు పస్తాయించి అరుగుమీదనుంచి దిగి ఇహ ఆరోజు స్నేహితుల ఇళ్లకు వెళ్లకుండా సరాసరి ఇంటికి వెళ్లిపోయినాడు

కొంతకాలము గడిచినది. సోమసుందరుడు లక్ష్మీకాంతమింటికి మామూలుగానే వస్తున్నాడు. మాధవరావింటికివచ్చే సుబ్రహ్మణ్యము వేషము ఆరోజుకారోజుకు విచిత్ర మవుతున్నది. అతను అంత సంపన్నుడు కాడు. మునుపు ముతకిగుడ్డలు కట్టుకుని వీధులవెంట తిరిగేవాడు ఇప్పుడు పూటకొకరకము దుస్తులు ధరిస్తున్నాడు. పొద్దున పూట విస్త్రీమడ్లు కట్టి పట్టుచొక్కా తొడిగి పైన పచ్చని రాజమండ్రీ సిల్కు వేసుకొంటే సాయంత్రానికి అవి తీసివేసి జరీపంచె కుచ్చె కట్టుకుని, పిండిపెట్టి గ్లాసువలెనున్నగా విస్త్రీ చేసిన కఫ్సులుగల లాంగ్లాతు చొక్కా తొడుక్కొని నడుముకు వలిపెపు ఉత్తరీయము బిగించి మాటిమాటికి స్వామినాధయ్యను గారి ఇంటివేపు తనగుంట కళ్లతో చూస్తూ తెచ్చిపెట్టుకొన్న కొత్త నడకలతో మాధవరావు దగ్గఱకు వచ్చి పోతుంటాడు. ఇక అతను క్రాపింగు దువ్వే పద్ధతులకు అంతేలేదు. ఒకసారి జుట్టు అంతాపైకి దువ్వి విశాలమైన నుదురు కలవానివలె కనపడతాడు. ఇంకొకసారి ముందుకు దువ్వి ప్రబంధస్త్రీల ముంగురులు జ్ఞప్తికి తెప్పిస్తూ ఉంటాడు. మరొక సారి వెంట్రుకలు పక్కకు వంకెలు వంకెలుగా దువ్వి రంగాతరంగములు శిరస్సున ధరించిన సాక్షాదీశ్వరుని అవతారమువలె ఉంటాడు. ఇక వాడు వాడుకున్న తలనూనెలకు, అత్తర్లకు లెక్క లేనే లేదు. సీతాకోకచిలుకవలె ఉంటున్నాడు.

౨

మండు వేసంగి వెళ్లిపోయినది. వానలు జోరున కురవడ మారంభించినవి. వానాకాలములో గవర్నరుపేటలో కూడా రోడ్లు బొత్తిగా బాగుండవు. ఎక్కడచూచినా బురద. రోడ్డుమీదనే గుంటలు పడి నీళ్లతో నిండుకుంటవి. రోడ్డు మధ్యనున్న చెట్లు సుఖప్రదంగా నీడ ఇచ్చినప్పటికీ ఇప్పుడుమాత్రము వాన వెలిసినతర్వాతకూడా చిటపట చినుకులు రాలుస్తూ వీధులలో సంచరించేవాళ్లకు చికాకు కలిగిస్తూ ఉన్నవి.

బెజవాడలో సహాయ నిరాకరణోద్యమము ప్రజ్వరిల్లుతున్నది. గాంధిమహాత్ముడు దేశీయనాయకులతో వచ్చివెళ్లి ఎంతో కాలము కాలేదు. పెద్దలూ, పిన్నలూ, బాలురూ, బాలికలూ రకరకాల ఖాదీబట్టలు కట్టుకొని వూళ్లో అన్నిమూలలా కన్నులపండువుగా కనబడుతున్నారు.

సోమసుందరము పెద్దవాళ్ల భయం చేతనో, చదువుమీదనున్న ఆసక్తి చేతనో పాఠశాలా బహిష్కారముమాత్రము చేయలేదుకాని ఖాదీబట్టలే కట్టుకునే వాడు. ఒకనాడతను కొత్తబట్టలు కుట్టడము అయినవి కట్టుకొని అనేకమైనరంగులు గలిగి పేముతో చేయబడ్డ చక్కని స్వదేశపుగొడుగు [illegible] వేసుకొని విలాసంగా తిప్పుకుంటూ లక్ష్మీకాంత

మింటికి వచ్చినాడు. కాని లక్ష్మీకాంత మింట్లో లేనందున స్నేహితులతో కొంతసేపు కాలక్షేపము చేయకుండా ఊరికే ఇంటికి తిరిగి వెళ్లడానికి మనస్సు ఒప్పక నెమ్మదిగా వెళ్లిపోతున్నాడు. కాస్తదూరము సాగిపోగానే మాధవరావు ఎదురయినాడు. అతను సోమసుందరాన్ని చూడగానే, 'ఒరే! పాముకోళ్లు తక్కువేకాని కాశీకి వెళ్లుచున్నస్నాతకపు పెళ్లికొడుకులాగా ఉన్నావురా!" అని ఎకసక్కెమాడినాడు. పుష్పకోమలుడైన సోమసుందరుడు సిగ్గుపడి నవ్వగా అతనిమనోహరనేత్రములలో సౌందర్యము వెల్లివిరిసింది.

సోమసుందరుడు వీథివెంట నడుస్తున్నప్పుడు అతని లేడికళ్లు ఎక్కడా నిలవక ఊరికే సంచరిస్తూ ఉంటవి. అప్పుడతనిని చూచేవాళ్లకు ముచ్చటగా ఉంటుంది. 'మన సోముడికళ్లు మనఇంట్లో అందరి వాటికంటె అందంగా ఉంటాయి," అని అతని అక్కచెల్లెళ్లు అంతా అనేవాళ్లు. పూవవయస్కుడైన అతని కామాటలు ఎంతో ఆహ్లాదము కలిగించేవి. శుష్కప్రియాలు పల్కే భట్రాజుల స్తోత్రాలకే లోకానుభవము కలవాళ్లు కూడా ఉబ్బితబ్బిబ్బులవుతున్నప్పుడు హృదయపూర్వకంగా వాళ్లు ఆమాటలు అన్నప్పుడు సోమసుందరము పొంగడములో ఆశ్చర్యమేమున్నది? అతని కన్నులే కాక రూపము కూడా మనోహరమైనది. పచ్చని బంగారము వంటి చాయ. కొంచెము ఈడుకు మించిన పొడగరియై మనోజ్ఞమైనలతవలె సుకుమారముగా ఉంటాడు. ఈకోజన మరీ అవిచిత్రమైన గొడుగూ చక్కని అంచుల కొత్తఖాదీ బట్టలూ కట్టుకొని వెళ్లుతుంటే జగన్మోహనంగా ఉన్నాడు. కాబట్టి మాధవరా వన్న మాటలలో వింత ఏ మున్నది!

తర్వాత కృష్ణాతీరాన చల్లగాలికి తిరుగుదామని వాళ్లిద్దరూ బయలుదేరి పోతున్నారు.

వాళ్లు నాలుగడుగులు సాగిపోగానే, చక్కని మబ్బురంగుచీర కట్టుకుని కళ్లనిండా కాటుక తీర్చి, ఎఱ్ఱ కలువలవంటి పాదాల మీద పసుపు ముద్దు గొలుపుతూ ఉండగా ఒయ్యారముగా అడుగులు వేసుకుంటూ వస్తున్నకమల ఎదురైంది. పేరంటము చేసే ఆడపిల్లలను చూడడము ప్రతివాళ్లకూ నిర్వ్యాజమైనఆనందము కలిగిస్తుంది. సోమసుందరానికి పుట్టుకతోనే సౌందర్య తృష్ణ ఉన్నది. ఆకమల ముగ్ధమనోహరరూపము చూడగానే అతనిలో అప్పుడు నిర్వికారమైన ప్రేమభావముద్భవించి ఉల్లాసముకలిగించింది. వాళ్లు రావడము చూచి కమల పక్కగా తొలిగి పోతున్నది. సోమసుందర మాపిల్లవంక చూచి మాధవరావుతో, "ఈ అమ్మాయి స్వదేశీ వస్త్రాలు వేసుకుంటే ఇంకా ఎంతబాగుంటుంది!" అని కమలకు వినబడేటట్లుగా పలికి ముసిముసి నవ్వులు నవ్వినాడు. కమలకు అప్పుడే సిగ్గు కాస్త తెలుస్తున్నది. ఆమాట లామె వినగానే సిగ్గుతో తలవంచుకుని కొంత దూరము నడిచి సోమసుందరమువంక ఓరచూపొకటి విసిరింది. సోమసుందర మది చూచినాడు.

"......కమలరెదురైంది.........పక్కాగా తోలె......సోమసుందరము వంక ఓరచూపొకటి విసరింది"

పొంగిపొరలుతున్న కృష్ణవేణిమీదుగా మలయమారుతమువచ్చి వాళ్ల దేహములను చుంబనముచేసినది. దగ్గరనున్న వేపచెట్టునుంచి పళ్లు జలజల రాలినవి. ప్రపంచమంతా సోమ సుందరునికంటికి నూతనశోభతో కాన వచ్చింది. పక్కనున్న కాలవమీదనుంచి పల్లె వానిప్రేమపాట వాళ్లకు కర్ణపర్వమైనది. అ ప్రయత్నంగా సోమసుందరుని పెదవులవెంట పున్నాగరాగము వెలువడినది. మందవాయు వుతో శ్రుతి కలిసి అతనిరాగము అవ్యక్త మాధురి ఒలికింది. ఎగతాళి చేయ బోతున్న మాధవరావు కూడా ముగ్ధుడై పోయినాడు.

3

సోమసుందరమూ సుబ్రహ్మణ్యమూ ప్రతి రోజూ మాధవరావు ఇంట్లోగాని ఆ సమీపం లోగాని కలుస్తూ న్నందుల్ల ఉభయులకూ చిన్న నాటి పరిచయము వృద్ధి పోతున్నది. ప్రతిరోజూ సాయం కాలము ఇద్దరూ కలిసి ఇటు అటు షికార్లు చేస్తూ ఉండేవాళ్లు. కమల కనపడ్డప్పుడల్లా సుబ్రహ్మణ్యము విశారచేష్టలు చెయ్యడమూ సోమ సుందరు డసహ్యిం చుకోవడమూ జరుగుతూవచ్చాయి. సాయం సమయమందు చక్కని దుస్తులు ధరించి వాళ్లి ద్దరూ ఒకరితోఒకరు కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ అయ్యారు గారింటివేపు చూ పులు మరలించి చూస్తూ ఉండేవాళ్లు. కమ లమ్మ మనస్సును వీళ్లు ఆకర్షించినారని చెప్ప లేము కాని వీళ్లాదారిన వెళ్లినప్పుడల్లా ఆమె ముస్తాబై నిత్యము కంట బడేది. దూరదృష్టీ సూక్ష్మాలోచనా లేని సుబ్రహ్మణ్యము తన అందం చందం చూచి కమల భ్రమించుకూ ఉందని తలంచి మురుస్తూ ఉండేవాడు. సోమ సుందరునిహృదయంలో ఈగోడే లేదు. చక్క నివస్త్రములనూ చక్కని మనుష్యులనూ చూడడ మతనికి సరదా. కాబట్టి సౌందర్యరాశి అైన కమల అతన్ని ఆకర్షించింది.

అది మంగళవారము సాయంకాలము. సోమసుందరము బడినుంచివచ్చి పుస్తకాలు ఇంట్లోపడేసి కమలాదర్శనమునకై వెళ్లినాడు. ఆమెను ఒక్కరోజు చూడకపోతే అతనికి తోచేదికాదు. సూర్యాస్తమయము అప్పుడే కాబోతున్నది. కమలమ్మ వాకిట్లో గుమ్మముదగ్గర చాపవేసుకొని పీఠపై పుతలపెట్టుకొని పడుకొని ఉన్నది. సోమసుందరు డాదారిన వెళ్లుతూ "సుబ్రహ్మణ్యము!" అని కేకవేస్తూ కమల వంక తిరిగి చూస్తూ ఉన్నాడు. కమల అతనికంఠస్వరము విని కాబోలు, లేవకుండానే తలఎత్తి సోమసుందరము వంక చూచింది. అతనుకూడా ఆమెవంక చూచినాడు. ఇద్దరిచూపులూ కలిసినవి. సోమసుందరు డుల్లాసపూరితుడైనాడు. చీకట్లు ప్రపంచమున అల్లుకోసాగినవి. ఆహారార్థము పోయిన పక్షులు తమ కాంతలను కలుసుకొనవలెననే వ్యగ్రభావంతో గూళ్లకు చేరుకుంటున్నవి. సోమసుందరుడు ఇంటికి మరలిపోయినాడు.

ఇది జరిగిన కొన్ని రోజులకే ఒకనాడు సోమసుందరము చేత పుస్తకాలు పట్టుకుని బడికి వెళ్లుతూ తలవనితలంపుగా సుబ్రహ్మణ్యమును కలుసుకున్నాడు. వీళ్లిద్దరూ సాగిపోతూ ఉండగా దూరమునుండి ఎదురుగా వస్తూఉన్న కమలమ్మ కనబడ్డది. శాలువ అంచు ఖాదీచీరె కట్టుకుని నవ్వుముఖంతో చేతిలో కరేపాకు విలాసంగా ఇటుఅటు తిప్పుతూ మనోహరంగా వస్తున్నది. వర్షము కురిసి ఉండడమువల్ల రోడ్డంతా ఎండీ ఎండని బురదతో నిండి ఉన్నది. పాము మెలికెలు తిరిగి ఉన్న ఆ సన్నని కాలిదారిగుండా ఆమె జాగ్రత్తగా వస్తూఉంటే నాగకన్యకలు సోమసుందరానికి జ్ఞప్తికి వచ్చినారు. కవితాత్మకలవాడగుటచేత అతను ఆమెలావణ్యమును సుబ్రహ్మణ్యం వంక తిరిగి వర్ణింపసాగినాడు.

"...సుబ్రహ్మణ్యము:—కమలమ్మను హఠాత్తుగా చేయిపట్టుకున్నాడు. కమల ముఖము చిట్లించుకొని ధుమధుమలాడుతూ......చేయివిడిపించుకొన జూచుచున్నది."

మొద్దు సుబ్రహ్మణ్యము పరవసుడైనాడు. "కమలమ్మను చేయిపట్టుకుని పలకరించేదా?" అని సోమసుందరాన్ని అడిగినాడు. సోమసుందరము భయముతో "వద్దు, స్త్రీ సౌశీల్యము కాపాడవలసినది" అని కఠినంగా చెప్పినాడు.

ఒక్క నిముష కాలములో కమల వాళ్ల సమీపానికి వస్తుంది. నిముషము గడిచినది. సోమసుందరము కాలిబాటనుంచి పక్కకు బురదలోకి దిగినాడు. సుబ్రహ్మణ్యము కదల లేదు. ఉద్రేకముతో అతని దేహము కంపిస్తున్నది; ముఖ మెఱ్ఱబారినది; చెమటలు పోస్తున్నవి; ఉత్తరీయము జారుతున్నది. సుబ్రహ్మణ్యము మూర్ఖత్వమూ అతని ఆకారము చూచి కొంచెము భయముతో కాలిబాట నుండి అవతలికి తొలగ నుద్దేశించుతున్న కమలమ్మ నతడు హఠాత్తుగా చేయిపట్టుకున్నాడు. పక్కన ఉండి చూస్తున్న సోమసుందరము నిర్ఘాంతపోయినాడు. అతనికన్నులు చీకట్లు కమ్మినవి. ఇంతలో కమల ముఖముచిట్లించుకొని ఘుమఘుమలాడుతూ కాలభుజంగివలె చేయి విదిలించుకొని ముందుకు సాగిపోయింది. సుబ్రహ్మణ్యము నిశ్చేష్టుడైనాడు.

కమల కొంతదూరము నడిచిపోయి సోమసుందరమువంక తిరిగి జాలిగొలుపుతున్న చూపులు ప్రసరింపచేసింది. ఆచూపులతనిహృదయంలో ములుకులువలె నాటినవి. అతనికి కర్తవ్యతాజ్ఞానము వచ్చేలోగా సుబ్రహ్మణ్యము తలవంచుకొని నెమ్మదిగా జారిపోయినాడు సోమసుందరము కొన్నిక్షణములపాటు అచేతనుడై నిశ్చలుడై నిలిచి కొంతసేపటికి ధైర్యము తెచ్చుకొని అతని కళ్లెదుటనే జరిగినఆ భయంకరవిషయమును గూర్చి 'ఏమివిరసము! ఎంతసాహసము! అని ఆలోచిస్తూ నెమ్మదిగా బడికి వెళ్లిపోయినాడు.

౪

ఇప్పుడు సోమసుందరుని మనస్సునందు తరంగములవలె తలంపులు పొరలి వస్తున్నవి. ఉదయమున కమలమ్మను సుబ్రహ్మణ్యము అవమానము చేయడము, అప్పుడు తన్ను కమల కరుణారసము ఒలుకుతున్న నేత్రాబ్జములతో చూడడము పదేపదే జ్ఞాపకము వచ్చి అతని మనస్సును కలతపెట్టసాగినవి. స్కూలులో ఉన్నంతసేపు పిచ్చివానివలె ఉన్నాడు.

సాయంకాలము మామూలు ప్రకారమతడు లక్ష్మీకాంతము గదికి వచ్చినాడు. లక్ష్మీకాంతమూ మాధవరావూ మాట్లాడుకుంటున్నారు. వచ్చిన సోమసుందరాన్ని చూడగానే లక్ష్మీకాంతము "ఒరేయి!, నీవు రోజురోజూ కీల్గా అయిపోతున్నావేమిరా?" అన్నాడు. మాధవరావు లక్ష్మీకాంతాన్ని చూచి వికటంగా కన్ను గీటినాడు. సోమసుందరము మనస్సు అక్కడ లేదు. అందుచేత వారి పరిహాసపుమాటలు అతను వినిపించుకోలేదు. ఏమీ బదులు మాట్లాడకుండా కొంతసేపు అక్కడ ఉండి సోమసుందరము లేచి వెళ్లుతున్నాడు. వెనకనుంచి లక్ష్మీకాంత మాధవరావులు నివ్వెరపోయి అతనివంక రెప్ప వాల్చక వికటపుచూపులతో చూస్తున్నారు.



శ్రీ శైల దేవాలయ పటముయొక్క వివరములు రాగల సంచికయందు [illegible]

సోమసుందరుని హృదయమంతా కమలతో నిండి ఉన్నది. అతను ఇప్పు డెక్కడికి వెళ్లుతున్నాడో అతనికే తెలియదు. లక్ష్మికాంతం దగ్గరకు వచ్చేటప్పుడుగాని మళ్లీ తిరిగి వెళ్లేటప్పుడుగాని నిత్యమూ కనపడే కమల మనోహర రూపము నేడతనికి కనబడలేదు. సుబ్రహ్మణ్యం చేసిన సాహసకార్యానికి ఆమె ఎంత సిగ్గుపడుతున్నదో! అతని పక్కనే ఉండి అది నివారించలేకపోయినందుకు తన మీదకూడా కమలకు అసహ్యము కలిగిందేమో! ఈవిధంగా మనోవేదనపడుతూ కాళ్లు నడిపించుకొనిపోయిన చోటికి వెళ్లి పోయినాడు.

రాత్రి ఎనిమిదిగంట లయినది. పండు వెన్నెల కాస్తున్నది. భోజనమయినతర్వాత వాకిట్లో అరుగుమీద కూర్చున్న సోమసుందరుని మనస్సు తపిస్తున్నది. కమల తనను క్షమించినట్లు తెలుసుకోనిది అతని ఆవేదన శాంతించదు. చివాలున లేచి మాధవరావింటి వేపు వెళ్లినాడు.

ఆ వేపుగా ఎవరో పెళ్లివారు ఊరేగుతున్నారు. గుంటూరునుంచి రామదాసు మేళము వచ్చింది. సన్నాయిమీద రాళ్లు కరిగేట్లు నాగస్వరము వాయిస్తున్నారు. వేరేమీ ఆలోచించకుండా, పెండ్లికొడుకునూ పెండ్లికూతురునూ చూడకుండా, సోమసుందరము మేళమువద్దకు పోయి నిలుచున్నాడు. గానము మధురంగా ఉన్నది. రాగం వింటూన్న కొద్దీ సుందరముహృదయము అనేక ...ప్పులు చెందుతూ ఉన్నది. అతని ఆత్మ ... శాంతించినది. సంగీతమాగిపోయింది; ఊరేగింపు సాగిపోతున్నది. అన్నిరకాలవాయిద్యములూ అతని శ్రవణములలో కర్ణకఠోరంగా ప్రవేశిస్తున్నవి. అక్కడనే నిలబడి అయ్యరుగారి ఇంటి వైపు చూచినాడు.

వాకిట్లో కమలమ్మ నిలుచున్నది. ఆమె తనవైపు చాలాసేపటినుంచి తదేకధ్యానంతో చూస్తున్నట్లు గ్లాసు లైట్ల వెల్తుర్లో అతనికి స్పష్టంగా కనబడ్డది. వాళ్ల ఇద్దరిచూపులు కలిసి సిగ్గుతో ఒండొంటితో పెనుగులాడినవి. ఆమె అప్పుడు తెల్లని వలిపెపుచీర కట్టుకొని గ్లాసు లైట్ల కాంతితో మరింత ప్రకాశమానముగా ఉండి పండువెన్నెలశోభను తిరస్కరిస్తూ నిలుచుని ఉన్నప్పుడు సాక్షాత్తు మోహినీవిగ్రహం లాగా సోమసుందరానికి కనబడ్డది. ఇప్పటి కెన్నోసారులు ఆమె అతన్ని చూచి ఉన్నది; అత నెన్నోసారులు ఆమెను చూచి ఉన్నాడు. కాని ఈరోజునమాత్రము ఎందువల్లనో ఆమెచూపు అతన్ని కలచివేసింది. మునుపెప్పుడూ తనలో కలగనిభావాలు అతని హృదయంలో అప్పుడు మెరుపు మెరిసినట్లు ఉద్భవించి అతనికి అర్థము గాకుండా బాధపెట్టినవి.

మార్పు చెందిన హృదయముతో సోమసుందరము మాటిమాటికి కమలమ్మ ఇంటి వైపుకు తిరిగి తిరిగి చూస్తూ నెమ్మదిగా ఇంటికి వెళ్లిపోయినాడు. రాత్రి పన్నెండు కూడా దాటింది; ఇంకా వానికి నిద్ర పట్ట లేదు. చాలాసేపు పక్కపై ఇటు అటు అశాంతితో తిరిగి సుబ్రహ్మణ్యము కమలచేయి పట్టు

కొన్నట్లూ కమల తనవైపు ఏదోగా చూచినట్లూ కలవరిస్తూ ఎట్టెట్లో నిద్రపోయినాడు.

తెల్లవారింది. రాత్రి నిద్రలేని బడలికతోనూ మనస్సు నింకా వదలిపోని ఆందోళనముతోనూ సోమసుందరము అరుగుమీద కూర్చుని దంతధావనము చేసుకుంటున్నాడు. ఇంట్లోవాళ్లంతా ఎవరిపనిమీద వాళ్లున్నారు. గడిచిన రాత్రి జరిగిన సంగతి ఊరికే ఆలోచిస్తూ నోట్లోపెట్టిన వేలు కదపక అట్లే ఉంచుకొని నేలవంక చూస్తున్నాడు. అప్పుడు హఠాత్తుగా వాని అన్నగారు కళ్లెఱ్ఱ చేసుకొని అతని వద్దకు వచ్చి వానిగడ్డము పట్టుకొని మోటుగా ముఖము పైకెత్తినాడు. సోమసుందరము ఉలిక్కిపడ్డాడు "ఒరే వెధవా! ఆ వెధవసహవాసముచేసి చెడిపోతున్నావట్రా!" అని గద్దించి పలుకుతున్న అన్నగారిమాటలు అతనికి వినబడ్డవి. ఈ సందడి విని వాళ్లక్కగారు ఇంట్లోనుంచి పరిగెత్తికొని వచ్చి అన్న మోటుతనము చూచి "పొద్దున్నే లేవగానే చిన్నవాణ్ణి పట్టుకొని అట్లా తిడతావేమిరా?" అన్నది. ఆమాటకు మరింత కోపంతో అన్న తమ్ముణ్ణి పట్టుకొని ఇటు అటు విదిలించి 'వీడా! పాడుసావాసాలవల్ల చెడిపోతున్నాడు!" అన్నాడు.

"ఏమిచేశాడేమిరా"? అని అక్క అడిగింది.

"ఏమని చెప్పమన్నావు! చెప్పుకుంటే సిగ్గు కూడానూ!" అని అన్న ధుమధుమలాడుతూ వెళ్లిపోయినాడు.

అక్కగారా మాటలకు నివ్వెరపోయింది.

ఇప్పటివరకూ సోమసుందరము ఇంట్లో వాళ్లెవరిచేతనూ ఒక్కమాటకూడా పడి ఎరగడు. అతని సత్ప్రవర్తనమూ శాంత స్వభావమూ కోమలబుద్ధి ఇంట్లో అందరికి ఆశ్చర్యం కలిగించేవి. అతను అభిమానవంతుడని తెలిసి ఇంట్లో అంతా బహుఆదరించే వాళ్లు. అందులో పసివాడు!

ఈవిధంగా అన్నగారు అని వ్రంసడానికి కారణము అతని నిష్కళంక హృదయానికి ఏమీ కనపడలేదు. తనను ఎప్పుడూ ప్రేమాతిశయంతో చూచే అకళంకుడైన తన అన్నగారు నిష్కారణంగా ఏపాపమూ ఎరుగని తన్ను దూషించిన మాట లతనిహృదయమును శూలములవలె భేదించినవి. అదికాడా అక్కగారిముందు తనకు పరాభవము జరగడము మరింత కష్టకారణమైనది.

అతనికి పిచ్చి ఎత్తినట్లయింది. దానికి తోడుగా ఇంట్లోవాళ్లంతా అతనియెడల ఏదో వింతగా ప్రవర్తించ సాగినారు. అవమానము కలిగినతర్వాత ప్రథమోద్రేకము కొంత శాంతించిన పిమ్మట అతను అన్నగారి కటువంటి దురభిప్రాయము తనపై కలగడానికి కారణమేమని ఆలోచింప నారంభించినాడు. మనస్సు పరిపరివిధాల పోయింది. తానా మధ్యను చేసినపనులు పలికిన మాటలు మెరుపులు మెరిసినట్లు వెంట వెంట అతని మనోవీథిలో పొడగట్టినవి. కాని అతను ఎంత శోధించుకున్నా సోదరుడు ఆవిధంగా కోపిం[illegible]డానికి తగిన హేతువు కనుపించలేదు. [illegible] ఎవరైనా గిట్టనివాళ్లైనా కల్పించి [illegible]

చెప్పినారా అంటు అతని కటువంటివాళ్లు ఎవరు లేరే! అతన్ని చూచిన ప్రతివానికీ అతనిమీద ఒకవిధమైన ప్రేమ కలిగేది. ఆలోచించిన కొద్దీ అతనిమనస్సునందు కల్లోలము ఎక్కువ కాసాగినది. సుబ్రహ్మణ్యము ఆవెనకటి రోజున వీధిలో పట్టపగలు కమలచేయి పట్టుకొన్నప్పుడు తాను దురదృష్టవశాత్తుగా అతనివెంట నున్నసంగతి జ్ఞప్తికి వచ్చినది. అప్పుడెవరో ఒకరిద్దరు చూచి ఉన్నది కూడా పొడగట్టింది. "కాని ఆవిషయములో నేనే పాప మెరగనే! సుబ్రహ్మణ్యమును మొదటనే నివారించవలెనని ప్రయత్నము చేసినాను గదా! తర్వాత చీవాట్లుకూడా పెట్టినానే! ఇక నెన్నటికి ఆ దుర్మార్గునిముఖమువంక చూడనని ఒట్టుపెట్టుకున్నానుగా!" అని ఏమేమో వితర్కించుకున్నాడు. లోకానికి మనస్సు ప్రధానముకాదని పాప మాకుఱ్ఱవానికి ఎట్లా తెలుస్తుంది!

౫

ఆరోజుమధ్యాహ్నము కమల కానరామికి మిక్కిలి చింతిల్లుతూ సుబ్రహ్మణ్యము కాలుగాలినపిల్లివలె ఆమెఇంటిచుట్టూ పడయాడుతున్నాడు. ఇంతలో చేయి కడుక్కుంటూ కమల అతన్నిచూచి లోపలికిపోయింది. వాడు కిటికీవద్దకు వెళ్లి చూడడను నిలుచున్నాడు. వెళ్లినాడో లేదో అని కమల తొంగిచూచింది. అది సుబ్రహ్మణ్యము కనిపెట్టి గచ్చకాయంత తెల్లని కాగితపుచుట్ట నొకదాన్ని కిటికీలోగుండా లోపల పడవేసి అక్కడనిలవక గృహాభిముఖుడై గబగబనడిచి పోతున్నాడు.

ఆసాయంకాలము సోమసుందరుడు లక్ష్మీకాంతం ఇంటికి వచ్చినాడు. దానిమ్మగింజలవంటి పలువరస కనపడేట్లు కిలకిలనవ్వుతూ రోజూవాకిట్లో కూచునే కమల నేడు కానరాకున్నది. మూర్ఖుడైన సుబ్రహ్మణ్యం ఏదో చేసిఉంటాడని ఊహించి అతను ఉగ్రుడైనాడు. లక్ష్మీకాంతంవాళ్లు తమదోవన తాము పేకాడుకుంటూ ఉంటే అతను వెళ్లి అరుగుమీద విచారమగ్నుడై కూచున్నాడు. సాయంత్రము ఆరుగంటలయినా కమలజాడ కనపడలేదు. ఇహ చేసేది ఏమీలేక హృదయభారంతో ఇంటికి వెళ్లి పోయినాడు.

ఒకనెలరోజు లిట్లా గడిచినవి. మాధవరావు ఇంటివద్దసుబ్రహ్మణ్యము కనపడటము లేదు. కాని ప్రతీసాయంత్రమూ సోమసుందరుడొక్కడుమాత్రము ఆవీధిన లక్ష్మీకాంత మింటికి పోతూ ప్రతిఇంటిమీదనూ తన కమలనేత్రములు సారించి అలంకరిస్తున్నాడు. కాని కమలమల్లి ఒక్కసారికూడా అతని కళ్లబడలేదు. ఆమె బయటికి రానందువల్ల ఆబజారుకంతకూ కళ తగ్గిపోయింది. కారణము తెలుసుకోవలెనని సోమసుందరానికి ఆదుర్దా ఎక్కువగుతున్నది. కాని అతని కేమి తెలియరాలేదు. రోజూ కమలాదర్శనవ్యగ్రుడై ఆశతో అత డావీధిన వెళ్లుతాడు. కాని రోజూ కొండంతనిరాశతో తిరిగివస్తాడు.

దసరాసెలవులు వచ్చాయి. బడి లేదు గనుక అత నిప్పుడు ఇంటిపట్టున ఉండక

బజార్ల వెంబడి తిరుగుతున్నాడు. ఒక నాడు ప్లీడరు గుమాస్తాలంతా కూడే తమలపాకుబీడీల దుకాణమువద్ద పదిమంది పోగయి బిగ్గరగా మాట్లాడుతూ ఉండడము చూచి సుందరము అక్కడికి వెళ్లినాడు. అతన్నిచూచి ఒకడు "మీ బావగారి గుమాస్తా ఎవరిప్పుడూ! సూరయ్యేనా?" అని ప్రశ్నించినాడు. సోమసుందరము దగ్గరకు పోయి "అవును" అని తమలపాకుబీడీ కొంటానికి జేబులు చూచుకుంటూ నిలబడ్డాడు.

గుమాస్తాలంతా కోర్టుసంగతులు మాట్లాడుకుంటున్నారు. "ఏరోయి, మన స్వామినాథయ్యరుగారిని గంజాము బదలాయించినారట. నాలుగురోజుల్లో అయనపోయి చార్జి పుచ్చుకోవాలట. బందరునుంచి, ఆయన ఎవరూ! సుబ్బారావుగారు కాబోలు నీకోర్టుకు వస్తారట అని ఒక గుమాస్తా ఇంకొకనితో అంటున్నాడు.

తమలపాకుబీడి కొని నోట్లోపెట్టుకోబోతున్న సోమసుందర మామాటలు విన్నాడు. ఏమది! అతని ముఖమంతా మారిపోయిందే! అతనికన్నులు అస్రుపూరితములయినవి. కన్నీటిబొట్లు కారుతున్నదానిని తుడుచుకున్నాడు. పెదవులు విచిత్రముగా వణుకుతున్నవి. నిర్విణ్ణుడై అతడు బయలుదేరిపోయినాడు.

ఆరాత్రి అతనికి అన్నము సయించలేదు. వానితల్లి 'భోజనము సరిగా చేయలేదేమిరా'? అని అడిగింది. వంట్లో బాగాలేదన్నాడతను. తల్లి వళ్లుపట్టుకునిచూచింది. వళ్లు కాల్తున్నది. తీవ్రమయిన జ్వరంతో నిద్రపోయినాడు.

పొద్దున త్రిఫలకషాయంతో శీతాంశురసము తల్లి ఇచ్చినది పుచ్చుకున్నాడు. కాని జ్వరము రెండు రోజులు పట్టినపట్టు విడవలేదు. చలి పుట్టుతున్నప్పటికీ బయటికి రావాలని ప్రయత్నించినాడు. కాని ఇంట్లోవాళ్లు పోనియలేదు. అయ్యరుగారు ఇవాళో రేపో వెళ్లుతారు. సోమసుందరానికి ఆందోళన మరింత ఎక్కువయింది.

మూడవనాటికి సోమసుందరానికి జ్వరము కాస్త జారింది. ఆ సాయంత్రము వాకిట్లో అరుగుమీద వచ్చి కాసేపు కూర్చున్నాడు. అప్పుడు రామమోహన గ్రంథాలయమునుంచి తిరిగి వస్తూ లక్ష్మీకాంతము సోమసుందరుని చూచి 'వంట్లో బాగాలేదూ!' అని అడిగి పక్కనువచ్చి కూర్చున్నాడు. సోమసుందరము ఆరోజంతా లంకణప్రాయంగా ఉన్నందున బాగా మాట్లాడేశక్తి లేక నీరసించి హీనస్వరంతో మాట్లాడుతున్నాడు.

మాటలసందర్భాన లక్ష్మీకాంతము "మీ బావగారు ఈమధ్య ఇళ్లకోసము వెదుకుతున్నట్లున్నారు. నేనున్నగదికి ఎదురింట్లో ఉన్న అయ్యరుగారు ఖాళీచేసి వెళ్లిపోతున్నారు. ఆ యిల్లు బాగానే ఉంటుం దనుకుంటాను!" అన్నాడు.

అయ్యరుగారిమాట రాగానే సోమసుందరానికి ప్రాణాలు లేచివచ్చినవి. ఇప్పటికే వెళ్లి పోయినాడేమో! కమలను ఒక్కసారి చూచేందుకు కూడా వీలులేక పోయిందే అని ఇన్నాళ్లూ దిగులుపడుతున్నాడు.

'అయ్యరుగారు వెళ్లుతున్నారా? ఎప్పుడు వెళ్లుతారేం?'

'రేపు ప్రొద్దునవాల్తేరు ప్యాసెంజరులో'

'సప్పూరికయినా బదలాయింపు చేసినారా ఏమిటి?' అని ఎరగనివానివలె సుందర మడిగినాడు.

'ఎరగవా ఏమిటోయ్! గంజాము బదలాయించినారుగా!' అన్నాడు లక్ష్మీకాంతం. తర్వాత కొంతసేపు లోకాభిరామాయణము మాట్లాడి అతను వెళ్లిపోయినాడు.

౬

ఆరాత్రి సుందరానికి మళ్లీ జ్వరము వచ్చినది. భళ్లున తెల్లవారేసరికే, జ్వరమింకా పూర్తిగా జారకపోయినా, ఓపిక చేసుకొని లేచి ముఖప్రక్షాళనము చేసుకున్నాడు. జ్వరమింకా విడవనందున కూరగాయవైద్యాలతో ఇహ లాభము లేదని అపూట డాక్టరు కోసము కబురంపించినారు. డాక్టరు వచ్చి థర్మామీటరుతో చూచి 102 డిగ్రీల జ్వరమున్నదని ప్రక్కను నిలుచుని ఉన్న సోమసుందరుని తండ్రితో చెప్పి 'సీసా పంపించండి' మందిస్తాను. పిల్లవాణ్ణి గాలిలో తిరగనీయక కప్పుకొని పడుకోపెట్ట వలెను.' అని మరీ మరీ చెప్పి వెళ్లిపోయినాడు.

గడియారము ఎనిమిది కొట్టింది. లక్ష్మీకాంతం చెప్పిన మాటలు సుందరం మరచిపోలేదు. వాల్తేరుప్యాసెంజరు తొమ్మిదింటికి బయలుదేరుతుంది. ఒక్కొక్క క్షణము గడిచిపోయిన కొద్దీ అతని ఆవేగము ఎక్కువవుతున్నది. మతిపోయిన వానివలె పక్కమీద కాసేపు పడుకొని కాసేపు లేస్తున్నాడు. "నేను తప్పక స్టేషనుకు వెళ్లి నాకమల నొక్కసారి చూచి తీరాలి" అని నిశ్చయించుకొన్నాడు. కాని తల్లి ఎదటనే కూచుని ఉన్నది. అతని ఆందోళన కనిపెట్టినఆమె ఎంతసేపటికీ అక్కడనుంచి కదలలేదు. ఇక చివరకు సోమసుందరము ఓర్చలేక లేచి నిలబడ్డాడు. 'ఎక్కడికి వెళ్లుతున్నావురా!' అని తల్లి అంటూనే ఉన్నది.

'ఇప్పుడే బయటికి పోయి వస్తా'నని మెల్లగా వీథిలోకి జారినాడు. వెంటనే అతను ఆరండల్ సత్రమువద్దకు పోయి బండి ఎక్కి చురుకుగా తోలమని బండివానిని తొందర చేస్తూ స్టేషనుకు బయలుదేరినాడు. రయిలు దాటిపోతుందేమో అని అతను తహతహ పడుతున్నాడు. బండి స్టేషనువద్ద ఆగింది. సోమసుందరము చురుకుగా దిగి ఆతురతతో వంతెన దాటి ప్లాటుఫారంటిక్కెట్టు తీసుకొని వాల్తేరు ప్యాసెంజరు ఆగే ప్లాటుఫారంమీదికి వెళ్లినాడు. రైలు ఇంకా ఉన్నందుకు అతనికి కాస్త మనస్సు కుదట పడ్డది. కాని అప్పటికే రయిలు వచ్చి పదిహేను నిమిషాలయింది.

సోమసుందరము సరాసరి ఆడవాళ్ల పెట్టె వద్దకు పరిగెత్తినాడు. అక్కడ కమల కనపడలేదు. వెర్రెత్తినవానివలె ప్లాటుఫారముమీద ఈ చివరనుంచి ఆ చివరకు పరిగెత్తినాడు. సెకండుక్లాసుబండిలో స్వామినాథయ్యరుగారు కూచున్నాడు. ప్లాటుఫారము మీద గుమస్తాలు చేతులు కట్టుకుని నిలుచుని వినయంగా మాట్లాడుతున్నారు. కాని ఆ పెట్టెలోకూడా కమల లేదు. ఆమె కూచున్న

పెట్టె అతనికి అడావడిలో కనపడలేదు. అతని గుండెలుతటతటకొట్టుకుంటున్నవి. "వెళ్లేముందు కమల నొక్కసారి చూచే భాగ్యము కూడా నాకు లేదా!" అని విచారపడ్డాడు.

రైలు కూత వేసింది. గార్డు సిగ్నలు ఇచ్చాడు. దూరదేశము వెళ్లుతున్న మిత్రుల వద్ద వారి ప్రేమాస్పదులు సెలవు తీసుకుంటున్నారు. బండి సాగింది. సోమసుందరము దేహము కొయ్యవారుతున్నది. సాగిపోతున్న రైలు ఇంతలో ఆగింది. కమల ఉన్న పెట్టె సుందరానికి కనపడ్డది. అతని ప్రాణాలు లేచి వచ్చినవి. వేరేమీ ఆలోచించక అక్కడికి పరుగెత్తి పోయినాడు. 'కమలతో మాట్లాడడము ఎట్లా! పోనీ నావైపు చూడడమైనా లేదే!' అని దిగులుతో ఏమీ తోచక నిశ్చేష్టుడై నిలవబడ్డాడు. మళ్లీ రైలు కదలబోతున్నది. గార్డు జండాను పట్టుకుని నెట్టుకుంటున్న జనాన్ని ఎట్లాగో బండిలోకి ఎక్కించి తలుపు వేసి బుజ్జున బిగిలు ఊదినాడు. సోమసుందరుని ఆశలన్నీ అడుగంటినవి. కమల ముఖము కూడా చిన్నపుచ్చుకొనే ఉన్నది. ఆమె హృదయములో ఇప్పుడేమి భావములు నాట్యమాడుతున్నవో ప్రేమ తెలిసిన వాళ్లకే గాని తెలియవు. సోమసుందరాన్ని ఆమె ఇంకా చూడలేదు. చివరకు సుందరము ధైర్యము చేసి ఒరగా నిలుచుని ఏలుగు బడుతున్న స్వరముతో 'కమలా'! అని పిలిచినాడు. ఆస్వరము బాధ పడుతున్న వాని మూల్గు వలె నున్నది. కాని పిలుపుగా లేదు.

కమల అతని వైపు తిరిగి చూచింది. ఆమెముఖము వెలవెలబారింది. వక్షస్థలము కంపిస్తున్నది. వేడి నిట్టూర్పు విడుస్తూ అవ్యక్తము ఒలుకుతున్న దృష్టులతో సోమసుందరాన్ని ముంచివేసింది.

"సుందరము...'కమలా'! అని పిలిచినాడు...కమల అతనివైపు తిరిగి చూచింది. ఆమె ముఖము వెలవెలబారింది."

గార్డు జండా చూపించినాడు. రైలుకూత వేసి కదిలింది. ఇక కంటికి కనబడకుండా కమల ఎగిరిపోబోతున్నది. కమలా సోమసుందరులు ముగ్ధులై ఒకరివంక ఒకరు చూచుకుంటున్నారు. సోమసుందరుని హృదయం కొట్టుకో నారంభించినది. హృదయము వేయి సుత్తు

లుపెట్టి చిత్రకకొట్టు తున్నట్లు భావించి పరి తపించినాడు. కమల కన్నులలో నీరు గిరు క్కున తిరిగింది. నిస్సారముగా నున్న తన బాహులత నామె బయటికి చాచి సోమసుం దరునివైపుకు ఊపింది! 'మరచిపోవద్దు' అని కోకిలస్వరము మృదుమధురంగా సోమసుం దరుని చెవులలో ప్రతిధ్వనించి పులకరింప చేసింది.

రైలు ప్లాటుఫారం దాటింది. తన కంబు కంఠము సారించి అతని వైపు చూస్తున్న కమలముఖబింబము కనబడు తున్నంతసేపూ సోమసుందరుడు తన్మయుడై ప్లాటుఫారము మీద నిలుచున్నాడు. గంటకు ముప్పదిమైళ్ల వేగముతో రైలు అతనివద్దనుంచి కమలమ్మ ను క్రూరముగా ఎత్తుకుని పోతున్నది. మళ్లీ వాళ్లు జీవితములో ఎల్లా కలుస్తారు!

సోమసుందరము నిశ్చేష్టుడైనాడు. చెమటలు దేహమునిండా కారుతున్నవి. హృ దయభారంతో ఎట్లాగో నెమ్మదిగా వంతెన దాటి బండిలో వచ్చి పడ్డాడు. ఇంతవరకూ తాను జ్వరముతో బాధ పడుతున్న సంగతి మరచిపోయినాడు. బండిలో ఎక్కగానే అతని బలహీనత తెలియవచ్చి సొమ్మసిలినట్లు పడు కున్నాడు.

బండి అరగంటలో సత్రమువద్దకు వచ్చి నిలిచింది. సత్రములో బొప్పాయికాయలను కోసుకొని వచ్చిన అతని తమ్ముడు ఎదురై 'నా న్నగారు నీకోసము వెతుక్కుంటున్నారు' అని చెప్పినాడు. ఆమాటలు విని సోమసుందరము ఇంటికి పరుగెత్తినాడు. ఎదురుగా తండ్రి వచ్చి 'వెళ్లవద్దని ఎంత చెప్పినా వినక గాలిలో షికార్లు చేసివచ్చినావా?' అని కోపపడినాడు.

సోమసుందర మామాటలు వినిపించు కోకుండా ఇంట్లోకి వెళ్లి పచ్చడము కప్పుకుని కన్నీరు కాల్వలై పారేటట్లు విలపిస్తున్నాడు. కొద్ది సేపటిలో కప్పుకున్న పచ్చడమంతా కన్నీటితో తడిసిపోయింది.

యెఱ్ఱి నా యెంకి

నండూరి వేంకటసుబ్బారావుగారు బి.ఏ.

"యేనాటి జల్మములోన
యెవరమో" నంటె
సిగ్గొచ్చి నవ్వింది
సిలక-నా యెంకి

"ముందు మన కేజల్మ
ముందోలె" యంటె
తెల్ల తెల బోయింది
పిల్ల-నా యెంకి

"యెన్నాళ్లు మనకోలె
యీసుకము" లంటె;
కంట నీరెట్టింది
జంట-నా యెంకి.

అస్పృశ్యత

గాదె నరసింగరావుగారు బి. ఎ., ఎల్. టి.

ప్రస్తుతకాలమున మనదేశమందు కొన్ని జాతులవా రంటరానివారని వ్యవహారమున్నది. తన్మూలకమగు నాచారము గూడ దేశమంతటను వ్యాపించినది. ఇట్టి యాచార వ్యవహారములకు యోగ్యమైన వారిని కడజాతివా రని చెప్పుచున్నాము. ఈ జాతులలో వచ్చువారు మాలలు మాదిగలు మొదలగువారు. వీరందరిని చండాలురని కూడ మనము వాడుచున్నాము. ఇట్టివారితో మాట మొదలగు వ్యవహారములందు ధర్మముపేరిట జరుగుచున్న వ్యవహారము కడుంగడు శోచనీయముగ నున్నది. మనవారిని ప్రశ్నించినపుడు తమయాచారము ధర్మశాస్త్రసమ్మతమనియే వారు చెప్పుచున్నారు. అందువలన దేశమందంతటను ప్రమాణములుగ మనవారు గ్రహించిన మను యాజ్ఞవల్క్య పరాశర స్మృతులను పరిశీలించి మనవారియాచారమెంతవరకు స్మృతుల ననుసరించి యున్నదో చూచుట మనవిధియై యున్నది. "కలౌ పారాశరాః" అను నార్యోక్తి ననుసరించి పరాశర స్మృతినే ప్రధానముగ గ్రహించి యీవ్యాసమును వ్రాసితిని. కాని మనుస్మృతినుండియు యాజ్ఞవల్క్యస్మృతినుండియు యథోచితముగా ప్రమాణము చూపించెదను.

ఇందు మొట్టమొదటను ధర్మమూలముగ మనుస్మృతియం దున్నయంశ మొకటి గ్రహింపవలసియున్నది. మనుస్మృతి ౧౨ అ. ౧౧౭ వ శ్లోకమున శ్రద్ధావంతుడై చరాచరాత్మకమగు జగత్తంతయు నాత్మస్వరూపముగ గ్రహింపవలయు ననియు, నట్టిబుద్ధిమంతు డెన్నడును నధర్మమున ప్రవర్తింప డనియును చెప్పబడియున్నది. ధర్మప్రవర్తనకు సర్వసమత్వబుద్ధియే ముఖ్య మని గ్రహింపదగియుండుటచే ద్వేషమూలకములగు నాచారములన్నియు నధర్మములే యని తోచుచున్నది. కాబట్టి ధర్మశాస్త్రములందు దర్శన స్పర్శనసంభాషణము లెట్టివాని విషయమున నైన నిషిద్ధములై యుండవోపు. మనవారి వ్యవహారములో కడజాతివారును చండాలురు నొకటేయని భావించుచున్నారు కాని యీ విషయమును గురించి ధర్మశాస్త్రములు చూచిన కడజాతివారలు చండాలురు కారని స్పష్టమగుచున్నది. పరాశరస్మృతి ౧౦ అధ్యాయము ౯౦ న శ్లోకము వ్యాఖ్యానమున మాధవాచార్యులవా రిట్లు,

"బ్రాహ్మణ్యాం శూద్రాజ్జాతా చండాలీ
అసూఢపతితా జ్జాతా వా
సగోత్రా జ్జాతా వా
తదేత త్త్రివిధం చండాలత్వమ్."

అని చెప్పి యమస్మృతినుండి ప్రమాణమును చూపించిరి. దీనివలన చండాలత్వము మూడువిధములు ౧. బ్రాహ్మణస్త్రీయందు శూద్రునివలన జనించుటచే కలిగినది. 2. సన్యాసియై తిరిగి గృహస్థుడైనవానికి జనించుటచే కలిగినది. 3. సగోత్రులైన స్త్రీపురుషులకు జనించుటచే కలిగినది. పరాశరస్మృతి 4 అధ్యాయము 19 శ్లోకము వ్యాఖ్యానమున "ధర్మపరాఙ్ముఖః కర్మచండాలః" అని మాధవాచార్యులవారు వ్రాసిరి. ఇందువలన చండాలురు కర్మచండాలు రనియు జన్మచండాలురనియు రెండువిధములుగ గన్పట్టుచున్నది. అందు జన్మచండాలత్వము పైని జెప్పిన మూడువిధములుగ నుండుటచే చండాలత్వము నాల్గువిధములైనది. పరాశరస్మృతి 6 అ. 19-28 శ్లోకములలోను చండాలసంభాషణము, సహవాసము, సహయానము మొదలగు నకార్యముల కన్నిటికిని ప్రాయశ్చిత్తము చెప్పి, 32, 33, 34 శ్లోకములలో చండాలాన్నభోజనప్రాయశ్చిత్తమును గూడ జెప్పియున్నారు. ఇందొకవిశేషము విమర్శింపవలెను. పై శ్లోకములయందు చెప్పబడిన కార్యములు ప్రాయశ్చిత్తార్హము లని యుండుటచే నెట్టివి ప్రాయశ్చిత్తయోగ్యము లని ధర్మశాస్త్రములు చెప్పినవో కొంత విచారింపవలెను. చేయవలసినకార్యములు చేయకుండుటయు, చేయగూడనివనులు చేయుటయు కారణముగ మనుష్యుడు ప్రాయశ్చిత్తయోగ్యుడగుచున్నాడని మనుయాజ్ఞవల్క్యపరాశరులు చెప్పిరి. యాజ్ఞవల్క్యస్మృతియందుగాని మనుస్మృతియందుగాని పరాశరస్మృతియందు చెప్పినటుల చండాలవిషయమున ప్రాయశ్చిత్తము చెప్పలేదుగాని యీరెండు స్మృతులలో యాజ్ఞవల్క్యస్మృతియందు తాను ప్రాయశ్చిత్తము చెప్పనటువంటి యకార్యములకన్నిటికి నొక ప్రాయశ్చిత్తము చెప్పెను. స్మృతిప్రారంభమున ధర్మనిర్ణయముచేయుట కధికారము పరిషత్తునందుంచెను. మనుస్మృతిలో చండాలాన్నభోజనచండాలస్త్రీగమనములకు ప్రాయశ్చిత్తము చెప్పి యనుక్తములకు ప్రాయశ్చిత్తము చెప్పనధికారము పరిషత్తునందుంచెను. మనుస్మృతిలోను యాజ్ఞవల్క్యస్మృతిలోను చండాలుడు బ్రాహ్మణస్త్రీకి శూద్రునివలన జన్మించినవాడనియు, నట్టివాడు బహిష్కృతుడనియు చెప్పబడెను. వాడు బహిష్కృతిగతి ననుసరించి సంఘమున వ్యవహార్యుడు గాకుండవలెను. పరాశరప్రాయశ్చిత్తకాండమున ప్రాయశ్చిత్తములు చెప్పబడినను, ఆచారకాండలో నీ కార్యములు నింద్యముల క్రింద వారు చెప్పినందున మాధవాచార్యులవా రన్యము లగువాని నాశ్రయించి వ్యాఖ్యానము చేసిరి. మనుయాజ్ఞవల్క్యస్మృతులలో చండాలదర్శనస్పర్శనసంభాషణములు నిషేధింపబడలేదు; కాని, చండాలాన్నభోజన చండాలస్త్రీగమనములు మాత్రము నిషేధింపబడెను. మొదట చెప్పబడిన చతుర్విధచండాలురలో కర్మచండాలురు ప్రాయశ్చిత్తమును చేసికొని సంఘమున సర్వవ్యవహారయోగ్యులయ్యెదరని చెప్పుటకు ప్రాయశ్చిత్తకాండ మంతయును ప్రబలనిదర్శనము.

అయ్యది విపులముగ చర్చించుటయు ప్రస్తుతమున ననావశ్యకము. జన్మచండాలురని చెప్పబడినవారేమయినారో నిశ్చయించి చెప్పుటగూడ సంకేయావశ్యకము గాదు. అయినను వారుమట్టుకు సంఘమున కలసిపోయియుండిరని పై యంశములబట్టి నిర్ణయింపవచ్చును. వారుమట్టుకు ప్రస్తుతమున లోకమందు ప్రత్యేకముగ నున్నట్లు గనబడదు. వారే యంత్యజాతులవారని చెప్పు మనవారియూహాలు నిరాధారములు. యాజ్ఞవల్క్యస్మృతికి వ్యాఖ్యానము వ్రాసిన విజ్ఞానేశ్వరయోగియు పరాశరస్మృతికి వ్యాఖ్యానము వ్రాసిన మాధవాచార్యులవారును గూడ చండాలు రంత్యజాతులవారిలోనివారని యభిప్రాయపడినట్లు గనుపట్టునుగాని మనుస్మృతి 11 అ. 176 శ్లోకమున చండాలురును అంత్యజులును వేఱని స్పష్టమగుచున్నది. ఇదిగాక పరాశరస్మృతి 6 అ. శ్లో.31, 32 లను జూచినను చండాలురును అంత్యజులును వేఱనియే నిశ్చయమగుచున్నది. ఈశ్లోకముల వ్యాఖ్యానమున మాధవాచార్యులవారుగూడ నంత్యజాతులవారేడు విధములుగ నున్నారని చెప్పినారు. వారెవ్వరనిన "రజకశ్చర్మకారశ్చ నటో జరుడ ఏవచ, కైవర్త మేధభిల్లాశ్చ సప్తైతే చాంత్యజా స్మృతాః" అని ప్రమాణము నిచ్చినారు. నిఘంటువులందుగూడ నీవిధముగనే కన్పట్టుటచే నంత్యజాతులు వే అని నిశ్చయింపవచ్చును. ఈ అంత్యజాతులవారైన, 1.రజకుడు,2.చర్మకారుడు,3.నటుడు అనగా యీటెవాళ్లు,4. జరుడులు అనగా మేదరివాళ్లు,5.కైవర్తులు అనగా జాలరివాళ్లు, 6. మేధులు, 7. భిల్లులు అనగా కొండజాతులలోనివారు. ఈ ఏడుగురిలో రజక, నట, జరుడ, కైవర్త, భిల్లులను గూర్చి యెట్టివివాదమును లేదు. కాని చర్మకారులైన వారినిన్ని, చర్మకారులుగాని మరికొందరినిన్ని మన మస్పృశ్యులనుగ జూచుచున్నాము. అంత్యజాతులను గురించి పరాశరస్మృతియందు అస్పృశ్యత చెప్పబడలేదు. కాని వారికుండలలోని నీరును త్రావినచో ప్రాయశ్చిత్తము విధింపబడినది. ఇట్టిది గూడ నితరస్మృతులయందు గానరాదు. ఇందుచే మనయాచార మెంతయంధపరంపరగ నున్నదో యెంతస్మృతివిరుద్ధముగ నున్నదో యెంతధర్మవిరుద్ధముగ నున్నదో చెప్పనక్కఱలేదు. అందులో నంత్యజులను చాలమందిని విడిచి యొక్క చర్మకారమేధులనుమట్టు కిట్టి యాచారము పాల్చేసి మనము చేయుచున్న ధర్మద్రోహమును దేశద్రోహమును వర్ణింపనలవిగాదు. ఈ విషయముననే గాక యింకను ననేకవిషయములలో మనయాచారము లొకదారి మనధర్మశాస్త్రములు మఱియొకదారి. ఇట్టి యవస్థ కేవల మజ్ఞానముచేతను తన్మూలకమగు నభినివేశముచేతను గలిగినది గాని యన్యముగాదు. కాబట్టి వివేకము నవలంబించి ధర్మశాస్త్రములను పరిశీలించి యధర్మములగు నాచారములను దేశమునుండి బాఱద్రోలి పంకనిమగ్నమై యధోగతికి బోవుచున్న భారతమాత నుద్ధరింప బ్రార్థితులు.

అఱవభాషయొక్క - యుత్పత్తి

తేకుమళ్ల రాజగోపాలరావు గారు, బి. ఏ. ఎల్. టి. Ph. D. F, M. U. M. R. A. S. (Lond-)

నా మొదటివ్యాసమునందు అఱవవారిప్రమాణ గ్రంథములనుండి వారిదేశపుసరిహద్దులను వివరించియున్నాను. మొట్టమొదట అఱవము మధుర జిల్లాప్రాంతములందు మాటలాడఁబడెడిదనియు, ఆదేశమునకు ఉత్తరమున మరుదయూరును, తూర్పున మరువూరును, దక్షిణమున వైఘానదియు, పడమట కరువూరును, నుండెడివనియు, ప్రామాణికగ్రంథకర్తలగు సేనావరియరును, నచ్చినార్కినియరును పరిశుద్ధమైన తమిళకమునకు ఇవియే సరిహద్దులని తెల్పిరనియు నే నావ్యాసమునందు వ్రాసియుంటిని.

శెన్తమిళము

కాంచీపురము ప్రధానపట్టణముగాఁగల చోళ మండలముగాని, ప్రసిద్ధములైన చేర, తొండ మండలములుగాని శెన్తమిళభూములు కావు. పాండ్యమండలమే పురాతనపుతమిళభూమి. అందుండియే తమిళనాడు నానాఁటి విస్తీర్ణత నంది యొకకాలమున ఉత్తరమున తిరుపతివఱకు వ్యాపించెనని అఱవవారు చెప్పుటకుఁ గలకారణములను నేను మొదటివ్యాసమునందే ప్రమాణములతోఁగూడ వివరించియున్నాను. ఇది అఱవవారిసనాతనసిద్ధాంతము. తమిళసంగములు మూఁడును ప్రాచీనకాలపు ప్రసిద్ధద్రవిడభూమియగు పాండ్యమండలమునవే ఆమధురానగరమునందే పదివేలయేండ్లు భాషాసేవ యొనర్చెనని వారిపురాతన సిద్ధాంతము. ఈశెన్తమిళభూమికి సరిహద్దులలో మాటలాడఁబడు భాషలు అన్యభాషలు. అందుండి వచ్చినమాటలు వీనికి అన్యదేశములైనవి. కాఁబట్టి అఱవసిద్ధాంతములప్రకారముగా మరుదయూరు వైఘానదుల మధ్యభాగములో మాత్రమే ప్రాచీనద్రవిడ ముండెను. దీని చుట్టుప్రక్క నుండునవి అన్యభాషలగుటచేతనే అందలిమాటలు అన్యదేశ్యములయ్యెను.

శోధనకు నే నవలంబించినమార్గము.

నా మొదటివ్యాసమునందు నిరూపించిన పై సత్యముల నాధారము చేసికొని అఱవభాషయొక్క పూర్వచరిత్రను నేను అన్వేషణముచేయ మొదలుపెట్టితిని. చెంగల్పట్టు, దక్షిణపు ఆర్కాడు, తంజావూరు, తిరుచినాపల్లి మున్నగుజిల్లాలలో ఇప్పుడు ద్రవిడమే మాటలాడఁబడుచున్నను, ఇవి శెన్తమిళభూములు కావన్న ప్రాచీనమహావాక్యముల ననుసరించి, మధుర మండలములోని శెన్తమిళభూమినే తొలుదొలుత అఱవము మాటలాడఁబడుచుండెనను సిద్ధాంతముపై నేను నమ్మిక నిడితిని. ఈ శెన్తమిళభూమికి చుట్టుప్రక్కల నుండు నాడులలోనిమాటలు వీనికి అన్యదేశము లగుటచే శెన్తమిళభూమిలోనే ఆకాలమున పరిశుద్ధమైన యఱవము ఉండెననియు, తక్కినచోట్ల వేఱుభాషలు మాటలాడఁబడుచుండెననియు నే నూహించితిని. పరిశుద్ధమైన ప్రాచీనపుటఱవము ఎచ్చట నుండునో నిశ్చయముగా తెలిసినందున, అందుండి తిసైచ్చొల్ అనఁబడు అన్యదేశ్యములను తొలఁగించినయెడల మిగులునది. ప్రాచీనకాలపు శుద్ధద్రావిడ మగునని నిర్ణయించితిని. ఇట్లు ప్రాచీనకాలపు భాషయొక్కస్థలమును అందలి పదములును తెలిసికొనుటకు అవకాశ మేర్పడెను.

శెన్తమిళమే ప్రాచీనపుటఱవమా? దాని కింకను పూర్వస్థితి యొక్కటి కలదా? యని నాకుసందేహము కలిగెను. పెక్కండ్రు అఱవవారిని నే నడిగితిని. కాని నేను చూచినంతవఱకును, ప్రసంగించినంతవఱకును, అఱవభాషవిషయమున నాకొకచిత్రము కానవచ్చెను. తమభాష అతిప్రాచీనమని చెప్పువారు లక్షలకొలఁదిగా నున్నారు. వారివాఙ్మయము అతిప్రాచీనమైనదని వ్యాసములు వ్రాయువారు ఎందఱెందఱో కలరు, కాని ప్రాచీన మనుటకు ఒక్కయాధారముకూడ నీపఁదుకైరుకస్వరముల

లోను ఒక్కనాఁడైన నేను చూచి యెఱుఁగను. ఎంత లెంకలు చదివినవారును ప్రాచీనమని ముందు సంకల్పించి కొని ప్రస్తావన కారంభింతురు. ఎట్లు ప్రాచీనమన్న నందఱు నంగీకరించినవిషయమే యుండును. ఆధారములను జాగ్రత్తమని గట్టిగా నడిగిన కోపగింతురు. కొందఱు ఆంధ్రులు సహితము ఈవిషయమున అఱవవారిలో నే చేరి దాని ప్రాచీనతకు కారణములు తెలుపకయే అంగీకరింతురు. నే నిట్లు వ్రాయుట అసూయచేత కాదు. అఱవమునకు ప్రాచీనవాఙ్మయ మున్నయెడల మన కేమియు నష్టము లేదు. వేదములు ప్రపంచములోని గ్రంథములలో మొట్టమొదటివైనయెడల ఆంధ్రమునకు లోపము వచ్చెనా? కాని పరిశోధనలు చేయునప్పుడు తగిన ఋజువులనుగూడ పాటించుట మనకర్తవ్యము. క్రీస్తుపుట్టుటకు మునుపు వేయేండ్లక్రిందట వ్రాయఁబడిన గ్రంథములు గూడ అఱవములో నిప్పటికిని నున్నవని చెప్పి వానిని నమ్మి వానిమీఁదనే భాషాసంబంధమైన పరిశోధనలకు నన్నాధారపడియుండు మన్నప్పుడు, అట్టి సిద్ధాంతములను నే నంగీకరింపఁజాలను. ఇట్టి సందిగ్ధములైన సందర్భములవలన సెంతమిళముయొక్క పూర్వస్థితి నెఱుఁగుటకు నాకుఁ జాల కాలవ్యవధి పట్టెను. తుట్టతుదకు ద్రవిడవ్యాకరణములే నా కాధారము లయ్యెను. పండితులును వ్యాకరణవిషయమని చెప్పినప్పుడు నాకు తోడుపడిరి.

సెంతమిళము రెండు తెఱఁగులు కలది. అందొకటి అప్పటికాలప్రజనుల కల్ల అను అర్థముగునది. లోకవ్యవహారములం దప్పుడు వాడుకలో నుండు పద సముదాయము నే కలది. రెండవది పండితభాష. ఈ పండితభాష ప్రజలకర్థము కాదు. అందు ఒక్కపదమునకు పెక్కులర్థము లుండును. ఒక్కయభిప్రాయమును నెల్లడించుటకు పెక్కుపదములు పనికివచ్చును. ఇందు పండితభాష గ్రాంథికము. అనఁగా ప్రయోగశరణ్యమై ఆ కాలపుపుస్తకములలో వ్రాయ నమవైనది. ఇందు లోకుల కల్లఅనఁ దెలియు సెంతమిళమునకు ఇయర్ చ్చొల్ అని పేరు. ఇతరులకు అర్థము కాకుండునట్లు పండితులు తమలో తాము మాటలాడుకొను భాషకు తిరుచ్చొల్ (=పవిత్రమైన మాటలు) అని పేరు.

ఈ విభాగములవలనఁ దోఁచు నర్థ మేమి యని నేను యోచించితిని. కొన్నిమాటలు పండితులకే కాని, అర్థము కావఁట. కాని యవి శుద్ధద్రవిడపదములే యఁట. వానికి గ్రంథములయందుఁ బ్రయోగములు కలవఁట! ఇప్పటికిని గ్రంథములందు వాడఁబడుచుండునఁట! కాని జనసామాన్యమునం దవి వాడుకలో లేవఁట! ఇందువలన ఇయర్ చొల్, అను విభాగము నవీనమనియు అందు ముందును ద్రవిడము ఉండెననియు, ఇయర్ చొల్ కంటెను ప్రాచీనమైన సెంతమిళవిభాగము పవిత్రమైన తిరుచ్చొల్ కావలెననియు నే నెంచితిని.

ఇయర్ చొల్ లోనిపదములు జనసామాన్యమునకుఁ జక్కఁగాఁ దెలియుటచే నవి యాకాలపువ్యావహారికభాషకుఁ జెందినట్లు మనము తెలిసికొఁగలిగితిమి కదా. ఇవే కొన్ని యుదాహరణములు: మణ్-మన్ను; పొణ్-పొన్ను (బంగారము); మరమ్-(మ్ + ర్ + అ + అ) మ్రాను, నడన్ దాన్-(వాఁడు) నడచెను; వందాన్-(వాఁడు) వచ్చెను; అళగు-అలవు (అందము); అవనాల్-వానివలన (వల్ల);

"పెణ్ తమిలాహి తిరితూది యూర్కుం
తంబొరణ్ విలక్కుం తల్మయ ఇయర్ చొల్."

ఇది ఇయర్ చొల్ కు సూత్రము.

ఇక తిరుచొల్లో! ఒక్కమాట చెప్పిన పెక్కు అర్థములిచ్చును. అనేకములైన పదములు ఒక్కటేయర్థమును గలిగియుండును.

"ఒరుపొరుల్ కురిత్త పలచొల్ ఆకియుం
పలపొరుల్ కురిత్త ఒరుచొల్ ఆకియుం
అరి తువార్ పొరుల్ అన తిరిచొల్ ఆకుం"

అనునది దీనికిసూత్రము. ఉదా. "కిళై" యను నొక్క మాటకు గిన్నె, చిలుక యని నానార్థములు. కాసునకు తప్పు, బంగారము, గంట యని నా. ఏకినాన్ అన్న వెళ్లినాఁ డనియు, స్థలమును విడిచినాఁ డనియు నా. కోల్ అనుమాటకు కోరుట లేక అడుగుట, సందేహించుట యని నా. అట్లే సమృద్ధి యనునొక్కయర్థ మిచ్చుటకు సాల, ఉరు(డు) దావ, నాని, [illegible], కూర్ అని యనేకపదములు. ఇయర్ చొల్ లోని పదములలో తిరుచొల్ లోనిపదము లుండఁజాలవనియు ఈ రెండును వేఱనియు దీనివలన విశదమగుచున్నది.

ఈ విభాగములకు అర్థము.

ఇయర్ చొల్‌ను వ్యాకరణదుష్టము గాని వ్యావహారికభాషనుగా మనము గణింపవచ్చును. ఇదియే ద్రవిడవైయాకరణులమతము. ఒక్కపదమే పెక్కులర్థములను, ఒక్క యభిప్రాయమునకే అనేకపదములను గల తిరుచొల్ అను పండితభాష శబ్దజాలము విషయమునఁగూడ వ్యావహారికభాషకంటె భిన్నమైనది. లోకవ్యవహారములందు ఒక్కొక్క యభిప్రాయమున కొక్కొక్క ప్రదేశమున కొక్కొక్క పదము రూఢమై యుండును. భిన్నకాలములను గాని, వేర్వేఱుదేశములను గాని తీసికొన్నప్పుడు ఒక్కపదమునకే అనేకార్థములును, ఒక్క యర్థమునకే అనేకపదములు వచ్చుట సహజము. కాఁబట్టి ఇయర్ చొల్ అనునది ఒక్కకాలమున ఒక్కదేశమున వ్యవహరింపఁబడుచుండిన శబ్దజాలమని మనము సులభముగాఁ దెలియఁగలము. "తిరుచ్చొల్" అనునది అప్పటి వ్యావహారికభాషకంటె ప్రాచీనమై, కారణాంతరములచేత వాడుకలో లేనట్టిపదములను దెలుపును. మన తెలుఁగుభాషనుండియే యొక యుదాహరణమును దీసికొందము.

ఆ॥ వె. చిన్న జన్నిగట్టఁ గ్రొన్నెల నెన్నని
చెన్ను మీఱ వన్నె దెన్న మున్న
విన్న కతన నెప్రుడుఁ గన్నులఁ గట్టిన
ట్లున్న దెవము లేక యున్నలార.

క. ముద్దుల పట్టెవు నీ కీ
గద్దటి చందముల వెలఁగఁ గారాదు సుమీ
రద్దయుఁ బెద్దలఁ దలఁపక
ముద్దియ నీ కెంత దెందమున వెత యున్నన్.

కూచిమంచి తిమ్మకవిసార్వభౌముని నీలాసుందరీ పరిణయములోని పైరెండుపద్యములలో గీఁత లుంపఁబడినమాటలన్నియు నచ్చతెలుఁగు లయ్యు, ఇయర్ చొల్ వలె వ్యావహారికభాషయందుండక ఇప్పటికాలమున కేవలము గ్రంథస్థములై తిరుచొల్ అనుదీని భాషావిభాగమునందుఁ జేర్పఁబడవలసి యున్నవిగదా.

పరిశీలించి చూచినయెడల తిరుచొల్ అనునది ఇయర్ చొల్‌కంటెను ప్రాచీనమైనభాష యని యెల్లరును అంగీకరింపకతప్పదు. అట్లే అంగీకరింపఁబడియును న్నది. మధురమండలములో నాకాలమున మాటలాడఁబడుచుండిన ఇయర్ చొల్‌ను మనము వదలివేయుదము. అప్పుడు ఇయర్ చొల్‌కంటెను ప్రాచీనమైన తిరుచొల్ మనకు మిగులును. ఈ తిరుచ్చొల్లే సెంతమిళ్ యొక్క ఆదికాలపుచరిత్రమును మనకుఁ దెలుపవలసి యున్నది. ఆభాషయొక్క యుత్పత్తిని దెలుపు మూలసూత్రము లింకే యిమిడి యున్నవి. ఈసందర్భమున నీయర్థమునే సూచించు నాయింగ్లీషు వ్యాసములోని యీక్రిందివాక్యములను వ్రాసి వానిభావమును వివరించుచున్నాను.

"The Vocabulary of IYAR CHOL therefore differs from that of TIRU CHOL of the ancient classical Tamil works and of the Scholars. TIRU CHOL is thus no doubt SEN TAMIL, but it is not the language of the masses. It is a difficult literary language, with its characteristic vocabulary and meanings, representing an earlier type, the ISAI CHOL being the language actually used by the people......................the divisions mark the growth of language..........................
We thus see that the original element in the Tamil language gradually grew by regular additions, and it is this that has grown considerably by various admixtures that became the standard SEN TAMIL. Sen Tamil therefore consists of the original element as well as further additions into it until a stage was reached centuries afterwards when in its standardised form Grammarians began to impose their restrictions on it to keep it from further admixture."

ఇంతవఱకు తేలినవిషయములు

మధురకు సమీపమున పూర్వకాలమునందు ఒక చిన్నదేశ ముండెను. దానియందు ఒకజాతిజనులు నివసించుచుండెడివారు. వా రేదేశమునుండి యచ్చటకు వచ్చిరో వారికి తెలియదు. ఒకకాలమునందు వారు ఒక భాషను మాటలాడుకొనుచుండిరి. ఏకారణముచేతనో వారిభాష దినదినాభివృద్ధి నంద మొదలిడినది. క్రమక్రమముగా నూతనపదము లందుఁ బ్రవేశింపఁ జొచ్చి

వని. క్రొత్తనీరు వచ్చి పాతనీటిని గొట్టివైచినది. మును వచ్చినచెవులకంటె వెనుకవచ్చిన కొమ్ములు వాఁడిగలైనవి. క్రొత్తమాటలు వాడుకలో హెచ్చినకొలఁదిని ప్రాంత మాటలు వెనుకఁబట్టినవి. ఈవిధముగా కొన్నిపదములు వాడుకనుండి తొలఁగినవి. కాని విద్వాంసులకు మాత్రము అవి తెలిసియే యుండెను. ఇట్లు మఱల కొంతకాలము కడచెను. నూతనపదములు మఱల హెచ్చెను. వాడుకలో నున్న పదములు మఱల వెనుకఁబట్టెను. ఈవిధముగా పెక్కుతరములు కడచెను. భాష పెరుఁగుచుండెను. మార్పు లధికమయ్యెను. ఇట్టిభాష పెరుఁగుటచేత రెండుచాళ్లులు ఏర్పడవలసివచ్చెను. గ్రాంథికభాష ప్రజలకు బోధపడ దయ్యెను. ఒక్కమాటకు పెక్కులర్థము లయ్యెను. ఒక్క యర్థమునకు మాటలు పెక్కు లయ్యెను. అప్పటికి తిరుచాల్, ఇయర్-చాల్ అను సంప్రదాయము లేర్పడెను. భాష యింకను పెరుఁగుచుండెను. అన్యదేశ్యములను జొరనీకుండ ఆపి అప్పటికి భాషను స్వచ్ఛముగా నుంపవలసిన యవసరము వైయాకరణులకుఁ గలిగెను. అప్పుడు వారు అన్యదేశములనుఁబట్టి అన్యదేశ్యములను వేఱుపఱిచిరి.

ఇక్కడ ఒక చిన్నవిషయమును మనవిచేయ నిందు. ఒక్క యర్థమున పెక్కుపదము లుండుటయు, పెక్కులగు నభిప్రాయముల నొక్కమాటయే వెల్లడింపఁ గలుగుటయు భాషయొక్క దినదినాభివృద్ధిని సూచించు నని భాషాశాస్త్రజ్ఞులమతము. నాగరకప్రజలమధ్య నివసించుటచేతను, ఇతరభాషలతో నత్యంతసంబంధ ముండుటచేతను, జనుల యభిప్రాయములందును జీవనమునందును మార్పులు కలుగుటచేతను క్రొత్తక్రొత్త యర్థములను భాషకు లభించును. సమస్తభాషలందును, అట్లే తెలుఁగునందును, ఒక్క యభిప్రాయమునకు పెక్కుపదములును, ఒకమాటకు పెక్కులర్థములును నుండుట కిదియే కారణము. కాఁబట్టి మొట్టమొదట కేళాతమిళ్ భూమిని చేరిన యఱవవారి కెట్టిచరిత్ర గలదో విశదమయినఁ గాని అఱవభాషయొక్క యుత్పత్తియు, ఆంధ్రాదిభాషల పూర్వచరిత్రమును మనకు విశదముకాదు.

అఱవము అను పదముయొక్క నిజమైన యర్థము

అఱవమనుపదమునకు అనేకులు అనేకవిధములుగా అర్థము చెప్పిరని నామొదటివ్యాసమునందే వ్రాసియున్నాను. అఱవవారు మాత్రము అఱవమనుపదమును తమ భాషకు పర్యాయపదముగా నెన్నఁడును ఉపయోగించి యెఱుఁగరు. కాని తెలుఁగును కర్ణాటకమును అఱవమునకు సంబంధించినభాషలు. కొందఱు ద్రవిడాంధ్ర కేరళకర్ణాటదేశములభాషలన్నియు అప్పసెల్లెండ్రవంటివని తలఁచుచున్నారు. కొందఱు అఱవము ఆదిభాషయనియు, తెలుఁగును నితరభాషలును నందుండి పుట్టెననియు తలఁచుచున్నారు. ఏది యెట్లున్నను, ఈభాషలలోని శబ్దజాలము అనేకవిషయములలో నొక్కటియై యున్నది. తెలుఁగు-తల- అఱవము- తలై; మలయాళము తలై; కన్నడము- తలె. తెలుఁగు-కన్ను; అఱవము-కణ్; మలయాళము-కణ్; కన్నడము-కణ్ణు. తెలుఁగు-కై (చేయి); అఱవము-కై; మలయాళము- కై; కన్నడము-కై. ఇట్టి సామాన్యపదముల నెన్నింటినైన మనము చూపవచ్చును. ఒకకాలమునందు ఈ నాలుగుభాషలును ఒక్కటే భాషగా నుండెడివి. ఏకభాషనే మాటలాడు వీరందఱును కాలక్రమమున చీలిపోయి, వేఱువేఱుసమీప దేశములలో బహుకాలము నివసించి, నేటికి భిన్నభాషలవా రయినట్లున్నను, ఒకప్పుడు వీరందఱును ఏకజాతివారే. భాషాసంప్రదాయ మెట్టి దయినను, దానితొలినాఁటిగాథలు నాలుగుభాషలకును సమముగా వర్తింపవలెను గాని విపరీతపరిస్థితుల కాస్పదము కారాదు. అఱవవారిదగ్గఱిచుట్టము లగు తెలుఁగువారు అఱవమును అఱవ మందురు. కర్ణాటకులును ద్రవిడభాషను అఱవమనియే పిలుతురు. దూరమునను న్న మహారాష్ట్రులుగూడ అఱవమును అఱవమనియే యందురు. కాని యఱవవారు మాత్రము దీనిని అఱవమనరు. తోడివారందఱును తమ్ము అఱవలనియు, తమభాషను అఱవ మనియు ఏల పిలువవలెనో వారికిఁ దెలియదు. కాని అనేకశతవర్షములనుండి వారికి సార్థకముగా నుపయోగింపఁబడుచున్న యీపదమును తప్పుపదమని మనము మాలకు త్రోసివేయరాదు. ఈ యఱవమను పదమే ఈనాలుగుజాతుల పూర్వచరిత్రమునకు ఆధారభూతమై యున్నది.

దీనియర్థమును దెలిసికొనుటకు పూర్వము అఱవవారు పాండ్యమండలమునఁ బ్రవేశింపని ప్రాచీన కాలమునకు మనము పోవుదము. దక్షిణదేశములో సహితము అఱవవారు ఇంకను బ్రవేశింపని యాదిమ దివసములకు మన మేఁగుదము. అప్పటిస్థితిని అఱవ గ్రంథములే మనకుఁ దెలుపుచున్నవి.

అగస్త్యుఁడు అఱవభాషకుఁ బితామహుఁడను సంప్రదాయము నీచలకే నేను వివరించియుంటిని. అఱవ పుస్తకములలో మిక్కిలి పురాతనమైనదగు తొల్కాప్పియములోని మొదటిసూత్రమునకు వ్యాఖ్యానము వ్రాయుచు నచ్చినార్కినియర్ అను ప్రామాణికుఁడైన ప్రాచీనవ్యాఖ్యాత అగస్త్యుఁడు ముందు ద్వారసముద్రమునకుఁ బోయెననియు, అక్కడనుండి శ్రీకృష్ణునిసంతతివారైన పదునెనిమిదిమంది రాజులను పదునెనిమిది వెళిర్ జాతివారి కుటుంబములను అరువలారిజాతిజన సంఘమును వెంటఁబెట్టుకొని దక్షిణదేశమునకు వచ్చెననియు తెలుపుచున్నాఁడు. కాఁబట్టి ఏస్థాంతము అగస్త్యునకును అఱవమునకును సంబంధముకూర్చుచున్నదో ఆ సిద్ధాంతమే అరువలారు తెగ ఉత్తరమునుండి అగస్త్యునితోఁగూడ దక్షిణదేశమునకు వచ్చినట్లు ఘోషించుచున్నది. ఈతెగకాక అగస్త్యునితో దక్షిణదేశమునకు వచ్చినవారు 18 మంది యాదవవంశపు రాజపురుషులును, 18 కుటుంబముల వెళిరులును. అఱవముయొక్క పురాణగాథ యీరీతినున్నది. తొల్కాప్పియములోని మొదటి సూత్రమునకు వ్యాఖ్యానము వ్రాయుచు ప్రామాణికుఁడైన ప్రాచీనవ్యాఖ్యాత,నచ్చినార్కినియర్ అనునతఁడు అగస్త్యమహర్షి ద్వారకకుఁ బోయెననియు, అందుండి అరువలారి తెగలను, పైనచెప్పిన పదునెనిమిదివెళిర్ కుటుంబములను, పదునెనమండ్రు రాజపుత్రులను దీసికొనివచ్చె ననియు తెలుపుచున్నాఁడు. దక్షిణహిందూదేశమును బ్రవేశించిన తరువాత ఈవెళిరులు మైసూరురాజ్యమున నివాస మేర్పఱచుకొని అందు 49 తరములు రాజ్యపాలన మొనరించినట్లు పురనానూరువలన మనకుఁ దెలియుచున్నది. ఇదియే పురనానూరు వచనము.

ఉవరావీకైతువరై యాణ్డు
నార్పత్తెంబదు వళ్ళి ముణైవంద
వెళిరుళ్ వేళై

ఈవెళిరులకథను వ్రాసిన పురనానూరు అను గ్రంథపుకవి క్రీ. శ. 500 నాఁటివాఁడట. అప్పటికి 49 తరములు చెల్లినయెడల తరమునకు 20 ఏండ్లు లెక్కచేసినను 780 ఏండ్లగును. కాఁబట్టి ఇట్టి జనశ్రుతి సత్యమేని అరువలారులు క్రీ. ము. 280 ప్రాంతములందు మైసూరుప్రాంతములకు వచ్చియుందురు. కాని దృఢముగా కాలము నిర్ణయించుటకీయాధారము చాలదు.

ఏది యెట్లున్నను అగస్త్యునితో వచ్చినవారు అరువలారని యెల్లరు నెఱుఁగుదురు.

పాపమీయరువవారు దక్షిణదేశమును చేరుటకు ముందే ఆప్రదేశము జనాకీర్ణమైయుండెను. ఈ యరువలారు తెగలు వచ్చి దేశముపైఁ బడినప్పుడందున్న జనులు వీరిని మిత్రభావముతోఁ జూడలేదు. అది మనుష్యులకు సహజగుణమే. గుంపులుగుంపులుగా జనసమూహము వచ్చి మీయడవులలోని పదార్థముల నన్నిఁటిని మిగులు లేకుండ తినిపోవుచు మీస్థలముల నాక్రమించి పీఠము వేసికొని కూరుచుండునప్పుడు సహన మెట్లు కలుగును? అంతే ముందందున్నవారీయరువలారిని చండాలురతో సమానముగఁ జూచిరి. వారు సమీపించినచో మైలపడుట తటస్థించెను. ఇట్టిస్థితి అరువలారులకు మాత్రమే పట్టలేదు. ఈయరువలారుల పెద్దలకును శిష్యసేవకులకును గూడ నిట్టిదుర్దశయే వచ్చెను. ప్రాచీనభాషలగు అఱవము, తెలుఁగు, కర్ణాటకము- ఈ మూఁటికినిగూడ నీశాపము తగిలెను. పవిత్రము ప్రాచీనము ననియేఁ గ్రంథమును అఱవవారు మెచ్చుకొందురో ఆతొల్కాప్పియమే తనభాష అరువలారులభాషయొక్క నూతనపరిణామమని తెలియక ప్రాచీనకాలపు జనశ్రుతినిట్లునుడువుచున్నది.

"వడుకర్ అరువాళర్, వాణ్ కరునాటర్ సుడిగాడు పేరేమపై రొమ్ తినై యాలుం కులుంకారతీవుడైయర్."

ఇందు వడుగరనఁగా తెలుఁగువారు. ఇప్పటికిని తెలుఁగువారిని వడుగ రనియే వారు చెప్పుదురు. వడుగనఁగా నుత్తరదిశవారి కుత్తరదిక్కుననుండువారని దీనియర్థము. తెలుఁగువారు, అరువయారు, కరునాటరు (కర్ణాటకులు) శ్మశానము, దయ్యము, ఎనుఁబోతు, వీరిని సమీపించిన వారు మైలఁబడుదురని దీనిభావము.

రాఁబోవు వ్యాసమునందు తరువాతి చరిత్రమును వివరించుచున్నాను.

మహాత్ముని నిర్బంధవిమోచనము

దామరాజు పుండరీకాక్షుడుగారు

"బయట పడినావె భారతభాగ్యమూర్తి!
ఘనకృపామూర్తి మోహనగాంధిమూర్తి"
కాలవశుఁడైన రామభూపాలుపగిది,
విధివశుండౌ హరిశ్చంద్రవిభునిభంగి,
ధర్మమునఁ గట్టువడియున్నధర్మరాజు
మొదలుగాఁగల పాండవపుత్రులట్లు,
సత్యమె జయించునను ధర్మసరణి నెఱిఁగి
సాత్త్వికుండైన క్రీస్తు సచ్చరితుమాడ్కి,
కానికాలంబునకుఁ జిక్కి ఘనయశుండు
ధీరుఁడై నీకనులముందె దివికిఁ జనిన
బాలగంగాధరునిసాటివాఁడ వగుచు,
కర్మవశమునఁ జెఱసాలఁ గాంచి మరల
బయట పడినావె భారతభాగ్యమూర్తి
ఘనకృపాసాంద్ర! మోహనగాంధిచంద్ర!
అడవిలో రాకసులు రాముఁ డణఁచినట్లు
జైలులో మృత్యుదేవత సాగనంపి
ధరణి శ్రీరామరాజ్య మేర్పఱచుకొఱకు
సత్య మెద నమ్మి స్వేచ్ఛాప్రసాది వగుచు
బయట పడినావె భారతభాగ్యమూర్తి!
ఘనకృపాసాంద్ర! మోహనగాంధిచంద్ర!
బంధములఁ జిక్కి నీతపోబలము చేత
దాస్యరణమును లోనుండి తఱిమివేసి
స్వచ్ఛమగు దేహమున నేఁడు స్వేచ్ఛ గాంచి
బయట పడినావె భారతభాగ్యమూర్తి!
ఘనయశస్సాంద్ర! మోహనగాంధిచంద్ర!
లంకలోపలఁ జొచ్చి శ్రీరాము ప్రతిభ
గొంతవడిఁ జెప్పి కార్యానుకూలుఁడైన
ఆంజనేయుం డనఁగఁ జిత్తరంజనుండు
రాజ్యవర్గంబుఁ జొచ్చి నీ ప్రతిభఁ జూపి
పలువిధంబుల నీకుఁ దోడ్పడుచునుండ
బయట పడినావె భారతభాగ్యమూర్తి!
ఘనకృపాసాంద్ర! మోహనగాంధిచంద్ర!
భర్త నెడఁ బాసి ధైర్యంబుఁ బాయకుండ
నెమ్మదిఁ దపం బొనర్చు సీతమ్మవోలె
భారతీయస్వరాజ్యసౌభాగ్యలక్ష్మి
నిన్నుఁ బాసి తపించుచు నున్నకతన
జయజయధ్వానముల పునర్జన్మ మెత్తి
బయట పడినావె భారతభాగ్యమూర్తి!
ఘనకృపాసాంద్ర! మోహనగాంధిచంద్ర!
రామరాజ్యసౌభాగ్య మేర్పడనికతన
అంధకారంబునం దయోధ్యాపురంబు
మునిఁగి కళ కాంతు లుడిగినపోల్కి నేఁడు
నాయకుని నిన్నుఁ బాసి హైందవధరిత్రి
అంధకారమయమయి యల్లాడుచున్న
తరుణమున నీప్రపూర్ణవత్సలతఁ జూపి
బయట పడినావె భారతభాగ్యమూర్తి!
ఘనయశస్సాంద్ర మోహనగాంధిచంద్ర!
రాక్షసాధములైన ఘోరమగుతపముఁ
జేసి వాంఛాఫలంబు నాసించి యుండఁ
బరమయోగీంద్రుఁడవు భద్రపదుఁడ వీవు
కల్మష మనంగ నెఱుఁగని ఘనుఁడ వీవు
కల నయిన మనోవాక్కాయకర్మలందు
హింసయు, నధర్మ మెందు సహింపనట్టి
శాంతమూర్తివి, రెండేండ్లు సాత్త్వికమునఁ
జేసినతపంబు పుష్పవికాస మగుచు
పంట పండెదె భారతభాగ్యమునకు
జయము చేకూరదె స్వరాజ్యసాధనమున
ఘనయశస్సాంద్ర! మోహనగాంధిచంద్ర!

ఆంధ్రులు - తెలుగులు

కేవలీరుడాక్టరు బుర్రా శేషగిరిరావుగారు ఎం. ఏ; పి. హెచ్. డీ.

తైలివాహానది పరిసరములలో ఉన్న ఆంధ్రులవలన లతిప్రాచీనములనియు వాటి జాడలు పురాణములలో గల ఆంధ్రులగాథలతో సమన్వయము పొందుచున్నవనియు ఆయాస్థలములలో పరిశోధనలు చేసినగాని ఆంధ్రులచరిత్ర సరియైనది తేలదనియు "కళింగమండలి ఆంధ్రులు"ను గూర్చిన ప్రసంగమువల్ల తేలును. ఇట్లు కళింగములోనికి వలసవచ్చిన ఆంధ్రులున్ను క్రీ. శ. ౧౧ శతాబ్దమునుండియు స్థిరముగా ఆంధ్రశబ్దము తమకే చెల్లుననుకొనుచున్న తెలుగులున్ను ఒక్కతెగవారేనా లేక భిన్నజాతులవారా అని యొక ప్రశ్న యిదివరకే కలిగియున్నది. కొంతకాలము క్రిందట విజయనగరములో ఆంధ్రులనుగూర్చి ప్రసంగించిన చారిత్రకాచార్యులగు శ్రీమాన్ డాక్టరు. ఎస్. కృష్ణస్వామి అయ్యంగార్లు చారిత్రక ప్రసిద్ధిగాంచిన ఆంధ్రులకును తెలుగువారికిని సంబంధము లేదని వ్యాఖ్యానించిరి. అంతకుపూర్వమే విశాఖపట్టణమున కళాశాలాధ్యక్షులుగ నుండిన శ్రీమాన్ పి. టి. శ్రీనివాసఅయ్యంగార్లున్ను "ఇండియన్-ఆంటిక్వారి" పత్రికలో నిట్లే వ్రాసియుండిరి. ఈ ప్రశ్న ఆంధ్రులచరిత్రకు ముఖ్యమైనది. క్రీ.శ.౧౦౨౨ ప్రాంతమున తెలుగు దేశములో రాజమహేంద్రవరమున రాజ్యముచేసిన రాజరాజ నరేంద్రునికాలమున తెలుగునకు నియమ మేర్పరచిన "ఆంధ్రశబ్దచింతామణి"లో తెలుగు భాషకు "ఆంధ్ర" మనుపదము పర్యాయముగా వాడబడినది. రాజరాజనరేంద్రుని యాస్థానములో కవిభవబ్రాంకుశు డని పేరుపడ్డనారాయణభట్టు "ఆంధ్రమున" అనగా "తెలుగు"న కూడా కవిత్వముచెప్పసామర్థ్యము గలవాడని ఆతనినిగూర్చి నన్నయ (ఆంధ్ర మహాభారత కర్త) రచించిన శాసనములో కలదు. తరువాత "తిక్కనసోమయాజి" విరాటపర్వము చెప్పుచు "ఆంధ్రావళి మోదముం బొరయునట్లుగ" అని వచించియుండుటనుబట్టి తిక్కననాటికి ఆంధ్ర పదము తెలుగుమాతృభాషగా వాడబడు తెలుగుజిల్లాలపట్లను తెలుగుభాషపట్లను రూఢి పడినట్లు నిశ్చయము. వీరందరికీ పూర్వము వేంగిమండలమున కర్ణాటభాషను వ్యాసభారతమును జైనకావ్యముగా చెప్పినపంపాకవి (క్రీ. శ. ౧౦ శతాబ్దము) ఆంధ్ర పదములను తెలుగు దేశముపట్ల రూఢిగా ఆదిపురాణమున వాడినాడు. అనగా నేటికి ౧౦ శతాబ్దములనుండి ఆంధ్ర, తెలుగుపదములు పర్యాయములై దేశవాచకములుగాను జాతివాచకములుగాను భాషానిర్దేశములుగాను ప్రసిద్ధిగాంచినవి. ఇట్టి వాడుక "లా" ప్రకారముకూడా అనాదిసిద్ధమనియు నంగీకరింపక తప్పదు. అయితే

క్రీ. శ. ౧౦-వ శతాబ్దమునకు పూర్వము, అనగా ఆంధ్రశబ్దమును శాసన-చరిత్రా-ప్రసిద్ధముచేసిన శాతవాహనుల కాలమున, క్రీస్తుశకప్రారంభమున నీ ఆంధ్ర, తెలుగుపదముల వ్యవహార మెట్లుండెననిన ఆవిషయమునను కళింగమండలమున తెలివాహా ప్రాంతభూములలో విమర్శనీయము లగుజాడలు కనబడుచున్నవి.

ఈ ప్రాంతములందు ఆంధ్రులవలసలు చూపెడు ఆంధ్రశబ్దపూర్వకములగు గ్రామనామములకు తోడుగా "తెలుగు" శబ్దము పూర్వముగాగల గ్రామనామములును కనబడుచున్నవి. ఇది చిత్రమైనసంగతి. ఆంధ్రులును తెలుగులును మొదటనొక్కజాతివారే. అయితే ఇట్లు గ్రామనామము లేర్పడవు. కావున్న నీ"తెలుగు" శబ్దము పూర్వముగా గల గ్రామనామములు ఆంధ్రశబ్దపూర్వకము లగువాటికన్న నవీనముగానో, ఆంధ్రశబ్దార్థము మఱుగుపడినతరువాతనో పుట్టియుండవలెను. ఈగ్రామనామములు "కళింగ", "సవర" "గదబ", "తక్షర", "ఒడ్డా", "ముండారి" పదములుతో కలసినగ్రామనామముల మధ్యకూడా కనబడుచున్నవి. ఈయంశమును బట్టి ఈ "ఆంధ్ర" "తెలుగు" తెగలు "కళింగ" త్యాదితెగలవలె పరస్పరభిన్నము లగు తెగవేమో అనుసంశయము కలుగుట సహజము.

దృష్టాంతములు విమర్శనీయములు.

1. రామగిరి మాళియా:—కొళింగిబాడి కొళింగి; తెలింగిపల్లి; తెలిగాం; ఆంధ్రకల్య ఓర్ప్రాయుసెరిగి, ఒంఛకెనుడ!

2. బిస్సంకటకంమాళియా:—తెలంగపాదరో, ఒంధరులిమ్మ

3. గుణుపురం మాళియా:—తెలిగోయి, తెలిగుడ, వెలుగొగొర్జంగి; ఒంధ్రగుడసాల.

4. జయపురం మాళియా:—తెన్గగుడ, ఒంధ్రాముండ.

5. నవరంగపురం మాళియా:—తెలుగాం, ఆంధ్రగుడ.

ఇట్టిగ్రామములు కళింగమండలిమాళియా (ఏజన్సీ)లో కనబడుచున్నవి. దీనినిబట్టియే ఇవి ప్రాచీనములుగాని నవీనములుగావనియు చెప్పవచ్చును. ప్రజలు కొండప్రాంతములనుండి పల్లపుభూములకు వలసవత్తురుగాని పల్లపుప్రదేశములనుండి కొండలలోనికి సాధారణముగా వలసపోరు. ఏదేశపుచరిత్ర చూచినా ఒకప్పుడు ఫలవంతములై ప్రజావంతములై నాగరకములగు దేశములు పాడుపడి అడవి బలసి పోవుటయు, అప్పటి కడవులుగా నుండినభూములు పల్లపునేలలై వాసయోగ్యములై పట్టణము లగుటయు విశదమగును. నేడు కుగ్రామములై పాడుపడిన తెలివాహా ప్రాంతభూములు తొలుదొల్త నిఆంధ్ర, తెలుగు, కళింగవలస లేర్పడిననాడు వాసయోగ్యములై సర్వవిధములగునాగరకవైభవములతో విరాజిల్లుచుండెననుటయు నీప్రాంతపు గ్రామ నామములవల్లనే ఋజువగుచున్నది. అట్టిప్రాంతములను నాగరకములుగా చేయుటలో ఆంధ్ర, తెలుగు, కళింగ తెగలు పాల్గొనియుండుటయు వీటివల్లనే స్పష్టము.

ఈ గ్రామనామములలో తుదిభాగము "గుడ" అని ఈయిరుతెగలవారి గ్రామముల పట్లను ప్రసిద్ధము. "గుడ" అన్నది తెలుగు మాట. దీనికి రూపాంతరము "గూడెము". "కూటము", "కూడిక" అనుపదములు దీని వంటివే. ఇది సమూహార్థమున చెల్లుచున్నది. ఆంధ్ర అనుపదముతో "గుడ" అను తెలుగు మాట కూడి గ్రామనామముగా ఏర్పడుట చూడగా, దీని కీపేరు తెలుగు పెట్టియుండ వలెను; లేదా ఆంధ్రమును తెలుగును అప్పటికే ఒక్కభాషగా కలిసిపోయియుండవ ను. ఇట్లే- "పాదరు";- "వాడ (-ఆడ)"; "-పాడు" అనుపదములును ఈప్రాంతమున గ్రామద్యోతక ములుగా వాడబడినవి. ఉ. "కళింగపాదరు"; తక్షరాడ; ఒడ్డెపాడు; ఈపదములును తెలుగు మాటలే. కాగా ఆంధ్రులవలెనే, కళింగులు; తక్షులు (తక్షకవంశస్థులు); ఓఢ్రులును తెలుగులమధ్య కీప్రాంతములకు వలసవచ్చియుండు రనవలసి యున్నది. ఎట్లైనను గ్రామనామము లలో ఆంధ్ర, తెలుగుపదములు కలిసిపోయి నట్లే, ఆంధ్ర, తెలుగుభాష లీప్రాంతమున మొదట మిళితములై పోయియుండును. ఇది ఆంధ్రులును తెలుగులును కలిసి యేకజాతియై పోవుటనుగూడ సూచించును.

గుణుపురం మాళియాలో "ఒంప్రగుడ" తోపాటు "సాత" అను గ్రామము కానవచ్చుచున్నది. కళింగమండలి "శాలిహుండం"లో శాలివాహనరాజుల జాడలు కనబడ్డట్టే ఈ "సాత" గ్రామమును తవ్వించిచూస్తే శాత వాహనులజాడలు కనబడవలెను. గుణుపురంమాళియాలలో శాతవాహనులు రాజ్యముచేసినసంగతి స్థిరపడితే అది అతి ప్రాచీనకాలమందు అనగా శాతవాహనులు ధాన్యకటకము రాజధానిగాచేసికొనుటకు ముందు శాతవాహనులస్థితి చెప్పును. ఆంధ్రులచరిత్రను సమగ్రముగా సప్రమాణముగా సమన్వయింపదలచినవా రీజాడలు పట్టి కొంతవిమర్శించుట యుక్తము. ఈశాతవాహనులనాటికి కొన్నిశతాబ్దముల క్రిందటనే బౌద్ధజాతకముల ప్రకార మీప్రాంతములలో ప్రఖ్యాతము లగు బౌద్ధక్షత్రియులరాజ్యాంగము లేర్పడి యుండెను.

ఇట్లు పరస్పరము సన్నికటముగా వలస లేర్పరచుకొని ఏకమతానుసారులుగా నొకప్పు డన్యోన్యసహాయముతోనూ మరియొకప్పుడు ప్రతిస్పర్థులుగాను పల్లెలలోనే గాక పట్టణము లలోను, మఠాస్థానములలోను, రణరంగముల లోను సాహచర్యము గలిగి ఆంధ్రులును, తెలుగులును, కళింగులును, తక్షులును కాలక్రమమున కలిసిపోయి సంబంధబాంధవ్యములుగలిగి ఏకమతానుసారులై ఏకభాషాపరులై నేటి తెలుగులుగా పరిణమించియుందు రనుట సమర్థనీయమగుచున్నది.

శాతవాహనులనాటి కాంధ్రమండలమున బౌద్ధజైనదర్శనములు ప్రబలియుండెను. బౌద్ధమునకు "పాలీ"భాష మూలాధారము. గ్రామపద మీభాషలో "గాం" అని మారును. రామగిరిమాళియాలో "తెలిగాం" గ్రామమున్ను నవరంగపురంమాళియాలో "తెలుగాం" గ్రామమున్ను ఇట్టిబౌద్ధగ్రామములై యుండనోపును.

అప్పటికే ఆంధ్రులున్న బౌద్ధులుగా నుండినట్లు "బంధరిగాం" అనుగ్రామనిర్దేశమువల్ల తేలుచున్నది. ఇట్లు శాతవాహనులనాటికే ఆంధ్రులు తెలుగులై యుందురు. ఈ గ్రామము లిట్టిసాక్ష్య మిచ్చునా? ఇవి వంశనిర్దేశకములా? అన్న ప్రశ్నకు సాజాత్య ప్రామాణ్యమున బదులు చెప్పవచ్చును. ఈభూముల లోనికి క్రీ. శ. ౬ వ శతాబ్దమందు గాంగులు వలసవచ్చిరి. వీరు దక్షిణమునుండి వచ్చినవారు. తత్పూర్వము గంగాతీరమునుండి కళింగమునకు వలసవచ్చినగాంగులును కలరు. ఈ ఆరవశతాబ్దపు గాంగులు శాసనప్రసిద్ధి చెందినవారు. వీ రీప్రాంతములలో తమ వంశముపేరను, తమలో ప్రసిద్ధులగురాజుల పేరను, తమయారాధ్యదేవతలపేరను గ్రామములు కట్టిరి. గంగవరం, గంగవలస, గంగాపురం, గంగాపురి అనుగ్రామములున్ను, చుడంగ (చోడగంగ)పల్లి, చోరంగపల్లి అనుగ్రామములున్ను, గంజాంవిశాఖపట్నంజిల్లాలలో పల్లపు జిల్లాలలోను మాళియాలలోను కనబడుచున్నవి.

ఇట్లే అస్కాతాలూకాలో "గోకర్ణమేరి", బరంపురంతాలూకాలో "గోకర్ణపుర", పర్లాకిమిడి, సోంపేటతాలూకాలలో "గోకర్ణపురం", పాలకొండతాలూకాలో "గోకర్ణపల్లి" అనుగ్రామములును సుప్రసిద్ధములు. గోకర్ణేశ్వరుడు మహేంద్రగిరివాసుడగు గాంగుల ఆరాధ్యదేవత.

చోడగంగ (చుడంగ) వంశపురాజులపేర చోడంగిపల్లి, చుడంగుపురం అని గ్రామము లేర్పడినట్లు సాలంకాయన వంశముపేరిట నీప్రాంతములందు "సాలంకోయి" గ్రామమును "శాతవాహనులపేరిట "సాత" గ్రామమును ఏర్పడినవి.

శాసనప్రసిద్ధులగుగాంగులు తమవంశము పేరిటను, తమవంశమందలి ప్రసిద్ధులపేరిటను, తమయారాధ్యదేవతలపేరిటను గ్రామము లేర్పరచియుండుట నిశ్చయము కాగా ఆంధ్రులును, కళింగులును, తక్షులును తమ తమ వంశముల పేరిట గ్రామనామము లేర్పరచియుందు రనుట సత్యదూరము కాజాలదు కదా!

ఇక ఆంధ్రము తెలుగెట్లాయెనో నిరూపింపవలసియున్నది. ఇది మరియొక ప్రసంగమున విమర్శింపబడవలెను

మధుకలశము

(ఉమర్ ఖయ్యామున కనువాదము)

రాయప్రోలు సుబ్బారావుగారు

జముషెడు శీధు వానుచు యశస్సఖి నేలిన నేలలందు సిం
హములును దుష్టలుల్ సలుపునందురు రాచటికమ్ము నేఁడు; 'బై
రము' మృగయావతంసుని శిరం బెట వ్రాలెను యమ్యెడల్ యథే
చ్ఛముగను ద్రొక్కుగార్దభము, చాన! చలింపఁడు నిద్ర నాతఁడున్. ౧౮

చ. కడు నరుణమ్ముగా నెచట కన్నెగులాబి జ్వలించు నచ్చటన్
బడఁదగు మున్ను సీజరునృపాలునిరక్తమటంచు నెంతు, నే
కడఁ బావురకోఁటతొయ్యలి సుగంధసుమమ్ములు రాసిపోయు, నా
కడ నొకయప్సరస్సఖనిగారపుపీడెము రాలియుండెడిన్. ౧౯

చ. కలకలఁబోవు తేటసాన కమ్మనివాతెఱ నంటి, పల్లవాం
గుళి బ్రతిమాలుచున్న యనుగుంబుపతీవియ యోర్తు, చూచితే
కలికి! నఖక్షతిన్ మధువు గ్రక్కనియే చెలిచాయమోవి యీ
చెలియలితీవె యున్ మనసు చెల్లనికోర్కుల నప్పగించెనో. ౨౦

చ. గతదివసప్రపీడనయు గాఢభవిష్యదపోహభీతియున్
హత మొనరింపఁ జాలుమధు వందపుగిన్నియనిండ నింపు, వీ
వితమున 'రేపు రే'పని తపించెద వెందుల? కెన్ని 'రేపు' లీ
క్షితివయి 'నిన్న'లందు గలిసెన్ సఖి! యెప్పటి కేది ప్రాప్తమో! ౨౧

చ. నయమతు, లాప్తు, లున్నతమనస్కులు నామనమిత్రు లెంద తే
ప్రియమగు తోఁటలోఁ దమయదృష్టవశమ్మగు ద్రాక్షపంక్తి పిం
డి యొకటిరెండుగిన్నియలు నిండుగఁ ద్రావి, విరామలాలనా
శ్రయు లయిరో సఖి! యొకరు జాఱఁగ నొక్కరు తోడు నోడుచున్. ౨౨

చ. పలుచనిశావికోకలసాబం గొలసెన్ మధుమాసలక్ష్మి, నీపు
వ్వలపొదరింటిలోన తనివోము రతిన్ మన మిందు, ముందు రా
గిలిన ప్రియుల్ తొలంగిరి సఖి! యింకఁ గ్రిందకుఁ బోదు మేము భూ
తలిఁ బవళింప, నన్యులకుఁ దల్పము లౌదుము మేమె యావలన్. ౨౩

చ. నయములు, లాస్త్రు, లున్నతమనస్కులు నౌ మన మిత్రు లెంద ఱే
ప్రియమగుతోఁటలోఁ దమ యదృష్టపు కమ్మగు ద్రాక్షపండ్లు పిం
డి యొకటిరెండుగిన్నియలు నిండుగఁ ద్రావి, విరామలాలసా
శ్రయు లయిరో సఖీ! యొకరు జాఱఁగ నొక్కరు తోడుతోడుగన్.

(ఎడ్మండ్ డూలాక్ గారి చిత్రపటమునుండి పునర్ముద్రితము.)

చ. మనమును మంటిక్రిందఁ బడి మాయకపూర్వమె లబ్ధమైనదా
ని ననుభవింపఁబోలుఁ దరుణీ! యటుపిమ్మట ధూళి ధూళితోఁ
బెనసి యణంగిపోవు పృథివిన్, మధు వెందుకు, గాన మాఁగు, గా
యనులును బవ్వళింత్రు, చెవి కందదు పైస్రుతియున్ సమాప్తమై. ౨౪

ఉ. వేనుక నేఁటిభుక్తికి లభించిన దెల్ల వ్యయించుపుణ్యులున్,
పీడితు లయ్యు రే పనుభవింపఁగ దాఁచునికృష్టులున్, వినన్
బాడెడుచిత్రగుప్తుఁడు తమాలనికుంజమునుండి, "యేల యీ
యేడుపు మూర్ఖులార! సుఖ మేర్పడ దిందును నందు మీకికన్." ౨౫

చ. ఇహపరలోకతర్కముల నెంతొ చలంపడి శాస్త్రులున్ గురూ
ద్వహులును పెక్కు రేగిరి, పదంపడి వారిభవిష్యదర్శనం
గ్రహమును త్రుప్పవట్టె, సుడిగాలికిఁ బోయెఁ దదీయబోధనా
మహిమయు, దుమ్ముగొట్టికొని మాసెను వారిసమాధులున్ సఖీ! ౨౬

శా. ఆవేదాంతుల శుష్కతర్కముల వ్యాఖ్యానింపఁగా నిమ్ము, నీ
వీవృద్ధున్ సుఖపెట్ట రమ్ము సకియా! యేకాంతపున్ సేవ; నే
పూవుల్ విచ్చు సుఖప్రభాతముల నాపూలన్నియున్ రాలు సం
ధ్యావేళన్, నిజ మిద్ది, తక్కినది మిథ్యావాద మింకేటికిన్? ౨౭

ఉ. నేనును బాల్యమందు నతినిష్ఠమెయిన్ గురుపాదసన్నిధిన్
మానుగ నాలకించితిఁ బ్రమాణములైన పరేంగితార్థముల్,
గాని; నిజాన కెప్పుడును గన్నులు విప్పక బైట వచ్చితిన్
పూనిక పీడి, లోపలికిఁ బోయిన వాకిటనే సఖీమణీ! ౨౮

ఉ. వారలతోన నేనును నవంధ్యములై తగు జ్ఞానబీజముల్
కారునఁ జల్లి సొంతముగఁ గష్టముఁ జేసితిఁ బండినట్టి యం
బార మిదేనుమీ! సకియ! వచ్చితి నచ్చపునీరుమట్టు లా
కారము లేనిగాలివలెఁ గన్పడ కేగుదు గుర్తు లారఁగన్. ౨౯

ఉ. ఏమిపనో యెఱుంగక మహిన్ బడితిన్, ప్రవహించుచుంటి నే
భూముల నింకనో జలముపోల్కి, ననిష్టమొ యిష్టమో సఖీ!
ఈమధువాటికన్ విడిచి యేదెసకో సుడివోదు, చోటిరా
సీమల పంగుగాడ్పులనసిన్ మది నచ్చిన నచ్చకుండినన్. ౩౦

చ. ఇచటికి నన్నుఁ ద్రోయనవు డించుక కోరఁడు నాయభీష్ట, మిం
కెచటికొ యిందునుండి యెడయించెడున ట్లడుగంగఁబోవఁ డే
ల చపలతర్క మిట్లు పగలంబడ జ్ఞప్తికిఁ దెచ్చుకొందువో
రుచిగలశీధుపాత్రికను ద్రోయక వాతెఱఁ దార్చవిదా సఖీ! ౩౧

(పాఠాంతరము)

ఉ. ఆది సృజించున ట్లడుగఁడాయెను నన్నిటఁ ద్రోతునంచు, నీ
మీఁదట నెందు నే నథగమింతునొ నిశ్చిత మాట తెల్లమో
ప్రైదలి! యీ ప్రసన్నమధుపాత్రను బల్మఁబు నింపియిమ్మి వి
చ్ఛేద మొనర్తు నీవెకిలిచింతలఁ జిత్తముఁ జీల్పకుండఁగన్. ౩౨

చ. ఇల నడిబొడ్డునుండి వడి నేశనివాకిట బైట వచ్చితిన్
జెలఁగి శనైశ్చరుం డధివసించెడుగద్దియ నెక్కితిన్, జగ
మ్ములఁ గిరుఁగించినట్టిపెనుముళ్లు నడల్చితి నెన్నొ; కాని చి
క్కుడల దొకింత మృత్యువను నీముడిమెల్కల నన్ని విప్పినన్. ౩౩

చ. ఒకతలు పుండె దానిగడె లూడ్చెడుబీగము చిక్కలేదు, వే
తొకతెఱ యుండె దానికవలున్నది చూడఁగ లేకపోతి, నిం
చుక వినినట్టులయ్యె నట నుంత నన్ నినుఁ గూర్చి ముచ్చటల్
సకి! యటుమీఁదటన్ మన ప్రశంస రవంతయుఁ జెప్ప రెవ్వరున్. ౩౪

ఉ. అంతఁ దెగించి గోడినడునాకస మేఁ గని యంటి, "ధ్వాంతమం
దెంతయు దారి గానక భ్రమించుప్రజాళికి బాటఁ జూప నే
కాంతులకాగడా గలదు కాలపుహస్తమునం" దటంచు, "వి
భ్రాంతుఁడ! అంధతుల్యమగు భక్తియెసు"మ్మని మాఱు వాకొనెన్. ౩౫

చ. ప్రణయిని! నే వసంతరము భౌతికభాండము డాసి "ఆత్మశీ
వనవరసీరహస్యములు పాడెదవా" యని వేఁడికొన్న నే
మనియెనొ వింటివా! "బ్రతికినన్ని దినంబులు త్రాగవోయి తీ
యని మధుర్రన్ గళించియును నావల వచ్చుట మిథ్య సుమ్మిలన్." ౩

చ. కలఁగి మెలుంగు తోట్రుపడఁగా బదులాడినయాఘుట మ్మొక
ప్పుడు సుఖముండి వేడుకలఁ బొంపిరిపోవఁగ నోపు నంచు నేఁ
దలఁచెద నెచ్చెలీ! కలలు తగ్గిన యీయధరమ్మునైన త మిం
పొలయఁగ నిచ్చి పుచ్చికొనెనో మును పెన్నిమిటారిముద్దులన్. ౩

చున్నది. రక్తాక్షీసంవత్సరము తీక్ష్ణకరమైనను గాంధిమహాత్ముని నాయకత్వము క్రింద ప్రశాంతముగ బరిణమించుటకు భగవంతు డనుగ్రహించుగాక?

* * * *

భారత రాజ్యాంగ సంరంభమునం దొక రంగము ముగిసినది. రెండవరంగ మెట్టులు ప్రారంభము గావలయునో తెలియకున్నది. అన్నిపక్షములవారును భావికర్తవ్యమును దెలియకను ముందువెనుకాడుచున్నారు. ఎన్నికలయందు గలిగిన విజయమును స్వరాజ్యపక్షము బాగుగ వినియోగించినది. స్వరాజ్యపక్షనాయకుల రాజ్యతంత్రము ప్రభుత్వపక్షతంత్రమును మించినది. నెహ్రూ పటేలు జిన్నా గారులు మొదలగువారి చాకచక్యము ముందరను హెయిలీగారియాటలు సాగలేదు. వారి భేదనోపాయములు నిరర్థకమైనవి. దేశబాంధవుడు పండిత మదనమోహనమాళవ్యగారు నిరంకుశప్రభుత్వనటనమును నిర్భయముగను విశదము చేసిరి. చిత్తశుద్ధిగల భారతీయులు నిరంకుశ విధానమును సంరక్షింపజాలరని పరిస్ఫుటము చేసిరి. సామ్రాజ్యశాసనసభ ఆర్థికశాసనసభను నిరాకరించి ప్రజాభిప్రాయమును విశదము చేసినది. ఈవిజయము స్వతంత్రపక్ష సహాయమునను గలిగెననునాక్షేపణ కవకాశము లేదు. నిర్బంధశాసనముల నుపసంహరింపవలయునని సామ్రాజ్యశాసనసభ తీర్మానించినది. రాజ్యాంగ సమస్యను నిర్ణయించుటకు భిన్నపక్షములవారి సభాసమావేశమును జేయవలయునని శాసనసభ తీర్మానించినది ఈ తీర్మానములను ప్రభుత్వము ప్రకటించినది. ప్రభుత్వపక్షమునకిట్టి పరాజయము లెన్నియో గలిగినవి. ధర్మనిరీక్షణవిరహితమైన ప్రభుత్వమునకీ పరాభవము జ్ఞానోదయమును గలుగజేయలేదు. రీడింగు ప్రభువు ధ్రువకరణాధికారమును వినియోగించుచు శాసనసభ్యుల నాక్షేపించుట విచిత్రముగనున్నది. ప్రజాప్రతినిధుల యభిప్రాయములకు వ్యతిరేకముగను బ్రవర్తించుచు న్యాయము తనపక్షమున గలదని సమర్థించుటమాత్ర మనాదరణీయము. నిరంకుశప్రభుత్వమున కన్నియుగములందును రాజ్యములందును నిది సహజలక్షణము. సామ్రాజ్యప్రభుత్వమునందు గలిగిన పరాజయము మధ్యరాష్ట్రములందును వంగరాష్ట్రములందును గలిగినది. చెన్నరాష్ట్రమునందుసయితము పరాజయము గలిగినది. ప్రజాప్రతినిధులైన మంత్రులు నిరంకుశాధికారపక్షపు సహాయమువలన బ్రతుకుచున్నారు. సంస్కరణముల మిథ్యాస్వభావమును గవర్నరుల ధ్రువకరణాధికారము విశదముచేసినది. ఎంతకాలము ధ్రువకరణాధికారము నిలువగలదో చూడవలసియున్నది. ధర్మసందేహములేని ప్రభుత్వ మెంతకాలమైనను నీయధికారమును వినియోగించుచు కాలయాపనమును జేయవచ్చును.

* * * *

స్వరాజ్యపక్షము కొంతవిజయమును గడించినను ప్రభుత్వమును ప్రతిష్టంభనము జేయజాలదని విశదమైనది. తెయిటో వా
నిరంకుశాధికారహృదయము వ

మును విశదము చేసినది. బ్రిటిషు ప్రభుత్వస్థితికి పశుబలమే శరణ్యమని విశదమైనది. ప్రజాప్రతినిధులకే పశుబలమును ప్రతిఘటించుటకు శక్తిలేదని ప్రభుత్వవిధానము విశదము చేయుచున్నది. స్వరాజ్యపక్షపు ప్రయోజన మింతటితో ముగిసినదని విశదమగుచున్నది. స్వరాజ్యపక్షపు రాజ్యనీతి ప్రతిష్టంభనమును జేయగడగినను జేయ లేకపోయినను స్వరాజ్య సంపాదనమునకు వినియోగపడ జాలదని విశదమైనది. ఇకముం దీక్షమేమి చేయవలసియున్నదియును తెలియకున్నది. పార్లమెంటును ఆంగ్లపత్రికలును నిరంకుశాధికారమును సమర్థించుచున్నవి. దేశమునకు మోక్షము శాసనసభలవలనను గలుగదని విశదమైనది. మహాత్మునితో నాయకు లిపుడు సంప్రతించుచున్నారు. మహాత్ముడు దేశదృష్టిని నిర్మాణ కార్యవిధానమునందు లగ్నముచేసి ప్రజాశక్తిని విజృంభింప జేయవలయునని నిర్ణయించుటస హజము. స్వరాజ్యమును బడయుటకిదియే సాధనమని దేశపరిస్థితులు స్పష్టము చేయుచున్నవి. ప్రజాశక్తిని నిర్మాణ విధానమునందులగ్నముచేసి వికసింప జేయుటయే కాంగ్రెసు ధర్మముగ నున్నది. ఈమహా కార్యమును సఫలముచేయుటకు గాంధిపూజానిధిని సమకూర్చుటయందు గలయవసరము విశదమగుచున్నది. మహాజనులు యథాశక్తిని పూజానిధికి ద్రవ్యమును సమకూర్చి గాంధిమహాత్మునిసంకల్పమును సఫలము చేయుటకు దోడ్పడుదురుగాత!

* * * *

రెండవయాంధ్ర చిత్రకళా ప్రదర్శనము కాకినాడ యందు గతమాసాంతమునందు జయప్రదముగ జరిగినది. కార్యదర్శి శ్రీయుత దామెర్ల వెంకట్రావుగారును వారిసోదరుడు రామారావుగారును ఆంధ్ర చిత్ర కళాభివృద్ధికి జేయుచున్న పరిశ్రమ ప్రశంసనీయముగ నున్నది. అధికారాదరణము లేకపోయినను చిత్రకళా ప్రదర్శనము జయప్రదముగ జరిగినది. ప్రదర్శింపబడిన చిత్రపటములు చిత్రకళయం దాంధ్రులకుగల యభినివేశమును వ్యక్తిత్వమును విశదముచేసినవి. చిత్రపటముల స్వరూప స్వభావములు ప్రత్యేకవ్యక్తిత్వమును విశదముచేసినవి. ఆంధ్రకళావైఖరి ప్రాచ్యకళావైఖరి నవలంబించుచున్నను ప్రత్యేకమైన వ్యక్తిత్వమును గలిగియున్న విధమును రామరావుగారు మొదలగువారు చిత్రించినచిత్రములు విస్పష్టము చేయుచున్నవి. ఈచిత్రపటములు రంగులందును రూపరేఖవిలాసనిర్మాణము నందును వంగదేశకళావైఖరినిగాని పాశ్చాత్య కళావైఖరినిగాని కేవలమనుకరణమును జేయక వ్యక్తిత్వమును గలిగి యాంధ్రప్రవృత్తిని విశదము చేయుచున్నవి. ఆంధ్రత్వవికాసమునకు చిత్రకళావికాసావసరమును ప్రదర్శనమువిశదముచేసినది. కాకినాడప్రదర్శనమునందలి చిత్రపటములవివరము రాగలసంచికయందువివరింపబడును. ఆంధ్ర దేశమునందు చిత్రకళాభిజ్ఞానమును వికసింపజేయుటకు శ్రీయుత దామెర్ల వేంకట్రావుగారుచేయు ప్రయత్నములకు శ్రీమంతులును కళాభిజ్ఞులును దోడ్పడి స్వధర్మ నిర్వాహణమును జేయుదురుగాక.

Published by K. NAGESWARA RAO, at the Andhra Patrika Press, No. 7. Thumbu Chetty Street, G.T.Madras

"యశోధర - సిద్ధార్థుఁడు"

చిత్రముయొక్క వివరణము

అడుగువైపు మొదలు, తటాకసోపానములు, తటాకభిత్తి, పశ్చాద్భాగము.

సోపానములు క్రిందినుండి పైకి క్రమముగ స్రోతాపన్న, సకృదాగామి, అనాగామి, అర్హత యను నాలుగవస్థలు; తటాకభిత్తి, ప్రత్యేకబుద్ధావస్థ; పశ్చాద్భాగము; బుద్ధావస్థ.

క్రింద కుడివైపున నొకతామరాకుపై నున్న పదిపూవులును దశకుశలములు; అహింస, అచౌర్యము. అకామమిథ్యాచారము, సత్యవాక్కు, అపైశున్యము, అపారుష్యము, అసంభిన్నప్రలాపము, అనభిధ్య, అవ్యాపాదము, అమిథ్యాదృష్టి యనునవి.

యశోధరసమీపముననుండు తట్టలోని యెనిమిదికమలములు ఆర్యాష్టాంగమార్గములు; సమ్యగ్దృష్టి, సమ్యక్సంకల్పము, సమ్యగ్వాక్కు, సమ్యక్కర్మము, సమ్యగాజీవము, సమ్యగ్వ్యాయామము, సమ్యక్స్మృతి, సమ్యక్సమాధి అనునవి.

వెలుపలికి వ్రాలియున్న మైదుతొడిమలు పంచస్కంధములు; రూపము, వేదన, విజ్ఞానము, సంజ్ఞ, సంస్కారము అనునవి.

యశోధర బుద్ధునిచేతనుంచెడి మూఁడు కమలములు శరణత్రయము; బుద్ధధర్మసంఘము లనునవి. యశోధర 'బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి' అని చెప్పునట్టులున్నది. యశోధర శిరమునకుఁ జుట్టియున్న పూలదండ యామె పవిత్రతను దెలుపుచున్నది. రెండుకంబములలో సిద్ధార్థున కాశ్రయమయినది ధర్మము, వేఱొకటి యధర్మము.

సిద్ధార్థుని కంఠహారములు చతురార్యసత్యములు: దుఃఖము, దుఃఖసముదయము, దుఃఖనిరోధము, దుఃఖనిరోధగామినీప్రతిపత్తు అనునవి. అతనిముందల నున్న పుష్పము విజ్ఞానము. శిరస్సు నావరించియున్న నీలపీతలోహితావదాత మాంజిష్ఠవిశిష్టప్రభాపుంజము నిర్వాణసూచకము. అతని రెట్టకడియమును, ముంజేతికంకణమును, శిష్యులగు శారిపుత్ర మౌద్గల్యులు. సమీపమున నుండు వృక్షము బోధిద్రుమము.

శంకరజయంతి

(వైశాఖ శుద్ధ పంచమి 9-5 24)

శ్రీ. బ్ర. కోటీశ్వరశర్మ శాస్త్రి గారు వ్రాసినది

శ్లో. శాస్త్రం శారీరమీమాంసా దేవస్తు పరమేశ్వరః,
ఆచార్య శ్శంకరాచార్య స్సంతు మే జన్మజన్మని.

సృష్ట్యాదినుండి నేటికాలమువఱకు అవిచ్ఛిన్నముగ ప్రకాశించుచున్న సనాతన ధర్మముయొక్క ప్రాచీనత్వము సుప్రసిద్ధముగదా. ప్రపంచమునందు నేటివఱకు అనేకమతములు పుట్టి గిట్టుచున్నవి. యుక్తివజ్రాఘాతములకు కొంచెమైనను చలింపక ప్రకాశించుసనాతనమతపర్వతముతో పోల్చదగిన మతమింకొకటి మనకు గనంబడుటలేదు. ఈ మతధర్మములు వేదశాస్త్రములందు వివరింపబడియుండును. జీవహింసయే జీవికగా గలిగి జీవించు కటికవాఁడు మొదలుకొని 'అహం బ్రహ్మాస్మి' యను దృఢభావనముగల బ్రహ్మవిద్వరిష్ఠునివఱకునున్న బహువిధసంఖ్యాకభేదములవారలలో వారివారి యధికారతారతమ్యానుసారము లెక్కలేని యుపాయములు భిన్నభిన్నములగు ఆచరణములు శాస్త్రములందు నిరూపింపబడినవి. శాస్త్రనియమములకు లోబడిన ఆయుపాయములు ఆచరణము లన్నియు సనాతనధర్మమునకు చేరినవియే. ప్రాయశః ఇతరమతములందిట్టి తరగతులు లేక అందఱకు ఒకేవిధమయిన యాచరణమేయుండును. మన యాచార్యులవారు దాదాపు ౨ వేల సంవత్సరముల క్రిందట భరతవర్షమున కేరళదేశమున జన్మించి బాల్యముననే సకలవిద్యల నభ్యసించి బ్రహ్మచర్యమునుండియే సన్న్యసించి అధికారతారతమ్యానుసారము ప్రస్థానత్రయభాషాద్యనేక గ్రంథముల రచించి శిష్యులకు బోధించి ఆసేతుహిమాచలము పాదచారముచేత పవిత్రమొనర్చి దుర్మతముల ఖండించి దిగ్విజయమొనర్చి అధికారతారతమ్యానుసారము షణ్మతముల స్థాపించిరి. కావున భారతీయులందఱు (9-5-24) నాఁడు శంకరజయంత్యుత్సవమును జరుపుట యుక్తము.

ఇట్టి జగద్గురు సార్వభౌములగు ఆచార్యులవారి సంపూర్ణచరిత్రము ప్రతిమాసహితముగ అవకాశము ననుసరించి ఇందు ప్రకటింపబడగలదు.

శ్లో. వేదే బ్రహ్మసమస్తదంగనిచయే గర్గోపమస్తర్కథా
తాత్పర్యార్థ వివేచనే గురుసమస్తత్కర్మసంకీర్తనే;
ఆసీ జ్జైమిని దేవ సూత్ర నిచయ స్వార్థోపసంవర్ణనే
వ్యాసే నైవ సమ స్స శంకరగురు శ్శేషీయతాం మానసే.